

సాహిత్యావలోకన

(సాహిత్య వ్యాస సంపుటి)

రచయిత

డా॥ కొప్పరపు నారాయణమూర్తి Ph.D

తొలి ముద్రణ : 2024
© సర్వ హక్కులు రచయితవే

ప్రతులు : **500**

ప్రచురణ కర్త : డా. కొప్పరపు నారాయణమూర్తి, పిహెచ్.డి.
సెల్ : 7671909759

ఐ.ఎస్.బి.ఎన్. సంఖ్య : 978-93-342-1095-8

ముఖ పత్రం : రాపిక్సెల్.కామ్ సౌజన్యంతో

వెల : రూ. 250/-

ప్రతులకు : డా. కొప్పరపు నారాయణమూర్తి, పిహెచ్.డి.
డోర్ నెం. 1-35-5/2, మల్లాదివారి వీధి,
నాజరుపేట, తెనాలి - 522 201.
సెల్ : 7671909759

డి.టి.పి. : శ్రీ దుర్గ గ్రాఫిక్స్, శ్రీ అష్టలక్ష్మి గుడి ఎదురుగా,
కొత్తపేట,తెనాలి-522 201
సెల్ : 9110761291

విషయసూచిక

		పుట సంఖ్య
	నా మాట	
1.	వ్యవహార భాషకు శాస్త్రీయత కల్పించిన భాషాశాస్త్రం	9
2.	చలం సందేశం	15
3.	తెలుగు రచనలు ప్రపంచ వ్యాప్తమయ్యేదెలా?	19
4.	మేళ్ళ చెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి రచనల్లో సెమియాటిక్స్	25
5.	భద్రిరాజు వారి 'చిన్ననాటి పద్యాలు'	39
6.	సాహిత్యమా ? సంగీతమా ? దేనికి ప్రాశస్త్యం ?	47
7.	కాటమరాజు కథలు	53
8.	మంకు తిమ్మని మిణుకు	59
9.	భద్రిరాజు – 'బ్రతుకు బాటలో కొండ గుర్తులు'	65
10.	రెండు శతకాలు – సామాజిక స్పృహ	75
11.	గాంధీపై సినిమా వెనుక దాగిన చారిత్రక సత్యాలు	89
12.	దేవదాసు – వలసానంతర వాద వక్రీకరణలు	95
13.	బమ్మెర పోతన ఎక్కడివాడు ?	103
14.	పోతన్న జీవితం పరిష్కృతమే !	111
15.	పోతన సమగ్ర జీవితావిష్కరణపైస్వోత్కర్ష తప్ప అన్నీ అసత్యాలు, అపరిష్కృతాలే	115
16.	ఆరు దశాబ్దాల అలుపెరుగని రచయిత – పి.ఎస్. నారాయణ	123
17.	దళిత, బహుజన సాహిత్యం	131
18.	కాలనాళికలు – 'గుంటూరు కథలు'	139
19.	సూర్య వనాలను సృష్టించిన 'కవిరాజు'	147
20.	భారతదేశంలో ఆంగ్లేయుల చీకటిపాలనా రహస్యాలు – శశిథరూర్ ఏమి రాశారు?	153
21.	ప్రకృతీ, భావుకతను సంగమించిన తెలుగు రవీంద్రుడు 'కవి రాజు'	163
22.	'నారాయణీయం' – పి.ఎస్. నారాయణ సాహిత్యం	169
23.	గాంధీకి, కే విశ్వనాథ్ కీ మధ్య సంబంధం ఏమిటీ?	177
24.	రాజా రామ్మోహన రావు కథలు: మనోవిశ్లేషణ	185

రచయితగా నా మాట

కాలాన్ని యంత్రంలో వేసి వేగంగా 40 ఏళ్ళు వెనక్కి త్రిప్పితే ఏమొస్తుందంటే ఈ పుస్తకం వస్తుందంటాను. నిజమే. 1977లో జవహర్లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయంలో నా ఎం.ఏస్సి కొనసాగించలేని ఆర్థిక దుస్థితిలో ఉద్యోగం కోసం హైద్రాబాదు వచ్చినప్పుడు ఈనాడు నాకు ఒక రచయితగా ఆశ్రయం కలిపించింది. చలసాని ప్రసాదరావు గారు ఆరోజుల్లో ఆదివారం అనుబంధం చూసేవారు. వారి వద్ద పనికి కుదిరాను. 1977 నవంబర్ టైం మ్యాగజైన్ (Nov. 7, 1977 Time Magazine) చేతికి ఇచ్చి, అందులో రిఛార్డ్ లీకీ (Richard Leakey) అనే ఆంథ్రోపోలోజిస్ట్ మానవ పరిణామంపై తాను చేసిన నూతనావిష్కరణలను వివరిస్తూ ఇచ్చిన ఇంటర్వ్యూను ఒక వ్యాసంగా రాయమని ఆదేశించారు. 'అది బాగా రాస్తే, రామోజీకి నచ్చితే నీకు ఉద్యోగం, లేకపోతే నువ్వు వేరేదేదైనా వెతుక్కోవాలి' అని చెప్పారు. ఒక వారం గడువు ఇచ్చారు ఆ వ్యాసం రాయడానికి. టైం మ్యాగజైన్ ఇంగ్లిష్ అమెరికన్ ఇంగ్లీషు. ఆ వ్యాస శైలి చాలా కఠినంగా ఉంది. అయినా రాయక తప్పలేదు. ముందు ఒక చిత్తు ప్రతి రాసి, దాన్ని మళ్ళీ అందంగా నకలు చేసి తీసుకెళ్లి ఇచ్చాను.

ముందు ఆయన చదివి దానిని చుట్ట చుట్టి చేతిలోపెట్టుకొని రామోజీ ఆఫీస్‌కు వెళ్లారు. నన్ను తన ఆదివారం సెక్షన్‌లో కూర్చోమన్నారు. ఒక అరగంట తరువాత వారు వచ్చి నన్ను రామోజీ దగ్గరకు తీసుకెళ్లారు. అదే మొదటిసారి రామోజీరావు గారిని చూడటం. చాలా చక్కగా మాట్లాడారు. జీతం, ఉద్యోగ నియమాలు, క్రమశిక్షణ గురించి చెప్పి నన్ను ఆ రోజు నుంచే ఉద్యోగంలో చేరమన్నారు. ఆ తరువాత డిసెంబర్ 8, 1977న ఆ వ్యాసం ఆదివారం అనుబంధం ప్రధాన పేజీ వ్యాసంగా అచ్చయింది. అప్పట్లో నాతో పాటు బుర్రా సుబ్రహ్మణ్యం (ఆదివారం అనుబంధం చూసేవారు), వై.

రామకృష్ణారావు (చతుర మాసపత్రిక చూసేవారు), పాప (పాపిరెడ్డి గారు) ఆర్టిస్ట్‌గా, చొక్కాపు వేంకటరమణ పనిచేసేవారు. నేను ఆదివారం అనుబంధానికి కొన్ని వ్యాసాలు, జి. సమరంగారి కాలం, బి.వి. పట్టాభిరామంగారి 'మాయా వినోదం', విపులకు స్పేస్ ఫిల్లర్స్ గా 'పొట్టి కథలు' రాసే వాడిని. ఆలా మొట్టమొదట రాసిన కథ 'నిర్మోహమాటం' అది విపులలో అచ్చయింది. ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియాలో వచ్చే ఒకచిన్న కార్టూన్ చూపించి దానిని ఒక పొట్టి కథగా మార్చమని చలసాని ప్రసాదరావు గారి ఆదేశం. అలా ఒక కార్టూన్ ప్రేరణగా ఒక కథ రాయవచ్చని నాకు తెలిసింది కూడా అప్పుడే. ఆ రోజులలోనే నా కాబోయే శ్రీమతి పేరున 'గిరిజా నారాయణ్' అనే తమిళ పేరులాగా ఉండేలా నాకొక కలం పేరు పెట్టి ఆ పేరునే కథలు, వ్యాసాలు రాయించారు ప్రసాదరావు గారు.

వయస్సులో చాలా చిన్నవాడినైనా ఎంతో స్నేహపూర్వకంగా మాట్లాడేవారు చలసాని గారు. భుజంపై చేయివేసి కాంటీనుకు తీసుకెళ్లి టీ ఇప్పించేవారు. నాతో పనిచేసే వారంతా మంచి మిత్రులుగా అప్పుడూ, ఇప్పుడూ ఉండిపోయారు. కాకపోతే చలసాని ప్రసాదరావు గారు, బుర్రా సుబ్రహ్మణ్యం కాలం చేశారు. ఇంత పెద్ద చాటభారతం ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడానికి ఇంతకు మించి నాకు వేదిక లేదు కనుక. అలా నా వ్యాస రచన, కథా రచన రెండూ ఈనాడులోనే ప్రారంభం అయి తరువాత శాఖోపశాఖలుగా విస్తరించాయి. ఈ పుస్తకంలో అలా ఆనాడు రాసిన కొన్ని వ్యాసాలు చేర్చాను. కథలను వేరే పుస్తకం 'మలుపు' పేరుతో తెచ్చాను. వాటిలోచేర్చాను. నాటి మిత్రులలో ఒకరైన చొక్కాపు వేంకటరమణ నా పిల్లల కథల పుస్తకానికి (బాలప్రభ), పిల్లల నవలిక (పిల్లలూ, పెద్దలూ – ముళ్ళున్నాయి జాగ్రత్త) కు ముందుమాట రాశారు. చొక్కాపు వేంకటరమణ కొంత కాలం ఈనాడులో మాతో పనిచేశాక, జవహర్ బాల భవన్లో చేరారు. ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమి బాలసాహిత్య పురస్కారం కూడా లభించింది.

గతం ఎప్పుడూ వర్తమానంలోకి తొంగి చూస్తుందంటారు. గతం లేనిదే వర్తమానం లేదు. వర్తమానం లేనిదే భవిష్యత్తు లేదు. గతం ఎందుకు అంత ముఖ్యం

అంటే అది మన మూలాలను గుర్తుచేస్తుంది. మనకు ఉనికి ఏర్పరుస్తుంది. నా ఈ 'వివిధ' పుస్తకం అలా గతానికి, వర్తమానానికి ఒక 'వారధి'. ఈ 'వివిధ'లో 24 వ్యాసాలు ఉన్నాయి. వీటిలో సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక వ్యాసాలు ఉన్నాయి కాబట్టే, వీటన్నిటి సమాహారంగా 'వివిధ' అని నామకరణం చేశాను. ఈ 'వివిధ' పేరున ఆంధ్రజ్యోతిలో ఒక శీర్షిక నడుస్తున్నది. ఈ 'శీర్షిక' పేరునే కాపీ చేశానని ఎవరైనా భావిస్తే భావించవచ్చు. కానీ, నా మదిలో ఈ పేరున ఒక పుస్తకం తేలవాలన్న సంకల్పం ఎప్పటినుంచో ఉంది. అలా 'వివిధ' అనే పేరు నాకు కలగటం, అదే పేరున ఆంధ్రజ్యోతిలో ఒక శీర్షిక ఉండటం యాధృచ్ఛికం కూడా అవ్వవచ్చు గదా !

1977లో ఈనాడు ఆదివారంలో ప్రముఖంగా వచ్చిన వ్యాసంతో ఆరంభమైన నా రచనా వ్యాసంగం తరువాతి కాలంలో నాకు అంత్యంత ప్రియమైన ఆంధ్రపత్రికకు వ్యాపించింది. 1978-1980 మధ్య నా వ్యాసాలు ఆంధ్రపత్రిక ఆదివారం అనుబంధంలో వచ్చాయి. వాటిలో --'వ్యవహార భాషకు శాస్త్రీయత కలిపించిన భాషాశాస్త్రం', 'చలం సందేశం' లాంటివి ఈ పుస్తకంలో చేర్చాను. నాకు 'ఆంధ్ర పత్రిక' అంటే ఎందుకు అంత ఇష్టం అంటే నేను స్కూల్లో చదివే రోజుల్లో మా తెలుగు ఉపాధ్యాయులు నందిగామ సూర్యనారాయణ, వావిలాల రామమూర్తి వంటి వారు ఆంధ్ర పత్రికకే వ్యాసాలు, పద్యాలు రాసేవారు. అవి నాకు చూపించేవారు. ఆనాడు ఆంధ్ర పత్రికలో వ్యాసం అచ్చుయితే అదో ప్రామాణిక రచన అని పదిమంది భావించేవారు. అప్పటికి ఈనాడు లేదు. పైగా ఆరోజుల్లో స్కూల్లో, కాలేజీల్లో జరిగే అన్ని సాహిత్య, సాంస్కృతిక పోటీలలో నేను పాల్గొని ప్రధమ బహుమతినో, ద్వితీయ బహుమతినో గెలుచుకొనే వాడిని. నా డిగ్రీ అయ్యేంతవరకు ఒంగోలులో ఎక్కడ ఏ సాహిత్య పోటీ జరిగినా నేను పాల్గొనటం, ఏదో ఒక బహుమతి కొట్టేయటం విధిగా ఉండేది.

చాలా కాలం నేను తెలుగు జర్నలిజం రంగం నుంచి దూరంగా జర్నలిజం విద్యారంగంలో లెక్చరర్‌గా, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, చివరకు ప్రొఫెసర్‌గా పనిచేస్తూ దేశంలోనూ, విదేశాల్లోనూ పనిచేయటం జరిగింది. ఈ కాలంలో జర్నలిజంలో సైద్ధాంతిక పరిశోధనలు, ఆంగ్ల పరిశోధన జర్నల్స్‌లో పరిశోధనా వ్యాసాలు

ప్రచురించటం (సుమారు 65 దాకా) జరిగింది. సేజ్ (Sage), రౌటలెడ్జ్ (Routledge), ఆక్సఫోర్డ్ (Oxford), వైలీ బ్లాక్వెల్ (Wiley Blackwell), పాల్గ్రేవ్ మాక్ మిల్లన్ (Palgrave Macmillan) లాంటి ప్రచురణ కర్తలు ప్రచురించే జర్నల్స్‌లో, వారు అచ్చు వేసే పుస్తకాలలో జర్నలిజం పైన సైద్ధాంతిక వ్యాసాలు అచ్చయినాయి. ఈ క్రమంలోనే భారతదేశంలోని జర్నల్స్‌కు, విదుర, హూట్ లాంటి వెబ్ పోర్టల్స్‌కు, భారతీయ విశ్వ విద్యాలయాల జర్నల్స్‌కు ఆంగ్లంలో వ్యాసాలు రాయటం జరిగింది. రిటైర్ అయ్యాక, స్వరాష్ట్రానికి తిరిగి వచ్చాక మళ్ళీ తెలుగు సాహిత్యంలో వ్యాస రచన సాగిస్తూనే నా సైద్ధాంతిక పరిశోధన, ఆంగ్లంలో రాయటం రెండూ కొనసాగిస్తున్నాను.

ఇందులో వ్యాసాలు తొలుత ప్రచురించిన చలసాని ప్రసాదరావు గారికీ, కాశీనాధుని నాగేశ్వర రావు గారికీ, మిసిమి సంపాదకులు అశ్వినీ కుమార్ గారికీ, ఆంధ్ర జ్యోతి సంపాదకులు కె. శ్రీనివాస్ గారికి, 'వివిధ' శీర్షికన సాహిత్య పేజీకి సంపాదకులుగా ఉన్న మౌహెర్ గారికీ, నవ తెలుగు తేజం సంపాదకురాలు డా॥ పి. పద్మావతీ శర్మ గారికీ, స్వాతి సంపాదకులు వేమూరి బలరాం గారికీ, విశాలాంధ్ర సంపాదకులు రామారావు గారికి, ప్రజాశక్తి సంపాదకులు సత్యాజీ గారికి, నవ తెలంగాణ సంపాదకులు ఆనందాచారి గారికి ఈ రచయిత తన మన:పూర్వక కృతజ్ఞతలు తెలుపుకొంటున్నారు. వారి ప్రోత్సాహం, అనుగ్రహం లేకపోతే ఈ వ్యాస సంపుటి ఈ రోజు వెలుగు చూసేది కాదు.

19-07-2025 **– డా॥ కొప్పరపు నారాయణమూర్తి Ph.D.,**

1
వ్యవహార భాషకు శాస్త్రీయత కల్పించిన భాషాశాస్త్రం

ప్రతి భాషను – ఆమూలాగ్రంగా, భిన్న కోణాలలో క్షుణ్ణంగా పరిశోధించి, అధ్యయనం జరిపే శాస్త్రమే “భాషా శాస్త్రం.”

ఒక భాష ప్రాముఖ్యం, ఔన్నత్యం – ఆ భాషను ఉపయోగించే విద్యాధికుల సంఖ్యకు, ఆ భాష వాడుకకు అనులోమానుపాతంగా ఉంటుంది: స్వచ్ఛందంగా ఒక భాష ఎంత గొప్పదైనా అన్య భాషా సంపర్కం, సమకాలీన భాషల ప్రభావం లేని పక్షంలో సరైన ఎదుగుదల కల్గి ఉండదు. అయితే, అధిక స్థాయిలో అన్య భాషా సంసర్కం వలన, భాష తన స్వయం ప్రతిపత్తిని, ఉనికిని, దేశీయ స్థాయిని కోల్పోతుందన్నది అభ్యంతరం కాలేదని వాస్తవం. (ప్రస్తుతం ప్రాథమిక విద్యాస్థాయిలో కూడా ఆంగ్లభాష మాధ్యమం ప్రవేశపెట్టడంతో తెలుగులో అధికంగా ఆంగ్ల పదాలు రావడం వలన, రచనల్లో, సినిమాల్లో, కవితల్లో పెరిగిపోతున్న ఆంగ్లభాషా ప్రయోగాల వలన తెలుగు భాష ఉనికికే ప్రమాదమని భాషా ప్రియులు, భాషా శాస్త్రవేత్తలు గగ్గోలుపెట్టడమే ఇందుకు ప్రమాణం).

సూటిగా పరిశీలిస్తే – నన్నయ్య కాలం నుంచి వాడుకలోనున్న పదాలు నేడు వాడుకలో లేవు. కాల ప్రవాహంలో అవి అదృశ్యమై వాటి స్థానే అదే అర్థాన్నిచ్చే పెక్కు పదాలు చోటు చేసుకొన్నాయి. శతాబ్దాల క్రితం నాటి వాఙ్మయం నుంచి నేటి వరకు భాష పొందిన మార్పులు అది క్రమంగా సంతరించుకొన్న ఆధునికతను క్షుణ్ణంగా తెల్పగలందులకు

పదబంధ ప్రయోగకోశాలు, వివిధ వర్గాల వారికి, భిన్న భిన్న వృత్తుల వారికి సంబంధించి వృత్తి పద ప్రయోగకోశాలు భాషా శాస్త్రజ్ఞులు తయారు చేశారు. అన్య భాషా సంపర్కం వలన కలిగే ఉచ్చారణ దోషాల నివారణలో భాగంగా భాషకు ఒక క్రమ రూపం తేవడానికి సల్పే ప్రయత్నంలో కూడా భాషా శాస్త్రజ్ఞుల సాహసం శ్లాఘనీయమైంది. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో "ఉచ్చారణా దోష నివారణా విభాగం". లేక "స్పీచ్ పేథాలజీ" ఉద్భవించింది. ఈ విభాగం జరిపే పరిశోధనలలో భాగంగా ఉచ్చారణా దోషాలున్న పెక్కు మందికి చికిత్స చేయడం, అంతేకాక, చెవిటి వారికి, మూగవారికి కూడా భాషను సరైన స్వరూపంలో నేర్పడానికి తగిన పరిశోధనలను విస్తృతం చేయడం జరుగుతున్నది.

'అనువాదం' కేవలం అనువాద ప్రధానంకాకుండా సామాన్యుడికి, పామరుడికి కూడ సులభంగా బోధపడే రీతిలో ఉండాలన్నది భాషా శాస్త్రజ్ఞుల అభిప్రాయం. ఒక భాషను మరో భాషలోకి అనువదించేటప్పుడు సంక్లిష్ట అనువాదంకన్నా, అన్యభాషా పదాలను యథాతథంగా "పడికట్టు" పదాలుగా వాడటం మంచిదని భాషాశాస్త్రజ్ఞుల అభిప్రాయం.

భాష విలువలు పతనం కాకుండా చూడడానికి, సులువైన అనువాద ప్రక్రియలను ఉపయోగించటానికి – ఒక "అనువాద నియమావళిని" రూపొందించాలని భాషాశాస్త్రజ్ఞులు కృషి సల్పుతున్నారు. ముఖ్యంగా ఆంగ్లంలో వచ్చే వార్తలను తెలుగులోకి అనువాదం చేసేప్పుడు సంస్కృత పదాలను వాడి వాటిని తెలుగు పదాలుగా చలామణి చేయడం సరికాదని భాషాశాస్త్రజ్ఞుల అభిప్రాయం. ఎందుకంటే తెలుగు భాషకు ఆంగ్లం ఎంత మేరకు అన్యభాషనో, సంస్కృతం కూడా అంతే అన్యభాష.

ఒక భాష ఎక్కువ మరో భాష తక్కువ – అన్న సంకుచిత భావనకు భాషాశాస్త్రజ్ఞుల మధ్య చోటులేదు. భాష హృదయానికి చెందింది. జాతీయ స్థాయిలో అన్ని భాషలకు సమాన ప్రతిపత్తి, గుర్తింపు ఉంది. అందువల్లనే – జాతీయ స్థాయిలో అధికార భాషగా, ఒకే భాష వాడుక భాషగా వుండాలన్నది భాషా శాస్త్రజ్ఞులకు కూడ అంగీకారయోగ్యం కానేరదు. ఎందుకంటే భాషకు సాంస్కృతిక వారసత్వం ఉంటుంది. ఏ ప్రాంతాని కాప్రాంతం భాష వాడుక భాషగా ఉండటం వలననే ఈ సాంస్కృతికత వృద్ధిచెందుతుంది. రక్షణ పొందుతుంది.

పదజాలాల్లోను, నూతన పద అల్లికలలోను వ్యాకరణ ప్రధానంగా వచ్చే మార్పులు భాషాశాస్త్రజ్ఞుల పరిశోధనల్లో ఎంతగానో ఉపయోగ పడ్తున్నాయి. భాషాశాస్త్రజ్ఞులు,

భాషాపోషకులు ఒకరిపై మరొకరు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ఆధారపడి యున్నారు. భాషాశాస్త్రజ్ఞులు తమ కవితా రీతులకు, పద అల్లికలకు అడ్డు కల్పిస్తున్నారనే భావన నిజానికి సంకుచితమైనట్టిదే తప్ప మరొకటి కాజాలదు.

పాశ్చాత్య దేశాలలో భాషాశాస్త్రానికి ఉన్న ప్రాధాన్యం మనదేశంలో లేదు. ఇది గుర్తించి, భాషాపోషకులు, భాషాశాస్త్రజ్ఞులు అమోఘమైన కృషి జరుపవలసి ఉంది. విశ్వ విద్యాలయ స్థాయి నుంచి, ఉన్నత పాఠశాల స్థాయి వరకు భాషాశాస్త్రాన్ని బోధనా పాఠ్యాంశంగా ప్రవేశపెట్టినపుడు మాత్రమే దానికి బహుళ ప్రజాదరణ లభించగలదు. అంతేగాక దీని వలన భాషాశాస్త్రం అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న అనేక మందికి ఉపాధి కల్పన కూడా జరుగుతుంది.

నేటి విద్యార్థి లోకానికి భాషాశాస్త్రం ఎంతగానో తోడ్పడగలదన్న నగ్నసత్యం ఇప్పటికైనా గుర్తించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ఎందుకంటే భారతదేశంలో 'భాషాశాస్త్రం' విదేశాలనుంచి దిగుమతి అయిన పరిశోధనాంశం. తెలుగునాట సామాజిక భావ విప్లవానికి ఆద్యుడని చెప్పుకోవలసిన సామినేని ముద్దు నరసింహనాయుడు 1850లలోనే తెలుగు ఆధునిక భాషా స్వరూపాన్ని చర్చించాడు. క్రీ.శ. 1816లో ప్రచురితమైన క్యాంప్ బెల్ తెలుగు వ్యాకరణముతో, ఆ సందర్భంలోనే విలియం వైట్ ఎల్లీస్ తెలుగుపై వ్రాసిన పరిశీలనా వ్యాసంతో ద్రవిడ భాషల తులనాత్మక అధ్యయనానికి బీజం పడింది. క్రీ.శ. 1856లో బిషప్ కాల్డ్వెల్ ద్రవిడ భాషల తులనాత్మక వ్యాకరణముతో దానికో రూపం ఏర్పడింది. ఇది భాషాశాస్త్ర ప్రారంభం మనదేశం సంబంధించినంతవరకు.

ఈ కాలంలోనే తెలుగు శాసనాల పరిశీలన చరిత్ర రచనకే కాదు, భాషాధ్యయనానికి కూడా ఎంతో ప్రయోజనకారిగా మారింది. క్రీ.శ. 1924లో మల్లంపల్లి సోమశేఖరశర్మ తన చరిత్ర పరిశోధనలో భాగంగా 'ప్రాచీనాంధ్ర భాషా స్వరూపము' అన్న వ్యాసాన్ని ప్రకటించారు. కాల్డ్వెల్ పరిశోధనా మార్గంలో ద్రవిడ భాషల ప్రత్యేక కుటుంబవాదాన్ని అంగీకరించిన కోరాడ రామకృష్ణయ్య 1929లో శాసనాల ఆధారంగా 'నన్నయ్యకు పూర్వము ఆంధ్ర భాషా స్థితి' అనే వ్యాసం ప్రకటించారు. సంధి, దేశి, భాషోత్పత్తి క్రమము మొదలైన గ్రంథాలు కోరాడకు ద్రవిడ భాషల తులనాత్మక అధ్యయనం మీద ఉన్న అధికారాన్ని సూచిస్తాయి. నన్నయ్యకు చాలా కాలానికి ముందే తెలుగు కావ్య భాషాస్వరూపం స్థిరపడిందని

ఆయన మొదటిసారిగా గుర్తించారు. తెలుగులో చరిత్ర పరిశోధనకు ఆద్యుడైన కొమర్రాజు లక్ష్మణరావుకు సమకాలంలో వస్తున్న ద్రవిడ భాషల పరిశోధనతో పరిచయం ఉన్నట్లు ఆయన రచనలు స్పష్టం చేస్తాయి.

తొలినాటి సాహిత్యాధ్యయనాలన్నీ ప్రధానంగా భాషమీదనే కేంద్రీకృతమై ఉండేవి. తొలి పిహెచ్.డి. పట్టం పొందిన సిద్ధాంత వ్యాసం భాషకు సంబంధించినదే అవ్వటం ఇక్కడ మనం గుర్తించాలి. నన్నయ్య భారత భాషను సమకాలీన శాసనభాషను తులనాత్మకంగా పరిశీలించిన చిలుకూరి నారాయణరావు సిద్ధాంత గ్రంథానికి ('పదునొకండవ శతాబ్దమునాటి తెనుగు భాష' అని ఆ సిద్ధాంత గ్రంథం పేరు) 1927-29లో మద్రాసు విశ్వ విద్యాలయం నుంచి పిహెచ్.డి. లభించింది.

క్రీ.శ. 1947లో కాల్డ్వెల్ తులనాత్మక వ్యాకరణం భూమికగా గంటి జోగిసోమయాజి 'ఆంధ్రభాషా వికాసం' ప్రచురితమైనది. ఆంధ్రాలోని విశ్వ విద్యాలయాలు తెలుగు భాషాధ్యయనం చేసేందుకు గంటి జోగిసోమయాజి చేసిన కృషి మరువలేనిది. 1940ల నాటికే బ్రిటన్‌కు చెందిన థామస్ బర్రో, అమెరికాకు చెందిన ముర్రే బి ఎమైనో ద్రవిడ భాషా రంగంలోకి ప్రవేశించి అలిఖిత ద్రవిడ భాషలపైన ప్రామాణిక పరిశోధనలు చేయడం ప్రారంభించారు. ఈ కాలంలోనే తెలుగునాట స్వాతంత్ర్యోద్యమం సాగుతుండగానే తెలుగు భాషలో గ్రాంథిక, వ్యావహారిక ఉద్యమాలు చెలరేగాయి. చర్చలు, వాద వివాదాలు, అధ్యయనాలు తెలుగు భాషాధ్యయనానికి దోహదం చేశాయి.

గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పారావు వంటివారు వ్యావహారిక భాషోద్యమానికి బలం చేకూరుస్తూ ప్రాచీన కవుల ప్రయోగాలు, ఆ కవుల సమకాలీన వ్యావహారిక భాషా రూపాలను తమ ఉపన్యాసాలలో, రచనల్లో ఉటంకించటం మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో మద్రాస్ యూనివర్సిటీ వారి ఆహ్వానం మేరకు గురజాడ అప్పారావు గారు వ్రాసిన 'అసమ్మతి పత్రం' చాలా విశిష్ట స్థానం కలిగి ఉంది. భాషకు, భాషాపరిణామానికి, భాషా వినియోగానికి సంబంధించి ఆయన సునిశిత దృష్టికి ప్రమాణం ఈ 'అసమ్మతి పత్రం'. ఒకరకంగా చెప్పాలంటే గిడుగు రామ్మూర్తి గారికి, గురజాడ అప్పారావు గారికి అప్పటికే ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలతో మౌలిక పరిచయం ఉన్నట్లు వారి రచనల ద్వారా స్పష్టమౌతుంది.

1950ల తరువాత తెలుగు భాషా కృషి, పరిశోధనలు కీలక మలుపులు తిరిగాయి. భారతదేశం మొత్తం మీద తొలిసారిగా విదేశాలలో భాషాధ్యయనం చేసి, పరిశోధన చేసినవారు భద్రిరాజు కృష్ణమూర్తి. తెలుగులో ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాల అనువర్తన కృషి ఆయనతోనే మొదలైంది. తెలుగు భాషలో జరిగినంత భాషాశాస్త్ర సిద్ధాంతాల అనువర్తనం, వివిధ కోణాలలో భాషాధ్యయనం భారతీయ భాషలలో దేనిలోను జరగలేదు. ఇందులో ప్రధాన పాత్ర భద్రిరాజు కృష్ణమూర్తిదే. వీరి పరిశోధనల తరువాత కాల్డ్వెల్ ద్రవిడ భాషాధ్యయన గ్రంథం పరాస్తమైంది. బర్రో, ఎమినో, భద్రిరాజు భాషాశాస్త్ర త్రిమూర్తులుగా మారారు. భద్రిరాజు వారి కృషి గురించిన వివరాలు కొన్ని ఇతర వ్యాసాలలో కన్పిస్తాయి. ఇంతటి ప్రాధాన్యం గల తెలుగు భాషను, దాని శాస్త్రీయ అధ్యయనాన్ని, ప్రాముఖ్యాన్ని రక్షించుకోవటం మన అందరిపైన ఉంది.

(4 జూన్ 1978, ఆంధ్ర పత్రిక ఆదివారం అనుబంధం)

2
చలం సందేశం

సూటిగా చెప్పాలంటే – రవీంద్రనాధ్ ఠాకూర్ ఈ దేశానికి ఎలాంటి వాడో చలం కూడా అలాంటి ఆదర్శ ప్రాయుడే. చలాన్ని పొగుడ్తు నేటి దాకా ఎన్నో రచనలు ఎంతో మంది చేశారు. అవి పొగడ్తలుగానే కాగితాలపై నిల్చిపోగా, చలం రచనలు రచనలుగానే పుస్తకాల్లో మిగిలిపోయాయి. చలం రచనల్లో ఊపిరి పోసికొని ప్రభావితమైన ఈ సంఘం, చైతన్య శూన్యమై జడపదార్ధంగా రూపు, స్వభావాలను దిద్దుకొంది కాల క్రమంలో.

చలం తన రచనల్లో వ్యక్తిగత సమస్యల్ని, సామాజిక సమస్యల్ని మాత్రమే ప్రతిబింబించాడు. తన రచనల్లో సామాజిక దురాచారాల్ని దుయ్యబట్టాడు. చలం రచనల్లో ద్యోతకమైన విప్లవ భావాలను ఈ సంఘం సమదృష్టితో చూడలేక పోయింది.

కొందరు ఆయన్ని "మార్క్సిష్టు" అని విమర్శిస్తే, కొందరు ఆయన స్త్రీల పట్ల వ్యక్తపరచిన అభిప్రాయాలను బట్టి "రసికుడు" అని నిందించారు. నిజానికి చలం ఏ పార్టీకి, మతానికి, వర్గానికి పరిమితమైన వ్యక్తికాదు. అంతేగాక తన పోరాటంలో ఎవ్వరి నుంచి సహాయం ఆశించలేదు. తను ఆశించిన ఫలితం పొందలేక, సంఘంలో నిత్యం జరిగే సంఘర్షణలకు తాళలేక, కేవలం మానసిక సంఘర్షణ జ్వాలల్లోనే ఆత్మాహుతి కావించుకొని, చలం చలనం లేని నిశ్చల వ్యక్తిగా సంఘం మంచి శాశ్వతంగా కదిలి పోయాడు ఒకనాడు.

స్త్రీలకు స్వేచ్ఛ ప్రసాదించమని వాదించటంలోను, నాగరికతకు సరైన అర్థం చెప్పటంలోను, సాంఘిక దురాచారాల నడ్డి, కాళ్ళు రెండూ విరగొట్టడంలో చలం చూపిన రచనా నైపుణ్యం, తీవ్రత నాటి యువతరాన్ని నిద్రలేపింది అనటం అతిశయోక్తి కానేరదు. స్త్రీలను మనుషులుగా గుర్తించి, వాళ్ళలో రగిలే సహజసిద్ధమైన భావాలకు, కోరికలకు ఒక సాంఘిక ప్రతిపత్తిని కల్పించమన్న చలం వాదన నాటి మగతరం అంగీకరించలేక పోయింది. స్త్రీలపై, వారి మనోభావాలపై మగతరం తమకు తాము ఆపాదించుకొన్న ఆధిక్యతను వదులకోను యిష్టపడక పోవటం వలన చలం తన రచనల్లో కథా నాయికలకు తమ కోర్కెల సాధనకై యిళ్ళు వదిలి రావటం ఒక మార్గంగా సూచించటం జరిగింది. అందుకూ తార్కాణమే "మైదానం"లో రాజేశ్వరి పాత్ర. అయితే చలం రచనల్లో కథా నాయికల పాత్రలు విషాదాంతం అవుతాయి కాబట్టి, చలం చూపిన మార్గం అంత సహృదయ రంజకమైనది కాదు అన్న విమర్శ ఒకటి లేకపోలేదు. 'అతి ప్రతిభాశాలి అయిన చలం, వీరేశలింగం పంతులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి వంటి రచయితల సంస్కరణలతో ఆగలేదు. వివాహ ధర్మమందు కాలక్రమమున జొరబడ్డ లోపములను సవరించుటకై వానిని నవ్వులపాలు చేసి పూరకుండలేదు. వివాహ ధర్మముల మూలమునకే మోసము తెచ్చు స్వేచ్ఛాచారమును వీరు ఉపదేశించుచున్నారా అని పించుచూ విశృంఖలమై నోరూరించు కామక్రియాకలాపమును వన్నెచిన్నెలతో వర్ణింతురు. శృంగార వర్ణనౌచిత్య విషయములో మన పూర్వ ప్రబంధములను నిరసించిన వీరేశలింగం గారి శ్రోత్రియత్వమును తుడిచిపెట్టి, వాటికి రంగు రంగుల బొమ్మలతో చిత్రించిన గాని తనివి తీరని స్థితికి తెచ్చినది చలంగారి అమోఘలేఖిని (సాహిత్యదర్శనము : కాటూరి వెంకటేశ్వరరావు. 1967. పుట 40).

కానీ, అది అంత ఆమోదయోగ్యమైనట్టి విమర్శకాదు. మన సామాజిక పరిస్థితి వారి జీవితాలకు అంతకంటే మరో మంచి మార్గం చూపలేకపోయిందన్న భావనను యినుమడింప చేయడానికి చలం ఆ విధమైన కథా కృషి చేయటం జరిగింది. "తన తప్పును తప్పుగా ఒప్పుకోలేని దైన్యమైన ఆత్మస్థైర్యతోను, కళ్ళు తెరిచి నిజం చూడలేని

బలహీనతతోనూ ఈ సంఘం ఒక క్రానిక్ 'పేషంటుగా ఏనాడో మారిపోయింది' – అంటారు చలం ఈ సంఘంపై తన అభిప్రాయం సూటిగా చెప్తూ చలం గర్విష్ఠి కాలేదు. సాటి రచయితల్ని సమానంగా గుర్తించాడు. తనవలె ఈ సంఘానికి షాక్ ట్రీట్‌మెంటు యిచ్చే రచనలకు రచయితలకు చేయి అందించి కలిసి మెలిసి ముందుకు సాగాడే కాని కుళ్ళు, స్వార్థం, అహంకార, ద్వేషాలకు లోనుకాలేదు. ఇందుకు తార్కాణమే శ్రీశ్రీకి ఇచ్చిన "యోగ్యతా పత్రం". శ్రీశ్రీని చలంతో శాశ్వతంగా ముడిపెట్టింది కూడ యిదే. చలం కవి కూడ, ఆయన కవిత్వం జటిల పదబంధ రహితమై, వ్యాకరణ సంకెళ్ళు, ఛందస్సుల పద్య పరిష్వంగాలు విడిచి అతి సులువుగా ఉంటుంది. "చలమే కనుక మొదటి నుంచి కవిత్వం రాసివుంటే తన కవితా పరిణామం ఊహించలేని మలుపుల్లో ఉండేది" అంటారు ఈ విషయంపై వ్యాఖ్యానిస్తూ డాక్టరు మిరియాల రామకృష్ణగారు. కవిత్వానికి సౌలభ్యం ఉండాలన్నదే చలం భావం. అందుకు తార్కాణం ఠాగూర్ గీతాంజలికి ఆయన (చలం) యిచ్చిన మధురమైన అనువాదమే.

– "చలం ఒక గొప్ప సాహితీ కళావేత్తని, ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆయనకు తప్పకుండా స్థానం ఉందని, తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన కృషికి మా అందరి ఆరాధనలు పొందిన రచయితని – తనకి ఆరాధ్యుడని" – శ్రీశ్రీ కొనియాడాడు చలానికి – నివాళులర్పిస్తూ.

తిరిగి చలం లాంటి వ్యక్తి రావటం ఎప్పుడో...? శ్రీశ్రీ కూడ మహా ప్రస్థానంతో ఆగిపోయాడు...? అప్పుడప్పుడే చైతన్యం పుంజుకొంటున్న సంఘం దిక్కు తోచక ఆగిపోయింది సగంలో... కానీ, చలం ఈ సమాజానికి యిచ్చిన షాక్ ట్రీట్‌మెంటు సజీవం – ఒక మధుర స్మృతి – చైతన్య గీతం.

(15 జూన్ 1980, ఆంధ్ర పత్రిక ఆదివారం అనుబంధం)

3
తెలుగు రచనలు ప్రపంచ వ్యాప్తమయ్యేదెలా?

గతంలో కన్నా ఇప్పుడు తెలుగులో రచనలు ఎక్కువ య్యాయి. తెలుగులో రాసే రచయితలు పెరిగారు. దాదాపు ఏ వారపత్రిక చూసిన పదుల సంఖ్యలో పుస్తకాలు సమీక్షకు రావటం ఎంతో సంతోషించదగ్గ పరిణామం. అయినా తెలుగు రచనలు, పుస్తకాలు అంతే స్థాయిలో ప్రపంచవ్యాప్త మవుతున్నాయా? – అని ప్రశ్న వేస్తే లేదనే చెప్పాలి.

పందొమ్మిది వందల తొంభైల్లో ప్రపంచీకరణ ఆరంభమైంది. అప్పట్నించి ప్రచురణ రంగంలో కూడ విప్లవ స్థాయి పరిణామాలు వచ్చాయి. తెలుగు లిపి కంప్యూటరీ కరణం చెందాక ప్రచురణ రంగం వేగవంతమైంది. గతంలో రాతప్రతులుపయోగించి అచ్చు వేయడానికి బాగా సమయం పట్టేది. ఇప్పుడు డెస్క్ టాప్ పబ్లిషింగ్, పేజ్‌మేకర్, మిని ఆఫ్‌సెట్, డిజిటల్ ప్రింటింగ్, ఇంటర్నెట్ వెబ్‌పోర్టల్స్ ఇలా ఎన్నో సౌకర్యాలు ఏర్పడ్డాయి. అయినా తెలుగు రచనలు సముచిత స్థాయిలో ప్రపంచీకరణం చెందటం లేదు.

ఇందుకు తెలుగు రచయితలు ఏమి జాగ్రత్తలు తీసుకోవాలి? ఎందుకు తీసుకోవాలో? – చెప్పేందుకే ఈ వ్యాసం. ఈ సందర్భంగా తెలుగు భాష ఔన్నత్యం, గొప్పతనం, తెలుగు రచయితల కథలకు తొలినాళ్ళలో వచ్చిన అంతర్జాతీయ ఖ్యాతి మనం గుర్తుపెట్టుకోవాలి. కాని, ఆ స్థాయిలో నేడు మన తెలుగు రచయితల రచనలు ప్రపంచ వ్యాప్తంగా అందరికీ అందుబాటులో వస్తున్నాయా అంటే, సమాధానం శూన్యం. కేవలం తెలుగు రచనలు, రచయితల పట్ల జిజ్ఞాస ఉన్న వారికి తప్ప మిగతా ఎవ్వరికీ మనం మన రచయితల రచనల గురించి తెలిసే పరిస్థితి లేదు.

ఎందుకిలా? ముఖ్యంగా ఇందుకు కారణం తెలుగు రచనలు చేసేవారు తీసుకోవలసిన కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం లేదు. ఏమిటవి? – అని అడిగితే వివరంగా చెప్పవలసినవే సంక్షిప్తంగా చెప్పే ప్రయత్నం చేస్తాను.

ఐ.ఎస్.బి.ఎన్. సంఖ్య అంతర్జాతీయ ప్రాచుర్యానికి తొలిమెట్టు:

ప్రచురణ రంగంలో వచ్చిన పెను మార్పుల కారణంగా పుస్తకం అచ్చు వేయాలంటే కొన్ని ప్రమాణాలు పాటించాలి. రచనలు ఏవైనా ఈ ప్రమాణాలు పాటించటం వలన పుస్తకం ప్రాథమికంగా ప్రపంచీకరణం చెందుతుంది. ముందుగా రాసే రచన – కవితలైనా, కథలైనా, విమర్శలైనా, అనువాదాలైనా, నవలలైనా ఆ పుస్తకానికి ఐ.ఎస్.బి.ఎన్. సంఖ్య సంపాదించుకోవాలి. ఐ.ఎస్.బి.ఎన్. సంఖ్య అంటే ఇంటర్నేషనల్ స్టాండర్డ్ బుక్ నెంబరు ఇదే మీ పెద్ద విషయం కాదు. ఎవరికీ లంచాలు ఇవ్వవలసిన పనిలేదు. కేంద్ర మానవ వనరుల శాఖ (ఎంహెచ్ఆర్‌డి) వారి వెబ్‌సైట్‌లోకి వెళ్తే రాజారామ్మోహన్‌రాయ్ ఫౌండేషన్ వారి లింక్ కన్పిస్తుంది. దీన్ని తెరిస్తే అందులో ఐ.ఎస్.బి.ఎన్. సంఖ్య పొందే మార్గం సులువుగానే అవగత మవుతుంది. రచయితలు స్వయంగా దరఖాస్తు చేసుకోవచ్చు ఈ సౌకర్యం కేవలం రచయితలకు, ముద్రణకర్తలకు మాత్రమే లభ్యం. థర్డ్ పార్టీ లేదా ఒకరి కోసం మరొకరు చేసే సౌలభ్యం ఉండదు. ఇది మీ పేరు మీద మీరు 'లాగిన్' అయి, పాస్‌వర్డ్ ఏర్పరచుకొని మీ గుర్తింపు ఆధారాలు సమర్పించి రిజిష్టర్ చేసుకోవాలి. ఆ తర్వాత మీరు రాసిన / రాస్తున్న పుస్తకం వివరాలు – అంటే మీ పేరు, రచయిత పేరు, రచయిత జీవిత వివరాలు, రచనలోని ప్రధాన విషయాలు నిర్దేశించిన ఫారంలో రాయవలసి ఉంటుంది. అలా అన్ని వివరాలు ఇచ్చి ఫారమును 'సబ్‌మిట్' చేస్తే, వారం, పదిరోజుల్లో మీకు రాజారామ్మోహన్ రాయ్ ఫౌండేషన్ వారి నుంచి ఐ.ఎస్.బి.ఎన్. సంఖ్య వస్తుంది. ఇందుకు గాను మీకో గుర్తింపు ఈ-మెయిల్ ఐడి అవసరం సుమా! ఈ మెయిల్ ఐడి లేని వారు ముందు ఈ-మెయిల్ ఐడి ఏర్పరచుకుని ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టాలి.

ఈ ఐ.ఎస్.బి.ఎన్. సంఖ్య మీ పుస్తకం పై ప్రచురించాల్సి ఉంటుంది. దీని వలన ఈ పుస్తకం వివరాలు ప్రపంచ వ్యాప్తమవుతాయి. ఈ పుస్తకముకు నిర్ధేశితమైన

ఐ.ఎస్.బి.ఎన్. సంఖ్యని గూగుల్‌లో కొడితే మీ పుస్తకం వివరాలు, మీ వివరాలు ప్రపంచవ్యాప్తంగా తెలుస్తాయి. మీ రచనలు ప్రపంచవ్యాప్తం కావటానికి ఇది తొలిమెట్టు మాత్రమే. అంతటితో అంతా అయిపోయిందని భావించకండి.

ఇంటర్నెట్ ఆర్చేవ్.ఆర్గ్‌లో పుస్తకాలను, దానిలో మీ రచన పేజీలను ఉంచే సౌకర్యం :

ఇంటర్నెట్ ఆర్చేవ్.ఆర్గ్ అనే ఒక ఆన్‌లైన్ లైబ్రరీ ఉంది. మీ అచ్చయిన పుస్తకాన్ని కాని, లేదా డెస్క్ టాప్ పబ్లిషింగ్ ద్వారా కంప్యూటర్‌లో కూర్చిన మీ పుస్తకాన్ని కాని ఈ ఇంటర్నెట్ ఆర్చేవ్.ఆర్గ్‌లో నేరుగా పెట్టే ఉచిత సదుపాయం ఉంది. దీనివలన ఈ పుస్తకం కొనలేనివాళ్ళు, కొనడానికి అందుబాటులో లేనివాళ్ళకి కూడ ఈ పుస్తకం అందుబాటులోకి వస్తుంది. దీన్ని చదవగల్గుతారు. ఈ విధంగా ఇంటర్నెట్ ఆర్చివ్ .ఆర్గ్ ద్వారా చదివిన వారు కూడ ఈ పుస్తకాన్ని పలువురికి సిపార్సు చేయడాని, పురస్కారాలకు సన్మానాలకు పంపడానికి సులభసాధ్యమవుతుంది కూడ. అంతేకాక ఐ.ఎస్.బి.ఎన్. సంఖ్య కూడ ఉంటే ఇంకా మంచి గుర్తింపు వస్తుంది. ఒక్క క్షణంలో ప్రపంచలో ఎవరు ఏ మూలనుంచైనా మీ రచన, మీ గురించి తెలుసుకొనే అవకాశం కలుగుతుంది. ఉత్తరోత్ర మీ పుస్తకానికి ఏదైనా గుర్తింపు లభిస్తే మీ గురించి, మీ పుస్తకం గురించి వికీపీడియా వంటి ఆన్‌లైన్ ఎన్‌సైక్లోపీడియాల్లో పెట్టే అవకాశం 'వికీపీడియా' రచయితలకు లభ్యమవుతుంది.

'వికీపీడియా' : ఉచిత ఆన్‌లైన్ ఎన్‌సైక్లోపీడియాను ఉపయోగించు కోవడం ఎలా?:

'వికీపీడియా' కొన్ని వింత ప్రమాణాలను పాటిస్తుంది. అమెరికాలోని ఒక ప్రైవేటు ఫౌండేషన్ నడుపుతున్న ఆన్‌లైన్ ఎన్‌సైక్లోపీడియా ఇది. దీన్లో ఎవరి గురించైనా రాయాలంటే, దేని గురించైన చెప్పాలంటే ముఖ్యమైన షరతు ఒకటి ఉంది. అదేమిటంటే ఆ రచన, ఆ రచన చేసిన వ్యక్తి వివరాలు గుర్తింపు పొందిన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ల ద్వారా ఇంతకు ముందే అందుబాటులో ఉండాలి. దీనికి తోడ్పడే విషయాలే పైన చెప్పినవి. ఒకటి రచనకు ఐ.ఎస్.బి.ఎన్. సంఖ్య ఉండాలి. ఆ రచన ఇంటర్నెట్ ఆర్చివ్.ఆర్గ్ ద్వారా అందుబాటులో ఉండాలి. అలాగే వరల్డ్ క్యాట్.ఆర్గ్ వంటి సంస్థల్లో కూడ లభించాలి.

ఇలా ఎందుకు చెబుతున్నామంటే ఎవరు ఎంత గొప్పవారో ఎవరు ఎంత గొప్ప రచన చేశారో ఎవరు చెప్పాలి? దానికి ప్రామాణికత ఏమిటి? నైతిక విలువలు నానాటికి పడిపోతున్న రోజులో ఎవరు ఏ పుస్తకం గురించి రాసినా అది "పెయిడ్ రచన" అని పరిగణిస్తున్నారు. అలాంటప్పుడు ఒకరి గురించి వికిపీడియాలో రాయటం చాలా కష్టం. నేరుగా ఫలానా వ్యక్తి "ఓ గొప్ప రచయిత, ఇంత గొప్ప రచనలు చేశారు" అని 'వికిపీడియా'లో రాసేందుకు 'వికిపీడియా' నిబంధనలు ఒప్పుకోవు. ఒకవేళ 'వికిపీడియా'లో పెట్టినా దాన్ని వేరే సంపాదకులు, పర్యవేక్షకులు (అడ్మిన్స్) తొలగిస్తారు. అలాంటి రచనల్ని వారు 'అడ్వర్‌టైజ్‌మెంట్' క్రింద పరిగణించి రాసిన రచయితను 'బ్లాక్' చేస్తారు. అందువలన రచయితలు తను ఉన్నతమైన రచనలను నలుగురికీ తెలిసేలా చేసుకోవటం ఎంతైనా సబబు.

తెలుగు పుస్తకప్రచురణకు పాటించవలసిన ప్రమాణాలు :

తెలుగు పుస్తకప్రచురణకు పాటించవలసిన పై ప్రమాణాలు పాటించటంతో సమస్య పరిష్కారం కాలేదు. ఇవాళ పుస్తక రచన అంటే కొన్ని ప్రమాణాలు విధిగా పాటించాలి. గతంలో స్థానికంగా అచ్చోత్తే వారితో అచ్చొత్తించి నలుగురికి పుస్తకం పంచేవారు. ఇప్పుడు కూడ పుస్తక సమీక్షలకు వస్తున్న అనేక రచనలు సొంతంగా స్థానికంగా అచ్చొత్తే వారితో ముద్రణ చేయించి పుస్తకాలు లభ్యమయ్యే స్థలాన్ని ఒక ప్రముఖ పంపిణీదారుకు అప్పచెబుతున్నారు.

ఈ విధంగా అచ్చొత్తించటంలో ఏ ప్రమాణాలు పాటించకపోవటం కూడ ఒక పెద్దలోపమే. ఈ రచయితలు సొంత ఖర్చుతో అచ్చొత్తించటం కన్నా ప్రముఖ ప్రచురణ సంస్థలను వాడుకోవటం ఎంతో ఉత్తమం. గతంలో వావిళ్ళ రామస్వామి అండ్ సన్స్, గోరఖ్‌పూర్ గీతాప్రెస్, వెంకటేశ్వర పబ్లిషింగ్ హౌస్ అండ్ కంపెనీ లాంటి ప్రముఖ పుస్తక ప్రచురణ సంస్థలు ఉండేవి. వాటి ప్రచురణలకు ఎంతో గౌరవం, ఆదరణ ఉండేవి. ప్రస్తుతం – విశాలాంధ్ర, నవయుగ, నీల్‌కమల్ వంటి ప్రచురణ సంస్థలు ఉన్నాయి. ఇవి హైద్రాబాదు, విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్నాయి. ఎమెస్కో, పెంగ్విన్ వంటి పుస్తక

సంస్థలు రెండు భాషల్లోనూ అచ్చు వేస్తున్నాయి. ప్రముఖ అచ్చొతే సంస్థలను ఆశ్రయించటం వలన మీ రచనలు తగిన ఖ్యాతి, గుర్తింపు పొందే అవకాశం ఎక్కువ. అన్నింటికీ మించి ఆ రచయితలకు, రచనలకు 'వికిపీడియా' వంటి ఆన్‌లైన్ ఎన్‌సైక్లోపీడియాలో కూడ ఆదరణ లభించవచ్చు.

ఇప్పుడు పైన వివరించిన జాగ్రత్తలు తీసుకోకపోవటం వలన, తెలుగు సారస్వతం ఎంత నష్టపోయిందో వివరిస్తాను. గతంలో తెలుగులో ఎందరో మహకవులు, రచయితలు, విమర్శకులు, చరిత్ర పరిశోధకులు ఎన్నో రచనలు చేశారు. ఆ కాలంలో ఎవరో దాతలు వాటిని అచ్చువేసి లోకానికి అందించేవారు. కాని ఈనాడు అవి ఎక్కడున్నాయో కూడ అంతుబట్టని విషయం. ఆ రచనలను ప్రపంచవ్యాప్తం చేద్దామని ఈ వ్యాసరచయిత చేసిన ప్రయత్నాలు ఇంకా ప్రాధమిక స్థాయిలోనే ఉన్నాయి. కొన్ని పుస్తకాలు, రచనలు, రచయితల వివరాలు సేకరించ గలిగినా వాటిని 'వికిపీడియా' అంగీకరించటం లేదు. కారణం ఆ రచనలకు ఐ.ఎస్.బి.ఎన్. సంఖ్య లేకపోవటం, ఇంటర్నెట్ ఆర్చైవ్.ఆర్గ్, వరల్డ్‌కాట్.నేట్ వంటి వాటిల్లో వాటి వివరాలు పొందుపరిచేవారు లేకపోవటం, ఆ రచయితల గురించి ప్రామాణికంగా చెప్పే వ్యాసాలు ఏవీ ఆంగ్లంలో ఆన్‌లైన్‌లో లభ్యం కాకపోవటం వంటివి. తెలుగు వికిపీడియాలో పెట్టాలన్నా ఇవే నియమాలు వర్తిస్తాయి. అయితే తెలుగు రచనలు, రచయితలు తెలుగు వారికి మాత్రమే ప్రపంచవ్యాప్తంగా తెలియటం వలన తెలుగు రచనల ప్రపంచీకరణ పూర్తి లక్ష్యం నెరవేరినట్లు కాదు కదా!

ఆంగ్లం ఎప్పటికీ అనుసంధాన భాషనే :

తెలుగువారు, తెలుగు రచనలు, తెలుగు రచయితలు, వారి గొప్పదనం ప్రపంచానికి తెలియాలంటే వాటి గురించి ఆంగ్లంలో రాయిగల్గి ఉండాలి. ఆ రాసింది ఆంగ్లంలో ఆన్‌లైన్‌లో ప్రామాణిక ఆంగ్ల మాధ్యమాల్లో రావాలి. (ఉదా: ఆంగ్లపత్రికలు, మ్యాగజైన్‌లు మొదలైనవి) బ్లాగ్ పోస్టులు, ట్విట్టర్‌లు, ఫేస్‌బుక్‌ల్లో రాసిన వాటిని 'వికిపీడియా' గుర్తిస్తుందనుకోవటం పొరపాటే. 'వికిపీడియా' గుర్తించకపోతే ఏమిలోపం? – అని ఎవరైన అడగవచ్చు. అందుబాటులోకి సులువుగా ఉన్న, పైసా ఖర్చులేని ఓ ప్రపంచీకరణ మాధ్యమాన్ని గుర్తించవలసిన అవసరం ఎంతో ఉంది. దీన్ని కూడ వాడుకోవడానికి ప్రయత్నించటమే సరైన ఆలోచన అని అభిజ్ఞుల అభిప్రాయం.

తెలుగు పుస్తకాల ప్రచురణ రీతిలో కూడ రావలసిన మార్పులు:

అంతేకాదు తెలుగులో అచ్చొత్తే పుస్తకాలకు కొంత ప్రామాణీకరణ అవసరం. కేవలం కవరు పేజి, లోపలి పేజి వివరాలు ఇచ్చేస్తే సరిపోతుందని అనుకోవటం తొందరపాటే. మీ రంగాన్ని బట్టి మీరెంచుకొన్న రచనా వస్తువు ప్రాధాన్యాన్ని బట్టి ఆ రంగంలోని ప్రముఖుడితో “ముందు మాట” రాయించండి. తర్వాత మీరు రచయితగా ఆ పుస్తకం, ఆ వస్తువు వెలుగులోకి తేవటంలో మీ ఉద్దేశ్యం, లక్ష్యాలు పేర్కొనండి. విషయ సూచికలో వీటికి పేజీల సంఖ్యను కేటాయించండి. తర్వాత పుస్తకం చివరన “ముగింపు వాక్యాలు” (ఎపీలాగ్) తప్పక రాయించండి. లేక మీరైనా రాయండి. ‘ఏపిలాగ్’ చాలా అవసరం. తర్వాత పుస్తకం చివరలో విషయం లేదా సబ్జెక్ట్ ఆధారంగా పారిభాషిక పదపట్టిక లేదా రెఫరెన్స్ ఇండెక్స్ తప్పక పెట్టించండి. కథలు, నవలలు, కవితలకు అవసరం లేకపోయినా, వాటిల్లో ప్రత్యేక వివరణనిచ్చుకోవలసిన అంశాలను కనీసం ఆ పుస్తకం వెనుకపేజీల్లో / చివరి పేజీల్లో రాయండి. అన్నింటికీ మించి రచయితగా మీ గురించి ముఖ్యమైన విషయాలే చెప్పండి చివరి అట్టపైన ఫోటోతో సహా.

‘కేవలం రాశాం, అచ్చొత్తాం, ఆపైన దేవుని దయ’ – అన్నట్లు రచనలు చేసి, అచ్చువేయకండి. ఈ యాంత్రిక యుగంలో మీ పుస్తకాలు, మీ రచనలు పదిమందికి చేరి, వారు తప్పక మీ రచనలు చదివేది ఎలా? – అని ఆలోచించండి. ఆంగ్లంలో కూడ కవితలు, కథలు అచ్చు వేస్తున్నారు. విమర్శనా గ్రంథాలు అచ్చువేస్తున్నారు. వారిలో తెలుగువారు కూడ ఉన్నారు. ఆయా అచ్చొత్తే ఆంగ్ల సంస్థలు చేయమన్నవన్నీ చేస్తున్నారు. అప్పుడే ఆ రచనలు అచ్చొత్తుతున్నారు. జన బాహళ్యంలోకి వెళ్తున్నాయి. మరి తెలుగువారు తమ పుస్తక ప్రచురణలో నూతనరంగంలో వస్తున్న ప్రమాణాలను పాటించి తగిన ‘ఫార్మాట్’ లో అచ్చొత్తిస్తే అది ప్రపంచం నలుమూలలా చేరటంలో కష్టం ఉంటుందా? ఆలోచించండి!

(నవ తెలుగు తేజం మాస పత్రిక జులై 2019)

4
మేళ్ళ చెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి రచనల్లో సెమియాటిక్స్

మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి సంస్కృతాంధ్రాలలో విశేష ప్రజ్ఞ, పాండిత్యము గల శతాధిక గ్రంథకర్త. నేటి ఆధ్యాత్మిక సాహితీరంగంలో ఒక ధ్రువతారలాంటి మహాపండితుడు. చాగంటి కోటేశ్వరరావు, గరికపాటి నరసింహరావు గారల ప్రసంగాలలో తరచూ ప్రస్తావనకొచ్చే 'చందోలు మహర్షి' – తాడేపల్లి రాఘవ నారాయణశాస్త్రి గారి – అంతేవాసి ఈ మేళ్ళచెరువు వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి. ఆయన శిష్యుడు గూడ. ఆయన వద్దే సంస్కృతాంధ్రాలలో గురుకులాభ్యాసం చేశారు. తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ. తెలుగు, ఎం.ఏ. సంస్కృతాలలో ఫస్టు క్లాసులో పట్టాలను పొందారు. ఒంగోలులోని శ్రీ తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రి సంస్కృత కళాశాలలో సంస్కృతం లెక్చరర్‌గా జీవితం ప్రారంభించి, గోరంట్ల వెంకన్న సంస్కృత కళాశాల, తిమ్మసముద్రంలో పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం వీరి వయస్సు 70 వసంతాలు పైనే. చాగంటి వారు, గరికపాటి వారు ప్రవచించే 'చందోలు మహర్షి' వారికి బాలాకటాక్షం, కంచి పరమాచార్య చంద్రశేఖర సరస్వతి గారితో 'చందోలు మహర్షి' సాంగత్యం, వారు 'చందోలు మహర్షి'ని చూడటానికి చందోలు రావటం వంటి అనేక ఘటనలు మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు రాసిన తొలి సంస్కృత పద్య కావ్యం – శ్రీగురు చరిత – నుండి ప్రోది చేసినవే. దీనినే శాస్త్రిగారు తర్వాత కాలంలో తెలుగులో, 'పితాపుత్ర కవీశ్వరులు – చందోలు మహర్షులు' అని ఒక చిరునవలలా రాశారు.

మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి గారి రచనల్లో సంస్కృత కావ్యాలు, తెనుగు కావ్యాలు పద్యరూపంలో ఉంటాయి. ఇవి గాక వారు సుప్రసిద్ధ సంస్కృత మహాకవి, 'అపర ఆదిశంకరుడి'గా కీర్తిగాంచిన హయగ్రీవ అవతారమైన బెల్లంకొండ రామరాయ కవి రాసిన అనేక సంస్కృత కావ్యాలను, విమర్శలను, నామావళులను తెలుగులో అనువదించే అనితర సాధ్యమైన పనిని సాధ్యం చేసి చూపిన అపురూప సంస్కృత కవి. ఎంతో పాండిత్యం, ఆధ్యాత్మిక పరిజ్ఞానం ఉంటేగాని శ్రీ బెల్లంకొండ రామరాయ కవి రాసిన సంస్కృత గ్రంథాలను పరిష్కరించటం, అనువదించటం సాధ్యం కాదన్న విషయం ఆధ్యాత్మిక సాహితీ లోకంలోని పండితులకు విదితమే.

అంతేగాక సంప్రదాయ అనువాద సాహిత్యంలో విద్యారణ్యముని కృతం అయిన 'ఆంధ్ర వివరణ ప్రమేయ సంగ్రహము'ను తెలుగులోకి అనువదించారు. ఇది అత్యంత క్లిష్టమైన ప్రబంధం. విద్యారణ్యముని సంస్కృతంలో ఎంత జటిలంగా రాస్తారో పండితులకు తెలియనిదికాదు. అలాగే శ్రీ సర్వజ్ఞాత్మముని రాసిన మూలానికి 'శ్రీ మధుసూదన సరస్వతి విరచిత సారసంగ్రహ వ్యాఖ్యా విశేషాన్ని' అత్యంత సులభతరం చేసి 'ఆంధ్ర సంక్షేప శారీరకము' అను పేరుతో ఒక అసాధారణ అనువాదం చేసిన అనువాద కర్త కూడ. వారు చేసిన బెల్లంకొండ రామరాయకవి అనువాదాల్లో కొన్ని ముఖ్యమైనవి. పరమాత్మ సహస్రనామావాళి (వ్యాఖ్యకూడ), సిద్ధాంత సింధు: (నాగరలిపి), రమావల్లభరాయ శతకం (సంస్కృత వ్యాఖ్య), అద్వైత విజయము, వేదాంత నిశ్చయము, అద్వైతామృతం, భాగవత చతు:శ్లోకి, సిద్ధాంత సింధు:. (దశశ్లోకి తెలుగు వివరణ), శంకరా శకర భాష్య విమర్శ మొదలైనవి ఆయనకి ఎంతో ఘనకీర్తిని తెచ్చిపెట్టాయి.

శాస్త్రి గారి తెలుగు రచనలు

మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి రాసిన తెలుగు కావ్యాలలో చిన్నవి, పెద్దవి కలిపి దాదాపు 15–20 ఉన్నాయి. అవి : సామిశరణం, మదాలస జోలపాట, ఆత్మ సుప్రభాతం, అస్తి దేవము (సదసత్సంశయము), కనకధారాస్తవము (పద్యాను వాదము వ్యాఖ్యతో) శ్రీ కృష్ణ రాసలీల – యోగత్రేయాహేల, బీజతంత్రము, చందోలు మహర్షులు, అటుకులలో కిటుకులు (విమర్శనా వ్యాసం), గజేంద్రమోక్షం, ఋషి రుణం, వామనడు – వామనము

మొదలైనవి. ఇక వ్యాఖ్యానాలకు వస్తే దాదాపు 15-20 దాకా ఉంటాయి అవి కూడ. త్రిపురామహిమ్న: స్తోత్రము, రామకృష్ణ విలోమ కావ్యము, బ్రహ్మసూత్ర భాష్యకరదీపిక, కనకధారాస్తవము, విజ్ఞాన భైరవము, విష్ణు సహస్రనామ స్తోత్రము, శివ గీత, వాగ్దేవి స్తుతి, ముక్తి ద్వారా స్తవరాజ:, వరహోపనిషత్తు మొదలైనవి. వీటిలో సిద్ధాంత సింధు: (తెలుగు లిపి : సంస్కృత మూలము - దశ శ్లోకి వ్యాఖ్యా) రావి మోహనరావు గారితో కలిసి రచించగా, సిద్ధాంత సింధు: (నాగర లిపి)ను రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి ద్వారా ప్రచురించారు. అలాగే బెల్లంకొండ రామరాయ కవిగారు రాసిన రమావల్లభరాయ శతకమునకు సంస్కృత వ్యాఖ్య రాశారు. ఇవన్నీ సాధారణ సంస్కృత పండితులకు సాధ్యమయ్యేవి కావని ఈ రంగంలో ప్రవేశమున్న ఎవరు పఠించినా సులువుగా అవగతమవుతుంది.

ప్రస్తుత పరిశీలన లక్ష్యం

భారతీయ ఆధ్యాత్మిక సాహిత్యం నుంచే సామాజిక పరిణామంలో సాధారణ సాహిత్యం రూపుదిద్దుకొంది. ఇది భాషా పరిణామంలో ఒక ముఖ్య అంశం. పూర్తిగా భాషా సాహిత్య పరిణామం ఇది మార్గంలో జరిగిందని చెప్పలేము. భాషా పరిణామం అనేక పాయల్లో అనేక మార్గాలుగా జరిగిందని భాషా శాస్త్రవేత్తలు భద్రిరాజు కృష్ణమూర్తి లాంటి వారు ఎప్పుడో ఆవిష్కరించారు (చూడు : భద్రిరాజు కృష్ణమూర్తి రచనలు - తెలుగు భాషా చరిత్ర, భాషా, సంస్కృతి, సమాజం). కాని భాషా సాహిత్య పరిణామంలో వ్యాకరణ పునాదులు వాటి నుంచే ప్రారంభమైన దన్నది ప్రపంచ భాషా శాస్త్రవేత్తలు అందరూ అంగీకరించినదే. తొలినాటి భాషా సాహిత్యం ప్రధానంగా సంస్కృతం చుట్టూ కేంద్రీకృతమైన దన్నది కూడ జగద్వితం. వేదాలనుంచి వాల్మీకి, వ్యాసుడు, శ్రీహర్షుడు, కాళిదాసు, గుణాఢ్యుడు, శ్రీనాధుడు, నన్నయ్య, పోతనలదాక భాషా సాహిత్యం ఉద్భవించి భాషను పరిపుష్టం చేసింది. అధ్యాత్మిక భాషా సాహిత్యమే. దీని నుంచే అలంకారాలు, ఛందస్సులు, సంధులు, సమాసాలు వంటివి ఉద్భవించి నేటి రచనా సాహిత్యానికి విస్తరించాయి. అయినప్పటికీ నాటి సాహిత్యం నుంచి నేటి వరకూ ఈ భారతీయ సాహిత్యంలోని 'సెమియాటిక్స్' పైన సమగ్ర పరిశోధన జరగలేదు.

'సెమియాటిక్స్' అంటే సంజ్ఞాశాస్త్రం. నిజానికి వేదమంత్రాలనుంచి భారతీయ సమాజంలోని అనేక సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు (పూజలు, అర్చనలు, వివాహాలు, పురుళ్ళు, మరణాలు, గృహప్రవేశాలు... వంటివి అనేకం) సంజ్ఞలతోనే జరుగుతాయి. పూలు, పండ్లు, సువాసన, అగరుబత్తీలు, కర్పూరం, గంట, శంఖం, పసుపు, కుంకుమ, పసుపు అక్షింతలు, తెల్ల అక్షింతలు, పాద నమస్కారాలు, సాష్టాంగ నమస్కారాలు, ప్రదక్షిణలు, మండపాలు, మండపాల అలంకరణకు వాడే కొబ్బరి చెట్లు, కాయలు, అరటి మండలు, అరటి ఆకు విస్తర్లు, దర్భలు, అగ్నిహోత్రాలు, హోమాలు, ఇత్యాదివి ఎన్నో ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలలో కనిపించేవన్నీ సంజ్ఞా సంబంధమైనవే. అయినప్పటికీ, సంజ్ఞా శాస్త్ర పరంగా, ఆధ్యాత్మిక, సామాజిక, సాహిత్యంలోని ఈ సంజ్ఞలపై పరిశోధన జరగలేదు. ఇటీవల (అంటే మార్చి 29, 2021 వివిధలో) సంజ్ఞల గురించి, తెలుగు సాహిత్యంలో 'చాసో' లాంటి వారి రచనల్లో సంజ్ఞల విస్తృత అర్థం ఎలా ఉంటుందో ద్వారం దుర్గా ప్రసాదరావు గారు చేసిన వ్యాసం లాంటివి అరుదుగా కనిపిస్తాయి.

ఇంకొంచెం ముందుకు వెళ్తే భారతీయ ఆధ్యాత్మిక సాహిత్యంలోని భాషాపరమైన సంజ్ఞలను వాటి అర్థాలను అవి ఎంత క్లిష్టంగా ఉన్నా మన విశ్లేషణాశక్తిని బట్టి వాటినుంచి నూతన అర్థాలు ఎలా రాబట్టవచ్చునో తెలిపే పరిశోధన ఇంతవరకు రాలేదు. నిజానికి వేదాలన్నీ సంజ్ఞాపరమైనవే అయినా వాటిని వివరించేవారు దాన్ని ఒక సంజ్ఞాశాస్త్రంలో భాగంగా పరిగణించలేదు. అలాంటిదొక శాస్త్రం భవిష్యత్తులో ఒక సాహిత్య సామాజిక, పరిశోధనాంశం అవుతుందనీ, ఒక స్వతంత్రమైన పరిశోధనా విభాగం అవుతుందని కూడ వారు భావించలేదు.

సెమియాటిక్స్ (సంజ్ఞా శాస్త్రం) అంటే ?

ఈ కారణంగా అత్యంత పురాతన వాఙ్మయం అయిన భారతీయ ఆధ్యాత్మిక సాహిత్యం ఒక నిగూఢమైన దుర్భేద్యమైన రహస్య వాఙ్మయంగా మారిపోయింది. సంస్కృతంతో పరిచయం క్రమంగా అంతరిస్తున్న కొద్దీ ఈ వాఙ్మయంలోని అపూర్వ సామాజిక, సంజ్ఞాపరమైన అంశాలు కూడ మరుగున పడిపోయాయి. కాని, ఇదే సమయంలో గత శతాబ్ద ఉత్తరార్థంలో సంజ్ఞాశాస్త్రం "Semiotics" గా పాశ్చాత్యా దేశాలలో ఉద్భవించి,

అనేక సాంస్కృతిక రంగాలలోని సాంస్కృతిక అంశాలను భాషా పరంగా, శబ్దపరంగా, బొమ్మల రూపంగా, వ్యాఖ్యానాల పరంగా వెలుగులోకి తేవటం ప్రారంభించింది.

ముఖ్యంగా స్విస్ భాషాశాస్త్రవేత్త ఫెర్డినాండ్ డి. శాస్యూర్, అమెరికన్ భాషా శాస్త్రవేత్త ఛార్లెస్ శాండర్స్ పియర్స్ ఈ సంజ్ఞాశాస్త్రం అనే శాస్త్రీయ విభాగానికి గట్టి పునాదులు వేశారు. వీరిలో ఫెర్డినాండ్ డి శాస్యూర్ ప్రముఖ భాషా శాస్త్రవేత్త, భారతీయ సంస్కృత వాఙ్మయంతో పరిచయం ఉన్న వ్యక్తి. సుమారు ఐదువేల సంత్సరాలకు పూర్వం భారతదేశంలో ఆవిర్భవించిన పాణిని వ్యాకరణం ప్రపంచంలోని భాషలన్నింటి వ్యాకరణాలకు ప్రమాణం అని పూర్తి సాధికారికతో చెప్పినవాడు. అలాగే నోమ్ ఛాంస్కీ అనే అమెరికన్ భాషా శాస్త్రవేత్త, సామాజిక రాజకీయ విశ్లేషకుడు, మేధావి, బహు గ్రంథకర్త పాణిని వ్యాకరణం ఆధారంగానే ట్రాన్స్‌ఫర్‌మేటివ్ ఇంగ్లీషు గ్రామర్ రూపకల్పన చేశానని స్వయంగా రాసుకొన్నాడు. అయితే శాస్యూర్ రూపొందించిన సెమియాటిక్ మోడల్‌కు, ఛార్లె శాండర్స్ పియిర్స్ రూపొందించిన సెమియాటిక్ మోడల్‌కు మధ్య కొన్ని భేదాలు ఉన్నా, రెండూ మోడల్స్‌ను సందర్భాని బట్టి ఆయా దేశాల సాంస్కృతిక సామాజిక అంశాల్లోని సంజ్ఞలను వివరించడానికి పరిశోధకులు వాడుతున్నారు. అందులో భాగంగానే ఎడ్విన్ గెరో అనే భాషాశాస్త్రవేత్త క్రీ.శ. 1984లో తను రాసిన వ్యాసం – 'లాంగ్వేజ్ అండ్ సింబల్స్ ఇన్ ఇండియన్ సెమియాటిక్స్' వ్యాసంలో పియర్స్ మోడల్ ద్వారా నేను పైన వివరించిన ఆధ్యాత్మిక గ్రంథాలలోని సంజ్ఞలను వివరించే ప్రయత్నం చేశాడు. ఈ ప్రయత్నంలో భాగంగానే ఆయన కనుగొన్న దేమిటంటే భారతీయ సంజ్ఞల ప్రవర్తనకు, పాశ్చాత్య దేశాల్లో సంజ్ఞల ప్రవర్తనకు మధ్య చాలా తేడా ఉందని. ముఖ్యంగా పియర్స్ మోడల్‌తో అవి విభేదిస్తాయి అని కూడ ఆయన వివరించాడు. ఈ పరిశోధనకు గాను ఆయన భారతీయ సంస్కృత వాఙ్మయంలోని 'మీ మాంస'ను, 'న్యాయ' శాస్త్రాలను ఎంచుకొన్నాడు.

ఏతావతా సంజ్ఞాశాస్త్రం అంటే సంక్షిప్తంగా శాండర్ హెర్వే మాటలలో 'సందేశాలను' 'సూచికల' ద్వారా పంపటం, లేక తెలపటం లేక వివరించటం. ఇవి పలు రకాలుగా ఉంటాయి. అక్షర గుర్తులుగా, బొమ్మ గుర్తులుగా ఉండే సంజ్ఞలుగా లేక సూచికలుగా

ఉండి, అవి వేటిని సూచిస్తాయో వాటిని విశేషంగా వివరిస్తాయి. అంటే సంజ్ఞ, సంజ్ఞ సూచించేది, దేన్ని సంజ్ఞ సూచిస్తున్నదో అది. ఈ మూడు అన్ని సాంస్కృతిక, సాహిత్య రంగాలలోనూ విశ్వవ్యాపితంగాను ఉంటాయి. మరో మాటలో చెప్పాలంటే భారతీయ ఆధ్యాత్మిక సాహిత్యంలో భాగం అయిన 'అద్వైతం' అంటే 'చూస్తున్నది' – 'చూసేది', 'చూపునకు లక్ష్యమైనది' – అన్నీ ఒక్కటిగా మారటం అని. ఈ మూడు ఒకే తలంలో ఉంటాయి వేదాంతంలో. సంజ్ఞా శాస్త్రంలో కూడ సంజ్ఞ, దాన్ని సూచించేది, సూచన లక్ష్యం మూడు ఒకటే అయి ఉంటాయి కాని 'అద్వైతం'లా ఒకే తలంలో ఉండవు. ప్రస్తుతానికి ఈ నేపథ్యంతో మనం మేళ్ళ చెరువు సుబ్రహ్మణ్య శాస్త్రి రచనలో ఈ సంజ్ఞాలను ఆయన 'సంకేతా'లని ఎలా వివరించారో ముందుకు వెళ్ళి పరిశీలిద్దాం.

ఈ పరిశీలనలో రెండు విషయాలు బోధపడ్డాయి. ఒకటి ఫెర్డినాండ్ శాస్యూర్, ఎడ్విన్ గెరో కనుగొన్నట్లుగా భారతీయ సనాతన, ఆధ్యాత్మిక శాస్త్రంలో, సాహిత్యంలో సెమియాటిక్స్ (సంజ్ఞాశాస్త్రం) తొలిసారిగా వేల సంవత్సరాల క్రితమే నిక్షిప్తం అయినా, వాటిపై పరిశోధన జరగలేదన్నది. రెండవది ఎడ్విన్ గెరో లాంటివారు పరిశీలన జరిపినా వాళ్ళకు భారతీయ సెమియాటిక్స్ (సంజ్ఞాశాస్త్రం)లోని సంజ్ఞల ప్రవర్తన పాశ్చాత్య సిద్ధాంతీకరణకు భిన్నంగా ఉన్నదనిపించటం. వాస్తవానికి భారతీయ సంజ్ఞాశాస్త్రం అత్యంత పురాతనమైన ఆధ్యాత్మిక, వైదిక వేద సాహిత్యం నుంచి, తద్వారా వచ్చిన రామాయణం, మహాభారతం, భాగవతం, బ్రహ్మసూత్రాలు – పూర్వ మీమాంస, ఉత్తర మీ మాంస – నుంచి ఉద్భవించినది. పాశ్చాత్య సంజ్ఞాశాస్త్రం పందొమ్మిదవ శతాబ్దం రెండో అర్ధభాగంలో ఏర్పడినది. ఈ కారణంగానే భారతీయ ఆధ్యాత్మిక శాస్త్రంపై, వేద సాహిత్యంపై సరైన గురుముఖ విద్య గరపని కారణంగా ఎడ్విన్ గెరో తన పరిశోధనలో వేరే ఫలితాలు పొందారు. వాస్తవానికి తూర్పు నుంచి పడమరవైపునకు ఈ సంజ్ఞాశాస్త్రం పరిశీలిస్తూపోతే సంజ్ఞలపైన, సూచనలపైన, వాటి లక్ష్య వస్తువులపైన సరైన అవగాహన వచ్చి ఉండేది. కాని పాశ్చాత్యంలో కొన్ని సూత్రీకరణలు చేసి, వాటి పరిధిలోకి భారతీయ సంజ్ఞా శాస్త్రాన్ని విశ్లేషించడం తల్లక్రిందులుగా పరిశీలన జరపడమే. ఈ నేపథ్యంలో మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి అసలు ఈ సంజ్ఞాశాస్త్రాన్ని ఎలా సరైన కోణంలో పరిశీలించాలో మార్గ నిర్దేశం చేశారు.

అందుకుగాను ఈ పరిశీలనకు మేళ్ళచెర్వు సుబ్రహ్మణ్యశాస్త్రి రాసిన అనేక కావ్యాలు, గ్రంథాలనుంచి రెండింటిని ఎన్నుకోవటం జరిగింది. శ్రీ త్రిపుర మహిమ్న స్తోత్రము, (శ్రీ దుర్వాసముహాముని విరచితమ్), శ్రీ కృష్ణ రాసలీల – యోగత్రయీహేల. శ్రీ త్రిపుర మహిమ్మ స్తోత్రమ్ పై వ్యాఖ్యానానికి, 'శ్రీ నీరాజన' అని పేరు పెట్టారు మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి.

మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి : సంజ్ఞాశాస్త్ర పరిశీలనా శైలి, మార్గం

మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి తన రచనల్లో తన గురువు 'చందోలు మహర్షి'నే అనుసరించారని వారి రచనలు పరిశీలిస్తే స్పష్టంగా అవగతమవుతుంది. 'చందోలు మహర్షి' గారి జీవిత చరిత్రను గ్రంథస్తం చేసిన తొలి సంస్కృత కావ్యం – 'శ్రీగురుచరిత'. ఈ విషయాలు స్వయంగా సుబ్రహ్మణ్యశాస్త్రి గారే వివరించారు. ఈ గ్రంథరచనకు ఉపక్రమించే ముందు ఆయన గుంటూరు శేషేంద్ర శర్మ రాసిన 'షోడశి రామాయణం – రహస్యములు'లో 'గ్రంథుల'ను ఎలా పొందుపరచారో, వాటిని ఎలా విప్పారో తొలుత పరిశీలించారు. గుంటూరు శేషేంద్రశర్మ ఆధునిక కవితా లోకానికి ఒక కవిగా, గేయకర్తగా పరిచయమే గాని, ఆయన సంస్కృతంలోనూ, ఆధ్యాత్మిక శాస్త్రంలోని గ్రంథులను విప్పటంలో కూడ దిట్ట అని చాలామందికి తెలియదు. ముఖ్యంగా 'స్వర్ణహంస'లో శ్రీహర్షుడి గురువు ఆధ్యాత్మిక రహస్యాలను ఎలా 'గ్రంథుల' రూపంలో నిక్షిప్తం చేశారో బయటి ప్రపంచానికి తెలియజెప్పిన మహాకవి, జ్ఞాని గుంటూరు శేషేంద్రశర్మ. అలాగే వావిలికొలను సుబ్బారావు గారు తెలుగులోకి అనువదించిన వాల్మీకి రామాయణం – మందరం – తొలి యథాతథ తెలుగు రామాయణం అని వేల్చేరు నారాయణరావు (వీరికి ఇటీవల సాహిత్య అకాడమి, ఫెలోషిప్ పురస్కారం లభించింది) వ్యాఖ్యానించారు. అంతేగాదు, వాల్మీకి రామాయణంలోని శ్లోకాలలో 'ఆధ్యాత్మికశక్తి' మంత్రాల రూపంలో 'గ్రంథులు'గా నిక్షిప్తం చేశాడు వాల్మీకి. సరిగ్గా యథాతథా అనువాదం చేస్తూ ఆ 'మంత్రశక్తి'ని తెలుగు శ్లోకాలలో 'గ్రంథుల' రూపంలో నిక్షిప్తం చేశారని వావిలికొలను సుబ్బారావును ఉటంకిస్తూ వేల్చేరు నారాయణరావు వివరించారు. అలాగే ఎక్కిరాల కృష్ణమాచార్యుల వారు రచించిన 'భాగవత రహస్య ప్రకాశం' కూడ

మేళ్ళచెరువు వారి సాహితీ వ్యవసాయాన్ని ఒక స్థాయి నుంచి మరో స్థాయికి తీసుకెళ్ళింది. ఈ నేపథ్యంలో శ్రీ త్రిపురామహిమ్న స్తోత్రంలోని 'సంజ్ఞాశాస్త్రము'ను సుబ్రహ్మణ్యశాస్త్రి గారు ఎలా ఛేదించారో, ఎలా వ్యాఖ్యానించారో ముందు వివరిస్తాను.

శ్రీ నీరాజన (ఆంధ్రవ్యాఖ్య)

ఇది మేళ్ళచెరువు 'శ్రీ త్రిపురామహిమ్న స్తోత్రమ్' పై రాసిన వ్యాఖ్య. దీనిలోని సంజ్ఞా వివరణలను వారే స్వయంగా 'సంకేత శాస్త్రం' అని వివరించటం ఈ పరిశీలకుడికి ఎంతో ఆశ్చర్యం కలిగించింది. ఎందుకంటే దీన్నే 'సంజ్ఞాశాస్త్రం' అని, 'సెమియాటిక్స్' అని పాశ్చాత్య సామాజిక శాస్త్రవేత్తలు వ్యవహరిస్తారని వారికి తెలియదు. అమెరికాలో ఈ శాస్త్రాన్ని 'సెమియాటిక్స్' అంటారని, యూరప్ దేశాల్లో దీన్ని 'సెమియాలజీ' అని అంటారని కూడా వారికి తెలియదు. ఇది ఇటీవల అంటే ఒక శతాబ్దం క్రింద ప్రాశ్యాత్య సామాజిక శాస్త్రవేత్తలు ప్రపంచ దేశాల్లో ఉన్న వేరువేరు సంస్కృతులను అధ్యయనం చేయటానికి రూపకల్పన చేశారని కూడ సుబ్రహ్మణ్యశాస్త్రికి తెలియదు. అయినా ఆయన 'త్రిపుర మహిమ్న స్తోత్రం' వ్యాఖ్య అయిన 'శ్రీనీరాజన'లో 'సంకేత' మంటూ 'సంజ్ఞా శాస్త్రం' ను ఎలా వివరించారో తెలిస్తే ఆశ్చర్య పోకమానలేము.

సుబ్రహ్మణ్యశాస్త్రి మాటల్లో – అసలు భాష అంతయు సంకేతముగదా. అనగా, ఈ పదము ఈ వస్తువు సంబోధింపవలెను అని మనము ఏర్పరచుకొన్న ఒక గుర్తు. లేనిచో శబ్దమునకు, అర్థమునకు ఏమి సంబంధము. అట్లే 'అర్థ'మే సంకేతముగా మంత్ర శాస్త్రము అక్షరములను స్వీకరించినది'. ఈ వివరణకు అనుబంధంగా సుబ్రహ్మణ్యశాస్త్రి ఏమంటారంటే – అక్షరములు అర్థములకు సంకేతములుగా నిలచినవి – అని. అంటే 'క' అనే అక్షరానికి 'ప్రకాశం', 'వాంఛ' లాంటి అర్థాలు ఉన్నవి. అక్షరానికి ఇంత అర్థము వస్తుందా? – అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. వారికి మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి సమాధానం – 'వస్తుంది' అని. ఇందుకు ఉపపత్తిగా వారు 'ఏకాక్షర నిఘంటువు'ను ఉదహరిస్తారు. ఏకాక్షర నిఘంటువు ప్రకారం ఒక్కో 'అక్షరమే' అర్థము నివ్వగలదని. పై ప్రతిపాదనలతో ఆయన దుర్వాసవిరచితమైన 'త్రిపుర మహిమ్నా స్తోత్రం'లోని మంత్రాలను సంజ్ఞా పరంగా వివరించిన తీరు అద్భుతంగా ఉంటుంది.

ఇందులో భాగంగా ముందుగా మంత్రములు వాటి స్వరూప స్వభావాలను వివరిస్తారు మేళ్ళచెరువు. మంత్రాల విభజనలో వారు మంత్రాలను రెండు రకములుగా విభజించారు. అవి వేద మంత్రాలని, బీజ మంత్రాలని. బీజమంత్రాలలో బీజమంత్రములు, వాక్య మంత్రములు అని వాటిని మళ్ళీ రెండు రకాలుగా చేశారు. బీజములున్న మంత్రాలన్ని 'సంకేత' (సంజ్ఞా) మంత్రములు అని వివరించారు. మంత్రాలు వర్ణించేవి ఏవైనా – బీజములైనా, పదములయిన – అవి ఆ మంత్రాధిపతి, ఉపాసన దేవత రూపానికి సంబంధించి ఉంటాయి. అంటే మంత్రమే దేవతా శరీరము. ఇలాంటి అవగాహన లేకపోవటంలోనే ఎడ్విన్ గెరో లాంటి పాశ్చాత్య సామాజిక శాస్త్రవేత్తలు 'భారతీయ సంజ్ఞా శాస్త్రం' ప్రవర్తనపై సరైన అవగాహన ఏర్పరచుకోలేక పోవటం ఒక కాదనలేని సత్యం. మంత్రమే దేవత. మంత్ర చింతనవలన మంత్రమే దేవతగా ప్రత్యక్షమై తరువాత మరల మంత్ర వర్ణాలలో కలిసిపోతుంది, తాదత్మ్యం చెందుతుంది. ఉదాహరణకు వేదమంత్రాలలో 'ఇంద్రాయ స్వాహ' అనే మంత్రోచ్చారణ మనకు వినిపిస్తుంది. ఇక్కడ అర్థం ఏమిటంటే ఈ మంత్రమే 'ఇంద్రస్వరూపము' అని. ఇక్కడ 'స్వాహ' అంటే గుటక వేయటం లేదా మింగటం కాదు. ఇందుకు ప్రమాణంగా మేళ్ళచెరువు వారు ఇలా రాశారు.

జ్ఞాపకం దేవతాదీనం యద్బీజమక్షర ముచ్యతే అని,
మంత్రాణాం చింతనాత్ దేవి సమను: దేవతాస్వయం
ధ్యానేన దర్శనం దత్వా పునర్మంత్రేషు లీయతే – అని.

అంటే, ఇలా సంజ్ఞలతో నిండి అర్థభావ, రూపాలను ప్రదర్శించే విద్యనే 'శ్రీ విద్య' అంటారు. ఇందు మాయాశక్తి అయిన జగన్మాతను ఆమె సృష్ట్యతీత స్వరూపమునుంచి సృష్టి రూపము వరకు సంజ్ఞారూపంలో, ఆ సంజ్ఞలను మంత్ర బద్ధము చేసి, దీనికి 'శ్రీ చక్ర' రూపం కలిపించారు. అంటే దేవీ రూపం మొత్తం సంజ్ఞాత్మకమైనదని భావన. దాన్ని సుబ్రహ్మణ్యశాస్త్రి 'చక్ర సంకేతకో మంత్ర పూజా సంకేత కామతి, త్రివిధం త్రిపురాదేవ్య: సంకేత: పరమేశ్వరి – అని. అంటే సంకేత త్రయము (సంజ్ఞా త్రయము) దేవీ రూపమే. ఇలా సంజ్ఞాశాస్త్రప్రతిపాదన సైన్, సిగ్ని ఫయ్యర్, సిగ్నిఫైడ్ ప్రతిపాదన ఎలా వేదకాలంలోనే

ఉద్భవించింది, ఎంత పురాతనమైనదో మనం ఈ త్రిపురమహిమ్నా స్తోత్రం నుంచి మేళ్ళచెరువు వివరణ ద్వారా తెలిసికొనగల్గుతాము. దీన్నే పందొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్ధంలో ఫెర్డినాండ్ శస్యూర్, ఛార్లెస్ ఎస్. శాండర్స్ పియర్స్ లాంటి భాషా శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. విశేషమేమిటంటే వీరికి భారతీయ సంస్కృత భాషతో పరిచయం కూడ ఉన్నా, శాస్త్రి గారిలా భారతీయ ఆధ్యాత్మిక సాహిత్యంతో లోతైన పరిచయం లేకపోవటం వలన భారతీయ సంజ్ఞా శాస్త్రపరంగా తమ మోడల్స్‌ను వివరించలేకపోయారన్నది కాదనలేని సత్యం. ఈ విశ్లేషణాధారంగా సంకేతత్రయ రూపమైన దేవీ మంత్ర వివరణ – పంచదశి – షోడశి ని వివరిస్తారు మేళ్ళచెరువు.

ముందుగా 15 అక్షరాలు గల ఏ 'మంత్ర' విద్య (జ్ఞానం) లేక 'ఉపాసన' ఉందో దీనిని 'పంచదశి' అని అన్నారు. దీనికి 'ఈం' లేదా 'శ్రీం' చేరిస్తే దాన్ని 'షోడశి' అని అంటారు ఇలా అక్షర సంజ్ఞాధారంతో శ్రీవిద్యా మంత్రార్థము వివరించటానికి మేళ్ళచెరువు వారు అగస్త్యుడు రాసిన 'శ్రీవిద్యా దీపిక'ను ఆలంబనగా చేసికొన్నారు. అలా 'త్రిపుర మహమ్న స్తోత్రమ్'లోని 30 అవతారికలలోని ప్రతి శ్లోకముకు ప్రతిపదార్థము, తాత్పర్యము (దేవతాపరంగా), ప్రతి పదార్థము, తాత్పర్యము (మంత్ర విద్యాపరముగా), చివరలో సంకేత వివరణము, దాని విశేషములు (సిగ్నిఫైడ్, సిగ్నిఫికేషన్స్) వివరిస్తూ, ఇతర మంత్రాలలోని అక్షరముల అర్థాలను ఏకాక్షర నిఘంటువు ద్వారా తెలుపుతూ, ఈ మంత్రములు భిన్నరూపములలో ఉన్నప్పటికీ అవి 'శ్రీవిద్య' మంత్రములలో నిక్షిప్తమైన సంకేతాలకు ఎలా సరిపోతాయో వివరిస్తారు మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి. 'సంజ్ఞా శాస్త్రం' పై ఎంతో పట్టు సాధిస్తే తప్ప ఈ విధమైన తులనాత్మక అధ్యయనం సాధ్యంకాదు. విశేష మేమిటంటే ఈ మంత్రాలన్నీ వేదకాలం నాటివి అయినా వాటి సంజ్ఞలను అవి సూచించే దేవతా స్వరూపాలను వాటి మధ్య సారూప్యతోను సంజ్ఞల ద్వారానే ఉపపత్తితో నిరూపించటం, వాటి మధ్య అక్షరసంజ్ఞ, సారూప్యంతోను, భావసారూప్యంతోను సాధించగలగటం. ఉదాహరణకు గాయత్రీ మంత్రంలోని అక్షర సారూప్యత, సంజ్ఞలు, షోడశి మంత్రాక్షరాల్లోని సంజ్ఞా సారూప్యతను వివరించటం (18 పేజీ). ఇలాగే ఎన్నో మంత్రాల మధ్యకూడ అక్షర సారూప్యత, సంజ్ఞా సారూప్యతను వివరించటం మనకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

శ్రీ కృష్ణరాసలీల - యోగత్రయీహేల

ఇది మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి అద్భుత స్వయం కావ్యము. ఇందులో భాగవతంలోని 'కృష్ణుని రాసలీల'కు అర్థాన్ని సంకేత శాస్త్రం ద్వారా వివరణ ఇచ్చారు సుబ్రహ్మణ్యశాస్త్రి. వారు ప్రవచనకర్తగా వ్యవహరిస్తున్న ఒకానొక సందర్భంలో (దాదాపు 28 సంవత్సరముల పూర్వము) 'రాసలీల - అంతరార్థము' అను అంశంపై విస్తృత వ్యాఖ్యానము చేశారు. కృష్ణుని పింఛమును 12 భాగాలుగా చేసి ఒక్కో పింఛమును అనేక కోణముల్లో వివరించారు. 'పింఛము'ను రాసలీలకు 'మకుటముగా' మార్చారు. ఆంగ్ల సాహిత్యంలోని 'సెమియాటిక్స్'లో దీనిని 'మెటఫర్' అంటారు. ఈ పన్నెండు భాగాలలోని వివరణల్లో ఒక్కొక్క భాగ వివరణ ఒక్కొ రీతిలో వివరించటం ద్వారా భాగవతంలోని రాసలీల అంతరార్థాన్ని విశదీకరించటం ఈ గ్రంథ విశేషం. రాసలీలపై గల అనేక భ్రమలను, అపవాదములను దృష్టిలో ఉంచుకొని సంజ్ఞాశాస్త్రం ద్వారా వాస్తవార్థమును వివరించినట్లు రాశారు సుబ్రహ్మణ్యశాస్త్రి. ఇందులో సుబ్రహ్మణ్యశాస్త్రి శబ్దశక్తి, అర్థ శక్తిని వినియోగించి అంతరార్థములను బయటి ప్రపంచానికి వెలువరించారు. ప్రస్తుత రచనలోని రహస్యాలను జ్ఞానపరంగా, కాలపరంగా, ఖగోళపరంగా, యోగపరంగా, వేద పరంగా, దేహపరంగా, మంత్ర శాస్త్రపరంగా, జీవన్ముక్తుల అనుభూతుల పరంగా వివరించటం జరిగింది. వీటన్నింటినీ 'సెమియాటిక్స్' రూపంలోనూ, 'సంజ్ఞా శాస్త్రపరం'గా విశదీకరించారు మేళ్ళచెరువువారు. 'త్రిపుర మహిమ్న స్తోత్రం'లోని అనేక సంజ్ఞా వివరణలు ఇందులో కూడ కనిపిస్తాయి. ఉదాహరణకు ఏకాదశ పింఛములో 'గోపకన్యా వస్త్రాపహరణం'లో 'హ్రీ' అనే ఏకాక్షర సంజ్ఞకు అర్థములు ఎలా పరిగణించాలో చూస్తే 'సెమియాటిక్స్'కు సాహిత్యంలో ఎంత ప్రాధాన్యం ఉందో అవగత మవుతుంది. 'హ్రీశ్చతే లక్ష్మీశ్చ, పత్న్యౌ' అన్న పురుష సూక్త వాక్యమునకు 'హ్రీ' అంటే అర్థము 'ఆవరణము'. ఈ ఆవరణము 'దేహ భావము' రూపంలో ఉంటుంది మనుషుల్లో. అంటే 'హ్రీ' లజ్జ, సిగ్గులను సూచిస్తుంది. 'హ్రీ' అనునది మాయాభేదమే. అంటే 'పురుషులు' 'స్త్రీలు' పరస్పరం తమదేహాలపై చూపే సిగ్గు, లజ్జ, ఒకరినొకరు నగ్నంగా చూడకుండా బట్టలు అనే ఆవరణం కప్పటం ద్వారా ఈ 'లజ్జ'ను, 'సిగ్గు'ను ప్రదర్శిస్తారు. భారతములోని యక్ష ప్రశ్నలలో - 'హ్రీ' కార నివర్తనమ్

– అని 'హ్రీ'ని వివరించారు. ఇక్కడ 'హీ' అనునది అకార్యములు చేయటానికి సిగ్గుపడటం. అంతేగాక 'హ్రీ' కి 'హరించునది' అనే అర్థం కూడ ఉంది. 'హీ' ధాతువు నుంచి పుట్టింది. జీవాత్మను – పరమాత్మనుంచి దూరం చేసేది. అంటే మాయ. గోపికలు 'హ్రీ' వలన భగవంతుని నుంచి దూరమయ్యారు. ఆ 'హ్రీ'ని కృష్ణుడు హరించటంవలన 'గోపిక'లు, కృష్ణునిలో లీనమయినారు. ఇలా 'హ్రీ'ని సంజ్ఞాపరంగా అనేక అర్థాలలో వివరిస్తారు మేళ్ళచెరువువారు. అలాగే దశ పించము 'గోపికలు – వారి కామము'లో కామాల్లో ఒకరైన (మదనుడు, చిక్లీతుడు, దమనుడు) 'చిక్లేత్' శబ్దానికి, శ్రీ సూక్తంలోని 'చిక్లేత' శబ్దానికి, షోడశిలోని 'క్లీం' శబ్దానికి మధ్యనున్న సంబంధాన్ని సోదాహరణలతో ఆవిష్కరిస్తారు మేళ్ళచెరువువారు.

ఈ విధంగా పరిశీలిస్తే 'త్రిపురమహిమ్న స్తోత్రమ్' (శ్రీ నీరాజన), 'శ్రీ కృష్ణరాసలీల – యోగ త్రయాహేల' – భారతీయ ప్రాచీన సాహిత్యంలోని సంజ్ఞా శాస్త్రాన్ని ఆధునిక ప్రపంచానికి సులువుగా పరిచయం చేసిన రెండు చక్కని గ్రంథాలు. ఇవాళ 5000 సంవత్సరాల క్రితం వేదాలను, తర్వాత కాలం వేదమే ప్రమాణంగా తత్సమానంగా వెలువడిన రామాయణ, మహాభారత, భాగవతాదులను క్షుణ్ణంగా పరిశోధించి వాటిలో నిక్షిప్తమైన సంజ్ఞా శాస్త్రాన్ని వెలుగులోకి తెచ్చే స్థాయి పరిశోధకులు లేరు, పండితులు లేరు. ఒకవేళ ఎవరైనా ఉన్నా వారికి అంత ఓర్పు, సమయం ఉండాలని లేదు.

స్వాతంత్ర్య సంగ్రామ కాలంలోనూ, ఆ తర్వాతి కాలంలోనూ వలసవాద పాలన వలన ఏర్పడిన మనస్తత్వం వలన కామోసు, చాలామంది భారతీయులు పాశ్చాత్య సాహిత్యం పట్ల మోహం పెంచుకొని వాటిల్లో నిష్ణాతులవడానికి కృషి చేశారు. అవి సులువుగా బోధపడతాయి కాబట్టి వాటిని నేర్చుకొని, ఆపాశ్చాత్య రీతుల్లో ఆవిర్భవించిన సిద్ధాంతాలు/ తత్వాలు – మార్క్సిజం, మనో విశ్లేషణ, స్త్రీ వాదం, ఉనికి, ప్రాతినిధ్యాలు వంటి వాటికి ప్రాచుర్యం కలిపించారు. దీన్నే వాళ్ళు శాస్త్రీయ దృక్పథంగా, జీవన వేదంగా భావించి పుస్తకాలు, రచనలు, కావ్యాలు రాశారు. శ్రీశ్రీ నుంచి ఆరుద్ర దాకా అందరూ ఈ కోవకు చెందినవారే. కొందరు హేతువాదం పేరిట, మరికొందరు నాస్తిక వాదంపేరిట భారతీయ ప్రాచీన సాహిత్యం పట్ల ఏవగింపు కూడ కలిగించేలా రచనలు చేశారు. కోశాంబి, రాహుల్ సాంకృత్యాయన్ వంటి వారి రచనలు తర్వాతి తరాలకు మార్గనిర్దేశం చేశాయి.

ఒకవేళ మేధావులు నిజమైన మేధావులు అయి ఉంటే మన ప్రాచీన సాహిత్యంలో నిక్షిప్తమై ఉన్న పాశ్చాత్య సామాజిక సిద్ధాంతాలకు సమానమైన, బహుశ వాటికి కూడ ఆద్యమైన సంజ్ఞాశాస్త్రం, భాషాపరిణామం. మనోవైజ్ఞానిక శాస్త్రాలను వెలుగులోకి తెచ్చి ఉండేవారు. అలా జరిగి ఉంటే ఎడ్వర్ట్ సైద్‌కు 'ఓరియంటలిజమ్' అనే అత్యంత ప్రపంచ ఆదరణ పొందిన బృహత్ గ్రంథం రాసి ఉండే అవసరం ఉండేదికాదు. పాశ్చాత్య సిద్ధాంత ప్రచార వ్యామోహాలనుంచి ప్రాక్ దేశాలకు విముక్తి కల్పించడంలో ఎడ్వర్డ్‌సైద్ పరిశోధన – ఓరియంటలిజం – పాత్రం అనిర్వచనీయమైంది. అదే అదనుగా చైనా లాంటి దేశాలు 'కన్ఫ్యూజినిజం'ను, 'టావోయిజం'ను ముందుకు తెచ్చాయి. దక్షిణాసియా దేశాలు 'బుద్ధిజం' (బౌద్ధమతాన్ని)ను ముందుకు తెచ్చాయి. కాని భారతీయ మేధావులు పాశ్చాత్య సిద్ధాంతాల నుంచి బయటపడలేక భారతీయ ప్రాచీన సాహిత్యాన్ని చిన్నచూపు చూస్తున్నారు. ఈ కారణంగా మన ప్రాచీనసాహిత్యంలోని 'సంజ్ఞాశాస్త్రం', 'సామాజిక' సిద్ధాంతాలు, 'మనోవైజ్ఞానిక' విశ్లేషణలు వెలుగులోకి రాకుండా పోయాయి. ఆ కొరతను కొంతవరకూ పూడుస్తున్నాయి మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి రచనలు – 'త్రిపురమహిమ్న స్తోత్రమ్' (శ్రీనీరాజన), 'శ్రీకృష్ణరాసలీల – యోగత్రయీ హేల'.

(మిసిమి మాసపత్రిక ఆగస్టు 2021)

5
భద్రిరాజు వారి 'చిన్ననాటి పద్యాలు'

'అంభోజాసనన్ బెళ్ళి యాడుతతటి హెూమాయత ధూమంబుచే...' అని పధ్నాలుగేళ్ళకే ఒకానొక పెళ్ళి సందర్భంగా తన పాఠశాల తెలుగు పండిట్ భారతుల మార్కండేయశర్మ గారు రాయమని ఆదేశిస్తే భద్రిరాజు కృష్ణమూర్తి రాసిన పంచరత్నాలలో అది ఒకటి. భారతుల మార్కండేయ శర్మ గారు నాటి ఒంగోలు మున్సిపల్ హైస్కూల్‌లో తెలుగులో పెద్ద పండిట్ గ్రేడ్ గలవారు. తెలుగు సాహిత్యంలో దిట్ట. అప్పుడు కృష్ణమూర్తిగారు పదవ తరగతి చదువుతున్నారు. పదకొండవ తరగతిలో (నాడు ఎస్.ఎస్.ఎల్.సి. అనేవారు) వారి తెలుగు పాఠ్య పుస్తకంలోని విశ్వనాథ సత్యనారాయణ గారి 'రెండు నక్షత్రాలు' కావ్యాంశం చదివి, 'ఆత్మార్పణం' అనే కవితా ఝురిని సృజించారు. 'అట్లతండు ప్రాణ హత్యాకృత్యదృఢ నిశ్చయుండై మందాకినీ ధునీ, తటంబుజేరి, నాకున్ దీటె జగమ్ముతోడ ఋణమీనాడే - సమర్పింతు నీ నా కాయమ్మును - సర్వజంతు కృత న్యానపాప సంహరిణీ... కొన్మను మానమేలయిక నీ నిర్భాగ్య భాగీరథీ' అని. ఒక కవి తన పేదరికానికి తట్టుకోలేక, తన కవిత్వానికి ఆదరణలేక జీవితం ముగించుకొనే ప్రయత్నంలో స్వగతంగా ఆశువుగా చెప్పిన కవిత్వం ఇది. ఈ పద్యం 1942లో ఆచ్చయింది. గురువుగారైన పళ్ళెపూర్ణ ప్రజ్ఞాచార్యులు నాటి గుంటూరు హిందూకాలేజిలో సంస్కృతాంధ్రాలలో పండితులు. 1943-45ల మధ్య కృష్ణమూర్తి గారు అక్కడ ఇంటర్మీడియట్ చేయడం జరిగింది. ఆ సంవత్సరం ఉత్తీర్ణులై కాలేజీ నుంచి వారి సహవిద్యార్థులతో సహ కాలేజి వీడ్కోలు సందర్భంగా జరిగిన సభలో

కృష్ణమూర్తి గారు రాసిన పద్యాలలో ఒకటి "...మతి వికసించె, నీ చలువమాటునన్, బెంపును గాంచి వత్సర ద్వితీయము వెళ్ళ బుచ్చితిమి, ముందెటుల్ పరిణమింపగనున్నదో మాదు భావి జీవితము లిన్కెన్ని యెన్నినెఱ వేర్పగనున్నవి యోమహత్మ్యతుల్" అని. ఈ వాక్యము కృష్ణమూర్తి కాలేజీ నుంచి వీడ్కోలు తీసుకొంటున్న తన సహచర విద్యార్థులందరి సమిష్టి మనోభావమ్ముగా రాసినా, అందులోని భవిష్యత్ దర్శనం కృష్ణమూర్తి జీవితంలో మటుకు అక్షరాల నిజమై నిల్చింది. ఆ 'మహత్మ్య తుల్' లో భాగంగానేమో భద్రిరాజు వారు సాహిత్యం నుంచి భాషాశాస్త్రం వైపుకు మరలి అంతర్జాతీయ ఖ్యాతి పొంది, తెలుగుజాతికి గర్వాన్ని కూర్చారు. తెలుగు భాషా, సంస్కృతి, సాహిత్యాల ఘనతను ప్రపంచానికి చాటారు.

భద్రిరాజు కృష్ణమూర్తి రాసిన చిన్ననాటి కవితలను వారు 1998లో సంకలన రూపంలో తెచ్చారు. – 'చిన్ననాటి పద్యాలు'గా. ఈ కవితా సంకలనానికి నాటి ప్రఖ్యాత భాషాశాస్త్రవేత్త, స్వతహా కవి, విమర్శకుడు, భద్రిరాజు వారి శిష్యుడు అయిన చేకూరి రామారావు (చేరా) గారు పీఠిక రాశారు. ఆ సందర్భంగా ఆయన ఈ కవితా సంకలనాన్ని ఆమూలాగ్రంగా విశ్లేషించటమే గాక, కృష్ణమూర్తి గారి ఆప్తుడిగా ఎన్నో వ్యాఖ్యాలు చేశారు. 'సాహిత్య పఠన, రచన ఆయనకు చాలా ఇష్టమైన వ్యాసంగాలని చాలా మందికి తెలీదు. భారతంలో పద్యాలు, శ్రీనాథుడి కవిత్వం వారికి కంఠోపాఠం... విశ్వనాథ సత్యనారాయణ కవిత్వం అంటే ఎంతో మక్కువ. వ్యావహారిక భాషా వాదాన్ని విమర్శిస్తూ కృష్ణమూర్తి గారిని ప్రస్తావిస్తూ "ఆతనికి నా కవిత్వం అంటే ఎంతో ఇష్టం" అని స్వయంగా విశ్వనాథ సత్యనారాయణ గారే ఒకానొక సందర్భంలో ఒక పత్రికలో వ్యాసంగా రాశారు. విశ్వనాథ వారి 'ఆంధ్ర భిక్షువు'ను వారితోనే చదివించుకొని తన వద్ద టేపులో భద్రంగా దాచు కొన్న గడుసరి భద్రిరాజు వారు", అని వ్యాఖ్యానించారు.

'అలాగే చేకూరి రామారావు రాసిన 'స్మృతి కిణాంకణం' గేయాన్ని 1959లో వారే చదవగా దాన్ని కూడ టేపు చేసి భద్రంగా పదిలపరచు కొన్నారు భద్రిరాజు వారు', అని చేకూరి రామారావే (చేరా) స్వయంగా ఈ సంకలన పీఠికలో తెలిపారు. కావ్య సాహిత్యం, భావ కవిత్వం, గేయ రచనలపై కృష్ణమూర్తికి ఉన్న సాధికారతకు ఆయన సంపాదకత్వంలో

వెలువడిన 'నన్నయ్య పద ప్రయోగకోశం', 'తిక్కన పద ప్రయోగ కోశం' చాలు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ఆచార్యులుగా పని చేసిన గంటి జోగిసోమయాజి గారి వద్ద 'తెలుగు ధాతువులు, పుట్టు పూర్వోత్తరాలపై' పరిశోధిస్తున్నప్పుడే భద్రిరాజు వారు తెలుగు, సంస్కృత వ్యాకరణాలను క్షుణ్ణంగా శోధించారు. 'బాల వ్యాకరణం' నుంచి పాణిని 'అష్టాధ్యాయి' వరకు కృష్ణమూర్తికి కంఠోపాఠమే. ఈ విధమైన భాషాధ్యాయనం ఆయన కవిత్వానికి పదును, పాండిత్యం సమకూర్చింది. చాలా మందికీ ఈ విషయాలు తెలియవు. కేవలం ఆంగ్లంలో భాషా పండితుడు అని అనుకొంటారు. ఆయన అమెరికా గురువు ముర్రె బి ఎమనో గారు సంస్కృతంలో ఆచార్యుడని గూడ చాలామందికి తెలియదు.

కృష్ణమూర్తి గారు 1942–45 మధ్యకాలంలో రాసిన కవిత్వం చాలా ఉన్నతమైనది. నూతన ఒరవడులకు, ప్రమాణాలకు శ్రీకారం చుట్టింది కూడ. ఈ విషయమై స్వయంగా కృష్ణమూర్తి గారు ఇలా రాశారు తన కవిత సంకలనం ముందుమాట (నామాట)లో. "ఆరోజుల్లో గేయంకన్నా పద్యానికే ఎక్కువ ప్రాధాన్యం ఉండేది. కారణం అవధాన కవుల ప్రభావం కావచ్చు; మనకున్న సాహిత్య సంప్రదాయ ప్రభావం కావచ్చు. భావ కవిత్వం రోజులవి. అయినా తల్లావఝ్ఝల, రాయప్రోలు, నాయని, దేవులపల్లి, విశ్వనాధ, వేదుల సత్యనారాయణశాస్త్రి మొదలైన వాళ్ళంతా పద్యాలే ఎక్కువగా రాశారు. అందుకని నేనూ ఛందోబద్ధమైన పద్యాలే 1940–50 మధ్య రాశాను.... చివర చివర కాస్త గేయ రచన ధోరణి పట్టుకొంది" అని.

కృష్ణమూర్తి హైస్కూలు, ఇంటర్మీడియట్ చదివే రోజుల్లో సాంప్రదాయక కవిత్వం, భావ కవిత్వం ఎక్కువగా చదివారు. తిరుపతి వేంకట కవులు ఆయన కవిత్వాన్ని తీవ్రంగా ప్రభావితం చేశారని ఆయనే చెప్పుకొన్నారు. నాటి భావ కవుల్లో గుర్రం జాషువా, దువ్వూరి రామిరెడ్డి, వేదుల సత్యనారాయణశాస్త్రి వంటి కవులు రాసిన పద్యాలు వారికి చాలా నచ్చిన పద్యాలు. ప్రాచీన ప్రబంధాలు, భారతం, భాగవతం వంటివి ఆయన 1942లోరాసిన 'మాతృ సందేశం' ముందే చుట్టబెట్టేసినవి.

1942లో క్విట్ ఇండియా ఉద్యమానికి గాంధీజీ పిలుపు నిచ్చిన రోజులవి. కృష్ణమూర్తి గారు హైస్కూల్లో చివరి సంవత్సరం చదువుతున్నారు. ఆ నేపథ్యంలో కృష్ణమూర్తి

రాసినదే 'మాతృ సందేశం' అనే ఖండకావ్యం మచ్చుకకు ఒక పద్యం చదివితే చాలు ఈ 'మాతృ సందేశం'లోని పద్యాలు ఎంత జటిలంగా ఉన్నాయో తెలుసుకోవడానికి. "వితతం బైన చరచరాత్మక మహ విశ్వ ప్రపంచంబునన్, బ్రతి జీవాణువునన్ భ్రమించుచున్ బరబ్రహ్మైక రూపంబునై, శ్రుతిలోక ప్రథమ ప్రకాశితమునై రూపొందె నే పూజనీ, యతన్ గన్నటి పదార్థయయ్యమృత శబ్దావాప్తి నూహించెదన్"- ఈ ఖండ కావ్యం 28-12-1945న ముగించినట్లు కృష్ణమూర్తి గారే స్వయంగా రాశారు. 297 పద్యాలు, భిన్న ఛందోరీతుల్లో సాగే కావ్యం ఇది. స్వాతంత్ర్యము సిద్ధించిన యాభై సంవత్సరములకు దీన్ని అచ్చు వేశారు భద్రిరాజువారు.

"గురువు గారి తొలి పద్యాలలో సహజంగానే భాషాడంబరం, సమాస రచనపై మోజు, భావాల్లో వివేచనకన్నా మోగ్ధ్యం కనిపిస్తుంది... 'మాతృ సందేశం' గురువుగారి చేత పద్య రచనాభ్యాసం చేయించింది. ఆ తర్వాత స్వాతంత్ర్యానంతరం 'ఆశంస' పేరుతో రాసిన పద్యాల్లో ఎక్కువ పరిణతి కనిపిస్తుంది. సమాసాల మోజు తగ్గి తెలుగు మాటల మార్పువైపు మొగ్గు కనిపిస్తుంది", అని రాశారు చేకూరి రామారావు . 'తెలిదమ్మి రేకు కత్తుల బోనులలో నుండి,చివ్వున తుమ్మెద చెంగలించె పెను బాస తేడు తానిడలేక మొగలిపై చుట్ట విప్పుకొని పోయె, ఒడిసిపట్టిన చంద్రునుడుపక యేకాల, బద్ధుడై రాహువు పట్టువదలె, చీకటి కప్పు విచ్చిన జాడజూచిగూ, బలు చెట్టుగుట్టల పాలం బడియె' – అలా సాధారణ అలతి అలతి తెలుగు పదాల సొబగులతో పోతన రీతిలో కవితా ఝరి నడిపించారు 'ఆశంస'లో. ఈరకపు పద్యరచన తిక్కన గారిపై భద్రిరాజు వారికున్న అపారమైన అభిమానం వలన అయి ఉంటుంది. భద్రిరాజు వారు 'తిక్కన' మహాభారతంపై 'స్పెషలిస్ట్' ప్రసంగాలు చేసేవారు. చిన్ననాడే తిక్కన కవిత్వంపై విపరీతమైన అనురక్తి పెంచుకోవటం వలన కాబోలు ఆయన తిక్కన భారత పర్వాలను క్షుణ్ణంగా శోధించారు.

నాటి బహుభాషావేత్త, ఆంధ్రరాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రి, ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా పనిచేసిన బెజవాడ గోపాలరెడ్డి గారికి కృష్ణమూర్తి గారి 'తిక్కన' ప్రసంగాలు అంటే ఎంతో ఇష్టం. తరుచూ కృష్ణమూర్తి గారికి ఖర్చులు ఇచ్చి నెల్లూరు పిలిపించుకొని ఆయనతో ప్రసంగాలను ఇప్పించేవారు. తగు పారితోషికం ఇచ్చి దుశ్శాలువతో

సత్కరించేవారు. అదే విధంగా నాటి విద్యాశాఖా మాత్యులు, తర్వాత కేంద్రంలో విద్యాశాఖా మాత్యులు, భారత ప్రధానిగా పనిచేసిన పి.వి. నర్సింహరావు గారు కూడ కృష్ణమూర్తి గారి తిక్కన సోమయాజిపై ప్రసంగాలకు చెవి కోసుకొనేవారు. ఆకాశవాణి వారు తిక్కనపై వారి ఉపాన్యాసాల పరంపరకు మచ్చుతునకగా ఒక ఉపన్యాసాన్ని 'తిక్కన పదసంపద' పేరుతో ప్రసారం చేశారు. భద్రిరాజు వారి సంపాదకత్వంలో 'తిక్కన పదప్రయోగ కోశం' చేసేప్పుడు ఆ యజ్ఞంలో ప్రముఖ పాత్ర పోషించిన నల్లాన్ చక్రవర్తుల రామానుజాచార్యుల వారు తన షష్టిపూర్తి సందర్భంగా భద్రిరాజు వారికి తిక్కన కవిత్వంపై, ఆ మహాకవి వాడిన ప్రతి పదంపైన ఉన్న సంపూర్ణ సాధికారితను వివరించారు. నాడు ఆ సభ హైద్రాబాదులోని చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో జరిగింది. బూదరాజు రాధాకృష్ణ గారు అధ్యక్ష ప్రసంగం కావించారు. వైస్ – ఛాన్సలర్ బాధ్యతల వలన కృష్ణమూర్తి గారు ఆ సభకు నాడు రాలేక బూదరాజు వారిని పంపారు.

అంతెందుకు, ఇందాక పేర్కొన్నట్లు వారు కాలేజీ వీడుతూ (1934లో) 'వీడ్కోలు పద్యాలు' రాశారు. ఆ పద్యాలలో ఒకటిని నేను పైన ఉదహరించాను. ఆ పద్యంలో సరిగా గమనిస్తే రెండో పాదం చివర 'ఎ', మూడు పాదం మొదట 'మి' రావటం వలన పాదం తెగటంలేదని దాన్ని సవరించమని ఆయన తమ కాలేజీలోని సంస్కృతాంధ్ర భాషా కోవిదుడైన పల్లెపూర్ణ ప్రజ్ఞాచార్యుల వారిని కోరారు. అందుకు వారు చెప్పిన సమాధానం వింటే మనకు ఆశ్చర్యం కలగ మానదు. "ఈ రకమైన రచన తిక్కన భారతంలో కనిపిస్తుంది. తిక్కన గారికి ఈ పద్ధతి చాలా ఇష్టమని" అది విని నిర్ఘాంతపోవటం కృష్ణమూర్తి గారి వంతు అయింది. 'ఆయనకు తెలియకుండానే తిక్కన కవిత్వం ప్రభావం ఆయనపై అంతగా పడిందా' అని.

కృష్ణమూర్తి గారు చివరగా రాసిన గేయం 'కాల స్రవంతి'. ఇది చేకూరి రామారావు గారికి బాగా నచ్చిన 'సాగర సంగీతం' తర్వాత రాసినది. రెండూ భావ కవిత్వాలే. మాత్రా ఛందస్సులో రాసినవి. 'కాలస్రవంతి! ఓహెూ! కాలస్రవంతి! నీ జన్మస్థానమేమి! నీ గమ్యస్థానమేమో? తెడ్లులేని సృష్టి పడవ, ఒడ్లులేని నీ వేగపుటురవడిలో యెటకో, చెరచెర మని సాగిపోవు... నిలుపులేని, నియతిలేని స్రోతోనిస్వతులకు, ఒకవైపు విశాల సృష్టి,

ఒకవైపు శ్మశాన వాటి... పాంచ భౌతిక ప్రకృతికి బాయని నీ చెలిమి యేమి ! మానవ సృష్టికి నీకును మధ్య తీవ్రవైరమేమి !' అంటూ ముగుస్తుంది. ఇది నేడు పలు వారపత్రికలలో, దినపత్రికలలో వచ్చే భావ కవిత్వాలకు ఎంత మాత్రం తీసిపోదు.

అన్ని కాలాల్లోను కవులు తమ సమకాలీన సమస్యలనే వస్తువుగా స్వీకరించి కవితలల్లారు. భద్రిరాజు వారు కూడా అలానే అల్లారు. 1947లో బెంగాలులో, బీహారులో సంభవించిన హత్యాకాండలకు స్పందిస్తూ 'ఆవేదన' రాశారు. ఛందోబద్ధమైన ఈ కవితల్లో సంబోధితుడు బుద్ధుడు. స్వాతంత్ర్యం సిద్ధించిన ఆగస్టు 15, 1947న రాసిన ఛందోబద్ధమైన పద్యమాలిక 'ఆశంశ'. నాడు భద్రిరాజు వారి వయస్సు కేవలం పందొమ్మిది సంవత్సరాలు. ''బహు కాలాగత పారతంత్ర్య నిగళా ప్రాప్తిన్ విభేదించి, సన్నిహితంబైన స్వతంత్రానవనవోన్మేషాంశులన్ భారతి, హృదయం భోజ వికాసముం గొలిపి యద్యన్మూర్తి యొప్పులో, కహితోద్భూత! త్రివర్ణ భారతపతాకా! నీకు బ్రహ్మాయువౌ?

కృష్ణమూర్తి గారి కవితల్లోని సెమియాటిక్స్ (సంజ్ఞలు), యతులు, గణాలు, వ్యాకరణాంశాలను చేకూరి రామారావు గారు విశ్లేషించారు కాబట్టి నేను ఈ వ్యాసంలో వాటి గురించి ప్రస్తావన చేయటంలేదు. కృష్ణమూర్తి దాదాపు 1950, 1951ల తర్వాత ప్రత్యేకించి, కవితలు, గేయాలు, కావ్య ఖండికలు రాయక పోయినా ఆశుకవిత్వంలో పద్యాలు అల్లి చెప్పేవారు – తన పండిత శిష్యుల మధ్య. 1987 జనవరిలో అనంతపురంలో జరిగిన ద్రావిభభాషా పరిశోధన సంఘం వారి సమావేశంలో భద్రిరాజువారు, బూదరాజువారు పోటీలు పడి ఆశు కవిత్వం చెప్పారు. బూదరాజు రాధాకృష్ణ తన 'సాహితీ వ్యాసాలు' అనే గ్రంథాన్ని అబ్బూరి రామకృష్ణారావు స్మృతికి అంకితం చేసిన సందర్భంగా ఫత్‌మైదాన్ క్లబ్‌లో భద్రిరాజు కృష్ణమూర్తి గారు అప్పటికప్పుడు సీసపద్యంలో వారికి నివాళి అర్పించారు (3–5–1990న).

భద్రిరాజు వారు చిన్ననాడు ఒంగోలులో అష్టావధానాలు చేసేవారు. నాటి అవధానాలకుసాక్షులుగా భారతుల మార్కండేయ శర్మ, నాయని నరసింహరావు ఉండి వారి పృచ్ఛకత్వానికి ధీటుగా సమాధానాలు పద్యరూపంలో పలికినందుకు నాడు 'కిష్టుడు' అని ముద్దుగా పిలిచే భద్రిరాజు కృష్ణమూర్తిని అభినందించేవారు. కృష్ణమూర్తి సాహితీ

పిపాస భాషా పరిశోధనతో సమాంతరంగా సాగేది. రాచకొండ విశ్వనాధ శాస్త్రి (రావిశాస్త్రి) షష్టిపూర్తి సందర్భంగా 'జులై 30' అని రావిశాస్త్రి షష్ఠిపూర్తి సన్మాన సంచిక తెచ్చారు – ఆయన ప్రియ మిత్రులు. వారిలో భద్రిరాజు వారు ఒకరు. ఆ సందర్భంగా రావిశాస్త్రి 'ఋక్కులు' అని రాసిన తొమ్మిది కథలను పరిశోధనాంశంగా చేసికొని, "రావి శాస్త్రి రచనల్లో 'సిమిలీ' – అని ఒక అద్భుత వ్యాసాన్ని ప్రచురించారు భద్రిరాజు కృష్ణమూర్తి. ఆ తర్వాత ఆ సంచికను అనేక వార, దిన పత్రికలు సమీక్షించాయి. అన్నింటిలోనూ భద్రిరాజువారు రాసిన విమర్శనా వ్యాసం రావిశాస్త్రికి నిజమైన షష్టిపూర్తి కానుకగా నిలిచింది. ఈ విషయాన్ని చలసాని ప్రసాదరావు తన సమీక్షలో విస్పష్టంగా పేర్కొనటం జరిగింది.

భాషా శాస్త్రం ఎంచుకొన్న తర్వాత కృష్ణమూర్తి గారు కవితాసృజన ఆపేసినా, ఒకవేళ ఆయన కొనసాగించి ఉంటే ఏ స్థాయికి వెళ్ళేవారో ఊహించటం కష్టం అంటారు చేకూరి రామారావు గారు.

(ఆంధ్రజ్యోతి వివిధ దినపత్రిక అక్టోబర్ 25, 2021)

6
సాహిత్యమా ? సంగీతమా ? - దేనికి ప్రాశస్త్యం ?

సంగీతంలో సాహిత్యానికి ప్రాధాన్యమా, స్వర, రాగ ఆలాపనకు ప్రాధాన్యమా ? - దేనికి ప్రాధాన్యం ఇవ్వాలి అనే మీ మాంసకు "దాక్షిణాత్య వాగ్గేయకారులు - దేవీకృతులు - ప్రాశస్త్యం" అనే గ్రంథం నుంచి కొన్ని సమాధానాలు లభిస్తున్నాయి. ఇటీవలి కాలంలో నండూరి పార్థసారథి గారు 'వివిధ'కు రాసిన రెండు వ్యాసాలు - "సంగీతంలో సాహిత్యం ఒక అడుగు వెనకే నడవాలి" (తేదీ : లభించలేదు), "విలంబగాన సౌందర్యం" (తేదీ 25-10-2021)-లలో ఈ విషయమై కొన్ని ఆసక్తికరమైన పరిశీలనలను వ్యక్తం చేశారు. ఈ వ్యాసాల్లో వారు వ్యక్తపరచిన భావాలు వారి వ్యక్తిగతమని స్వీయానుభవ జనితమని భావించవచ్చు. (సంగీతంపై వారికి ఉన్న అపార పరిజ్ఞానాన్ని కించపర్చటం ఈ వ్యాసం ఉద్దేశ్యంకాదు). ఎందుకంటే ఈ వ్యాసాల్లోని అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ఆయన ఏ సంగీత విద్వాంసులను గాని, సంగీతంలోని ప్రామాణిక పుస్తకాలను కాని ప్రస్తావించలేదు. పైగా వారు అన్ని రకాల సంగీతాలను కలిపి తన భావాలను విస్తృతీకరించారనిపిస్తుంది. అంటే శుద్ధ సంగీతం, సంగీతానికి ప్రాశస్త్యం అనే దానికి వస్తే అందులోని అన్ని తరగతులకు, వాటిలోని ఆధ్యాత్మిక హిందూస్థానీకి, కర్ణాటకలకు కలిపి అవే భావాలు వర్తిస్తాయన్నట్లుగా నడిచింది వారి వ్యాసరచన.

కాని ఇక్కడ నేను ప్రస్తావించే గ్రంథం "దాక్షిణాత్య వాగ్గేయకారులు – దేవీకృతులు – ప్రాశస్త్యం" అనే దానిని ద్రావిడ విశ్వవిద్యాలయం వారు ప్రచురించారు. (2012లో). డా॥ డి. సుగుణ గారు ఆ గ్రంధకర్త. స్వయంగా సంగీత కచేరీలు చేసి, సంగీత బోధన చేసే సుగుణగారు తన వ్యక్తిగత అనుభవం మేళవించి, ఆధ్యాత్మిక సంగీతంలోని సాహిత్య, సంగీత ప్రాశస్త్యంను వివరించిన గ్రంధం ఇది. కొద్దిపాటి లోపాలు (తప్పులు కాదు) మినహాయిస్తే (వాటి గురించి మరెక్కడైనా చెప్పుకోవచ్చు) ఈ గ్రంథం పార్ధసారథిగారి అనేక భావాలకు విరుద్ధంగా విషయ వివరణ చేస్తుంది అనటంలో సందేహంలేదు.

ఉదాహరణకు – "శుద్ధ శాస్త్రీయ సంగీతంలోని సాహిత్యానికి ప్రాధాన్యం ఇవ్వడం సంగీతాన్ని అవమానించడమే" అంటారు పార్ధసారథిగారు. ఇంకా "సంగీతం స్వయం ప్రకాశం గల కళ. కవిత్వం కూడ అంతే. కాని గానం చేయడానికి ఉద్దేశించిన తాళబద్ధమైన గీతాలు కూడ స్వయం ప్రకాశం కలవి కావు. సంగీతాన్ని ఆశ్రయించనిదే అవి రాణించలేవు. సంగీత రచనల్లో సాహిత్యం కేవలం 'టే కాఫ్' కి మాత్రమే ఉద్దేశించినవి" – అని కూడ వ్యక్తీకరించారు.

అయితే ఇందుకు ప్రతిగా పైన ఉటంకించిన సుగుణగారు వ్రాసిన గ్రంథం ఏమంటుందో చూద్దాం : "ప్రాచీన కాలం నుంచి భారతదేశంలో భావాలకు, అనుభూతులకు పలికించడానికి సంగీతం ఒక అద్భుత మాధ్యమంగా వుంటూ వచ్చింది. కాలక్రమంలో చెప్పే విషయంలోనూ (రచనల్లోని సాహిత్యము), మాధ్యమంగా ఉన్న సంగీతంలోనూ ఎన్నో మార్పులు వచ్చాయి. సామగానం చేసిన కాలంలో మాధ్యమంగా సంగీతం పరిధి చాలా చిన్నది. చారిత్రక క్రమంలో, భక్తి భావంలో విభిన్న కోణాలు ఏర్పడ్డాయి. శైవ, వైష్ణవ, భక్తి ఉద్యమాలు వచ్చాయి. తత్సంబంధమైన తాత్విక దర్శనాలు ఏర్పడ్డాయి. అదే సందర్భంలో (సమయంలో) సంగీతం కూడ అభివృద్ధి చెందుతూ నిర్దిష్టతను, సున్నితత్వాన్ని, గాఢతను సంతరించుకొంటూ, క్రొత్త రూపాలను ఏర్పరచుకొంటూ ముందుకు సాగింది. వాగ్గేయకారులు కూడా తమ భావాలు సంగీతంలో ఏవిధంగా పలికితే రసిక జనుల హృదయులను గొప్ప అనుభూతితో నింపగలవో తమ ప్రతిభావ్యుత్పత్తులతో గ్రహించి, అందుకు అనుగుణంగా తమ గీతాలకు సంగీత రచన చేశారు.

అంటే భక్తి సాహిత్యానికి, శైవ, వైష్ణవ, ద్వైత, విశిష్టాద్వైత దర్శనాలకు, జీవేశ్వర భేదాన్ని గుర్తించేందుకు, పామరుడు సహ అందరికీ ముక్తి మార్గం, జ్ఞానమార్గం కలగడానికి సంగీతం ఒక మాధ్యమం అయితే, భక్తి సాహిత్యం మూలపదార్థం అయిందన్నమాట. "అందువల్లనే భక్తి ఉద్యమాలు, భక్తి ఆలంబనగా చేసుకొన్న సంగీతం సమాజాన్ని గాఢంగా, విస్తృతంగా ప్రభావితం చేయగలిగాయి", అంటారు సుగుణ.

కర్ణాటక సంగీత క్రమం (త్యాగరాజు, శ్యామాశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు) వర్ధిల్లిన కాలంలో, శ్రీ విద్యో పాసన నేపథ్యంలో దేవీకృతులు వచ్చాయి. ఈ కృతులు చేసిన వాగ్గేయకారుల్లో ఉతుక్కాడు వేంకట కవి, ముత్తుస్వామి దీక్షితులు, ప్రముఖులు. అదేకాలంలో త్యాగరాజు, శ్యామా శాస్త్రి, స్వాతి తిరునాళ్, మైసూరు వాసు దేవాచారి వంటి వాగ్గేయకారులు భక్తి భావంతో దేవీకృతులు రచించి, గానం చేశారు. అంతేగాక తాంత్రిక అద్వైత దృష్టి కలిగి రాసిన కృతులకు, భక్తి భావంతో రాసిన కృతులకు మధ్య భావ వ్యక్తీకరణలో, నిర్మాణంలో సామ్య, భేదాలు ఉన్నాయంటారు సుగుణ. ఆయా విధాల సంగీత రచనల విశిష్టతలు ఏమిటో కూడ సుగుణ ఈ గ్రంథంలో విశదీకరించారు.

ఈ నేపథ్యంలో 'సంగీతంలో సాహిత్యం ఒక అడుగు వెనకే నడవాలి' అన్న వ్యాసంలో రచయిత వ్యక్తం చేసిన భావాలు పైపై విశ్లేషణ కారణంగా వెలిబుచ్చిన వేనన్న భావం కలుగుతుంది. అంతేగారు రచయిత పార్ధసారథి గారు తన రెండవ వ్యాసం 'విలంబగాన సౌందర్యం'లో త్యాగరాజు వారి "నగుమోమును గనలేని" అనే త్యాగరాజు కీర్తనను ఉటంకించారు. అంటే సంగీతంకు సంబంధించిన ఆయన చేసిన విశ్లేషణలో త్యాగరాజు కృతులను కూడ పరిగణలోకి తీసుకొనటం ద్వారా ఆయన ఆధ్యాత్మిక సంగీతానికి కూడ వర్తించేలానే తన సూత్రీకరణలు చేశారు అన్నమాట. అయితే వారి ఈ సూత్రీకరణలలో కొంత భిన్నవాదం కనిపిస్తుంది. వారు హిందూస్థానీ, కర్ణాటక సంగీతాలలో హిందూస్థానీ రాగానికి, కర్ణాటక తాళానికి మధ్యపోలిక, భేదాలను చర్చించే నేపథ్యంలో ఈ సూత్రీకరణకు వచ్చినట్లు అవగతమవుతుంది. ఈ సందర్భంగా ఆయన త్యాగరాజు స్వామి 'నగుమోము' కీర్తనను త్యాగయ్య సిన్మా (1946)లో నాగయ్యగారు ఎంతో ఆర్తితో కీర్తించారు అని రాసుకొచ్చారు. దాదాపు త్యాగరాజస్వామి గారు జీవించి ఉంటే వారు కూడ అంతే ఆర్తితో

కీర్తించి ఉండేవారన్న అర్థంలో. వాటిలో ఆత్మావలోకనం, వేదన రెండూ వ్యక్తమౌతాయి అని, కాని తర్వాతి కాలంలో అదే కీర్తనను గానంచేసే వారిలో ఆ ఆర్తి, వేదన, కచేరిల్లో కనపడవు అంటారు. ఇక్కడే అసలు చిక్కల్లా.

పార్ధసారథి వారి తొలి వ్యాసం 'సంగీతంలో సాహిత్యం ఒక అడుగు వెనకే నడవాలి' అన్న దానిలో 'సంగీత రచనల్లో సాహిత్యం కేవలం 'టే కాఫ్' కి మాత్రమే ఉద్దేశించినవి అనటం ద్వారా "పరస్పర విరుద్ధమైన సూత్రీకరణలు చేశారా?" అని అనిపిస్తుంది. ఎందుకంటే 'త్యాగరాజు వారి ఈకృతి తాళబద్ధమైనదే. పార్ధసారథి గారి వ్యక్తీకరణ ప్రకారం అది స్వయం ప్రకాశం కలది కాదు. అది సంగీతాన్ని ఆశ్రయించవలసిందే. ఆ విధంగానే సంగీతాన్ని ఆశ్రయించిన వారు కచేరిల్లో 'నగుమోము' అనే త్యాగయ్య కీర్తనకు 'టే కాఫ్' కు మాత్రమే వాడుకొన్నారా? అందువల్లనే వారి కచేరిల్లో ఆర్తి, ఆత్మావలోకనం, ఆవేదన మృగ్యమైందా? – వంటి అసందర్భ ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. అంతటితో ఆగక, వారు ఆ విధమైన కచేరి లక్షణాలను ముత్తుస్వామి దీక్షితులు నుంచి మంగళంపల్లి బాల మురళీకృష్ణ వరకూ అంతా అలానే పాడేవారు అన్ని సూత్రీకరణ చేశారు. ఇలాంటి సూత్రీకరణలు పంటి క్రిందరాళ్ళులా తగలక మానవు. వారు ముత్తుస్వామి దీక్షితులను ఈ గాటను కట్టేయకుండ ఉంటే బావుండేది. ఎందుకంటే ముత్తుస్వామి, త్యాగయ్య సహచరులు అన్నదమ్ముల్లా ఒకే కాలంలో జీవించారు. త్యాగరాజు గారి ఆర్తిని విస్మరించి ముత్తుస్వామి దీక్షితులు కచేరీల్లో గానం చేశారని పార్ధసారథి గారు ఎలా చెప్పగలిగారు ?

నిజానికి డి.కే. పట్టమ్మాళ్, ఎం.ఎస్. సుబ్బలక్ష్మి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, మహారాజపురం సంతానం లాంటి వారు పాడిన అనేక త్యాగరాజు స్వామికీర్తనల్లో ఆర్తి, ఆవేదన, ఆత్మావలోకన చాలా ప్రస్ఫుటంగా వ్యక్తమవుతాయి. కొన్ని సందర్భాలలో వినే శ్రోతల్లో సాత్విక భావాలు పొడచూపి కళ్ళు ఆర్ద్రమవటం కూడ జరుగుతాయి. ఇంకా అనేకమంది పేరున్న శాస్త్ర సంగీత విద్వాంసులు తిరువయ్యార్‌లో త్యాగరాజస్వామి పుణ్యతిథి అయిన పుష్యబహుళ పంచమినాడు చేసే శాస్త్ర సంగీత కచేరిలో ఒళ్ళు పులకరిస్తుంది. వారు భిక్ష స్వీకరిస్తూ గానం తోనూ, నృత్యం కూడా చేయటం చూస్తే కళ్ళు చమర్చక మానవు. ఇదంతా సాహిత్య ప్రమేయం లేకుండా కేవలం శుద్ధ సంగీతం వలన జరుగుతుందనుకోవటం అతివాదం అవుతుంది.

కొద్దిమంది పార్థసారథిగారు చెప్పినట్లు సంగీత ఆలాపన ప్రారంభం నుంచే పల్లవిని సాగదీసి, వివిధ రకాలుగా స్వరాలపై ఒత్తిడి మారుస్తూ గంటలపాటు ఆలపిస్తారు. కొంతమంది మహాప్రాజ్ఞులైన సంగీత విద్వాంసులు, రసికులు ఆ ఆలాపనలకు చప్పట్లు కొట్టం కూడ విదితమే. అయితే ఇది సార్వత్రికంగా, సార్వకాలీన సత్యం కాదు. చాలామంది చప్పట్లు కొడతారన్నది నిజమే అయిన, అంతకంటే ఎక్కువ స్థాయిలో చాలామంది నిద్రలోకి జారుకోవటం, లేక బయటికి వెళ్ళిపోవటం కూడ నిత్య సత్యమే. అలాంటి సంగీత కచేరి చేసి త్యాగరాజాదులు సంగీతంతో పరబ్రహ్మానికి చిరాకు తెప్పించారని అనుకోవటం సరికాదు. కీర్తనలోని భక్తిపాలు, సాహిత్యం నుంచే ప్రవహిస్తుంది కాబట్టి త్యాగరాజు వంటి వాగ్గేయకారులు పూర్తి కృత్తికి, కీర్తనకి ప్రాధాన్యం ఇస్తూనే పాడారనిపిస్తుంది. అందువలననే అవి సంగీతశాస్త్ర ప్రాజ్ఞులకన్న పామరులకే దగ్గరయినాయి. సాధారణ భక్తులు కూడ నంగినంగిగా తమలో తాము పాడుకొనేలా ప్రాచుర్యం పొందాయి. త్యాగరాజు గారి 'మరుగేలరా రాఘవా', రామదాసుగారి 'నను బ్రోమమని చెప్పవే' – ఈకోవకు చెందినవే.

దక్షిణాదిన తెలుగు వాగ్గేయకారులు పాడిన కీర్తనలను, కృతులను తమిళ సంగీత కోవిదులు తమిళంలోకి అనువదించుకొని పార్థసారథి గారు చెప్పినట్లు ఆలాపనలు చేసి సాహిత్యాన్ని పూర్వపక్షం చేసిన సందర్భాలు లేకపోలేదు. సిన్మాప్రక్రియ ప్రారంభమైనాక – ఆవిధమైన సంగీతాలాపన నుంచి సిన్మాప్రేక్షకులను మెప్పించే రీతిలో ఈ సంగీత గాన ప్రక్రియ సమయానుకూలంగా మార్పుచెంది నేడు ఒక తృప్తికరమైన స్థాయికి, సంగీతానికి, సాహిత్యానికి ఉభయ తారకంగా ఉండేలా పరిణమించింది అనటంలో అతిశయోక్తి ఏమీలేదు. ఘంటసాల, సాలూరి రాజేశ్వరరావు, ఆదినారాయణరావు వంటి వారలు సంగీత, సాహిత్యాలను సమతుల్యంలో ఉంచేలా సంగీత గానాలాపన రూపొందించారు సిన్మాలకి. విశ్వనాధ్, బాపు, వంశీ, జంధ్యాల వంటి వారు ఈ 'ఇన్నవేషన్స్' (రూపాంతరాలకు) శాశ్వత ప్రాచుర్యం కలిపించారు.

సుగుణగారు గ్రంథస్థం చేసిన 'దాక్షిణాత్య వాగ్గేయకారులు' గ్రంథంలో దేవీ కృతుల ప్రాశస్త్యంపై చేసిన "విశ్లేషణ చూస్తే, వాగ్గేయ కారులు రాసిన సాహిత్యం కేవలం సంగీతాలాపనకు 'టేక్ ఆఫ్'కు మాత్రమే పరిమితమైనది కాదని స్పష్టంగా తెలుస్తుంది.

ఉదాహరణకు ఉతుక్కాడు వేంకటకవి రచించిన 'కామాక్షి నవావరణ కృతులు' తాంత్రిక అద్వైత దృష్టితో చేసినవే. త్యాగరాజు రాసిన సంగీత నాటకాలు, 'ప్రహ్లాద భక్తి విజయం', నౌకాచరితం' లో దాదాపు 600 కృతులు ఉన్నాయి. వీటిలో లలితే శ్రీ ప్రవృద్ధే (రాగం : భైరవి, తాళం', ఆది); 'సుందరి నన్నిందరిలో' (రాగం : బేగడ; తాళం : రూపకం), 'అంబానిను' (రాగం : ఆరబి, తాళం ఫ ఆం) వంటి దేవీకృతులు ఎంతో ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలవి. ఇలా సుగుణ గారు శ్యామాశాస్త్రి, సుబ్బరాయశాస్త్రి, మైసూరు వాసుదేవాచార్, ముత్తయ్య భాగవతార్, మైసూరు సదాశివరావు, చెయ్యూరు చెలంగల్వరాయశాస్త్రి వంటి వారు రాసిన దేవీకృతుల విశ్లేషణ చదివితే సంగీతంలో సాహిత్యంకున్న ఆధ్యాత్మిక ప్రాధాన్యం అనన్యమైనదని స్పష్టంగా తెలుస్తుంది. వాటిలో నిక్షిప్తమైన శ్రీచక్ర బీజాలు, కోణాలు వెలుగుచూస్తాయి.

కనుక 'శాస్త్రీయ గాత్ర సంగీతం విషయంలోనూ సాహిత్యం విమాన చక్రాలు లాగానే ఉండాలి. సాహిత్యం, సంగీతాన్ని ముందుకు త్రోసి, అది వేగం పుంజుకోగానే వెనక్కితగ్గాలి' అన్న పార్ధసారథి గారి సూత్రీకరణ ఆమోదయోగ్యం కాదు. అంతేకాదు 'సాహిత్యాన్ని ఎంత చిత్ర హింస చేసినా సంగీత రంజకత్వానికి ఏమీ అభ్యంతరం ఉండదు' అన్న వారి సూత్రీకరణ ఎంతో వింతగా ఉంది.

అద్భుతమైన కంఠ మాధుర్యం, సంగీత ప్రావీణ్యం ఉన్నవారెవరైనా 'రామునితోక పివరుండిట్లనియే' అని గానం చేస్తుంటే, సంగీత రంజకత్వం సంగతి దేవుడెరుగు ముందు వాంతి వస్తుంది శ్రోతలకు ఆ విధమైన సంగీత గానం వినడానికి. ముఖ్యంగా తెలుగు సాహిత్యంలో ప్రాథమిక స్థాయి పరిజ్ఞానంలేని తమిళ నేపథ్యంలో ఎదిగిన శాస్త్రీయ సంగీత విద్వాంసులు చాలా మంది ఇలా వికటంగా పాడుతూంటారు. కాని సంగీతాన్ని సాహిత్యంతో సమతూకంగా వినాలనుకొనే రసజ్ఞులైన శ్రోతలకు అదో 'హింసాగానమే' అవుతుంది.

(ఆంధ్రజ్యోతి వివిధ దినపత్రిక డిసెంబర్ 13, 2021)

7
కాటమరాజు కథలు

తెలుగుదేశంలో (ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు కలిసి) రెండు ప్రసిద్ధమైన జానపద వీరగాథలుండేవి. ఒకటి 'పల్నాటి వీరచరిత్ర', రెండది 'కాటమరాజు కథలు', ఇటీవలనే పల్నాటి వీరుల 'వీరగానం' పల్నాడులో వారోత్సవాలుగా జరిపిన సంగతి ఈ సందర్భంగా మనం గుర్తు చేసుకోవాలి. అలాగే సరిగ్గా ఉగాది పండుగకు ఒకరోజు ముందు తెలుగు రాష్ట్రాలలోని యాదవులందరు నల్లమల్ల అడవుల్లోని రాజమలారణ్యంలో ఉన్న వేనూతల కాటమరాజుకి, వేనూతల గంగా భవానికి భక్తి ప్రపత్తులతో పూజలు చేసి, అక్కడ పెద్ద జాతర జరిపిస్తారు. నిజానికి 'పల్నాటి వీర చరిత్ర', 'కాటమరాజు కథలు' రెండూ జానపద గానాలు రూపంలోనే ఉంటాయి. అయినప్పటికీ ఇవి చారిత్రక కథలు.

వేటూరి ప్రభాకరశాస్త్రి లాంటివారు ఈ కథలపై తొలి పరిశోధనలు జరిపిన నాళ్ళలో వాటిని 'ఐతిహాసాలు'గానే పేర్కొన్నారు. సి.పి. బ్రౌన్, వేటూరి ప్రభాకరశాస్త్రి, తిమ్మావఝుల కోదండరామయ్య, మల్లంపల్లి సోమశేఖరశర్మలు తొలినాళ్ళలో 'కాటమరాజు కథలు' పై కొంత ప్రాథమిక పరిశోధనలు చేసినా అవి అసంపూర్తిగానే ఉండినాయి.

అసలు 'కాటమరాజు కథలు' ఎన్ని? వారు ఏ ప్రాంతంవారు? ఏ కాలంలో ఏయే ప్రాంతాలను పాలించారు? వారి కులగోత్రాలు ఏమిటి? వారి ఇంటి పేర్లు ఏమిటి? వారి పూర్తి పేర్లు, వంశవృక్షం, బిరుదులు, రాజధానులు, కోటలు వంటి వివరాలన్నీ సమగ్రంగా శోధించి, సంపూర్ణ విశ్లేషణ చేసినవారు ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు. వీరు బెంగుళూరు విశ్వ విద్యాలయంలోని తెలుగు శాఖలో ఆచార్యులుగా పనిచేశారు.

తంగిరాల వారి ప్రకారం 'కాటమరాజు కథలు' దాదాపు 32 దాకా ఉన్నాయి. వాటిని వారు 'కాటమరాజు కథా చక్రము' అని వివరించారు. అయితే వారి పరిశోధనలోని తొలినాటి పరిశీలనల ఆధారంగా 19 ప్రధానకథలను, ఆరు అనుబంధ కథలను కలిపి మొత్తం 25 కథలను నాటి ఉమ్మడి రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమివారు 'కాటమరాజు కథలు' అనే పేరుతో 1976లో రెండు సంపుటాలుగా ప్రచురించారు. రెండు దశాబ్దాల తర్వాత 1998లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు రెండవ ముద్రణగా తెచ్చారు. ఇప్పుడు ఇవి కూడ లభించడంలేదు. ఇటీవల ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు తన సొంత ఖర్చుతో అన్నీ కలిపి ఏక సంపుటంగా (2021లో) పునర్ముద్రించారు. పల్నాటి 'వీర కథాగానం' ప్రత్యేక వారోత్సవాలు ప్రముఖ పత్రికలలో ప్రకటితమైనట్లు, కాటమరాజు కథలు గానోత్సవాలుగా పత్రికల్లో బహుళ ఆదరణ పొందక పోవటం వలన, కేవలం జానపద సాహిత్య అభిలాష ఉన్న కొద్దిమందికి తప్ప చాలా మందికి 'కాటమరాజు కథలు' తెలియవు.

అత్యంత చారిత్రక ప్రాధాన్యం కల కాటమరాజు కథలను పరిశీలిస్తే సామాజికంగా, చారిత్రకంగా ఇవి ఎంతో ప్రాధాన్యం గల కథలు. ఒకరకంగా అవి వాస్తవాలు కూడ. ఈ కథల్లో కనిపించే అనేక ప్రాంతాలు, కోటలు నేటికీ ఉన్నాయి. సామాజికంగా పరిశీలిస్తే ఇవి ప్రధానంగా 'యాదవ రాజుల కథలు'. 'యాదవ భారతము', 'యదు శాస్త్రం'గా కూడ వీటిని అభివర్ణిస్తారు. మహాభారతం, భాగవతంలో కనిపించే యాదవరాజుల ప్రశస్తి తిరిగి మళ్ళీ మనకు ఈ కథల్లో కనిపిస్తుంది. అన్నింటికీ మించి సామాజికంగా, చారిత్రకంగా అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశం ఏమిటంటే ఈ రాజులందరూ ఒక శరణుకోరిన రాజునో, వారి బలగాలనో, ఆలమందలనో, రాజ్యాలనో రక్షించే లక్ష్యంలో భాగంగా యుద్ధాలు చేసి అసువులు బాసారు. అందువల్లనే "పరకార్యం మీద పాడైపోయింది యాదవకులం" అనే సామెతను, కాటమరాజు కథల జానపద గాయకులు ముఖ్యంగా గొల్లసుద్దులవారు తరుచూ అంటుంటారు అని వ్యాఖ్యానించారు తంగిరాలవారు. ముఖ్యంగా ఈ 'కాటమరాజు కథా చక్రము'లో కవి తిక్కన సోదరుడైన (తమ్ముడైన) ఖడ్గతిక్కన ప్రస్తావన వస్తుంది. ఖడ్గ తిక్కన మనందరికి తెలుసు. ఆయన ఒక చారిత్రక వాస్తవం.

ఖడ్గ తిక్కన పినతండ్రి కొమ్మనామాత్యుడి పుత్రుడు కవి తిక్కన. ఖడ్గ తిక్కన తండ్రి సిద్ధనామాత్యుడు. సిద్ధనామాత్యుడు, కొమ్మనామాత్యుడు అన్నదమ్ములు. విశేషమేమిటంటే నెల్లూరు సీమను పాలించిన మనుమసిద్ధి ఆస్థానంలో కవి తిక్కన సోమయాజి ఆస్థాన పండితుడిగా పని చేస్తున్న కాలంలోనే, ఖడ్గ తిక్కన మనుమసిద్ధి కొడుకైన నల్లసిద్ది ఆస్థానంలో సేనానిగా పనిచేశాడు. అయితే కవి తిక్కన రచనల్లో', అవతారికల్లో ఎక్కడా ఖడ్గతిక్కన ప్రస్తావన కనిపించకపోవటం వలన వారిద్దరి మధ్య ఒకతరం తేడా ఉండి ఉంటుందని తంగిరాల వారి భావన. కవితిక్కన కాలం చేశాక, ఖడ్గ తిక్కన యుద్ధంచేసి యాదవరాజు చలమపిన్నమనీడు బ్రాహ్మణమంత్రి బ్రహ్మ రుద్రయ్య చేతిలో మరణించి ఉంటాడని కూడ ఆచార్య తంగిరాల అభిప్రాయం.

యాదవరాజులు నేరుగా బ్రాహ్మణునితో యుద్ధం చేయటానికి నిరాకరిస్తారు. అప్పటికే ఖడ్గ తిక్కన సైనికులు మొత్తం యాదవరాజు చల్లపిన్నమనీడి సైన్యం చేతిలో వీరమరణం పొందుతారు. ఖడ్గ తిక్కన ఒక్కడే మిగులుతాడు. అందువలన యాదవరాజు యుద్ధం నిలిపివేస్తాడు. చల్లపిన్నమనీడు తమ సైన్యంలో ఉన్న బ్రాహ్మణుడైన మంత్రి, శివారాధకుడైన బ్రహ్మరుద్రయ్యను ఖడ్గ తిక్కనతో ద్వంద్వ యుద్ధం చేయమని ఆజ్ఞాపిస్తాడు. ఆ ద్వంద్వ యుద్ధాన్ని గుంగుల పినయెల్లయ తన గానంలో 'న భూతో న భవిష్యతి' గా వర్ణిస్తాడు. "ఇర్వురు పోరిరి దుర్వారులగుచు/తిక్కడు ద్రిక్కుడై తెగవ్రేయ, రుద్రుడక్కడ చెక్కలై అవనిపైబడి యె/పడుచునే రుద్రుడా ఏకఖడ్గధార/తడయక ఆ మంత్రి తలద్రుంచివైచే !" ఈ జానపద కథను జానపద సాహిత్యంలో పెల్లుబికే వీర రసానికి ఒక ఉదాహరణగా పేర్కొంటారు ఆచార్య తంగిరాలవారు. నిజానికి కాటమరాజు కథలన్నీ వీరగాథలే కాబట్టి ఇవన్నీ 'వీర రసం' తో పొంగి పొర్లుతాయి. గాన కథనం కూడ యుద్ధం లాగే రౌద్రంగా, ఘనమైన కంఠారవంతో దద్దరిల్లుతూ ఉంటుంది. ఉదాహరణకు ఈ గాథ కథనం నడక చూడండి :

"ధరణిపై నొండొరుం దప్పించుకొనుచు/లంగించి వెనుకకు రాగడిల్లుచును/ప్రాకుచు, దూకుచు, పైకి రేగుచును/ లాటించి నఱుకుచు, తాకి పొడ్చుచును/ఉరవడితో వచ్చి పరునడివేసి/కటపెట ఖంఖంగు ఘల్లు ఘల్లనుచు....."

ఈ విధమైన జానపద కథాగానం వెనుక వాస్తవికతను ఆచార్య తంగిరాల వారు చాలా సూక్ష్మంగా విశ్లేషించి ఈ కథలు ఎందుకు చారిత్రక వాస్తవమో సహేతుకంగా వివరించారు. "కాటమ రాజుల ఆస్థానాలలో ఎంతో మంది కవులు ఉండేవారు. వారంతా ఈ వీరుల సాహస గాథలను "కళ్ళారచూసి, యథాతథంగా వర్ణించి ఉండటం వల్లనే ఈ కథా కథనం ఒళ్ళు గగుర్పొడిచేలా సాగి ఉంటుంది. లేకపోతే ఈ కథలలో ఉండే అతి సూక్ష్మమైన వివరాలు, అత్యద్భుత వర్ణనలు, వీర-రౌద్ర-కరుణ-అద్భుత రసాల పోషణ ఎక్కడి నుండి వస్తాయి" అంటారు ఆచార్య తంగిరాల సుబ్బారావు.

వాస్తవానికి 'పల్నాటి వీరచరిత్ర'ను ద్విపదగా రాసిన శ్రీనాథుని రచనను ఆధారంగా చేసికొని తర్వాతి కాలంలో మల్లయ్య, కొండయ్య అనే కవులు 'పల్నాటి వీరచరిత్ర' జానపద గానంగా, వీరగానంగా మలిచారు. 'పల్నాటి వీరచరిత్ర' రాసిన శ్రీనాథుడే 'కాటమరాజు చరిత్ర కూడ' వ్రాసి ఉంటాడని ఈ ప్రాంతంలో జనవాక్యంగా తంగిరాల వారి పరిశోధనలో వెల్లడైంది. కాని శ్రీనాథుని రచనగా ఏ కాటమరాజు కథ లభించకపోవటం వలన ఈ జన వాక్యాన్ని 'ప్రామాణికంగా తీసుకోలేక పోయారు ఆచార్య తంగిరాలవారు.

కాటమరాజుల కథలకు సంబంధించిన తాళపత్రగ్రంథాల ఆధారంగా తొమ్మిది మంది జానపద కవులున్నట్లు గుర్తించారు తంగిరాలవారు. వారిలో గుంగుల పినయల్లయ, వడరూప మద్దులేటి కవి (ఆవుల వలురాజు కథ), మల్లయ్య (పంపాద్రి కథ), కనకబండి ఘట్టయ్య (పోలురాజు కథ, జన్నివాడ కథ), కట్టెబోయిన మారయ్య కవి (కాటమరాజు పట్టాభిషేకం), గొట్టిపాటి మల్లయ్య (బొంగరాల కథ), కదిరి మంగళం వెంకటాద్రి/మంగళపురి వెంకటాద్రి (పాపనూక కథ) రాలపాక వెంకురాం కవి (పాపనూక కథ), జరుగుపల్లె చెన్నయ్య (అగుమంచి కథ) ప్రముఖ కవులు గంగుల పినయల్లయ్య (పిన మల్లన అనే మరో మారు పేరు కూడ ఈయనకే ఉంది) కఱియావుల రాజు కథ, ఎఱ్ఱగడ్డపాటి పోట్లాట కథలను జానపద గానంగా రాశాడు.

నిజానికి కాటమరాజులు ఏ కాలానికి చెందినవారు అన్నది తంగిరాల వారి పరిశోధనలో తేటతెల్లమయింది. నిజానికి 'చరిత్ర'ను ఒక పాఠ్యాంశంగా పరిశోధించేవారు సాహితీ పరిశోధనలో వెలువడే సాహితీ చరిత్రతో తమ పరిశోధనలను సరిపోల్చుకుంటే, చారిత్రక శోధన ప్రస్తుత గమనం అంత అస్తవ్యస్తంగా ముక్కలు, ముక్కలుగా ఉండేదికాదు.

కాటమరాజు కథలలోని వీరుల కాలం దాదాపుగా పన్నెండు, పదమూడవ శతాబ్దాల మధ్య కేంద్రీకృతమై ఉంది. ఆవుల వలురాజు (క్రీ.శ. 1170-1195), పెద్దిరాజు (క్రీ.శ. 1195-1223), పోలురాజు (క్రీ.శ. 1212-1223), అయతమరాజు (క్రీ.శ. 1222-1283), కాటమరాజు (క్రీ.శ. 1217-1283), చోడ తిక్క లేక మొదటితిక్క (క్రీ.శ. 1209-1248), మనుమసిద్ధి (క్రీ.శ. 1248-12067), నల్లసిద్ధి (క్రీ.శ. 1270-1283). మొదటి తిక్కకే 'ముక్కంటి' అని మరో పేరు కూడ ఉంది. అది బిరుదు అయి ఉంటుందని తంగిరాలవారి అభిప్రాయం.

కాటమరాజును యాదవులు విష్ణు అవతారముగా భావిస్తారు. అందువలన కృష్ణ భాగవతము, (కంసుడి కథ)ను కూడ కాటమరాజు కథల్లో ఒకటిగా పరిగణిస్తారు. 'అగుమంచి వల పోత', 'గంగ పుట్టుక', 'వల్లికొండ పుట్టుక', కంసుడి కథ (కృష్ణ భాగవతము/విష్ణు భాగవతము)లను నాలుగు వీర గాధలను కూడ కాటమరాజు కథా చక్రములో భాగంగానే పరిగణించారు తంగిరాల వారు. అది అట్లుంచితే కాటమరాజుకు ఆరుపేర్లు, 77 బిరుదులు ఉన్నాయని కాటమరాజు కథలను బట్టి తెలుస్తుంది. నలనన్న, ఆవులన్న, పశువులన్న, నాట కోటేశ్వరుడు, కాటమరాజు, కత్రేయుడు అని ఆరు రకాలు పేర్లతో కాటమరాజు కథలు గానం చేస్తారు. ఆంభోజ బిరుదు, ప్రళయ కాల బిరుదు, సింగిణీ తోరణాలు, కనక సింగిణీలు, విష్ణు బిరుదు, చంద్ర బిరుదు, గరుడ శార్దూల, కనక పడగలు, భాస్మశంకర వంటివి ఆ 77 బిరుదుల్లో కొన్ని.

కాటమరాజు ముత్తాత పేరు కవులావుల గంగురాజు, తాత పేరు ఆవుల వలురాజు. తంగిరాల వారి పరిశోధన ప్రకారం కాటమరాజు ఇంటి పేరు మొదట 'కవులావుల వారు'గా ఉండి ఉండవచ్చునని, తరువాతి కాలంలో అది 'ఆవులవారు' గా మారిందని తెలుస్తున్నది. గుట్టంకొండ భక్తవత్సల కవి తన పద్య కావ్యంలో కాటమరాజు ఇంటిపేరు 'కఱియావుల వారు' అని పేర్కొన్నారు. అంటే 'కవులావుల' నే 'కఱియావులగా' మార్చినది విస్పష్టం. (కఱియావుల వారంటే నల్లని ఆవులు కలవారు అని)" కాటమరాజు కథా చక్రములోని ప్రధాన వీరుడు. అవతార పురుషుడు అయిన కాటమరాజు జననం క్రీ.శ. 1217 ఫిబ్రవరి 19వ తేదీగానూ, ఆయన ఎఱ్ఱగడ్డ పాడులో నెల్లూరు పాలకుడైన, మనుమసిద్ధి కుమారుడు నల్లసిద్ధిరాజు చేతిలో వీర మరణం పొందిన తేదీని మార్చి 7, 1283గాను తంగిరాలవారి పరిశోధన నిర్ధారించింది.

కాటమరాజు మధ్యయుగంనాడు ఆంధ్రదేశంలోని అనేక ప్రాంతాలలోని చిన్నచిన్న ప్రాంతాలను పాలించారు. యలమంచి, పంపాద్రి, అర్ధవీడు, ఉర్లుకొండ యలమంచి, దొనకొండ, బురగడ్డపాడు వంటివి ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం, నల్లగొండ ప్రాంతాలకు చెందినవి. కొన్ని ఇప్పటికీ అవే పేర్లతో ఉన్న విషయం కూడ విజ్ఞులకు విదితమే. (అర్ధవీడు, దొనకొండ), యలమంచి విశాఖ జిల్లాలోనిది. పంపాద్రి తూర్పు గోదావరి జిల్లాలోను, ఉర్లుకొండ యలమంచి నల్లగొండజిల్లాలో ఉన్నాయి. ఈ కథల్లో పంపానదే నేటి అన్నవరం కొండ ప్రక్కనుంచి పారుతున్న పంపానది. ఒంగోలు దగ్గరగా ఉంటున్న కనిగిరి కోట కాటమరాజు కట్టించిందేనని ఇప్పటికీ ఆ ప్రాంతం ప్రజలు నమ్ముచుంటారు. ఉర్లుకొండ యలమంచి ఓరుగల్లుకు సమీపంలో ఉంటుంది. భక్తిరన్న ఈ ప్రాంతాన్ని పాలించాడు.

కాటమరాజు కథా చక్రంలో వచ్చే ముఖ్యమైన వీరుల గురించి కొంత పరిచయం ఉంటే తప్ప ఈ కథలు పుట్టుపూర్వోత్తరాలపై అవగాహనరాదు. కాటమరాజు కథలు కాటమరాజు పితామహుడైన ఆవులవలురాజు (క్రీ.శ. 1170-95)తో ప్రారంభమవుతాయి. ఇతను యలమంచిని పాలించాడు. ఈయన కరణాలను రక్షించడానికి ఖండెమొండెముల కోటను పాలించే కలభూత గంగురాజుతో యుద్ధం చేసి వీరమరణం పొందుతాడు. ఆవుల వలురాజు భార్య పేరు వల్లమ్మ. వారి పిల్లలు సింహాద్రి రాజు, పెద్దిరాజు, ఎఱనూకరాజు, నలనూకరాజు, పోలురాజు. కూతురు కొమరక్క.

కాటమరాజు కథా చక్రములోని వీరగాథలు జానపద గానాలు. చాలా సాహిత్య ఔన్నత్యంతో వీర, భీభత్స, శాంత రసపోషణలతో, చక్కటి పద వరవడితో, వీనుల విందువుగా సాగుతాయి. ప్రస్తుతానికి 19 కథలే లభ్యమవుతున్న, తంగిరాలవారి పరిశోధనలో ఇంకా ఆరు కథలు సేకరించవలసి ఉన్నాయి. అవి : సింహాద్రి రాజు కథ, నలనూకరాజు కథ, భైరవ కురవ యుద్ధం, గంగ పుట్టుక, పల్లికొండ పుట్టుక, అగుమంచి వలపోత, ఇవికాక ఇంకా ఆరు మిగిలే ఉంటాయి. వాటి పేర్లు ఏమిటో కూడ భవిష్యత్తు పరిశోధకులు శోధించాలి అని ఒక ఆశయాన్ని వ్యక్తం చేస్తున్నారు ఆచార్య తంగిరాల వేంకట సుబ్బారావు.

(ఆంధ్రజ్యోతి వివిధ దినపత్రిక ఫిబ్రవరి 28, 2022)

8
మంకు తిమ్మని మిణుకు
(మత్తకూరు రాజణ్ణ చంద్రమౌళి కన్నడాంధ్రానువాదం)

కన్నడ, ఆంధ్ర భాషలలోని కావ్యాలను, నవలలను, కథలను పరస్పరం అనువదించటం క్రొత్తేమి కాదు, అనాదిగా ఉన్నదే "కన్నడిగుల ఆదికవి తండ్రి తెలుగు వాడు కాగా తల్లి కన్నడ ఆడబడుచు. నాచన సోమనాధుడు కన్నడ ధరిత్రి యందు జన్మించి తెలుగులో కొమ్ములు తిరిగిన కవీశ్వరుడైన ఉదంతం జగం ఎరిగినదే" అంటారు కన్నడంలో శతావధానిగా పేరుగాంచిన ఆర్.గణేశ్. ఈ పరంపరలోనిదె 'మంకు తిమ్మని మిణుకు' కూడా. పద్మభూషణ్ డి.వి.గుండప్ప రాసిన 'మంకు తిమ్మన కగ్గ'కు ఇది యథాతథ తెలుగు అనువాదం. ఈ యథాతథ తెలుగు అనువాదానికి చరిత్ర ఉంది. వావిలికొలను సుబ్బారావు ('ఆంధ్రవాల్మీకి' అని కూడా అంటారు). వాల్మీకి రామాయణాన్ని యథాతథంగా అనువదించిన ఏకైక తెలుగు కవి. తక్కిన తెలుగు రామాయణాలన్నీ ఈ కోవలోకి రావు. ఈ యథాతథ తెలుగు అనువాదం చాలా క్లిష్టమైంది. ఈ ప్రక్రియలో మూలంలో పద్యాలు 'ఏ ఛందస్సులో ఉంటాయో, ఒక్కో పంక్తిలో సరిగ్గా ఏ భావం వ్యక్తీకరిస్తాయో, సరిగ్గా అదే విధంగా అనువాద భాషలో పద్యాలు అదే ఛందస్సులో, అనువదించగల్గి ఉండాలి. ఈ పద్ధతిలో భాషాంతరీకరణంలో అల్పమైన లోపం ఉంటే అది భాషాంతరీకరణ పరిమితే అవుతుంది కానీ అనువాదకుడి లోపం కాదు. ఈ కన్నడాంధ్రానువాదం చూడండి. "పారిజాతవకందు

నిడుసుయ్డు, పదగళిం, శౌరికథెయను హెణెదు తృప్తనహను కవి, ఊరినుద్యానకద తరిసి బెళసువ కార్య, ధీరనుల రాజ్యకను-మంకుతిమ్మ" (కన్నడ). దీని ఆంధ్రానువాదము "పారిజాతము జూసి మెచ్చి పదములతోను, శౌరికథ నల్లుచును తృప్తిపడును కవి, ఊరి వనమునకు దానిని తెచ్చి పండించు, ధీరుడౌ రాజ్యకుడు – మంకుతిమ్మ" (తెలుగు).

మత్తకూరు రాజణ్ణ చంద్రమౌళి సంస్కృత, కన్నడాంధ్రలలో, ఆంగ్లంలో అసమానమైన ప్రతిభకల రచయిత. ఈ భాషల్లో సహజ సిద్ధమైన రచనా వ్యాసంగమే గాక, అనువాద వ్యాసంగం కూడా చేస్తుంటారు. పద్మభూషణ్ సి.నారాయణరెడ్డి రాసిన విశ్వంభర కావ్యాన్ని కన్నడంలోకి తొలిసారి అనువదించిన ఘనాపాటి ఈ చంద్రమౌళి. ప్రస్తుత రచన 'మంకు తిమ్మన కగ్గ' ను పద్మభూషణ్ గుండప్ప గారు ఎనిమిది దశాబ్దాల క్రితం రచించారు. కర్ణాటకలో దీనిని 'కన్నడ భగవద్గీత' అని కూడా పిలుస్తారు. అసలు భగవద్గీతను కన్నడిగులందరూ చదివి ఉండకపోవచ్చు కానీ, 'మంకు తిమ్మని కగ్గ' మటుకు ప్రతి కన్నడిగుడి నోట్లో నానుతూనే ఉంటుంది. రాజకీయ నాయకుల నుంచి, రచయితలు, పత్రికా సంపాదకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, యువత – ఇలా వీరు వారేమీటి, యావత్ కన్నడ రాజ్యంలో ప్రతి రోజు ఏదో రూపంలో 'మంకు తిమ్మనకగ్గ' ప్రతి ధ్వనిస్తుంది. అక్షర రూపంలో సాదృశమవుతూనే ఉంటుంది. ముఖ్యంగా దినపత్రికలు ఏదో ఒక శీర్షిక రూపంలో 'మంకు తిమ్మనకగ్గ' పద్యాలను రోజూ ప్రచురిస్తూనే ఉంటాయి. ఇందుకు మరో కారణం కూడా లేకపోలేదు. అదేమిటంటే గుండప్ప గారి వ్యక్తిత్వం, బహుముఖ ప్రజ్ఞ, నిరాడంబర జీవనం, ఆచరణాత్మక తాత్విక జీవన వైఖరి, శైలి. ఆయన కేవలం కవి, మార్మికుడే కాదు. గొప్ప పత్రికా రచయిత, సంపాదకుడు కూడా. కన్నడంలోనే గాక, ఆంగ్లంలో కూడా పత్రికా వ్యాసంగం నెరిపిన మహా మేధావి. బహుభాషా కోవిదుడు. తెలుగు అద్భుతంగా మాట్లాడటమే గాక తెలుగులో హాస్యోక్తులు, చాటువులుగూడ చెప్పేవారు. ఒక రకంగా ఆయన తాత్విక చింతన, రచనలు, జీవనశైలి చూస్తే మన జిడ్డు కృష్ణమూర్తి జీవితం స్ఫురణకు వస్తుంది.

దురదృష్టమేమో గాని ఎనిమిది దశాబ్దాల క్రింద తొలిసారి అచ్చయి, అనతి కాలంలోనే బహుళ ప్రాచుర్యం, జనాదరణ పొందిన ఈ మహాకావ్యం ఇటీవల వరకు తెలుగు వారికి తెలీనే తెలీదు. కువెంపు భాషా భారతి ప్రాధికార సంస్థ కోర్కె మేరకు

మత్తకూరు రాజణ్ణ చంద్రమౌళి 'మంకు తిమ్మనకగ్గ' ను తొలిసారి తెలుగులోకి అనుదించారు. దీనిని కువెంపు భాషా భారతి వారే పోయిన ఏడాది అచ్చు వేశారు. చంద్రమౌళి రాసే వరకు ఇటువంటి అపూర్వ పద్య కావ్యం ఒకటి కన్నడం నుంచి తెలుగులోకి అనువాదమైనట్టు తెలుగు వారికి ఒక్కరికీ తెలిసే అవకాశం లేదు.

ఈ 'మంకు తిమ్మనకగ్గ'లో సుమారు వేయికి పైగా పద్యాలు ఉంటాయి. ప్రతి పద్యం నాల్గు పంక్తులలో ఉంటుంది. నాల్గు పంక్తులలోనే ద్వితీయాక్షర ప్రాస, ప్రతి పంక్తిలో నాలుగు గణములు ఉంటాయి. ప్రథమ, తృతీయ పంక్తులలో నాలుగు పంచమాత్రా గణములు, ద్వితీయ పాదంలో మూడు పంచమాత్ర గణములు, ఒక్క చతుర్మాత్రా గణము ఉండగా, నాల్గవ పాదంలో మూడు పంచమాత్రా గణములు, రెండు మాత్రలు ఉంటాయి. ఆట వెలదిలా అంశ గణమూ, యతి పద్ధతి నాల్గు పంక్తులున్న పద్యాలకు ఉండవు. "రెండు, నాల్గు పంక్తిలోని నాల్గవ గణముల కొలత నాలుగు, నాలుగు, మరియు రెండు మాత్రలు అయినప్పటికీ, కర్షణలో అది ఐదు మాత్రల కాలప్రమాణానికే కుదురుతుంది" అంటారు చంద్రమౌళి. 'మాత్రానిబద్ధమైన సీస పద్యం రెండు పంక్తులను గాని, ఆటవెలదిని గాని పాడుతున్నట్టే ఉంటుంది. ఈ నాల్గు పంక్తుల పద్యం' అని వివరించారు చంద్రమౌళి. ఈ పద్యాలు చివరన 'మంకుతిమ్మ' అనే మకుటంతో ఉంటాయి.

'మంకు తిమ్మనకగ్గ'ని కన్నడపు 'భగవద్గీత' అంటారంటే ఇదేదో అసలు భగవద్గీతలా జ్ఞాన, భక్తి, కర్మ, షట్కాలుగా విభజితమై, ఒక్కో షట్కంలో ఆరు అధ్యాయాలు ఉన్నట్లు ఉండవు. ఇవి జ్ఞాన, భక్తి, కర్మ, యోగాలను బోధించవు కూడా. కాని ఈ పద్యాలలో ఒక వైచిత్రి కనిపిస్తుంది. ఇవి వేమన, సుమతి శతకాలులా నీతిని బోధించవు. శైలి విషయంలో ఇంతకు ముందు తెలుగులో కానీ, ఏ ఇతర భాషల్లో కాని ఇటువంటి శైలిలో ఉన్న పద్యాలు, ఎవ్వరూ రాసి ఉండలేదు. అందుకు అనేక కారణాలు లేకపోలేదు. ఒకటి, తెలుగునాట కవితా సరళి ఛందోబద్ధమైన సంప్రదాయ సాహిత్యం నుంచి వచన కవిత్వం వైపుకు దాదాపు ఒక శతాబ్దం క్రిందనే కుందటం జరిగింది. ఇవాళ వచన కవితలు రాసే వారిలో నూటికి పది మందికి కూడా గత సాహిత్యంలోని పద్యాల ఛందస్సుపై పట్టు లేదు. భావమే ప్రధానంగా కుందుర్తి వారి వచన కవిత్వం నుంచి నేటి 'నానీ'ల వరకు కవితా సామ్రాజ్యం

పరిఢవిల్లుతోంది. గతంలో కూడా మనకు సాహిత్యంతో పరిచయంలో ఉన్న బహుముఖ ప్రజ్ఞాశీలులైన రచయితలు, పత్రికా సంపాదకులు, రాజకీయ వేత్తలు ఎందరో ఉన్నారు. కాని వారెవ్వరికీ గుండప్ప గారిలా ఇలాంటి పద్యాలలో కవితా వ్యాసంగం చేయవచ్చునని ఎందుకు అనిపించలేదో అర్థం కాదు. కాని గుండప్ప గారి ఈ 'మంకు తిమ్మనకగ్గ'లో పద్యాలు చాలా విచిత్రంగా ఉంటాయి. ఈ పద్యాలన్నీ గుండప్ప గారి స్వీయ చరిత్ర నుంచే ఉద్భవించినవి కావు. అలా అని అవి ఆయన చుట్టున్న ప్రపంచం ఆవలి వైపువీ కావు. తన చుట్టూ పరిభ్రమించే ప్రపంచంలో జరుగుతున్న వాటిని నిశితముగా గమనిస్తూనే, వాటిల్లోంచి ఆయన తన భావాలను, నూతనార్థాలను వెలికి తీసినట్లు అవగత మవుతుంది. ఉదాహరణకు ఈ పద్యము చూడండి. బుద్ధి ప్రకాశమున నంతర భవశోధ, సిద్ధమా శోధనన్ సత్య సంవీక్ష" శుద్ధ సత్యము జీవిత ప్రశ్నకొదవంగ పద్ధతియె ధర్మమురా – మంకుతిమ్మ. ఇలా ఒక బాహ్య ప్రపంచానికి, అంత: ప్రపంచానికి మధ్య ఒక ఇంటర్‌ఫేస్‌లో జరిగిన సంఘర్షణ నుంచి ఉద్భవించిన సామాజిక తాత్విక కవిత్వం ఇది. అలాగే ఇంత బాహ్యాంతరములన్య లోకములు కావంతరంగమునందు సంతసందడిలా, సంతలోను యంతరంగమది వినిపించు స్వాంతమిరు వైపులవి – మంకుతిమ్మ".

ఈ పద్యములోని ప్రతి పదానికి లౌకిక అర్థము, వ్యాఖ్యానము ఉన్నది. అలానే పారమార్థిక అర్థం, వ్యాఖ్యానం ఉన్నది. "రాజ్యపాలన, పాలకుడి పాలన విశ్లేషణను చేయవలసివస్తే పరిశుద్ధమైన ప్రభుత్వం కానీ రాజ్యకారణము కాని సంభవం కాదు. ఎంతో కొంత లోటు పాట్లు ఉండి తీరతాయనే" అంటారు గుండప్ప. "యుద్ధమైనను, రాజ విద్యయైనను, శాస్త్ర వృద్ధియైనను, నరుని తలవ్రాత మిగులు, "క్షుద్ర కార్పణ్యాల న్యాయముల వంతింత, వద్దనుండును మనకు – మంకుతిమ్మ". జ్ఞాన, కార్పణ్యంల చాటున కొంత వంచన, స్వార్థము అనే క్షుద్రమైన భావాలు ఇంతో అంతో పాలకులలో మిగిలి ఉంటాయనే సత్యాన్ని గుర్తించాలన్నది దాని సారాంశం. అంటే ఏ పాలకుడు ఏనాడు, ఎప్పుడూ నూటికి నూరుశాతం న్యాయబద్ధంగా వ్యవహరించడన్నది ఆయన చెప్పకనే చెప్పారు. ఆనాటి రాష్ట్ర పాలకులు కొంత మంది తమకు తాము న్యాయమైన పాలకులుగా చెప్పుకొంటున్న సందర్భంలో రాసిన పద్యం ఇది. గుండప్ప గారు హిందూ, స్వరాజ్య, మచిలీపట్టణం మొదలైన అనేక పత్రికలకు అర్థము (ఎకనామిక్స్) ధర్మము (రైట్యూవస్‌నెస్), రాజకీయము (కాజ్ ఆఫ్

రూలర్స్ ఏక్షన్), సాహిత్యం (లిటరేచర్) వంటి విషయాలపై వ్యాసాలు రాసేవారు. ఈ కాలంలో రాసిన పద్యాలలోనిదే పైన ఉటంకించిన పద్యం.

'ఏ సమస్య అయినా సరే, పక్షపాత దృష్టిని వదిలి, ఉద్వేగ రహితంగా ఆ సమస్యకి సంబంధించి అన్ని కోణాల్ని పరిశీలించి జాతికి మేలు చేసే దృష్టితో దానికి పరిష్కారం కనుగొనడం గుండప్ప విలక్షణ పాత్రికేయ పాత్ర' అని అంటారు చంద్రమౌళి. ఒకానొక సందర్భంలో గుండప్ప గారికి నాటి మైసూర్ దివాణంలో మంత్రి పదవి ఇస్తామని ఆశ చూపినా, మృదువుగా దానిని త్రోసిపుచ్చిన త్యాగశీలి ఆయన. ఆ సందర్భంలోనే నాటి రాజకీయ స్థితి గురించి వారొక అద్భుత పద్యం రాశారు. అది నేటి రాజకీయ వ్యవస్థకు కూడా అద్దం పడుతుంది. "దొరతనమే నావనిరుప్రక్కలును సుడితెరలు, సుధగ్రోలి కొందరోడను నడుపు చొరగ, ఒంపిడి తుఫాను లిడజనుల్లెలలేచిపడ, పొరలి పడదదె వింత – మంకుతిమ్మ". ఒకానొక సందర్భంలో కర్ణాటక నాటి ముఖ్యమంత్రి దేవరాజు అర్సు గుండప్పకి నెలవారి గౌరవ వేతనం ఇవ్వడానికై నిర్ణయం చేశారు. అయితే గుండప్ప దానిని సున్నితంగా తిరస్కరించారు. ఆ తిరస్కారం ఎలా ఉందో ఈ పద్యంలో చూడండి. "నూకలంబలి గుడిచి తృప్తిగా మనుచున్న కాకి దొంగిలి తిండి చూసి మత్సరమా, నూకునాకలిని తినిన తిండదేమైనను నీకేల తలవంపు? – మంకుతిమ్మ". తలవంపు లేక కష్టపడి గడించి అంబలి త్రాగినా మేలే కాని మృష్టాన్నం కోసం ఆత్మాభిమానాన్ని చంపుకోకూడదు అన్నది ఈ పద్యం సారాంశం.

ప్రతి పద్యం చివర 'మంకుతిమ్మ' అనే మకుటాన్ని బట్టి ఈ 'మంకుతిమ్మ'కు గుండప్పకు ఏదో సంబంధం ఉండి ఉంటుందనే తోస్తుంది. స్వయంగా గుండప్ప తన 'మంకుతిమ్మనకగ్గ'లో ముందు భాగంలో ఒక కథ తెలిపారు. ఈ కథలోని 'మంకుతిమ్మ' అనే ఉపాధ్యాయుడు, గురువు గుండప్పకు వరుసకు 'మేనమామ' అని 1943లో ప్రకటించారు. నిజానికి ఆయన మేనమామ అవునో కాదో తెలిసిన వారెవ్వరూ లేరు. కానీ ఆయన 'కగ్గపు కథ' అని ద్విపదలో రాసిన కవితలో ఈ "మంకుతిమ్మడు" ఒక ఉపాధ్యాయుడిగా, గొప్ప తాత్వికుడిగా దర్శనమిస్తాడు. ఈ ద్విపద ఇలా నడుస్తుంది. "పిల్లలందరికిను గురువు పల్లెటూరి చెలిమియు, చల్లనైన బాపనోడు 'గోవు', 'శిశువు' అందురు. మంకుతిమ్మడనుచు వారి పేరు చెప్పుకొనుచు కొంకు బిడియమేమి తెలియలేని సాధువైన, బ్రతుకిదేలయనుచునెప్పుడు

తనను తానె యడుగును, గదుకు చున్న పీనుగిదని నగుచు తానే చెప్పును, బెదురు లేక వాని జూసి చుట్టుకొనుచు పిల్లలు ముదము, చనువుతోడ వారు మాస్టారని పిలుతురు, మూడపల్లి చుట్టుపక్కనైదుమైళ్ళ పిల్లలు కూడి వచ్చి తిమ్మ గురువు వద్ద చదువుకొందురు" ఇలా 'మంకుతిమ్మ' అనే ఆదర్శగురువు ఒకరు గుండప్ప జీవితానికి కవితా రచనకు ప్రేరణగా ఉన్నట్టు మనకు తెలుస్తోంది.

'మంకు తిమ్మనకగ్గ' కావ్యాన్ని 'మనన కావ్యం'గా పేర్కొన్నారు గుండప్ప. ఇదో కొత్త రకం కావ్యం. ఇందులోనూ అలంకారాలు, శబ్ద ప్రయోగాలుంటాయి. పఠించే పాఠకులకు సాధారణ లౌకిక జ్ఞానం ఉంటే చాలు సులువుగా బోధపడతాయి. పండితులైన వారికి తత్వదర్శనం కూడా అవుతుంది. ఏ కవి లక్ష్యమైనా లోకాన్ని పామరులకు అర్థమయ్యే రీతిలో కావ్యదర్పణంలో చూపటమే కదా! ఆ పనే చేశారు గుండప్ప. అంతేగాదు, గుండప్ప తన దేహాన్ని చాలించే ముందు జీవన సాఫల్యంగా మరో వేయి పద్యాలు రాశారు. దీన్ని 'మరుళమునియన కగ్గ' అని ప్రచురించారు. వీటిని కూడా చంద్రమౌళీ ఆంధ్రీకరించారు.

చంద్రమౌళి కూడా బహుముఖ ప్రజ్ఞాశాలి. పలు భాషల్లో పాండిత్యం ఆయన కొకవరమైతే, సంగీతంలోని ఆయన అభిరుచి ప్రత్యేకంగా ఒనకూడిన మరో వరం. ఆయన 'ఘంటశాల–గానశాల' అనే మకుటంతో అంతర్జాలంలో ఘంటశాల వారి సంగీత సంయోజన పద్ధతిలోని సూక్ష్మాలను, స్వారస్యాలను సుదీర్ఘమైన వ్యాసాల ద్వారా ధారావాహికంగా ప్రకటించారు. అత్యంత శాస్త్రబద్ధమైన ఈ వ్యాసాల పరంపర మరే గాయని/గాయకుని గూర్చి చరిత్రలో ఎవ్వరూ రాసి యుండలేదు అంటే అతిశయోక్తి కాదు. 'మంకు తిమ్మనకగ్గ'లోని గుండప్ప కన్నడ పద్యాలు, అందులోని విషయం, వస్తువు, వర్ణ, చెప్పిన తీరు, వాటిని చంద్రమౌళి యథాతథంగా తెలుగులోకి అనువదించిన విధానం అనువాద సాహిత్యంలోనూ, మనన సాహిత్యంలోనూ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాయి. అనువాద సాహిత్యంలో ఇది చిరకాలం నిలిచిపోతుంది.

(ఆంధ్రజ్యోతి వివిధ దినపత్రిక జూన్ 6, 2022)

9
'బ్రతుకు బాటలో కొండ గుర్తులు' - భద్రిరాజు

'ఉంటాడు' 'ఉండదు', 'పంటాడు' ' పండదు' అనే క్రియా పద ప్రయోగాలలో తొలి రూపం, వ్యతిరేక రూపం ఒక క్రమ పద్ధతిలో ఉన్నట్టు గమనిస్తాం. అలానే 'కంటాడు', 'కనదు', 'తింటాడు', 'తినదు' అంటామే గాని 'కంటాడు', 'కండదు', 'తింటాడు' 'తిండదు' అని వ్యవహరించం ఎందుకని? ఈ ప్రశ్న 1970 దశకంలో ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు వేసినప్పుడు చాలా మంది నోరు వెళ్ళ బెట్టేవారు (అలాంటి వారిలో ఈ వ్యాసకర్త కూడా ఉన్నాడు). నిజమే, అలా అని మనం ఎందుకనం? మనం మాట్లాడే భాషకు వ్యాకరణ సూత్రాలు ఏమీ ఉండవా? లేవా? అంటే మనం మాట్లాడే వ్యావహారిక భాష వ్యాకరణాతీతమా లేక వ్యాకరణ రహితమా?

1970లో చాలా మంది తెలుగు వారికి తెలిసినదేమిటంటే తెలుగు భాషా వ్యాకరణమంతా బాలవ్యాకరణ పరిధిలోనే ఉంటుందని. మహాఅయితే బహుజనపల్లి సీతారామాచార్యులు రాసిన ప్రౌఢ వ్యాకరణ పరిధిలో ఉండొచ్చు. కాని, కృష్ణమూర్తి గారు లేవదీసిన వ్యాకరణాంశాలు వ్యవహార భాషలో ఎలా అంతర్లీనంగా ఉంటాయో చాలా మందికి తెలియదు. ఈ ప్రశ్నలకు కృష్ణమూర్తి గారి సునిశిత పరిశోధనలే అద్భుతమైన జవాబులు ఇచ్చాయి. భాషా వ్యవహర్తల్లో అంతర్లీనంగా ఉన్న వ్యవహార యోగ్యతా నియమాల సంపుటినే భాషా శాస్త్రవేత్తలు వ్యాకరణంగా ఆవిష్కరిస్తారు. అంటే భాషలో ఉన్న నియమాలు లేదా సూత్రాలు అజ్ఞాతంగానే వ్యవహర్తల మనస్సుల్లో ఉంటాయి. ఇలా భాషా వ్యవహర్తల

భాషలోని అంతర్లీన భాషా వ్యాకరణం, దానిని వివరించేందుకు చేసే సమగ్ర ప్రయత్నాన్ని బహిర్గత వ్యాకరణంగాను భద్రిరాజు కృష్ణమూర్తి వివరించేవారు. గతంలోని తెలుగు వ్యాకరణాలు, 'పదాల రూప నిష్పత్తిలోనే' ఆగిపోతాయి అని తేల్చారు భద్రిరాజు కృష్ణమూర్తి తన పుస్తకం 'భాష-సమాజం- సంస్కృతి' గ్రంథంలో. ఇలాంటి సూక్ష్మ విశ్లేషణలతో తెలుగు భాషకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన మహా మేధావి, భాషాశాస్త్రజ్ఞుడు, సాహితీవేత్త ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి.

జూన్ 19, 1928 భద్రిరాజు కృష్ణమూర్తి ఒంగోలులో భద్రిరాజు సుబ్రహ్మణ్యం, భరతమ్మ దంపతులకు జన్మించారు. అత్యంత అల్పాదాయం ఉన్న శ్రోత్రీయ కుటుంబంలో జన్మించిన కృష్ణమూర్తి గారికి ముగ్గురు అక్కలు ఉండేవారు. ఆర్థిక స్థితిగతుల కారణంగా తన సోదరీ మణులు గౌరవప్రదమైన స్థాయి చదువుకు నోచుకోలేకపోయారని కృష్ణమూర్తి గారు ఎంతో ఆవేదన వ్యక్తం చేశారు తన ఆత్మకథ 'బ్రతుకుబాటలో కొండ గుర్తులు'లో. కృష్ణమూర్తి గారి విద్యాభ్యాసం పాఠశాల స్థాయి విద్య నుంచి యూనివర్శిటీ స్థాయి వరకు ఎన్నో కఠినమైన ఆర్థిక ఒడుదుడుకుల మధ్యనే సాగింది. తెలుగులో సహజంగానే అబ్బిన సంస్కారం వలన, భాగవతుల మార్కండేయ శర్మ వంటి బహు భాషాకోవిదుల శిక్షణలో త్వరలోనే కృష్ణమూర్తి గారు తెలుగు సాహిత్యంపై పట్టు సాధించారు. పాఠశాల స్థాయిలో ఉండగానే ఛందోబద్ధమైన పద్యాలను రచించడం ప్రారంభించి 15వ ఏటికి అష్టావధానాలు చేసే స్థాయికి ఎదిగారు. అలా వారి బాల్యం నుంచి సాగిన కవితా వ్యాసంగం కౌమార స్థితి ద్వారా వారు ఆంధ్రా యూనివర్శిటీలో ట్యూటర్‌గా చేరే వరకూ నిరాఘాటంగా సాగింది. ఆ కాలంలోనే వారు రాసిన కవితలు, కావ్యాలు, పంచరత్నాలు 'చిన్ననాటి పద్యాలు'గా వెలుగు చూశాయి.

బి.ఎ.ఆనర్సు చదువుతున్నప్పుడు అక్కడ లైబ్రేరియన్‌గా ఉన్న ప్రముఖ కవి అబ్బూరి రామకృష్ణారావు సాన్నిహిత్యం ఆయన దృష్టిని సాహిత్యం వైపు నుంచి భాష వైపుకు మరల్చింది. ఈ కాలం ఆయన జీవితంలో ఒక రకమైన పరిణామశీలమైన కాలం. చాలా కీలకమైనది. సాహిత్యంలో అనేక మంది దిగ్గంతులైన వారి సహచర్యం ఆయనను భాషనా, సాహిత్యమా అనే మీమాంసంలో కొంత కాలం నెట్టింది. "పైకి ఇసుక విసిరితే నేల మీద పడనంత

మంది కవులున్నారు తెలుగునాట. కాని ఒక్క భాషావేత్త ఈ నేలపైన లేడు కృష్ణమూర్తి, ఆలోచించు. నువ్వు ఏ తీగ నెగ్రాకితే ఒక్కడిగా అందరికీ అతీతుడిగా నిలుస్తావో" అన్న అబ్బూరి రామకృష్ణారావు మాటల్ను ఆయన అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన భాషా శాస్త్రవేత్తగా రూపాంతరం పొందాక కూడా చివరి వరకూ స్మరిస్తూనే ఉన్నారు.

కృష్ణమూర్తి గారు భాషను తన పరిశోధనాంశంగా బి.ఏ.ఆనర్సులో ప్రత్యేక అంశంగా మలుచుకొనడానికి మరో ముఖ్య కారణం నాటి ఆంధ్రా యూనివర్శిటీలో ఎంతో పేరు ప్రఖ్యాతులున్న ఆచార్య గంటిజోగి సోమయాజి గారు. వారి దర్శకత్వంలో భద్రిరాజు వారు తొలుత తెలుగు భాషాచరిత్ర, ద్రావిడ మూలాలపై దృష్టి సారించారు. అప్పటికే సోమయాజి, కోరాడ రామకృష్ణయ్య వంటి కృషి వల్ల ఆంధ్ర - ద్రావిడ అధ్యయనాల్లో కొంత మార్గం సుగమమైంది. "దానిని గట్టి పరచడమే కాదు, అంతర్జాతీయ ప్రమాణాలతో దానిపైన ఒక భవ్యమైన కట్టడం కట్టే భాగ్యం భద్రిరాజు వారికి దక్కింది" అంటారు ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ. బి.ఎ ఆనర్సు 1948లో పూర్తి కాగానే, గుంటూరు హిందూ కాలేజీలో ఒక సంవత్సరం పాటు స్పెషల్ ట్యూటర్‌గా పని చేసి, 1949లోనే ఆంధ్రా విశ్వ విద్యాలయంలో అధ్యాపకులుగా చేరారు. నాడు ఆంధ్ర విశ్వ విద్యాలయం తాత్కాలికంగా గుంటూరు మార్చారు రెండవ ప్రపంచ యుద్ధ కారణంగా. ఆ సమయంలోనే సోమయాజి గారి దర్శకత్వంలో 'తెలుగు క్రియ ధాతు స్వరూపం' మీద పరిశోధనలు మొదలు పెట్టారు కృష్ణమూర్తి గారు. ఈ కాలంలోనే దాదాపు 1250 తెలుగు ధాతువులు సేకరించి వివరణలు రాసుకొన్నాను. ఈ ధాతువులూ, శబ్దాలు, ఇతర భాషా శబ్దాలతో పోల్చి చూసుకోవడం అనేది ప్రతి రోజు ఏ పనిలో ఉన్నా చెయ్యడం ఒక అలవాటుగా మారిపోయింది కృష్ణమూర్తి గారికి

భాషా శాస్త్రాధ్యయనం కోసం అమెరికాలోని పెన్సిల్వేనియా యూనివర్శిటీకి వెళ్లారు. తెలుగులో భాషాధ్యయన కోసం అమెరికా వెళ్ళింది కృష్ణమూర్తి గారే. ఆ రోజుల్లో ఇది ఒక వింతగ పలువురు వ్యాఖ్యానించారు. 1955లో ఎం.ఏ చేశారు భాషా శాస్త్రంలో, ఆ తర్వాత అమెనో గారి వద్ద యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా (బెర్క్‌లీ క్యాంపస్)లో తెలుగు ధాతువుల తులనాత్మక పరిశోధన అనే అంశంపై పరిశోధన చేసి ఒక సంవత్సరంలోనే పి.హెచ్‌డి

పట్టాను పొందారు. 1961లో కాలిఫోర్నియా యూనివర్శిటీ దీనిని 'తెలుగు వెర్బల్ బెసిస్: ఎ కంపారటివ్ అండ్ డిస్క్రిప్టివ్ స్టడీ' పేరుతో అచ్చు వేసింది. తొలుత అమెరికా వెళ్ళడానికి ఫుల్ బ్రైట్‌స్కాలర్‌షిప్పు లభించినా, అది కేవలం అమెరికాలో ఒక సంవత్సరం ఎం.ఏ భాషా శాస్త్రం చేయను మాత్రమే సరిపోయింది. అయితే పి.హెచ్‌డికి ముర్రె బి అమెనో గారి సిఫార్సు మేరకు వెంటనే రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ వారి స్కాలర్‌షిప్ అందుబాటులోకి రావడం చాలా గొప్ప మేలు చేసింది కృష్ణమూర్తిగారి కృషికి. ఆచార్య గంటి సోమయాజి గారి దర్శకత్వంలో 1949లో ప్రారంభించిన తెలుగు క్రియాధాతువుల పరిశీలన 1956 నాటికి ఒక స్థాయికి రావడంతో కేవలం సంవత్సర కాలంలోనే అమెనో గారి దగ్గర పిహెచ్‌డి పూర్తి చేయడానికి తోడ్పడింది. అంటే కృష్ణమూర్తి గారికి ఎం.ఎ, పిహెచ్‌డి పెన్సిల్వేనియా విశ్వ విద్యాలయం ప్రదానం చేసింది. అలాగే వారి అతి ముఖ్య విదేశీ గురువులు ఇద్దరు పెన్సిల్వేనియాలో చదివేప్పుడు హెన్రీ హొనింగ్ స్వాల్డ్, హ్యారీలు. కాలిఫోర్నియాలో ముర్రె బి అమెనో ఒక్కరు మాత్రమే.

కృష్ణమూర్తిగారి 'తెలుగు వెర్బల్ బెసిస్: ఎ కంపారటివ్ ద్రవిడియన్' గ్రంథం 1961లో కాలిఫోర్నియా విశ్వ విద్యాలయంలో అచ్చయి, బాహ్య ప్రపంచంలోకి అడుగు పెట్టాక అప్పటికి వందేళ్ల నుండి చెలామణిలో ఉన్న బిషప్ కాల్డ్‌వెల్ గ్రంథం మొదటి సరిగా సంపూర్తిగా పరాస్తమైంది. ఆ తరువాత వారి గురువులు, 1945 తరువాత ప్రధాన గురుస్థానీయులు అయిన బరో, ఎమినో గారలు సంయుక్తంగా రూపొందించిన 'ద్రవిడియన్ ఎటిమలాజికల్ డిక్షనరీ' (డి.ఈ.డి : ద్రవిడ భాషల అధ్యయనానికి సర్వో త్కృష్టమైన ఆకర గ్రంథం) కి కృష్ణమూర్తిగారి సిద్ధాంత గ్రంథం ముఖ్య ఆధార గ్రంథాలలో, మాదిరి గ్రంథాలలో ఒకటైందంటే కృష్ణమూర్తి గారి కృషి ఎంత మౌలికమైందో ఇట్టే ఊహించవచ్చు. ఆ పరిశోధన ప్రచురణతో ద్రవిడ భాషాధ్యయనంలో మూర్తిత్రయం (బరో, ఎమినో, కృష్ణమూర్తి)లో ఒకరుగా తిరుగు లేని స్థానం పొందారు అని అంటారు ఆచార్య గంగిశెట్టి లక్ష్మినారాయణ గారు. చేకూరి రామారావు గారి మాటల్లో తెలుగు భాషా శాస్త్ర అధ్యయనంలో మూడే అధ్యాయాలు ఉన్నాయి : 1) కృష్ణమూర్తి గారి పూర్వ యుగం, 2) కృష్ణమూర్తి గారి యుగం, 3) కృష్ణమూర్తి గారి అనంతర యుగం.

అంతేగాదు, కృష్ణమూర్తి గారి తెలుగు, క్రియాధాతు పరిశోధన వైశిష్ట్యం అంతా అమెరికాలో వారు భాషా శాస్త్రం చదివాకనేనన్న అపోహ కూడా కొందరి రచనల్లో కనిపించేది. నిజానికి కృష్ణమూర్తి గారు అమెరికాకు ఉన్నత విద్యలకు వెళ్ళక ముందు భాషా శాస్త్రపరంగా అద్భుతమైన పరిశోధనలు కావించారు. అవి అప్పట్లో ఆంధ్ర పత్రిక యాజమాన్యంలో నడిచే 'భారతి' పత్రికలో అచ్చయినాయి. కొన్ని 'త్రిలింగ' అనే పత్రికలో అచ్చయినాయి. అందులో ఈ నాటికీ రచయితలకు, తెలుగు వ్యవహర్తలకు (ముఖ్యంగా గ్రామ్యాన్ని వ్యవహారికంతో మిళితం చేసే రాజకీయ నాయకులకు వర్తించేది) ఒక ముఖ్యమైన పరిశోధన షష్ఠివిభక్తి 'యొక్క' విచారణ. ఇది 1951లో 'త్రిలింగ'లో అచ్చయింది.

తెలుగు శాసనాలల్లో పదిహేనవ శతాబ్ది దాకా 'యొక్క' ప్రయోగం కనిపించదు. పదిహేను తర్వాత చాలా వచన రచనలలో దీని ప్రయోగం కనిపిస్తుంది. (పండితారాధ్య చరిత్ర, 1-89 పేజీల్లో) : 'అవిరళ సూక్త భాష్యార్థ మెట్లనిన హేరుద్ర యానగ తానో రుద్రయానుట వారక మరియున్, దవ ప్రణితా వనంగన్ బూర్వార్ధ మనంగ నీ **యొక్క** సంగతి లింగ పూజ వేళయందు'. ఈ పద్యంలో సంస్కృత శబ్దానికి అర్థ వివరణలో 'యొక్క' ఏకైక ప్రయోగం కనిపిస్తుంది. (పండితా. ఉపో.232). దీనిని బట్టి షష్టివిభక్తికి తెలుగులో వివరణ ఇచ్చేప్పుడు 'యొక్క' ప్రాచీన కాలం నుంచి పండిత వ్యవహారంలో ఉన్నట్లు తెలుస్తుంది. విశ్వనాథ నాయకుని (1520) '*రాయ వాచకం*'లోనూ, '*బాల సరస్వతీయం*'లోనూ ఈ విభక్తి ప్రయోగం తరచుగా కనిపిస్తుంది. అర్వాచీన రచనలో ఇంకా దీని వాడుక పెరిగిందనే చెప్పుకోవాలి. ఈనాటి రాజకీయ నాయకులు, ఇతర వక్తలు కూడా, 'ఈ యొక్క', 'ఆ యొక్క' అని వ్యవహరిస్తుంటారు. అయితే కృష్ణమూర్తి గారి పరిశీలనలో వెల్లడైన మూడు సూత్రాలలో మూడవది చాలా ప్రధానమైంది. మొదటి రెండు సూత్రీకరణలు 'యొక్క' ప్రయోగం ఎప్పట్నించి ఆరంభం అయింది, ఎలా వాడుకలోకి వచ్చింది తెలిపితే మూడవది కావ్య భాషలో ఎవ్వరూ, ఎప్పుడూ, ఎక్కడా దీనిని వాడకపోవడం. "అంటే 'యొక్క' వాడుక తెలుగు భాష మాట్లాడటానికి గాని, రాయడానికి గాని అనవసరమనీ, మన నుడి కారానికి సరిపడదని, కేవలం సంస్కృత పండితులు తెలుగు పాఠం చెప్పేటప్పుడు దీనిని అవసరమని గ్రహించవచ్చు" అంటారు భద్రిరాజు కృష్ణమూర్తి. అంతటితో దీనిని వదలేయలేదు. ఏ

లక్ష్యం లేకుండా లక్షణం రాసినది ఈ 'యొక్క' ఒక్కటే కావడానికి కారణాలను చీల్చి చెండాడారు కృష్ణమూర్తి.

అలాగే 1953-54లలో 'సంస్కృతి' పత్రిక సంపుటాలలో ప్రచురించిన 'తెలుగులో 'ఱు' కార పరిణామం అనే వ్యాసం. తులనాత్మకంగా ప్రాచీన ద్రావిడానికి ప్రత్యేకమైన 'ఱు' కారం తెలుగులో, ఇతర భాషలో పొదిన పరిణామాన్ని చాలా విపులంగా, శాస్త్రీయంగా నిరూపించారు కృష్ణమూర్తిగారు. ఈ పరిశోధన కొత్తతరం ద్రావిడ భాషా విజ్ఞానుల్లో, కృష్ణమూర్తి గారికి ఒక పదిలమైన స్థానాన్ని సంపాదించి పెట్టింది. ఆ కృషి అప్పుడు ఈ దేశం క్షేత్ర పరిశోధనలో ఉన్న బర్రో గారి దృష్టిని ఆకర్షించింది. అమెరికాలో పరిశోధనకు ఆయన కృష్ణమూర్తి గారిని ప్రోత్సహించారు. "ద్రావిడ వర్ణ విజ్ఞానంలో, ముఖ్యంగా ధాతువులలోని అచ్చుల హ్రస్వ దీర్ఘతల వైకల్పిక నియమాలను ఆవిష్కరించడంలో భద్రిరాజు వారిదే తుది తీర్పు. అలాగే ఇ/ఎ, ఉ/ఓ లు ఎందుకు మార్పు చెందుతున్నాయి? ఆ వైకల్పికతకు కారణమేమిటి ? అనే అంశంపై ఎంతో మంది భాషా శాస్త్రవేత్తలు చర్చించినా, పరిష్కారం లభించని స్థితిలో నికరమైన సూత్రీకరణలు కృష్ణమూర్తి గారే ఇచ్చారు", అంటారు ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ గారు. తమిళ, మలయాళ పదాలలో 'అ'కారం ముందున్న 'ఇ/ఉ ' లే ప్రాచీన రూపాలనే దుష్ట ప్రతిపాదనను శాస్త్రీయంగా ఖండించారు భద్రిరాజు వారు. తెలంగాణ మాండలికంలో గది, గిది, గిట్ల వంటి రూపాలలో పదాదిలో వచ్చే 'గ'కారానికి మూల కారణమేమిటి విశ్లేషించారు 'తెలుగు మాండలికాలు - కరీంనగర్ వాడుక' అనే వ్యాసంలో. ఇది 'భాషా-సంస్కృతి-సమాజం' పుస్తకంలో అచ్చయిన వ్యాసం. ఇందులో అనేక శబ్ద పరిణామాలు నేటికీ ఆమోదమైనవే తప్ప వాటికి ఉల్లంఘనలు ఎవరూ కనుగొనలేదు.

శాసన భాషా శోధన కృష్ణమూర్తి గారి పరిశోధనాంశాలలో అత్యంత కీలకమైంది తెలుగు శాసన భాషా శోధన. బూదరాజు రాధాకృష్ణ, కె.కె.రంగనాథాచార్యులు, ఎం.కందప్పచెట్టి గారలు తెలుగు శాసన భాషపై కృష్ణమూర్తి గారి దగ్గర పరిశోధన చేసిన ప్రముఖులు. కృష్ణమూర్తి గారితో శాసన భాషల విషయమై చర్చించడానికి అప్పట్లో కేంద్ర

వాణిజ్య మంత్రికి సెక్రటరీగా ఉన్న ప్రముఖ ఇండాలజిస్టు ఐరావతం మహదేవన్ తరచూ వస్తుండేవారు (1975–77 మధ్య). అలాగే 1978–83 మధ్యలో కామిశెట్టి శ్రీనివాసులు, డైరెక్టర్ అన్నమాచార్య ప్రాజెక్టు, కూడా అన్నమయ్య పదాలపై సందేహాలు తీర్చుకోవడం కోసం తరచూ కృష్ణమూర్తి గారిని దర్శించేవారు.

'అరకు లోయకు ఆంధ్రతో సంబంధం' పరిశోధన కృష్ణమూర్తి గారి క్షేత్రస్థాయి పరిశోధనలకు పతాక స్థాయిగా చెప్పవచ్చు. అరకు లోయలో బతక, కోట్య, కొండదొర, సామంతు వంటి ఎన్నో ఆదివాసీ తెగలున్నాయి. వాళ్ళు మాట్లాడే 'కొండ' లేక 'కూబీ' భాషను పరిశోధించి వారి భాషకు 23 అక్షరాలతో వర్ణమాలను తయారు చేశారు కృష్ణమూర్తి. ఈ భాష ప్రధాన లక్షణాలను ప్రదర్శించి తెలుగుతోనూ, మిగిలిన ముఖ్య ద్రావిడ భాషలతోనూ పోల్చి చూపారు. నన్నయ్యకు పూర్వపు తెలుగు శాసనాల్లో కనిపించే 'వాన్టు, 'మూన్టు' వంటి శబ్దాలు '9వ శతాబ్దం నాటికే 'వాణ్డు, మూణ్డు' గా మారి, నన్నయ్య కాలానికి వాడు, మూడుగా రూపొందాయి అని నిరూపించారు. కొండ భాషలో ఇప్పటికీ మన ప్రాచీన రూపాలకు దగ్గరైన 'న్ట' సహిత రూపాలు ఉచ్చారణలో ఉన్నాయి. సమగ్ర ద్రావిడ భాషా చరిత్ర రాయడానికి అనాగరిక భాషా సామాగ్రి ఎంతో అవసరమన్నది ఆయన పరిశోధనల ద్వారా నిరూపించారు. కృష్ణమూర్తి గారి పరిశోధనల్లోని కొన్ని విలక్షణ ఉదాహరణలు మనల్ని నవ్విస్తాయి కూడ. మధురమైన వాక్కు, ఛమక్కులు, గంభీరమైన కంఠం, అద్భుత మూర్తిమత్వం కలబోస్తే మన కళ్ళ ముందు నిలిచే రూపమే ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి. ఆయన ప్రసంగిస్తుంటే అదేదో పాఠం చెబుతున్నట్లు, మనం వింటున్నట్లు ఉండదు. ఆహూతుల్లో మొదటి వరుస వారు, చివరి వరుస వారు అంతే హాయిగా, ఆసక్తిగా, ఆయన ఛలోక్తులను ఆస్వాదిస్తూ వినడం ఈ రచయిత ఎన్నో సందర్భాల్లోను దర్శించిన ఒక గొప్ప విషయం. ఒకసారి ఒకానొక సందర్భంలో కృష్ణమూర్తి గారు మనుషులు ఎలా సౌలభ్యం కోసం మాటల అర్థాలను పరిమితం చేసుకొంటారు వివరించే కొన్ని ఉదాహరణలు చెప్పారు. 'టీచర్' అనే మాటకు ఆడ – మగ ఎవరైనా ఉపాధ్యాయులు కావచ్చు. కాని బడి పిల్లలు టీచర్ అనే శబ్ద ప్రయోగాన్ని ఆడ 'టీచర్'కే పరిమితం చేస్తారు. అలాగే 'పోట్లాట' అన్న మాట చాలా వరకు మాటలతో జరిగే సంఘర్షణగా ఇప్పుడు వాడుకలో ఉంది. కాని

ప్రాచీన కాలంలో అది 'పోటు'. కత్తి, ఈటె వంటి ఆయుధాలతో పొడుచుకోవడం అన్న అర్థంలో ఉండేది. భద్రిరాజు కృష్ణమూర్తి గారి వాదనల్లో వైయాకరణుల మీద సున్నితమైన చణుకులు పేలేవి. 'ఆవుపాలు' ను మనం 'ఆవు నుంచి తీసిన పాలు' అని చెబుతాము. మరి 'ఆవు నెయ్యి? – ఒక్కసారిగా జనం విరగబడి నవ్విన సంఘటన అది. అలాగే పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు తపాల శాఖ' అని తెలుగులో బోర్డుండేది ఆ రోజుల్లో (బహుశ ఇప్పుడు కూడా) నిజానికి 'టపాల్' అనేది తెలుగు పదం కాదు. కాని ఆశ్చర్యమేమంటే పోస్టల్ శాఖలోని దేనికీ తెలుగు పదం ఒక్కటీ నేటికీ లేదు. ఎంత మంది ఈ విషయం ఎప్పుడైనా ఆలోచించి ఉంటారు? మనీ ఆర్డరు, పోస్టుకార్డు, స్టాంపులు, వగైరా రిజిష్టర్డు లెటర్, పోస్ట్‌మాన్, పోస్ట్ మాష్టరు, రికార్డేడ్ డెలివరీ వగైరా. అలాగే ద్రవిడ భాషల్లో, ముఖ్యంగా తెలుగులో, ఉన్న వావివరుసలు ఏ ఇతర భాషల్లో ఉండవు – అన్న, తమ్ముడు, బాబాయి, పెదనాన్న, తాయ్య, ముత్తాత, పిన్నమ్మ, పెద్దమ్మ, చెల్లి, అక్క, అమ్మ, నాన్న ఇలా. అలాగే రెవెన్యూ శాఖలోని పదాలు కూడా. తెలుగు వారి పెండ్లి చాలా పాత వ్యవస్థ. ద్రావిడులు ఎవ్వరికీ 'సింహం' అనేది తెలియదు. 'వెయ్యి' అనే సంఖ్య వాచకం 'తెలుగు'లోనే ఉంది. హరప్పా, మోహెంజోదారో, సింధూ నాగరికత ద్రావిడనాగరికతేనని తెలుగు, తమిళ, మలయాళ రూపాలు ఆనాటి భాషలో ఉండేవని నిరూపించారు భద్రిరాజు.

తెలుగు అకాడమీ పునాదులు వేయటంలో భద్రిరాజు కృష్ణమూర్తి గారు నాటి ఖండవల్లి లక్ష్మీనిరంజనం, పింగళి లక్ష్మీకాంతం వంటి మహా మహులతో తన వంతు కృషి సల్పి శాస్త్రీయ ప్రాతిపదికన స్థూలంగా అకాడమీ ఏం చేయవలసి ఉంటుందో విధాన పత్రం రూపొందించారు. తర్వాత కాలంలో అదే తెలుగు అకాడమీకి మార్గ నిర్దేశం చేసింది. అలాగే 1985లో నాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు గారు తెలుగు విశ్వ విద్యాలయ స్థాపనకు పూర్వరంగంగా 'తెలుగు పీఠం'ను ఏర్పరచాలనుకొన్నారు. దాని రూపకల్పనలోనూ భద్రిరాజు వారు ప్రధాన భూమిక పోషించటమే గాక, ఆ దస్తావేజును శాస్త్రీయంగా రూపొందించటంలో కీలక పాత్ర నిర్వర్తించారు. దురదృష్టమేమంటే తెలుగు విశ్వ విద్యాలయానికి గాని, ద్రవిడ విశ్వ విద్యాలయానికి గాని తొలి ఉపాధ్యక్షులుగా ఆయన నియమితులు కాలేదు. చివరగా 1986లో భద్రిరాజు కృష్ణమూర్తిగారిని సెంట్రల్ యూనివర్శిటీ

హైదరాబాద్ ఉపాధ్యక్షులుగా నియమించారు. ఈ పదవిలో ఆయన 7 సంవత్సరాలు ఉండి సంస్థాభివృద్ధికి అవిరళ కృషి సల్పారు. చివరగా తెలుగు భాషకు 'ప్రాచీన భాషస్థాయి'ని కల్పించటంలోనూ, అంతేగాక తెలుగుకు, కన్నడకు, మలయళానికి కూడా ప్రాచీన భాష స్థాయిని కలిపించటంలోనూ వారి పాత్ర మరువలేనిది. భద్రిరాజువారి స్మారక సంచికలో డాక్టర్ జి.వి.పూర్ణచందు గారి వ్యాసం చదివితే తెలుగు జాతికి జీవితం చివరి అంకంలో గూడ ఆయన చేసిన సేవ, ఎదుర్కొన్న రాజకీయ సవాళ్లు మన హృదయాలను ఆర్ద్రం చేయక మానవు. తెలుగు భాషకు ప్రాచీన హోదా తేవటంలో పూర్తి శ్రమ భద్రిరాజు వారిదేననటంలో సందేహం లేదు.

భద్రిరాజు వారు భాషా, సాహిత్యాలకు చేసిన సేవలను, ఆయన విదేశాల్లో బోధించిన తెలుగు పాఠాలను ఒక్క వ్యాసంలో చెప్పడం సాధ్యం కాదు. ఆయన జీవితకాలం శోధనలతో ఒక సముద్రాన్నే సృష్టించారు. వాటినే ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి ముద్రణా సంస్థలు పుస్తకాలుగా తెచ్చాయి. ఎడింబరో విశ్వ విద్యాలయం ఫెలోషిప్, అమెరికన్ లింగ్విస్టిక్స్ సొసైటీ ఫెలోషిప్, స్టాంఫర్డ్ థింక్‌టాక్ ఫెలోషిప్‌లు ఆయన కీర్తి కిరీటంలోని కలికితురాయిలు. తన పద్నాలుగవ ఏట నుంచి, ఎనభయ్యవ పడి వరకు అటు తెలుగు భాషా సాహిత్యంపైన, ఇటు భాషాశాస్త్రంపైన అలుపెరగని కృషి సల్పిన ఈ మహామనిషి ఆగస్టు 11, 2012న తుది శ్వాస విడిచారు. భాషా వ్యాకరణంలో ధ్వనిపైన కృష్ణమూర్తి గారు ఎంతో కృషి సలిపి చివరకు ఈ విశ్వశబ్దంలోనే లీనమైపోయారు. ఆయన 'చిననాటి పద్యాల'లో 'మాతృ సందేశం' ఖండ కావ్యంలో రాసినట్టు– 'వితతంబైన చరచరాత్మాక మహా విశ్వ ప్రపంచంబునన్..... మయ్యమృత శబ్దావాప్తి నూహించెదన్'.

(10వ వర్ధంతి (ఆగస్టు 11/12) సందర్భంగా భద్రిరాజు సంస్మరణం)

(ఆంధ్రజ్యోతి వివిధ దినపత్రిక, ఆగస్టు 8, 2022)

10
రెండు శతకాలు - సామాజిక స్పృహ

ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు గారు ఇటీవల రెండు శతకాలను అచ్చొత్తి వెలువరించారు. : శ్రీ సింహాద్రి నారసింహ శతకము (2019), వేణుగోపాల శతకము (2020). వీటిలో శ్రీ సింహాద్రి నారసింహ శతకమును రాసినవారు గోకులపాటి కూర్మనాథ కవి (క్రీ.శ. 1720-1790). వేణుగోపాల శతకమును రచించిన వారు పోలిపెద్ది వేంకటరాయ కవి. (క్రీ.శ. 1800-1875). వీరిరువురు రాసిన ఈ శతకాలు సాహిత్యపరంగా, సామాజిక స్పృహపరంగా ఎంతో ఉన్నతమైనవి.

ఇటీవలి కాలంలో శతక పద్య శోధన, వాటిలోని సామాజిక స్పృహ వెలుగులోకి తెచ్చే పరిశోధనలు బాగా తగ్గిపోయాయి. (ఎక్కడైనా ఒకటి రెండూ ఉన్నాయేమో!) కాని, రామాయణం, మహాభారతం, భాగవతం వంటి చారిత్రక కావ్యాలు మినహా ఇతర సాహిత్య ప్రక్రియలలో 'శతకం' కంటే మరేదీ సమాజానికి దగ్గరగా వచ్చిన సాహిత్య ప్రక్రియలేదు. నిజానికి కన్నడ, మలయాళమ్, తమిళ భాషలలో కూడ – శతక సాహిత్యం ఉన్నా తెలుగులోనే అది ఎక్కువగా పరిఢవిల్లిందన్నది తిరుగులేని వాస్తవం. ఆచార్య కె. గోపాలకృష్ణారావు గారు తెలుగులోని శతకాల గురించి లోతైన పరిశోధన చేసి 1976లో 'ఆంధ్ర-శతక సాహిత్య వికాసము' అనే మంచి గ్రంథాన్ని ప్రచురించారు. వీరికన్నా చాలా ఏండ్లు ముందు వంగూరి సుబ్బారావు గారు 'శతక కవుల చరిత్రను' వెలువరించారు. వంగూరి సుబ్బారావు గారి పరిశోధన కాలం నాటికే తెలుగు శతకాల సంఖ్య దాదాపు 500 పై చిలుకు అని

తేలింది. తెలుగులో మొట్టమొదటి శతకమైన పాల్కురికి సోమనాథుని 'వృషాధిపశతకం' (క్రీ.శ. 12) నుంచి నేటికీ శతక రచనలు సాగుతునే ఉన్నాయి. భర్తృహరి రాసిన 'సుభాషిత త్రిశతి' సంస్కృతములో తొలి శతకం. శతక సాహిత్యంలా బహుళ ప్రాచుర్యం పొందిన తెలుగు సాహిత్య ప్రక్రియ మరోటిలేదు. పాల్కురికి సోమనాథుడు 'వృషాధిప శతకం' వచ్చిన కాలంలోనే బద్దెన వారి 'సుమతి శతకం', యథావాక్కుల అన్నమయ్య 'సర్వేశ్వర శతకము' వెలువడినట్లు చరిత్ర శోధనలో తెలుస్తోంది. వేర్వేరు అంశాలతో ఎందరో పండితులు, కవులు, ఔత్సాహికులు రకరకాల శతకాలు రాశారు. బమ్మెర పోతన (నారాయణ శతకం)లో ఎన్నో శతకాలు పొగడటం, తిట్టడం, పొగిడినట్టు తిట్టడం, తిట్టినట్టు పొగడడం, వర్ణించడం, బోధించడం – ఇలా ఎన్నో రకాలైన విషయాలు ఇతి వృత్తంగా శతకాలు వెలువడ్డాయి.

తెలుగు వాఙ్మయంలో మొట్టమొదట వెలసిన శతకాలన్నీ శైవమాత సంబంధమున్నవే. దీనిని బట్టి తెలుగున శతక సాహిత్య ప్రక్రియకు ఆద్యులు శైవకవులు అని తెలుస్తోంది. అంతేగాదు, సాంఘిక దురాచారా లను దుయ్యబడ్తూ నిశితంగా విమర్శించిన సాహితీ ప్రక్రియ కూడ శతకాలే. వారిలో వేమన శతకం ఎప్పటికీ అగ్రగామి. వేమన పద్యాలు లోకనీతులు. సామాజిక చైతన్యం వేమన పద్యాల లక్షణం. వేమన స్పృశించని అంశంలేదు. సమాజంలోని అన్ని సమస్యలు భిన్న కోణాలనుంచి దర్శించి ఆదర్శన వైశిష్ట్యాన్ని తన పద్యాలలో నిక్షిప్తం చేశాడు వేమన. కుటుంబ వ్యవస్థలోని లోటుపాట్లు, మతం పేరిట జరుగుతున్న దోపిడీలు, విగ్రహారాధనను నిరసించడం, కుహనా గురువులు, దొంగ సన్యాసులు, ఇలా కనపడిన ప్రతి సామాజిక రుగ్మత ఆయన కవితా వస్తువుగా మారింది. ఆచార్య రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ వేమన కవిత్వంపై విశేష పరిశోధన చేశారు. అంతేగాక తన పరిశోధనా ఫలితాలను ఆయన 'వేమన' పుస్తకం రూపంలో ప్రచురించారు. ఆ తర్వాత వేమన పై అంతేస్థాయిలో గొప్ప పరిశోధన చేసిన వారు ఆచార్య ఎన్. గోపి. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు వేమన కవిత్వంపై తన అభిప్రాయం ఇలా చెప్పారు – "వేమన కవిత్వం గాయపు మందు గాయానికి కాక, కత్తికి పూసినట్లుండును" అని.

కూర్మనాధకవి – శ్రీ సింహాద్రి నారసింహశతకం

ఈ కోవలోకి వచ్చేదే గోగులపాటి కూర్మనాధకవి రచించిన 'శ్రీ సింహాద్రి నారసింహ శతకము'. ఈ శతకం కవి కీర్తిని దశ దిశలా చాటి చెప్పినది. ఇది ఉత్తమ అధిక్షేప శతకము లేక చారిత్రక శతకం క్రిందికి వస్తుంది. పద్దెనిమిదవ శతాబ్దం మధ్య భాగంలో అంటే దాదాపు క్రీ.శ. 1753 ప్రాంతాలలో కళింగాంధ్ర/ ఉత్తరాంధ్ర తురక సైన్యాల దోపిడీలతో అల్లకల్లోలంగా ఉండేది. ఇందుకు చారిత్రక శోధకులు కొన్ని కారణాలు చెప్తారు. ఒకటి : అప్పట్లో హైద్రాబాదు నవాబు ఢిల్లీ చక్రవర్తి ఔరంగజేబుకు సామంతులుగా ఉండేవారు. ఉత్తర సర్కారులు వీరి ఆధీనంలో ఉండేవి. ఔరంగజేబు ప్రతినిధియైన ఫకీర్ ఆలీఖాన్ దగ్గర విజయనగర సంస్థానాధీశుడైన మొదటి ఆనంద గజపతిరాజు, అనకాపల్లి పాలకుడైన 'హోల్‌కాలమ్' అనే ఆంగ్లేయుని ద్వారా కొంతధనం అప్పుగా తీసుకొని సకాలంలో చెల్లించకపోవటం వలన ఆలీఖాన్ గ్రామాలపై పడి దోచుకోవటం, స్త్రీలను చెరపట్టటం, దేవాలయాలను ధ్వంసం చేయటం మొదలు పెట్టాడు. రెండవది : అదే సమయంలో దక్కను సుబేదారు 'సలాబత్ జంగ్' ఉత్తర సర్కారులను ఫ్రెంచి వారికి కౌలుకు ఇచ్చాడు. వాటిని స్వాధీనం చేసుకోమని ఫ్రెంచి దొర బుస్సీ, మచిలీపట్నం గవర్నర్ అయిన మారిసన్‌ను పంపించారు. శ్రీకాకుళంలో ఫౌజుదార్‌గా ఉన్న జాఫర్ ఆలీఖాన్ తిరుగుబాటు చేశాడు. అతడు మహారాష్ట్రులతో చేతులు కలిపి, ఉత్తర సర్కారులను దోచుకోవటం మొదలు పెట్టాడు. మరాఠ దండు గ్రామాలను దోచుకొంటే తురక దండు దేవాలయాలను ధ్వంసం చేయసాగింది. విజయనగరాధీశుడు పెద విజయ రామరాజు వీరిని ఆపలేకపోయారు. ఈ నేపథ్యంలో ఈ శతకం పుట్టింది.

"క్రమంగా ముస్లింలు సింహాచలం కొండ మీదకి చేరుతున్నారనే వార్త తెలిసి ఆ దేవస్థానంలో ఉద్యోగిగా ఉన్న భక్త కవి, గోగులపాటి కూర్మదాసు, నారసింహుని ప్రార్థిస్తు ఈ శతకం చెప్పాడు. 'ఆదుర్తి హరిదాసు' అనే అతని మిత్రుడు లేఖకుడిగా ఉండి ఈ శతకాన్ని రాశారు. ఈ శతకం మకుటం అందువలన – వైరి హరరంహ ! సింహాద్రి నారసింహ. సీస పద్యాలతో, నిందాస్తుతిగా, ఉపాలంభనలతో సాగిన శతకం ఇది" – అని వ్యాఖ్యానించారు ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు.

మొదటి పద్యంలో స్వామివారిని భక్తితో ప్రార్థించి, తర్వాతి పద్యంలో తాను విన్నవించుకొనే దాన్ని పరాకు లేకుండా వినమని వేడుకొన్నాడు. ఇక మూడవ పద్యం నుంచి 67 పద్యం వరకూ తురక సైనికుల చేతుల్లో ప్రజలు పడుతున్న పాట్లను కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. స్వామి వారికి, ఆయన పరాక్రమాన్ని గుర్తుచేసి శత్రువులను శీఘ్రంగా పారద్రోలుమని వేడుకొన్నాడు. ఎంతసేపటికి స్వామి కరుణించక పోవటంతో 'నీవు కూడ తురలతో కలిసిపోయావా?' అని స్వామిని నిందించాడు. ఈ విధంగా 67 పద్యాలు పూర్తి అయ్యేసరికి స్వామి అనుగ్రహం సాకారమైంది. సింహాచలం గుహలలో మంటలు చెలరేగాయి. అక్కడున్న తేనెపట్లు అంటుకొన్నాయి. వాటిలో నుండి గండు తుమ్మెదలు (తేనెటీగలు) భయంకరంగా చెలరేగి, ప్రళయకాలంలోని కారు మేఘాల్లా తురక సైనికులను కప్పి, తమ ఉక్కు మూతులతో వారిని కరిచి, కండలు ఊడిపడేలా చీల్చి చెండాడి, నెత్తురు పీల్చి వారిని సింహాచలం నుండి విశాఖపట్టణంలోని 'శ్మశానంమెట్టు' దాకా తరిమివేశాయి. అందువలన ఆ శ్మశానానికి 'తుమ్మెదల మెట్ట' అని పేరు వచ్చిందని ప్రతీతి. ఈ ఘట్టం తర్వాత కూర్మనాథ కవి రాసిన శతక పద్యాలు ఎక్కువగా (68-100) స్వామి వారిని పలు విధాలుగా స్తుతించే దశావతార వర్ణనల వైపు వెళ్ళిపోయాయి. ఈ సంఘటన విషయమై ఆరుద్రగారు తను రాసిన 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం', ఎనిమిదవ సంపుటం, కడపటి రాజుల యుగంలో (237-239)లో ప్రస్తావించారు కూడ.

ఇందుగల డందులేడను సందియంబు
జెంద వలదను వేద వాగ్బృందమెల్ల,
నెందువెదకిన గాన రాలేమా యిపుడు ?
వైరి హర రంహ ! సింహాద్రి నార సింహ (52వ పద్యం)

అని ఆక్రోశించాడు. దేవునికి తురక మతంపై అభిమానం పుట్టిందా అని శంకించి, "బీబీ నాంచారిని బిలిపింపు వేగమే, తుద కభ్యసింపుమా తురకభాష" అని ఏద్దేవ చేశాడు.

పాశ్చాత్యుల నమాజుపై బుద్ధి పుట్టెనో,
వేమౌనుల జపముపై మనస్సు రోసి ...
తురకల యాదునందు ముదంబుగల్గెనో,
భక్త నిత్యాత్సవాసరతమాని
వాండ్రు దుర్మార్గులయ్యిమో, వ్రతము చెడ్డ
సుఖము దక్కదు; వడి ఢిల్లి చౌరగం దోలు
పారసీకాధిపుల పటాపంచలుగాను !
వైరిహరరంహ ! సింహాద్రి నారసింహ ! (80వ పద్యము)

ఆయన తన పద్యాలలోని ఆర్తిని చాలా దీనంగా నివేదించు కొన్నాడు నరసింహస్వామికి. తన ఈ ప్రార్థనంతా ఆంధ్రా సృష్టిని రక్షించమని, పదిలంగా ఉంచమనే అని నివేదించాడు. తెలుగు జాతి నాశనం అవకూడదనే తన ఆవేదనంతా అని అచ్చ తెనుగులో నొక్కి వక్కాణించాడు.

ఔర! నిజమాడ నిష్టురం బౌ నటంద్రు !
కాక రోషంబు గలిగిన, గఠిన యవన
సేన నిర్జించి, యీ యాంధ్ర సృష్టి నిల్పు!
వైరిహరరంహ ! సింహాద్రి నార సింహ (24వ పద్యం)

శతక కారులలో శతక రచనతో నార సింహుని అనుగ్రహం సాధించిన తొలి కవిగా గోగులపాటి కూర్మనాథ కవి అగ్రస్థానంలో చిరస్థాయిగా ఉంటాడు.

ఇంచుమించు ఇదేవిధమైన వ్యాఖ్య చేశారు ఆరుద్ర –

"గోగులపాటి కూర్మనాథానికి పేరు తెచ్చిన శతకం కూడ ఇదే. ఇటువంటి శతకాలు తెలుగు సాహిత్యంలో మరి కొన్ని లేకపోలేదు. అయితే ఆంధ్రసృష్టిని నిలుపమని సందేశం ఇచ్చిన కవులలో ఇతరు ప్రముఖుడు. తెలుగు సాహిత్యంలో ఇతని ఈ సృష్టి నిలుస్తుంది". (పేజీలు : 237–239)

కూర్మనాథ కవి 'శ్రీ సింహాద్రి నారసింహశతకము'ను వెలుగులోకి తేవటానికి ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు చాలా శ్రమపడవలసి వచ్చింది. ఈ పద్యాలలో

కొన్ని పద్యాలను సుబ్బారావు గారు పునర్నిర్మాణం చేయవలసి వచ్చింది. కొన్ని పద్యాలను వేరే ఆధారాలనుంచి సేకరించి పద్య వరుసలకు అర్థం కలిపించవలసి వచ్చింది. ఆచార్య తంగిరాల వారి పరిశీలన ప్రకారం ఈ శతకంలో దాదాపు 108 పద్యాలు ఉండాల్సి ఉంది. కాని కేవలం 101 మాత్రమే ఉన్నాయి. కవి కాలం చేసిన తర్వాత కొంత కాలానికి ఎవరో కూర్మనాథ కవికి సంబంధించిన పద్యాలుగా పేర్కొంటూ 'ఆరాధన' పత్రికలో ఒక సీస పద్యం, తేటగీతి ముగింపుతో అచ్చొత్తారు. ఈ పద్యంలో స్వామి వారి ఆగ్రహంతో ఉక్కుమూతుల తుమ్మెదలు వచ్చి, తురక సేవలను చుట్టుముట్టి కుట్టి తరిమేశాయని ఉంది. కొందరు పండితులు ఈ పద్యాలను ప్రక్షిప్తాలని కూడ అంటారు. అందువలన తంగిరాల వారు వీటికి సంఖ్యలు కేటాయించలేదు. 101 పద్యాలకు మాత్రమే సంఖ్యలు వేసి, ఈ 'ప్రక్షిప్తం' అనే భావన కలిగిన రెండు పద్యాలను 68,69 పద్యాల మధ్యలో ఉంచారు. నిజానికి ఆచార్య తంగిరాల వారి పరిశీలనలో గండు తుమ్మెదలు తురకసైనికులను తరిమి కొట్టిన సంఘటన శతకంలో లేదు. స్వామి ఏదో మహిమచేసి ప్రజలను రక్షించినట్లుగా ఉంటుంది.

"ఖల హిరణ్యాక్ష ముఖ్యులనెల్ల ఖండించి, దేవతాతంత్రిం బ్రోచు దివ్యమహిమ" అనే భావం తను సంఖ్య కేటాయించిన 68వ పద్యంలో తెలిపారు ఆచార్య తంగిరాల వారు. 69వ పద్యంలో 'జయమాయె .... భవదీయ భాస్వత్ ప్రభాబలమున' అని కూర్మనాథ కవి రాయటంలో స్వామి ఏదో మహిమ చేశారన్నది ప్రస్ఫుటం అవుతున్నది.

తంగిరాల వారు చేర్చిన 'ఆరాధన' పత్రికలో అచ్చయిన సంఖ్యలేని ఆ రెండు పద్యాలను కూర్మనాథ కవి కాలంలో వేరొకరు రచించి, ఈ శతకంలో చేర్చి ఉంటారని, కూర్మనాథ కవి రచనాశైలికి, ఈ పద్యాల రచనాశైలికి చాలా భేదం ఉందని 1962లో ఈ శతకాన్ని పరిష్కరించిన పంతులు లక్ష్మీనారాయణ శాస్త్రి గారు అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనా తుమ్మెదల దాడిలో తురుష్కసేనలు వెను దిరిగి పారిపోవటం మాత్రం జనం మధ్య బలంగా ఉండి పోయింది.

నిజానికి కూర్మనాథ కవి శతకం భాషాపరంగా మిశ్రమ సంక్లిష్టంగా పరిణమించింది తంగిరాల వారికి. అచ్చ తెనుగు పదాలు, నుడి కారాలు, జాతీయాలు కాకుండా ఉర్దూ

భాషా పదాలు, వాక్యాలు, సామెతలతో కూర్మనాథ కవి శతకం చాలా క్లిష్టంగా పరిణమించింది. అందువలన ఆచార్య తంగిరాల వారు ఈ శతక శోధనకు ప్రతిపదార్థం, తాత్పర్యం ఎంతో కీలకంగా భావించారు. 'మధురకవి' బిరుదాంకితులు బులుసు వేంకటేశ్వర్లు ఈ పనికి సరైన పండితులు అని భావించి వారి సహాయం అపేక్షించారు ఆచార్య తంగిరాల వారు. అయినా కారణాలేమో తెలీదు కాని, బులుసు వారు కేవలం తాత్పర్యం మాత్రమే రాయగలిగారు. మిగతాది భవిష్యత్తుకు వదిలేశారు. ఉదాహరణకు 73వ పద్యం పూర్తిగా సంస్కృతంలోనే రాయటం జరిగింది. 79, 80 పద్యాలు పూర్తిగా తత్సమ పద భూయిష్ఠ సమాస రచనతో కూడి క్లిష్టంగానే ఉన్నాయి. ఈ శతకంలోని 73,79 పద్యాలకు కొడిమడుగు నాగేశ్వర శాస్త్రి ప్రతిపదార్థాలు, తాత్పర్యాలు రాసిచ్చారు. 79–83 నుంచి ఉన్న పద్యాలలోకొన్ని పాదాలకు, పదాలకు అన్వయం కుదరడంలేదు. వాటిని పండిత కవి శేఖరులు, పరిశోధకులు అయిన ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారు పరిష్కరించగలిగారు.

ఈ విధంగా గోగులపాటి కూర్మనాథ కవి రాసిన 'శ్రీ సింహాద్రి నారసింహ శతకము' నాటి సామాజిక జీవనస్థితి గతులను, భాషా పరిణామాలకు ప్రతిబింబించిందో, అలాగే తర్వాతి కాలంలో 'వేణు గోపాల శతకము' రాసిన పోలిపెద్ది వేంకటరాయకవి కూడ నాటి సామాజిక స్థితిగతులను నిశితంగా పరిశీలించి వేమనలాగే విమర్శించారు.

పోలిపెద్ది వేంకటరాయ కవి – వేణుగోపాల శతకము

పోలిపెద్ది వేంకటరాయ కవి రాసిన 'వేణుగోపాల శతకము' గురించిన పరిచయం ఆచార్య కె. గోపాలకృష్ణారావు గారు రాసిన 'ఆంధ్ర శతక సాహిత్య వికాసము' (పేజీలు : 440–444)లో కనిపిస్తుంది. క్రీ.శ. 1800–1875 మధ్య జీవించిన 'లావణ్య శతక' కర్త పోలిపెద్ది వేంకట రాయ కవినే వేణుగోపాల శతకాన్ని కూడా రాశారన్నది ఒక నోటిమాటగానే ప్రచారంలో ఉంది తప్ప సరైన సాక్ష్యము లేదని నిడుదవోలు వేంకటరావు గారు 'శతక వాఙ్మయ చరిత్ర' అను బంధములో రాశారు. పోలిపెద్ది వేంకటరాయ కవి తిట్ల దండకములో వేణుగోపాలుడు తన కిష్ట దైవమని పేర్కొన్నాడు. అయితే 'వేణుగోపాల శతకము'ను పోలిపెద్ది వేంకటరాయ కవే రాశాడని అనడానికి కొన్ని కారణాలు ఉన్నాయి. కార్వేటి నగరాధీశ్వరుడగు పెరుమాళ్ళ రాజేంద్రుని ఆస్థానములో ఒకానొక అధికారి కవిని అనాదరించటం వలన

సంస్థానంలోని అక్రమాలను, సాంఘిక వ్యవస్థలోని కల్లోల పరిస్థితిని కవి నిశితంగా విమర్శించటం జరిగిందన్నది ఒకటి.

కవి ఈ శతకంలో తనని రాజు, మంత్రి అవమానించారని ఎక్కడా పేర్కొనలేదు. కలియుగ ధర్మము ననుసరించి సంఘంలో ఏర్పడిన స్థితి గతులను కవి వివరించటం ద్వారా దురాచారాలు యుగధర్మ ప్రభావాన ఏర్పడ్డవేనని కవి భావించినట్లు ఈ శతకంలో అర్థమవుతుంది.

'అహహ కలియుగ ధర్మ మేమనగ వచ్చుననన్నిటికి నోర్చి యూరక యుండవలెను' – అని సమకాలీన స్థితి గతులను చెపుతూ ఎందుకు ఊరికే ఉండవలెనని చెప్పాడో బోధపడుతోంది. ఈ శతకంలో కొన్ని చోట్ల మంచి మంచి సాంఘిక నీతులున్నాయి. ధర్మాలు వివరించాడు. మోక్షమార్గం, వేదాంతం, ఉత్తమ రాజు, మంత్రి లక్షణాలను పేర్కొన్నాడు. తల్లిదండ్రులపై ఉండవలసిన భక్తి గురించి చెప్పాడు. అయినప్పటికీ ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు గారు ఇబ్బంది పడ్డ విషయం ఒకటుంది. అదేమిటంటే ఈ కవి తన వేణుగోపాల శతకంలో వివిధ వర్ణాలను దూషించిన తీరు. ఆయన స్త్రీల పట్ల వ్యక్తపరచిన భావాలు నేటి సమాజం 'మీసొగైనిక్' గా పరిగణించే ప్రమాదంలేకపోలేదు. ఈ కారణంగా ఆయన తన సాహితీ మిత్రుడు మొవ్వ వృషాద్రిపతి గారిని సంప్రదించారు. ఈ కవి పుస్తకం వెలుగులోకి తేవటం ఔచిత్యమా? కాదా? అన్న ప్రశ్నకు మొవ్వ వృషాద్రిపతి గారు ఇచ్చిన సమాధానం కూడ సమంజసంగానే ఉంది." ఫరవాలేదు లేండి. ఈ శతకంలో ఉన్నవి మన అభిప్రాయాలు కావు; అవి నాటికవి అభిప్రాయాలు. అవి 19వ శతాబ్దంలో తెలుగు నాట ఉన్న సామాజిక స్థితిగతులు. వాటిని ఈ నాటి దృష్టిలో చూడరులెండి' – అని చెప్పారు. ఈ విధంగా ఆయన సలహాపై ఈ కవి రచనను పరిష్కరించి ముద్రించారు ఆచార్య తంగిరాల వారు. అంతేగాదు, ఈ శతకంలోని ప్రయోగాలను పండితులు "శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు'లోకి స్వీకరించారు. ఇది ఈ శతక వైశిష్ట్యానికి ఉత్తమ తార్కాణం.

పోలిపెద్ది వేంకటరాయ కవి తన కన్న నూరు సంవత్సరాలు ముందున్న ఆడిదము సూరకవి (క్రీ.శ. 1720–1780) రచించిన "రామలింగేశ్వర శతకము"ను కొన్ని చోట్ల

అనుకరించినట్లు గుర్తించారు ఆచార్య తంగిరాల. అంతేగాక కొన్ని చోట్ల ఆడిదము సూరకవి శ్లోకాలను యథాతథంగా తన శతకంలోకి దిగుమతి కూడ చేశాడు అని కూడ గమనించారు. ఒకవేళ ఆయన దిగుమతి చేయకుండా ఉంటే, తర్వాతి కాలంలో ఎవరైనా చేర్చారేమోనన్న సందేహం కూడ కలగక మానదు. ఈ శతకములో 73వ పద్యము నుండి 92వ పద్యము వరకు 20 పద్యాలు, 96వ పద్యము నుండి 99 పద్యము వరకు గల నాల్గు పద్యాలు మొత్తం 24 సీస పద్యాలు ఆడెదము సూరకవి 'రామలింగేశ శతకము' నుండి యథాతథముగా ఈ పద్యాలలో చేర్చారు. ఇన్ని పద్యాలను ఒక కవి తన పూర్వ కవి నుండి బుద్ధి పూర్వకముగా చేర్చారనుకోవటం సమంజసం కాదు. కాబట్టి ఎవరో అధముడు చేసిన పనిగా తంగిరాల వారు భావించారు. ఈ వేణుగోపాల శతకములో మొత్తం పద్యాల సంఖ్య 105 కాగా, వాటిలో ప్రక్షిప్త పద్యాల సంఖ్య 24ను తొలగిస్తే వాస్తవానికి శతక కర్త రాసిన పద్యాలు 81 మాత్రమే. విద్వాన్ వేదము వేంకట కృష్ణ శర్మ గారు రాసిన 'శతక వాఙ్మయ సర్వస్వము'లో ఈ కవి రాసిన మరో పద్యం ఒకటి లభించింది దానితో కలిపి మొత్తం పద్యాలు 82.

వేణుగోపాల శతకము ప్రాచీన ప్రతి ముద్రణ 1880లో తొలిసారి జరిగింది. తర్వాత ముద్రణ 2013 ఆగస్టులో డా॥ శ్రీరంగాచార్య గారి సంపాదకత్వంలో కొత్త పాండురంగయ్య గారు ముద్రించారు. తంగిరాల వారు ఈ క్రొత్త ప్రతిని ప్రామాణికంగా తీసుకొని పరిష్కరించారు. "రంగాచార్యుల వారు 'అర్చనం' పేరుతో ఈ క్రొత్త పత్రికి 4 పేజీల పీఠిక రాశారు. కాని పద్యాలనేమి పరిష్కరించలేదు. పైగా ఈ ప్రతిలో ఎన్నో తప్పులు దొర్లాయి" అంటారు ఆచార్య తంగిరాల వారు. ఆఖరికి పద్యాల సంఖ్య కూడ తప్పుగా ఇచ్చారు. చివర్లో మూడు పద్యాలను పునరుక్తం చేసి, 105 సంఖ్యను 108గా సరిపెట్టారని కూడ ఆక్రోశించారు ఆచార్య తంగిరాల. డా॥ వెలగా వెంకటప్పయ్య గారు తన సంపాదకత్వలో వెలువరించిన 'తెలుగు శతకమంజరి'లో వేణుగోపాల శతకంలో 100 పద్యాలు చూపారు. వాటిలో గతంలో పేర్కొన్న ఆడిదము సూరకవి 'రామలింగేశ శతకం' నుంచి ఎత్తుకొచ్చి ప్రక్షిప్తం చేసిన 24 పద్యాలు గూడ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి వారు 1982లో ఆచార్య కె. గోపాలకృష్ణారావు సంపాదకత్వంలో వెలువరించిన 'అధిక్షేప శతకములు' గ్రంథంలో కూడా 'వేణుగోపాలశతకం'లో 105 పద్యాలను చూపారు. ఇందులో కూడ ఆడిదము సూరకవి రాసిన 24 పద్య ప్రక్షిప్తాలు కనిపిస్తాయి.

విద్వాన్ వేదం వేంకటకృష్ణశర్మ గారు 1954లో 'శతకవాఙ్మయ సర్వస్వము"ను వెలువరించారు తొలిసారిగా. దీనిలో క్రీ.శ. 1160నుంచి 1860 వరకూ 700 సంవత్సరాలలో జీవించిన 52 మంది శతక కవుల వివరాలు, ముఖ్యమైన పద్యాలు, వాటి ప్రాముఖ్యం తెలుపుతూ సోదాహరణముగా ప్రకటించారు. ఈ సంపుటిలోని 21వ వ్యాసం పోలిపెద్ది వేంకటరాయ కవిని గురించి ఉన్నది. "ఈ వ్యాసంలో శర్మ గారు 19 సీస పద్యాలను ఉదహరించారు. వాటిలో ఒక పద్యము నేడు అందుబాటులో ఉన్న వేణుగోపాల శతక ప్రతుల్లో దేనిలోనూ లేదు" అని అంటారు ఆచార్య తంగిరాల. "పద్య భావమును బట్టి, ఆ పద్యము మనుషులలోని 'లోభిత్వం గురించి కాబట్టి తదనుగుణంగా దానిని 101-102 పద్యాల మధ్య చేర్చాను' అంటారు ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు.

"తెలుగు శతకమంజరి' లోని వేణుగోపాల శతకమును, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు వేసిన "అధిక్షేప శతకములు"లోని 'వేణుగోపాల శతకము'ను, "శతక వాఙ్మయ సర్వస్వము" లోని వేణుగోపాల శతకములో పేర్కొన్న 19 పద్యాలు, ఆడిదము సూరకవి రామలింగేశ శతకం నుండి గ్రహించిన 24 పద్యములను జాగ్రత్తగా పరిశీలించి వాటి పాఠ భేదములను సూచించాను" అని వివరించారు ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు. ఇది సామాన్య పరిశోధన గాదు.

పోలిపెద్ది వేంకటరాయ కవి వేణుగోపాల శతకంలోని సామాజిక స్పృహ గురించి ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు గారు ఇలా రాశారు :

"ఈనాడు కవిత్వమనగానే, 'సామాజిక స్పృహ ఉన్నదా?" అని ప్రశ్నించుట ఒక అలవాటైనది. అది ఆధునికులు ప్రధానమని పలికినను, ఇప్పటికవితలలో అది నభ:పుష్ప సమమైనది. పూర్వశతకములలో సామాజిక స్పృహ అతి వేలముగా కన్పించుచున్నది. సుమతి - వేమన - భాస్కరశతకాదులలోనే కాక శ్రీకాళహస్తీశ్వర శతకము, నరసింహ శతకము - మొదలైన భక్తి శతకములలో కూడ సామాజిక స్పృహ ప్రధాన స్థాన మాక్రమించుచున్నది.

సీ॥	వేదాంత యుక్తులు విని రెండు నేర్చుక
		వాగునాతడు రాజయోగికాడు

....

పట్టపురాజు చేపట్టి యుంచంగానే
		గుడిసెవానికి భూరిగుణమురాదు.

....

తే॥గీ॥	కోతిపై నున్న సింగంపుగొదమగాదు,
ఎంత చదివిన గుణహీనుడెచ్చుగాడు:

....

వేణుగోపాల! భక్త సంత్రాణశీల!

'ఈ పద్యములో తొలి ప్రతిలో కవి పోలిపెద్ది 'గుడిచేటి ముండకు గుణమురాదు' అని రాయగా, తర్వాతి కాలంలో కొందరు పండితులు ఈ పదాన్ని సంస్కరించి ప్రస్తుతం పద్యంలో ఉన్నట్లుగా మార్చారు' అంటారు ఆచార్య తంగిరాల. ఇందులో 'గుడిచేటిది' అంటే 'దేవదాసి' అలాగే మరో పద్యం :

సీ॥	దండ కమండలు ధారులై కాషాయ
		ములు ధరించిన ముక్తి లేదు

....

		....

వాయువు బంధించి, ప్రాణంబులలయంగ
		మూతవేసిన దాన ముక్తి లేదు.

తే॥గీ॥	గురుపదాంబుజముల భక్తికుదిరి,
తమ్ము దామెరుంగక ముక్తి లేదవని యందు
వేణుగోపాల! భక్తాసంత్రాణ శీల!

సీ॥ అవనీశ్వరుడు మందుండయిన నర్థులకియ్య
వద్దని యొద్ద దివాను సెప్పు
మునిషీ యొకండు సెప్పు; మొనసి వష్క చెప్పు
దరువాత నామజుందారునెప్పు.

అంటూ నాటి రాచరిక వ్యవస్థలోని లోతుపాట్లును ఏకివదుల్తాడు కవి. అలాగే కవులను చూడగానే లేచి ఆస్థాన వారవనితలు వందనం చేయటం ఆనాటి ఆచారము. అయితే ఈ ఆచారము కవి జీవించిన కాలములో లోపించటం వలన, అటువంటి స్త్రీల పట్ల ఆగ్రహంతో కవి రాసిన పద్యం ఇది.

సీ॥ ఆస్థానమందు విద్వాంసులగనిలేచి
మ్రొక్కువేయని వారామోహినులకు
దలగొౌటిగించి, మెత్తని సున్నము బూసి,
బొగ్గు గంధంబున బొట్టమర్చి
చెప్పులు మెడగట్టి చింపి చేటల గొట్టి
....

తే॥గీ॥ వేణుగోపాలా! భక్త సంత్రాణశీల!

అంటూ అలాంటి స్త్రీల చేతిలో అవమానానికి గురైన కవుల హృదయాక్రందనను ఆక్రోశంతో చెప్తాడు కవి. ఇలాంటి పద్యాలు వేణుగోపాల శతకములో ఎన్నో.... నాటి సామాజిక స్థితులు ఎండగడుతూ, ఆనాటి సమాజంలో వేశ్యలకు, భోగలాల సత్వానికి ఎంత ప్రాధాన్యతను రాజులు కల్పించారో విశదీకరిస్తాడు కవి. పతనమైన ఆచార వ్యవహారాలను, పండితుల పట్ల అగౌరవము పెరిగిపోవుటాన్ని, పైసాకు పనికిరాని అజ్ఞానులు పండితుల్లా చలామణి అవటాన్ని, దొంగ సాధువులు, కపట వ్యక్తులు ఉన్నత గౌరవాన్ని, స్థానాన్ని పొందటాన్ని ఈసడిస్తాడు కవి తన పదునైన సీస చందస్సు పంక్తులలో.

ఇలా క్రీ.శ. 17వ శతాబ్దం, 18వ శతాబ్దంలో జీవించిన ఇద్దరు ప్రముఖ కవుల సాహిత్యాన్ని వెలికితీసి వాటి పద్యాలను సంఖ్యలోను, నిర్మాణంలోను, ప్రతి పాఠాలలోని

అంతర భేదాలను పరిశీలించి పరిష్కరించటంలోను, ప్రపంచానికి నూతన సాహిత్యాన్ని అందించటం లోను ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు గారి కృషి ముందు తరాలకు మార్గనిర్దేశకం. ఎనభైయవపడిలో కూడ తంగిరాల వారు తన శతక పరిశోధనలో పాటించిన ప్రమాణాలు ఆచరణీయమైనవి. అంతేకాదు కూర్మనాధకవి తన శతక రచనతో తురుష్కులనుంచి తెలుగు సృష్టిని కాపాడితే, పోలిపెద్ది వేంకటరాయ కవి తన కవిత్వంలో సమాజాన్ని పట్టి పీడిస్తున్న చీడలను ఏకరువుపెట్టి, ఏకి పారేశాడు. ఈ రెండు శతకాలు సాహిత్య ప్రియులు తప్పక చదవవలసిందే.

అటు సామాన్య శోధకులకు, భాషా పండితులకు కూడ ప్రయోజనకరంగా ఈ పరిశోధనలను పరిష్కరించారు ఆచార్య తంగిరాలవారు. ఇంకా ఈ శతకాలకు ప్రతిపదార్థం కాక కేవలం తాత్పర్యం మాత్రమే చేకూర్చినందుకు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయటమే గాక నూతన తరాన్ని ఆఖాళీని పూర్తి చేయమని ఆహ్వానిస్తున్నారు.

ఆనాటి సామాజిక పరిస్థితులు ఇతర సామాజిక శాస్త్రవేత్తలు ఈ కాలంలో చరిత్రపై చేసిన శోధనలలను తులనాత్మకంగా పరిశీలిస్తే, అవి ఎంతో వాస్తవ స్థితి ప్రతిబింబించాయని సులువుగా గ్రహించగలరు పరిశోధన జిజ్ఞాసువులు. ముఖ్యంగా శశిథరూర్ రాసిన 'ఏన్-ఎరా ఆఫ్ డార్క్‌నెస్ - ది బ్రిటీష్ ఇండియా' పుస్తకంలో ఈ వాస్తవాలు కళ్లకు గడతాయి చదువరులకు. ఆధ్యాత్మిక సాహితీ శోధకులు, భాషా శోధకులు ఈ పుస్తకాలను ఆసాంతం చదివి అందులోని అపూర్వ సాహిత్య సామాజికాంశాలను ఆస్వాదించాలి.

(మిసిమి మాసపత్రిక, సెప్టెంబర్, 2022)

11
గాంధీపై సినిమా వెనుక దాగిన చారిత్రక సత్యాలు

మనం 'మహాత్మ', జాతిపిత' అని ఎంతో గౌరవంగా పిల్చుకొనే మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ అక్టోబరు 2, 1869లో జన్మించారని మనందరికీ తెలుసు. అంతేగాదు ఈ మహాత్ముడు దారుణ హత్యకు గురయిన నాటికి ఆయన వయస్సు దాదాపు 78 సంవత్సరాలు పైనే. అప్పటికి భారతదేశంలో శబ్దం, సంభాషణలతో కూడిన సిన్మాలు తీయటం ప్రారంభమై కూడ దశాబ్దన్నరపైనే అయింది. నిజానికి భారతదేశ సినిమా చరిత్ర, ప్రపంచ సిన్మా చరిత్ర దాదాపు ఏకకాలంలోనే ప్రారంభం అయినాయని చెప్పుకోవచ్చు. 1912లోనే ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే తొలి నిశ్శబ్ద సిన్మా 'రాజా హరిశ్చంద్ర' (1912-13) నిర్మించారు. అంటే ఫ్రెంచ్ వారైన ల్యుమియరి సోదరులు తొలి నిశ్శబ్ద కురచ సిన్మాలు నిర్మించిన 1895-1905 కాలానికి దగ్గర్లోనే భారతదేశంలో కూడ (1912 నాటికే) సిన్మా చిత్రీకరణ ప్రారంభమైంది. 1931 నాటికే మనం జపాన్ కన్న అధికంగా సినిమా నిర్మాణాలు చేస్తున్నాము. 2012 నాటికి భారతదేశంలో సిన్మా నిర్మాణాలు సంవత్సరానికి వెయ్యి పైనే ఉంటే 2022 నాటికి అవి రెండు వేలు దాటాయి. ఈ విషయంలో మనకు ముందు స్పష్టత వస్తే గాంధీపై సినిమా నిర్మాణం ('బయోపిక్‌లు' అని ఇటీవల అంటున్న చిత్రీకరణలు) వెనుక దాగిన చారిత్రక సత్యాలు ఆశ్చర్యం కలిగించకమానవు.

ఈనాడు సినీ నటుల నుంచి క్రీడాభిమానులు దాకా అనేక మంది ప్రసిద్ధులైన వారి మీద, వారు జీవించి ఉండగానే సినిమాలు (బయోపిక్‌లు) నిర్మిస్తున్నారు, ప్రదర్శిస్తున్నారు.

అంతేగాదు కరుడు గట్టిన నేరస్తులైన ఛార్లెస్ శోభరాజ్ నుంచి అనేక మంది జీవితంపై గూడ సిన్మాలు నిర్మిస్తున్నారు. కాని ఆశ్చర్యమేమిటంటే మనం 'జాతిపిత' అని ఎంతో గౌరవాభిమానాలతో వ్యవహరించే 'మహాత్మ' గాంధీపైన సినిమా నిర్మాణం ఆయన జన్మించిన నాటి నుంచి సుమారు 112 సంవత్సరాల తర్వాత 1982లో తొలిసారిగా భారతదేశంలో 'గాంధీ' పేరుతో విడుదలయింది. అంత వరకూ భారతీయ సినిమా నిర్మాతలు ఎవరూ గాంధీపై సినిమా నిర్మించలేదు. గాంధీ కంటే ముందున్న స్వాతంత్ర్య సమరయోధులపైన ప్రాంతాలవారీగా, వారి వారి మాతృరాష్ట్రాల భాషలలో కూడ సిన్మాలు వచ్చాయి. కాని గుజరాత్‌లో కూడ గుజరాతీ భాషలో గాంధీపైన సిన్మా రాలేదంటే ఆశ్చర్యం కలగక మానదు. నిజానికి 1982లో విడుదలైన 'గాంధీ' సిన్మాకూడ భారతప్రభుత్వం, బ్రిటీష్ ప్రభుత్వం ఉమ్మడి పెట్టుబడి వలన సాధ్యమైందే తప్ప ప్రైవేటుగా, సహజంగా సిన్మాలు నిర్మించే భారతీయ నిర్మాతల పెట్టుబడితో కాదు. గోల్డ్ క్రెస్ట్ ఫిల్మ్స్, అంతర్జాతీయ సిన్మా నిర్మాతలు, భారత ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇండో బ్రిటీష్ ఫిల్మ్స్ సంస్థలు ఈ సిన్మాకు పెట్టుబడి పెట్టాయి.

ఇక్కడ ఇంకొక విషయం తెలుసుకోవలసి ఉంది. గాంధీ జీవితం పై తీసిన తొలి రెండు సిన్మాలు విదేశీయులు నిర్మించినవే, భారతీయ నిర్మాతలు కాదు. దర్శకులు కూడ విదేశీయులే. గాంధీపై తొలిసారిగా నిర్మించిన విదేశీ సినిమా 'నైన్ అవర్స్ టు రామ'. దీనిని 1963లో నిర్మించారు. దీని నిర్మాణం, దర్శకత్వం వహించిన వారు మార్క్ రాబ్‌సన్, స్క్రిప్టు రాసినది స్టాన్లీవోల్‌పర్ట్, సంగీతం సమర్పించినది మాల్కోం ఆర్నాల్డ్. గాంధీపై తీసిన రెండవ విదేశీ సినిమా 'గాంధీ'. దీని దర్శకుడు రిచర్డ్ అటెన్ బరో. స్క్రిప్ట్ తయారు చేసినది జాన్ బ్రైయిలీ. సంగీత దర్శకత్వం వహించినది పండిట్ రవి శంకర్ మహరాజ్, జార్జ్‌ఫెంటన్.

మరో విశేషమేమిటంటే గాంధీపై నేటి దాకా పది చిత్రాలే వచ్చాయి. దేవదాసు పై దాదాపు 16 చిత్రాల దాకా వస్తే, తర్వాత అధిక సంఖ్యలో వచ్చినవి గాంధీ సిన్మాలే. అయితే ఇక్కడ ఒక చిన్న తిరకాసుంది. గాంధీ ప్రధాన పాత్రలో (అంటే హీరోగా) వచ్చినవి

మూడు సిన్మాలే. అవి వరుసగా గాంధీ (1982), ది మేకింగ్ ఆఫ్ మహాత్మ (1996), గాంధీ మై ఫాదర్ (2007). ఇవిగాక గాంధీ ఒక పాత్రగా, వేరేవారు ప్రధాన పాత్రలుగా తీసిన సిన్మాలు ఏడు. వరుసగా అవి: నైన్ అవర్స్ టు రామ (1963), సర్దార్ (1993), జిన్నా (1998), డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్ (2000), హేరాం (2000), ది లెజెండ్ ఆఫ్ భగత్‌సింగ్ (2002), లగేరహో మున్నాభాయి (2006). దేవదాసు ప్రధాన పాత్రలో వచ్చిన 13 సిన్మాల కన్నా (ప్రాంతీయ భాషలు, హిందీతో సహా) గాంధీ ప్రధాన పాత్రలో వచ్చిన సిన్మాలు చాలా తక్కువే. ఇది మన నిర్మాతలు జాతిపిత కన్నా ఒక రొమాంటిక్ హీరోకి ఇచ్చిన ప్రాధాన్యం. ఇది మనదేశ ప్రాథమ్యాలకు కూడ అద్దం పట్టే చక్కని ఉదాహరణ.

ఇక గాంధీ పాత్ర పోషించినవారు (పైన పేర్కొన్న అన్ని సిన్మాలు కలిపి) దాదాపు పది మంది. వారిలో ప్రధాన పాత్ర పోషించిన వారెవరంటే : బెన్‌కింగ్‌స్లీ (గాంధీ, 1982), రజిత్‌కపూర్ (ది మేకింగ్ ఆఫ్ మహాత్మ, 1996), దర్శన్ జెరివాలా (గాంధీ, మై ఫాదర్, 2007). ఇతర పాత్రలలో నటించినవారు జె.ఎస్.కస్యప్ (నైన్ అవర్స్ టు రామా, 1963) అన్నూ కపూర్ (సర్దార్, 1993), శామ్ దస్తర్ (జిన్నా, 1998), మోహన్ గోఖలే (డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, 2000), నసీరుద్దీన్‌షా (హే రామ్, 2000), సురేంద్ర రాజన్ (ది లెజెండ్ ఆఫ్ భగత్ సింగ్, 2002), దిలీప్ ప్రభావల్కర్ (లగేరహో మున్నా భాయి, 2006). వీరిలో ఒక బెన్‌కింగ్‌స్లీ మాత్రమే బ్రిటీష్ పౌరసత్వం, భారతీయ వారసత్వం కల వ్యక్తి. శ్యామ్ దస్తర్ కూడా ఇంగ్లాండ్‌లోనే విద్యాభ్యాసం చేశారు.

అంతేగాదు. బ్రిటీష్ వారు లేక పశ్చిమ దేశాలవారు గాంధీపై నిర్మించిన తొలి రెండు సిన్మాలలో అధికశాతం నటులు ఆయా దేశాల వారే తప్ప భారతీయులుకాదు. గాంధీపై మార్క్ రాబ్‌సన్ నిర్మించి, దర్శకత్వం వహించిన తొలి సినిమా 'నైన్ అవర్స్ టు రామా' గాంధీ దారుణ హత్యకు గురైన 15 సంవత్సరాలకు 1963లో విడుదల అయింది. అంతవరకూ కూడ గాంధీపై ఒక నివాళిగా కూడ భారతీయ నిర్మాతలు ఒక సినిమా తీయాలని అనుకోలేదు. ఇంకో విషయం కూడ ఇక్కడ చెప్పుకోవాలి. 'నైన్ అవర్స్ టు రామా' (1963) విడుదలైన తర్వాత కూడ దాదాపు 19 సంవత్సరాల దాకా కూడ గాంధీపై

ఎవరూ సినిమా తీయలేదు. ఆశ్చర్యకరంగా రిచర్డ్ అటెన్‌బరో దర్శకత్వం వహించిన గాంధీ సినిమా 1982లో విడుదలైన తరువాతనే భారతీయ సిన్మా నిర్మాతలకు గాంధీపై సినిమా తీయాలని సంకల్పం కలిగినట్లు తోస్తుంది.

ఇందాక చెప్పినట్లు గాంధీపై నిర్మించిన పది సినిమాలలో దాదాపు ఏడు సిన్మాలను ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా వంటి విదేశాలలో చిత్రీకరించారు. కొన్ని హాలీవుడ్ స్టూడియోలలో నిర్మితం అయినాయి. గాంధీపై విడుదలైన దాదాపు పది సినిమాలలో మూడింటికి తప్ప మిగతా వాటికి స్క్రిప్టు రాసినది మాత్రం భారతీయ రచయితలే కావటం విశేషం. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ (2000), ది లెజెండ్ ఆఫ్ భగత్ సింగ్ (2002), గాంధీ మై ఫాదర్ (2007) సిన్మాలకు మాత్రం స్క్రిప్టు కమిటీని ఏర్పరచి వారు క్షుణ్ణంగా చారిత్రక పరిశోధన జరిపిన తర్వాత స్క్రిప్టు సిద్ధం చేయటం జరిగింది.

ఇక్కడ ఒక విషయం తేటతెల్లం చేయాలి. నైన్ అవర్స్ టు రామా (1963), గాంధీ (1982) సిన్మాల స్థాయిలో తీయకపోయినా వాటి విడుదలకు ముందు స్వదేశీ నిర్మాతలు గాంధీపై భక్తి భావంతో కొన్ని కురచ చిత్రాలు లేక లఘు చిత్రాలు తీశారు. చెట్టియార్ ఫిల్మ్స్ వారు మహాత్మగాంధీ (1940)ని, మహాత్మగాంధీ – ట్వంటియత్ సెంచరీ ప్రాఫెట్ (1953)ని, ది లైట్ దట్ షాన్ (1948)లో తీశారు. ద్వారకా ఖోస్లా దర్శకత్వం వహించిన 'విశ్వదీప్ గాంధీ' కూడ వీటిలో ఒకటి. కేవలం మూడు రీళ్ళ నిడివి ఉండే సినిమా ఇది. ఇవేమీ ఇప్పుడు లభ్యమయ్యే స్థితిలేదు.

నైన్ అవర్స్‌టు రామ, లెజెండో ఆఫ్ భగత్‌సింగ్, లగేరహో మున్నాబాయి, గాంధీ మై ఫాదర్ వంటి సిన్మాలలో మాత్రం కొంత శృంగారం, ప్రేమ వంటి కమర్షియల్ హంగులు కనిపిస్తాయి.

ఈ విధంగా గాంధీపై ఆయన జీవించి ఉన్నప్పుడు కాని, ఆయన హత్యకు గురైన తర్వాత గాని భారతీయ నిర్మాత లెవ్వరూ సిన్మాలు నిర్మించడానికి ఆసక్తి కనబరచకపోవడానికి ఒక పూర్వ రంగం కూడ ఉంది. గాంధీ హత్యకు గురైన తర్వాత నెహ్రూ యుగం నడిచింది. దాదాపు 17 సంవత్సరాలు నెహ్రూ తిరుగులేని నాయకుడిగా ఏకచ్ఛత్రాధిపత్యం నెరిపారు. ఆయన కాలంలో మీడియా ఎక్కువగా నెహ్రూని పొగడ్తలతో ముంచెత్తడంలోనే తరించిందని

ఈ రంగంలో పరిశోధకులు ఏకగ్రీవంగా అంగీకరిస్తారు. గాంధీపై సినిమాలు నిర్మించటం కన్నా, ఆయన సిద్ధాంతాలను అమలు చేయటం ప్రాధమ్యంగా నెహ్రూ మాట్లాడేవారు. ఒకసారి 1963లో నెహ్రూ రాజ్యసభలో ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు జవాబుగా, 'గాంధీపై ప్రభుత్వ పరంగా చిత్ర నిర్మాణం చేయటం అనేది ఒక క్లిష్టమైన ప్రతిపాదన, అందుకు భారత ప్రభుత్వం సమర్ధమైన భాగస్వామి కాలేదు' అని తెలిపాడు. ఇంకో ఆసక్తికర విషయం ఏమిటంటే భారతదేశంలో సినీ రంగం బ్రిటీష్ పాలనలోనే పూర్తిస్థాయికి ఎదిగింది. దీన్ని నియంత్రించడానికి అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం తొలిసారిగా 'భారతీయ సినిమాటోగ్రఫీ కమిటీ'ని ఏర్పరచింది 1927–28 మధ్య. ఈ కమిటీ గాంధీ అభిప్రాయాలను కూడ కోరింది. కారణాలు ఏవైనా గాంధీ సినిమా పట్ల తనకు సరైన సదభిప్రాయం లేదని కమిటీకి తెలిపారు.

అయినా అప్పటికే ఉవ్వెత్తున ఎగసిపడుతున్న స్వాతంత్ర్యోద్యమంకు ప్రేరణగా రూపొందుతున్న భారతీయ సినిమాల వలన, లైంగిక, విశృంఖలత్వంతో భారతదేశంలో విడుదల అవుతున్న బ్రిటీష్ సిన్మాల వలన, బ్రిటీష్ స్త్రీల పట్ల, అధికారుల పట్ల భారతీయుల్లో పెరుగుతున్న వ్యతిరేకత, తక్కువ స్థాయి భావాల వలన, బ్రిటీష్ ప్రభుత్వం ఈ సినిమాటోగ్రఫీ కమిటీ సిఫార్సుల ఆధారంగా సెన్సార్ చట్టాన్ని తొలిసారి అమలులోకి తెచ్చింది. ఈ సెన్సారు నిబంధనల ప్రకారం బ్రిటీష్ సినిమాలలోని అభ్యంతరకర లైంగిక సన్నివేశాలను తొలగించటం చేసేవారు. అంతేగాక స్వాతంత్ర్యోద్యమాన్ని ఎగద్రోసే సిన్మాలను కూడ నియంత్రించసాగారు. వీటి నుంచి తప్పించుకోవడానికే నన్నట్లు అప్పటి భారతీయ సిన్మాని భక్తి మార్గంలో నడిపిస్తూ, దేవీ, దేవతలను 'భరతమాత' రూపంలో ఒక మెటఫర్‌గా చూపిస్తు ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను ఎగదోసేవారు దర్శకులు.

ఇలాంటి సందర్భంలో ఒకసారి మహాత్మగాంధీ 'రామరాజ్య' (1943) అనే సినిమాను బొంబాయిలో వీక్షించారు. దీనికి నాడు విజయభట్ దర్శకత్వం వహించారు. సిన్మా వీక్షించటం అయినాక సిన్మాహాల్ నుంచి గాంధీ బయటికి వచ్చారు. సిన్మాపై గాంధీ అభిప్రాయం కోరగా 'తను ఈ సినిమా అనే దృశ్య కావ్యాన్ని భరించలేనని, ఎప్పుడెప్పుడు సిన్మా హాల్‌నుంచి బయటకు పోతానా' అని నిరీక్షించానని తెలిపారు. గాంధీ చేసిన ఈ వ్యాఖ్యలు అప్పటి పత్రికల్లో బహుళ ప్రాచుర్యం పొందటంతో భారతీయ సినిమా పరిశ్రమ చాలా ఇరకాటంలో

పడింది. క్వాజా అహ్మద్ అబ్బాస్ అనే ప్రముఖ సినీ పరిశ్రమ వ్యక్తి గాంధీ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందిస్తూ ఒక ఉత్తరం కూడ రాశారు. ఆ ఉత్తరంలో సినిమా పరిశ్రమ తెచ్చిన ఆధునికతను గుర్తించమని, పరిశ్రమలో శ్రమిస్తున్న వేలాది మంది కార్మికులను గుర్తించమని ప్రాధేయపడ్డారు. మరో సినిమా పత్రిక 'ఫిల్మ్ ఇండియా' ప్రముఖుడు బాబూ రావ్ పటేల్ కూడ ఇంచుమించుగా ఇదే విధమైన విన్నపం పంపించారు గాంధీకి.

గాంధీ జీవించి ఉన్న కాలంలో, గాంధీ హత్యకు గురైన తర్వాత కూడ భారతీయ నిర్మాతలు ఈ జాతిపితపై సిన్మా నిర్మించడానికి ముందుకు రాకపోవటానికి కారణం గాంధీ సినిమా పరిశ్రమ పట్ల, సిన్మా పట్ల వ్యక్తపరచిన భావాలేనని అనేకమంది ప్రసిద్ధ పరిశోధకులు భావిస్తారు. గాంధీ తన జీవిత కాలంలో చూసిన మొదటిది, ఆఖరిది అయిన సినిమా 'రామరాజ్య'మే. ఒక సందర్భంలో సినిమాల పై తన అభిప్రాయం చెబుతూ 'సినిమాకు మనిషి కంటిని తప్పుదోవలో నడిపించే శక్తి చాలా అధికమని, సినిమా చూడటం వలన మనిషి చెడు మార్గానికి మళ్ళే అవకాశాలు ఎక్కువన్నట్లు' అభిప్రాయపడ్డారు. గాంధీకి సినిమాపై ఉన్న అభిప్రాయాలు నాటి సాంఘిక, సంప్రదాయ నిర్మాణాలకు అనుగుణంగా ఉన్నా, లేకపోయినా గాంధీపై 1982-2007 మధ్య ఒక్కసారిగా పలు సినిమాలు విడుదలైనాయి. గాంధీ నమ్మిన విలువలను, అనుసరించిన మార్గాలను అభివ్యక్తీకరిస్తూనే గాంధీ వ్యక్తిత్వాన్ని భిన్నకోణాలలో విశ్లేషించాయి ఈ సినిమాలు. ఈ సినిమాలన్నీ ఒకేసారి వరుసగా చూస్తే గాంధీని 2007 నాటికి భారతీయ సమాజం ఎంత మేరకు సరిగ్గా అవగాహన చేసుకొందో మనకు స్పష్టమైన అవగాహన వస్తుంది. ఇదే గాంధీపై సినిమాలు నిర్మించడం వెనుకనున్న కథ సంక్షిప్తంగా.

(స్వాతి మాసపత్రిక నవంబర్, 2022)

12
దేవదాసు - వలసానంతర వాద వక్రీకరణలు

ఈ మధ్య వలసానంతరవాద సామాజిక సిద్ధాంతాలను (పోస్ట్ - కొలోనియల్) భారతీయ సాహిత్యానికి, అందులోని పాత్రలకు వర్తిస్తూ అనేక వ్యాసాలూ సాహిత్య పత్రికల్లో, పరిశోధనా పత్రికల్లో దర్శనమిస్తున్నాయి. ఈ వ్యాసాల్లో భారతీయ సాహిత్యాన్ని, అందులోని పాత్రల్ని వక్రీకరించి రాస్తుండటం కూడా గమనించవచ్చు. కొన్ని సందర్భాలలో ఆ సాహిత్య మూలానికి (ఫిడిలిటి టు ఒరిజినల్) ఏ మాత్రం సంబంధంలేని దానికి ఎంత మాత్రం వర్తించని వ్యాఖ్యానాలు విమర్శలు కూడా చేయడం జరుగుతుంది. వాస్తవానికి ఈ వలసానంతరవాద సామాజిక సిద్ధాంతాలు కూడా పాశ్చాత్య సిద్ధాంతాలే. అయితే వీటిని అలా ఎందుకు వర్తిస్తున్నారు అంటే ఒకప్పుడు భారతదేశం కూడా వలస పాలకుల చేతుల్లో మగ్గింది కాబట్టి. అంతే కాదు, వలస పాలకులు పాలించిన దేశాలకు, ఆ దేశాల సాహిత్యానికి, ఆ సాహిత్య పాత్రలకు, వలస పాలకులే సృజించిన సిద్ధాంతాలనే వర్తింప చేస్తే తిరుగుండదనేమో చాలా మంది భారతీయ సామాజిక శాస్త్రవేత్తలు ఇక్కడున్నా, విదేశాలలో ఉన్నా ఈ వలసానంతర వాద సిద్ధాంతాలనే ప్రయోగిస్తుంటారు. నిజానికి వలసానంతర వాద సామాజిక సిద్ధాంతాలు అంత సమగ్రమైనవా? అవి భారతీయతను, భారతీయ స్త్రీ, పురుష సంబంధాలను, భారతీయ జీవన స్థితిగతులను వక్రీకరించడం లేదా? ఈ విధమైన వక్రీకరించిన విమర్శనాత్మక వ్యాసాల వల్ల ఎవరికి జ్ఞానోదయం (ఎన్లైటెన్మెంట్) అవుతున్నది? అసలు ఈ విధమైన వ్యాస రచనకు పరిమితులు ఉన్నాయా, లేవా? ఉంటే అవి ఎలా, ఎందుకు ఉండాలి వంటివి ఈ వ్యాసంలో ప్రధాన చర్చాంశాలు.

పైన చెప్పినట్లు వలసానంతరవాద సామాజిక సిద్ధాంతాలను వర్తింప చేస్తూ వక్రీకరించిన ఒక అత్యంత ప్రముఖమైన సాహితీ అంశానికి ఒక ఉదాహరణ దేవదాసు

నవల. దీని గురించి భారత దేశంలో తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు. ప్రేమానురాగభరితమై, అమలినమై, భావోద్వేగాలతో, సంప్రదాయ విలువలతో పాఠకులను ఉత్కంఠతో ఉక్కిరిబిక్కిరి చేసే నవలా సాహిత్యం అది. శరత్చంద్ర ఛటోపాధ్యాయ బెంగాలీలో రాసిన అనేక ప్రసిద్ధ నవలలో దేవదాసు ముందుంటుంది. ఇది భారత దేశంలో దాదాపుగా అన్ని భాషల్లోకి అనువాదమైన ఏకైక నవల కూడా. దీన్ని దాదాపు 13 భాషల్లో సినిమాగా నిర్మించారు. కేవలం రాతలో ఉన్న నవలనే కాకుండా, సినిమా రూపంలోని దృశ్య రూపకాన్ని కూడా సాహితీవేత్తలు 'టెక్ట్స్' (అంటే అచ్చులో ఉన్న నవలలానే) గా పరిగణిస్తారు. శరత్చంద్ర చటోపాధ్యాయ కూడా నాడు అగ్రగామి బెంగాలీ రచయితల్లో ఒకరైనందున ఉన్నత విద్యలకు విదేశాలకు వెళ్లిన భారతీయ విద్యార్థులు, విదేశాల్లో స్థిరపడిన భారతీయులు ఆయన దేవదాసు నవలను, సినిమాను పరిశోధనాంశంగా ఎంచుకున్నారు. వాళ్లలో పూనమ్ అరోరా, పూజారంగన్, క్రీక్మూర్ లాంటివారు కూడా ఉన్నారు. పూనమ్ అరోరా దేవదాసు సినిమాపై ఒక పరిశోధనా వ్యాసాన్ని, 'సౌత్ ఆసియన్ లిటరేచర్ జర్నల్'లో ప్రచురించారు. (Devadas : Indian Cinemas, Emasculated Hero, Sado-masochism and Colonialism, 1995) అలాగే పూజారంగన్ (Transistions, Translations : Bollywood as a Signifying Practice) ఒక వ్యాసాన్ని 'ది సరాయి' రీడర్లో 2006లో ప్రచురించారు.

వలసానంతర వాద సిద్ధాంత కర్తల్లో ఒకరైన ఫ్రాంట్జ్ ఫనాన్ (1925-61) రచనలు, లారామౌల్వి (1941) వంటి ఫెమినిస్టు సిద్ధాంతాల ఆధారంగా దేవదాసు నవలలోని దేవదాసు, పార్వతి, చంద్రముఖి పాత్రలను విశ్లేషించారు. ఆ విశ్లేషణలు ఎంత దూరం వెళ్లాయి అంటే ఆఖరికి దేవదాసును 'నపుంసకుడి'గా, 'నార్సిస్ట్' (అంటే స్వీయ పొగడ్తలు, అహంభావం కలబోసిన వ్యక్తి) గా, శాడోమాసోచిస్టిక్ (తనను తానూ హింసించుకొంటూ, స్త్రీలను లైంగికంగా వేధిస్తూ ఆనందం పొందే వ్యక్తి) గా వర్ణించారు. అంతే గాక హెగెల్ (1770-1837) యజమాని - బానిస సిద్ధాంతం, జెస్సికా బెంజిమన్ (1946) శాడోమాసోచిస్టిక్ సిద్ధాంతాలను సమ్మేళనం చేసి పార్వతి, చంద్రముఖి, దేవదాసుల వ్యక్తిత్వాలను ఘోరంగా వక్రీకరించారు పూనమ్ అరోరా. ఇటు చంద్రముఖితో గాని, అటు

పార్వతితో గాని దేవదాసుకు ఎటువంటి లైంగిక సంబంధాలు లేకపోవడం 'కోలోనియల్ – నార్సిస్సం'గా పూనమ్ అరోరా అభివర్ణించింది. దేవదాసు ఇంగ్లీష్ విద్యనభ్యసించటం, తర్వాత పరిణామాలలో తల్లిని కోల్పోవడంతో అతనిలో లైంగికంగా విపరీత ధోరణులు ఏర్పడటానికి కారణం అయ్యాయి అని పూనమ్ అరోరా రాశారు.

దేవదాసు అటు పార్వతిని, ఇటు చంద్రముఖిని గాని ఎవరినీ వివాహం ఆడకుండా ఒక అనిశ్చిత మానసిక స్థితిలో తాగుడుకు బానిస అవటం అనేది పాశ్చాత్యుల నాగరికతకు, అవగాహనకు సరిపడని విషయం, భిన్నమైనది కాబట్టి పాశ్చాత్య సిద్ధాంతాల ప్రకారం, వలసానంతరవాద సిద్ధాంతాల ప్రకారం అతనిని 'శాడిస్ట్' గా, 'శాడోమాసోచిస్ట్' గా, 'నపుంసకుడి'గా, 'నార్సిస్ట్' గా, అభివర్ణించడానికి వీలయింది. ఈ పరిశోధనలో బయట పడ్డ విషయం ఏమిటంటే వలసానంతరవాద సిద్ధాంతాలు దేవదాసుకు వర్తించేలా చేయడానికి మూలంలో లేని అనేక విషయాలను ఈ శోధకులు మూలంలోకి చొప్పించారు. అంటే, 'మూలం పట్ల విధేయత' (fidelity to original) అనే దానికి మంగళం పాడారు.

నిజానికి పాశ్చాత్య సామాజిక శాస్త్రవేత్తలు, వలసానంతర వాద సామాజిక శాస్త్రవేత్తలు ఇంత విచ్చలవిడిగా భారతీయ సాహిత్యం పట్ల స్వేచ్ఛ తీసుకోవడానికి కారణం వారు శిక్షణ పొందిన పాశ్చాత్య సిద్ధాంతాలే. వలసానంతరవాద సిద్ధాంతాలు కూడా పాశ్చాత్య సిద్ధాంతాలే. మన మేధావులు, విదేశాలలోని మేధావులు తరుచూ జపం చేసే విదేశీ సిద్ధాంతాలలో ఫ్రాయిడ్ 'ఎడిపస్కాంప్లెక్స్', ఫ్రాయిడ్ 'మనోవిశ్లేషణ', 'మార్క్సిజం', 'పోస్ట్ క్రిటికల్ సిద్ధాంతాలు' వంటివి ముఖ్యమైనవి. అయితే వీరు, లేకపోతే వీరి అనుచరులు ఫ్రాంట్జ్‌ఫనాన్, ఆంటోనియా గ్రామిస్సీయి, బెంజమిన్ జెస్సికా, జాకీస్ లకాన్ వంటి వారు. ఇక సాహిత్య విమర్శలకు వస్తే రోలా బార్త్, జూలియాక్రిస్టివా, జాకీస్ దేరిడా వంటి వారు ముందు ఉంటారు. వీరి ప్రస్తావన ఎందుకు అవసరం అయిందంటే దేవదాసు నవల/ సినిమాపై పూనమ్ అరోరా, పూజారంగన్ చేసిన విమర్శలు, అంతకు పూర్వం వీరి సమకాలికుడు క్రీక్‌మూర్ వంటి విదేశీ విశ్లేషకులు, చేసిన విమర్శలు అన్నీ కూడా ఇక్కడ పేర్కొన్న మేధావులను ఉటంకిస్తూ చేసినవే.

వలస దేశాలపై పాశ్చాత్య సిద్ధాంతాల ఆధిపత్యమును తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఎన్నో ప్రసిద్ధ పరిశోధన గ్రంథాలు, రచనలు పాశ్చాత్య దేశాలనించే వెలువడినా (ఎడ్వర్డ్ సయిద్ 'ఓరియెంటలిజం', 1978, థామస్ కుహన్ 'స్ట్రక్చర్ ఆఫ్ సైంటిఫిక్ రివల్యూషన్స్' 1962, వాలర్ స్టెయిన్ 'యూరోపియన్ యూనివర్సలిజం: ది రిటోరిక్ ఆఫ్ పవర్,' 2006) విచ్చలవిడిగా దేవదాసులోని భారతీయ సంస్కృతిని వక్రీకరిస్తూ, తాము వర్తింపజేసే సిద్ధాంతాల కోసం ఆ సాహిత్యంలోని పాత్రలకు వక్రీకరణలు చొప్పించడం ఎలా జరిగిందో చూద్దాం.

పూజారంగన్, క్రీక్‌మూర్, అరోరా లాంటి వాళ్లు దేవదాసు నవల రచనా కాలాన్ని 1930 ప్రాంతాలుగా భావించారు. అంతేగాదు, అప్పటికే ఆ కాలం ఆధునిక నాగరికతలోకి వస్తుందని కూడా నిర్ధారించారు. ఇందుకు వాళ్ళు చూపిన ఆధారాలు ఏమిటంటే దేవదాసు ఇంగ్లీష్ మాధ్యమం ఉన్న స్కూళ్లలో చదివాడని, సూటు, బూటు వేసుకున్నాడని, టోపి పెట్టుకొని ఒక పొన్ను చేతి కర్ర చేతిలో ఎప్పుడూ ఉంచుకొనేవాడని, గుర్ర బగ్గీలలో తిరిగే వాడని, తరచూ వ్యభిచార గృహాలకు వెళ్లే వాడని, తాగు తాడని. ఇవన్నీ ఆధునికతకు సిమ్బల్స్‌గా పరిగణించారు.

వాస్తవం ఏమిటంటే దేవదాసు 1901 ప్రాంతాల్లో రచించారు అనడానికి ఆధారాలు అనేకం. దేవదాసు తొలి ముద్రణ 1917లోనే జరిగింది. వాళ్ళు ఆధునికతకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లుగా భావించిన సింబల్స్ బెంగాల్‌కు, వారి సంస్కృతికి అత్యంత సహజమైంది. బెంగాలీ జమిందారీ సంప్రదాయంలో ఈ విధమైన వేషధారణను 'భద్రలోక్' అని అంటారు. సాధారణ బెంగాలీలు ఈ వేషధారణలో ఉండే వారిని 'బాబూలు' (babus) అని కూడా అంటారు. అలాగే వ్యభిచార గృహాలకు వెళ్లే మాట వస్తే, దేవదాసు ఒకేసారి వ్యభిచార గృహానికి వెళ్తాడు మొత్తం నవలలో. అది కూడా తన స్నేహితుడు అక్కడ ఆనందం లభిస్తుందని నమ్మబలకటంతో. కానీ, అక్కడ జరిగే నాట్యాలు, ముఖ్యంగా చంద్రముఖి నాట్యం, ఆవిడ దగ్గర సుఖం కొనుక్కోవడానికి ఎందరో పెద్దలు ఆరాటం, పోటీ పడటం చూశాక చంద్రముఖిని ఈసడించుకొని బయటకు వచ్చేస్తాడు. అంతే. మళ్లీ ఎప్పుడూ వెళ్ళలేదు నవలలో.

ఈ నేపథ్యంలో ఈ పాశ్చాత్య సిద్ధాంతాల వెనుక ఉన్న 'యూరో సెంట్రీసిజం', 'వెస్టర్న్ సైంటిసిజం'ను అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ ఎడ్వార్డ్ సయ్యద్ 'ఒరియెంటలిజం' ప్రస్తావన చేయవలసి ఉంటుంది. ఎడ్వర్డ్ సయ్యద్ (1935-2003) తన 'ఒరియెంటలిజం' (Orientalism, 1978) లో పాశ్చాత్యులకు మధ్య ప్రాచ్య దేశాల సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలూ, నియమ నిబంధనలు, వేషధారణలు పట్ల ఉన్న తప్పుడు భావనలను, ఆలోచనలను తూర్పారబట్టాడు. ముఖ్యంగా ముస్లింల పట్ల, అరబ్బుల పట్ల, వారి స్త్రీలు, సమాజం పట్ల ఉన్న యూరోప్ 'బయాస్'ను యూరోసెంట్రీసిజం వైపు నుంచి ఎండగట్టాడు. ఈ పరిశోధన ఒక క్లాసిక్ పరిశోధనగా, ప్రామాణిక టెక్స్ట్‌గా, బెస్ట్ సెల్లర్‌గా నేటికీ ప్రపంచ వ్యాప్తంగా అన్ని విశ్వ విద్యాలయాలలో బోధిస్తున్నారు. కానీ, మన దేశంలో ఒక్కశాతం విశ్వ విద్యాలయాల్లో కూడా దీనిని బోధించరు.

ఇంకొక వక్రీకరణ ఏమిటంటే దేవదాసు ఆంగ్ల మాధ్యమంలో చదవటం వలన క్రమశిక్షణ అతని జీవన శైలి అయిందని, అందువల్లే అతను తన ప్రేమ కోసం తండ్రిని ఎదిరించలేకపోయాడు అని. నిజానికి 1900 నాటికి భారతీయ సంప్రదాయ సమాజం, పితృస్వామ్యంలో కొడుకు తండ్రిని ఎదిరించడం అనేది లేదు. ఒక రకంగా దేవదాసు నవల రచన, శిల్పం, పాత్రలు, అన్ని కూడా ఆధ్యాత్మిక స్రవంతి చుట్టు అల్లుకొని ఉంటాయి. నూటికి తొంభై శాతం పాత్రల పేర్లు శివుడివో, విష్ణువో అయి ఉంటాయి. పైగా ఆనాటి బెంగాల్ సామాజిక స్థితి ఆధ్యాత్మికతతో పరిఢవిల్లుతోంది. ఈ విషయంలో దేశానికే బెంగాల్ నాయకత్వం కూడా వహిస్తున్నది. శరత్చంద్రుడు ఈ నవల రాసిన కాలంలోనే శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, ఆరోబిందు ఘోష్, రవీంద్రనాథ్ ఠాగూర్, స్వామి దయానంద సరస్వతి వంటి వారు కలకత్తాలోనే ఉండేవారు. స్వయంగా శరత్చంద్ర సోదరుడు స్వామి వేదానంద కోల్కతాలోని రామకృష్ణ మఠంలో కొంతకాలం సన్యాసిలా జీవించాడు. దేవదాసు నవలలో భర్త పోయాక అతని తల్లి కూడా కాశీకి వెళ్లి సన్యాసినిగా శేష జీవితం గడిపింది అని రాశారు శరత్చంద్రుడు.

అంతే గాదు, దేవదాసు మాటలతో జ్ఞానోదయం అయినా వ్యక్తిగా చంద్రముఖి నాట్యం, వ్యభిచారం మానేసి గంగా నది ఒడ్డున ఒక ఆశ్రమం కట్టుకుని సన్యాసినిగా జీవితం గడుపుతున్నట్లుగా కూడా శరత్చంద్రుడు రాశారు. దేవదాసు నవలలో 'బిష్ణోయ్' పాత్రలతో వేదాంత సంబంధం ఉన్న పాటలు పాడిస్తారు శరత్చంద్రుడు. ఈ సన్నివేశం

బిమల్‌రాయ్ తీసిన దేవదాసు (1955) లో ఉంటుంది.... ఈ పాట భవిష్యత్ సూచకంగా తాత్వికంగా కూడా ఉంటుంది. దేవదాసు తెలుగు (1953) సినిమాలో కూడా తాత్వికత కూడిన పాటలు ప్రేక్షకులను భావగర్భితం చేసి, ముగ్ధులను చేస్తాయి. అసలు ఈ నవలలోనే ఒక తాత్వికత అంతర్లీనంగా ప్రవహిస్తూ పాత్రలను దానిలో ముంచి తెలుస్తూ ఉంటుంది. ఒకవేళ దేవదాసు ఆంగ్ల విద్య నభ్యసించటం, సూటు, బూటు, టోపి, చేతికర్ర ధరించడం ఆధునిక నాగరికత చిహ్నాలు అయితే, ఇక్కడ పేర్కొన్న అనేక అంశాలు దేవదాసు నవలను సనాతన సంప్రదాయ చట్రంకే పరిమితం చేస్తుంది అని బల్లగుద్ది చెప్పవచ్చు. దీనిని బట్టి వలసానంతరవాద పాశ్చాత్య సిద్ధాంతాలను వర్తింప చేసేందుకు పాత్రల వక్రీకరణలు చేశారన్నది తేటతెల్లం అవుతోంది.

దేవదాసు తన తల్లి ప్రభావం వలన లైంగికంగా అనేక విపరీత ధోరణలుకు లోనైనాడని అరోరా చేసిన విశ్లేషణ భారతీయ తల్లి, బిడ్డల మధ్య ఉండే ప్రేమ, ఆప్యాయతలనే ప్రశ్నించే విధంగా ఉంటుంది. నిజానికి నవల మూలాల్లోకి వెళ్తే దేవదాసు ఒకసారి విద్యాభ్యాసం కోసం కోల్కతా వచ్చిన తర్వాత చాలా తక్కువ సార్లు స్వగ్రామం వెళ్తాడు. వెళ్ళినప్పుడు కూడా అక్కడ పరిస్థితులు చూసి తట్టుకోలేక వెనువెంటనే తిరిగి కోల్కతా వచ్చేస్తాడు. భర్తకు అనుంగు భార్యగా దేవదాసు తల్లి ఎప్పుడూ భర్తను అంటి పెట్టుకుని ఉన్నట్టే రాశాడు శరత్చంద్రుడు. తల్లి, కొడుకులు ఒక చోట గడిపిన కాలం, సంఘటనలే నవలలో లేవు. ఉత్తర ప్రత్యుత్తరాలు తండ్రి, కొడుకుల మధ్యనే సాగుతాయి. తల్లితో తన పార్వతి ప్రేమ గురించి ఏకాంతంగా కూడా ఎక్కడా చర్చించినట్టు రాయలేదు నవలలో. అలాంటప్పుడు ఈ వక్రీకరణ ఎలా సాధ్యం అయింది అన్న ప్రశ్నకు 'ఫ్రాయిడ్ ఎడిపస్ కాంప్లెక్స్' ఆధారంగా ఫ్రాంట్జ్‌ఫనాన్, జెస్సికా బెంజిమిన్ల సిద్ధాంతాలను మేళవించి ఇలా వక్రీకరించటం సాధ్యం అయింది. ఈ నేపథ్యంలో ఫ్రాయిడ్ పైన, ఫ్రాయిడ్ రాసిన 'ఎడిపస్ కాంప్లెక్స్' పైన థామస్ సాజ్ (1920–2012) విశ్లేషణలకు ఎంతో ప్రాధాన్యం ఏర్పడుతోంది. ఇలా ఎంత మాత్రం సారూప్యం లేని భారతీయ పాశ్చాత్య నాగరికతలకు, పాశ్చాత్య సిద్ధాంతాలను వర్తింప చేయడం థామస్ కుహన్ (1922–1996) 'స్ట్రక్చర్ ఆఫ్ సైంటిఫిక్ రివల్యూషన్స్' (1962) ప్రకారం 'కల్చరల్ ఇన్ కమెన్‌సురబిలిటి' అవుతుంది. అయితే మాత్రమేం? తమకు తోచిన పాశ్చాత్య సిద్ధాంతాన్ని తీసుకోవడం భారతీయ స్త్రీ, పురుష సంబంధాలను వ్యాఖ్యానించడం నేటి పరిశోధనల్లో మేధావి తనానికి గీటురాయిగా

మారుతోంది. అందుకే వాలర్‌స్టెయిన్ (1930-2019) తన 'యూరోపియన్ యూనివర్సలిజం : ది రెటోరిక్ ఆఫ్ పవర్' (2006) లో వలస పాలనకు గురైన దేశాలు, ఆర్థికంగా వెనుకబడిన దేశాలన్నీ 'యూరోసెంట్రీసిజం', 'వెస్టర్న్ సైంటిసిజం'కు వ్యతిరేకంగా గళం విప్పిన రోజున నిజమైన 'యూనివర్సలిజం' వస్తుందని పిలుపునిచ్చాడు.

నిజానికి బానిస భావజాలంలో నాలుగు శతాబ్దాలు మగ్గినా భారతీయులు తమ సంప్రదాయ, సమిష్టి, ఆచార, వ్యవహార భావనలలో, స్త్రీ, పురుష సంబంధాలలో తీవ్రమైన మార్పులకు లోను కాలేదు. స్త్రీ, పురుష సంబంధాలు, సంప్రదాయ పరిధిలోనే ఉన్నాయి. అంటే 'స్ట్రక్చరలిస్ట్ లేక ఫౌండేషనిస్ట్ లేక మోడర్నిస్ట్' చట్రంలోనే ఉన్నాయి. వలసానంతరవాదం (పోస్ట్ కోలోనియలిజం), ఉత్తర ఆధునికత్వం (పోస్ట్ మోడర్నిజం), జోక్యం (ఇంటర్వెన్షన్) చేసుకునేంత స్థాయికి ఎదగలేదు. అయినా బలవంతంగా ఇన్ కమెన్సురేబిలిటీ, ఇర్రెలెవన్స్, కంపాటిబిలిటీ లాంటివి (థామస్ కుహన్ చెప్పినవి) పక్కన బెట్టి చేస్తామంటే అడ్డేముంది? వాస్తవానికి వలసానంతరవాదం (పోస్ట్ కోలోనియలిజం), ఉత్తర ఆధునికత్వం (పోస్ట్ మోడర్నిజం)కి విశ్వజననీయత లేదు. సార్వజనీయత లేదు. కేవలం ఒక సందర్భాన్ని జస్టిఫై చేసేందుకు అపద్ధర్మ విశ్లేషణగానే వీటి విశ్లేషణలను పరిగణిస్తారు. అవి గూడా వక్రీకరణలు లేకుండా ఉంటేనే. మన దేశ జనాభాలో ఒక జిల్లా జనాభా కూడా లేని దేశాలలో అనేక సామాజిక సిద్ధాంతాలు ఉద్భవిస్తుంటే 130 కోట్ల జనాభా ఉన్న దేశం నుంచి స్వదేశీయమైన సామాజిక సిద్ధాంతాలు నేటికీ లేకపోవడం ఏమి దారిద్ర్యం అనుకోవాలి. ఇలా వలసానంతరవాదం (పోస్ట్ కొలోనియలిజం), ఉత్తర ఆధునికత్వం (పోస్ట్ మోడర్నిజం) సిద్ధాంతాలు విచ్చలవిడిగా వాడితే మన దేశ సంప్రదాయ కవిత్వం, రచనలు, శృంగార కవిత్వం, విరహ కవిత్వం, ఆత్మాశ్రయ కవిత్వం అంతా 'నార్సిసెం'గా 'శాడిజం' గా, 'మాసోచిజం' గా మారిపోయే ప్రమాదం లేకపోలేదు.

(ఆంధ్రజ్యోతి వివిధ దినపత్రిక అక్టోబర్ 31, 2022)

13
బమ్మెర పోతన ఎక్కడివాడు ?

ఈనాటికీ సహజ పండితులు, సంస్కృతాంధ్ర మహాకవి బమ్మెర పోతనామాత్యుడి సమగ్ర జీవితావిష్కారం కాలేదంటే మనకు ఆశ్చర్యం కలగక మానదు. బమ్మెర పోతన జీవితంలోని ప్రతి అంశమూ వివాదాస్పదమే. బమ్మెర పోతన "బమ్మెర" వాడా, 'బొమ్మర' వాడా నుండి మొదలైన వివాదాలు, ఆయనే రాశారని చెబుతున్నా 'నారాయణ శతకం' 'వీరభద్ర విజయం' భోగినీ దండకం' చుట్టూ తిరిగి, పోతన తన జీవితం చివరి వరకు ఏక శిలానగరం/ఓరుగల్లు/వోరుగల్లులోనే గడిపాడా, లేదా వరకు అన్నీ వివాదాలే. దేనికి స్పష్టమైన సమాధానం లేదు. ఎవరికి వారే తాము చేసిన పరిశోధన ఆధారంగా మొత్తం సమస్యలన్నీ 'సమసి పోయాయి', ఇక వీటిపై ఎటువంటి వివాదాలు లేవని కూడా చెప్పుకుంటారు. కానీ, నల్గురు చేసిన పరిశోధనలను తులనాత్మకంగా పరిశీలిస్తే ఇంతవరకు బమ్మెర పోతనామాత్యుని సంగ్రహ జీవితావిష్కారంలో అన్ని సమస్యలు ఎక్కడివి అక్కడే ఉన్నాయన్నది చెప్పకనే బోధపడుతుంది. ఇలా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, వేరు వేరు పరిశోధకుల ఆవిష్కారాల మధ్య వైరుధ్యాలు బయటికి తెలుపడమే ఈ వ్యాసంలోని ప్రధాన చర్చాంశం.

ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో బమ్మెర పోతనామాత్యుని జీవిత సంగ్రహావిష్కారం చేసే ప్రయత్నంలో వెలువడిన రెండు ప్రముఖ గ్రంథాలను ప్రస్తావించడం చాలా అవసరం. అది 'పోతన మహాకవి – సర్వతోముఖ 'పాండిత్యము' (2016). రెండవది 'బమ్మెర పోతనామాత్యుని భోగినీ దండకము (2018). ఇందులో మొదటిది రాసిన వారు ప్రముఖ

సంస్కృతాంధ్ర పండితులు గరిమెళ్ళ అచ్యుత సత్యశేషగిరి సోమయాజిశర్మ (ఇకపై ఈ వ్యాసంలో వీరి పేరు గరిమెళ్ళ వారు) రెండవది రాసిన వారు కూడ ప్రముఖ సంస్కృతాంధ్ర పండితులు సంగనభట్ల నరసయ్య. ఈ ఇద్దరి రచనలను విశ్లేషిస్తే ఈ ఇద్దరుద్దండ పండితులు మధ్య అంగీకారమైనవి, అనంగీకారమైనవి ఎన్నో బయట పడ్డాయి. ఇద్దరు వేరు వేరు మార్గాలలో పోతన సమగ్ర జీవితావిష్కారం కోసం తమ వంతు ప్రయత్నాలు తాము చేశారు. గరిమెళ్ళ వారు పోతన సాహిత్య కాలం ముఖ్యంగా పోతన గారి భాగవత రచనా కాలం ఆవిష్కరించడానికి పోతన ముందు, తర్వాత సాహిత్యాన్ని శోధన చేసి కొంత వరకు కొన్ని పరిష్కారాలు, ఆవిష్కారాలు చేశారు. సంగనభట్ల వారు చరిత్ర శోధన చేసి కొన్ని ఆవిష్కారాలు చేశారు. ఇరువురు స్వతంత్రంగా పోతనామాత్యుని స్వగ్రామం 'బమ్మెర' అని, పోతన భాగవత రచన 'ఏకశిలా నగరం' (వరంగల్, ఓరుగల్లు/ యోరుగల్లు) లోనే ఆరంభం చేశారు అని అంగీకరించారు. అంతేకాక ఇరువురు పోతననే 'భోగినీ దండకము' రాశాడని, పోతన భాగవత రచనా కాలం 1450కి ముందే జరిగిందని అంగీకరించారు.

స్థూలంగా అంగీకరించిన ఈ విషయాలు తప్ప మిగతావేవి ఎక్కడా కలవవు. ఈ క్రమంలో ఇరువురు పండితులు (గరిమెళ్ళ వారు ఆంధ్రా నుంచి, సంగనభట్ల వారు ధర్మపురి నుంచి) ఎక్కువగా విభేదించింది, విమర్శించింది వావిలికొలను సుబ్బారావు గారిని, వారి గ్రంథాలను. అసలు జరిగిందేమిటో, మొత్తం నేపథ్యం ఏమిటో, ఎంత సంక్లిష్టమైందో తెలుసుకోవడానికి వావిలికొలను సుబ్బారావు (వీరిని 'ఆంధ్ర వాల్మీకి' అంటారు. వాల్మీకి రాసిన సంస్కృత రామాయణాన్ని యథాతథంగా తెలుగులోనికి అనువదించిన తొలి మహాకవి, సంస్కృతాంధ్ర పండితుడు) రాసిన గ్రంథాలను సేకరించి పరిశీలిస్తే ఎన్నో విభ్రాంతికరమైన విషయాలు బయట పడ్డాయి. వీటిలో ముఖ్యమైనవి 'బమ్మెర పోతరాజు విజయం' (బ.పో.వి.1919), 'పోతన నికేతనచర్చ' (పో.ని.చ.1920) 'ఆంధ్ర వాల్మీకి జీవిత చరిత్ర' (1981). ఇవి గాక వానమామలై వరదాచార్యులు రాసిన 'పోతన చరిత్ర' (1996), సి.పి.బ్రౌన్ అకాడమీ వారు వేసిన 'బమ్మెర పోతనపై విమర్శనా వ్యాసాలు' (2020). వీటిని పరిశీలనగా చదివితే ఈ ఇరువురు పండితుల పోతన సమగ్ర జీవితావిష్కారానికి ఎన్నో ఆమడల దూరంలోనే ఆగిపోయారన్నది వాస్తవం. వారు చెప్పుకొన్నట్లు పోతన జీవితం చుట్టూ అల్లుకొన్న

అనేక చిక్కుముడులనేవీ వీరి రచనలు విప్పదీయలేదు. నిజానికి పోతన సమగ్ర జీవితావిష్కార ప్రయత్నంలో పాల్గొన్న పండితులు, సాహిత్య శోధకులు, చరిత్రకారులు పూర్తిగా తెలుగు వారే అయినా ఒక వర్గం వారు కోస్తా నుండి, మరో వర్గం వారు రాయలసీమ నుండి పరస్పరం ఖండన మండనాలకు, వాద ప్రతివాదనలకు దిగారు గత రెండు శతాబ్దాలలో (19, 20). సంగనభట్ల నరసయ్య గారు ధర్మపురి నుంచి తొలిసారిగా ఈ వివాదంలోకి దూకి తన వంతు వాదనలు వినిపించారు. అయితే ఈ ప్రయత్నంలో సంగనభట్ల వారు చెప్పుకొన్నట్లుగా ఆయనేమీ నూతన వాదాలను ప్రవేశ పెట్టలేదన్నది నిర్వివాదం. గతంలో 'ఓరుగల్లు' (వరంగల్) వాదం వినిపించిన ఉత్తరాంధ్ర కవుల, రచయితల, చరిత్రకారుల పరిశీలనలే ఈయన పునరుద్ఘాటించారు. కాకపోతే 'రాచకొండ రాజవంశం' భేతాళ నాయకుడు (1225–53), 'రసార్ణవ సుధాకరం తెల్పిన వంశం వృక్షం'ను తీసుకుని మూడవ సింగ భూపాలుడికి కూడా 'సర్వజ్ఞుడని' బిరుదు వంశానుగతంగా వచ్చిందని, పోతన ఆతని కాలం వాడని, శ్రీనాథుడు రెండవ సింగ భూపాలుడి తరం వాడని, ఆతనికి కూడా 'సర్వజ్ఞ' బిరుదు ఉండిందని పేర్కొన్నారు. ఈ రాచరికాలు, వంశ వృక్షాలు ప్రాథమిక ఆధారంగా పోతన 'బమ్మెర' వాడేనని, భాగవతం 'ఏకశిలా నగరం' అని అప్పట్లో పిలిచేది నేటి వారంగల్/ఓరుగల్లునని చెప్పుకొచ్చారు. అయితే గరిమెళ్ళ వారు ఈ విషయంలో సంగనభట్ల వారితో ఏకీభవించినా, శ్రీనాధుడు, పోతన సమకాలీనులేనని నిర్ధారణ చేశారు.

ఇక్కడ విషయం ఏమిటంటే వావిలికొలను వారు పోతన స్వస్థలం 'బమ్మెర' కాదని (బ.పో.వి పుట:16, 40), ఆయన ఏకశిలా నగరం/ఓరుగల్లు/వరంగల్/యోరుగల్లు వారు కాదని కాని ఏనాడూ, ఎక్కడా వితండవాదం చేయలేదు. నిజానికి సంగనభట్ల వారు వావిలికొలను రచనలను ఏవీ పూర్తిగా చదివినట్లు లేదు. చదివితే "భోగినీ దండక కర్తృత్వం, రాచకొండ రాజ్యం గురించి ఒంటిమిట్ట వారు ఏమీ మాట్లాడలేదు" (పుట:39) అని రాసేవారు కాదు. 'బమ్మెర పోతరాజు విజయం' అని వావిలికొలను సుబ్బారావు గారు వేసిన పుస్తకం చదివితే అనేక విషయాల్లో సింగనభట్ల నరసయ్య గారు వావిలికొలను వారిని తప్పుగా అర్థం చేసికొన్న సంగతి ఇట్టే అర్థం అవుతుంది. అంతేగాదు వావిలికొలను సుబ్బారావు గారు 'నారాయణ శతకం' 'వీరభద్ర విజయం' 'భోగినీ దండకం' మూడు పోతన కృతం

కాదని సమూలంగా ఖండించారు. ఇందుకు ఆయన తీసుకున్న ఉపపత్తులు త్రోసి రాజనలేనివి. అంతేగాదు 'రాచకొండ రాజ్యం' గురించి కూడా క్షుణ్ణంగా చర్చ జరిపారు (బ.పో.వి. పుటలు :19, 39, 42, 43).

నిజానికి 'బమ్మెర' 'బొమ్మర' వివాదం తల ఎత్తింది జయంతి రామయ్య పంతులు గారి ఉత్తరం వలననే. నిజానికి 'బమ్మెర' పేరు గల గ్రామం ఏదీ వరంగల్ దగ్గర లేదు. 'బొమ్మర' అనే గ్రామం ఉంది. 'బమ్మెర'నే తర్వాతి కాలంలో 'బొమ్మర' అయి ఉండవచ్చునని జయంతి రామయ్య పంతులు గారు తన లేఖలో/వ్యాసంలో ఒక ఊహగా పేర్కొన్నారే తప్ప అదే 'బమ్మెర' అని నిర్ధారించలేదు. అలాగే పోతన రామచంద్ర సాక్షాత్కారమైన నదిని 'గంగ' అని అన్నాడే గాని 'భగీరథీ' అని గాని, 'గోదావరి' అని గాని పేర్కొనలేదు. గంగయిన, గోదావరి అయిన రెండు వరంగల్‌కు చాలా దూరంలో ఉన్నాయి. అయితే ఒంటిమిట్టకు ఇంకా దూరము. ఇలాంటి విషయంలో జయంతి రామయ్య పంతులు గారు పాము చావకుండా, బడితె విరగకుండా కాసేపు అటు, కాసేపు ఇటు మొగ్గు వచ్చేలా రాసిన వ్యాసం ఇది. అంతేగాదు సంగనభట్ల వారు తన గ్రంథంలో 'కొన్ని తెలంగాణా పదములను (దొబ్బు, పెండ్లాము, చాలు చేయ, కుయ్యో, మొర్రో), తెలంగాణా మాండలికములను పోతన భాగవతంలో వాడాడు', అని రాశారు (పుట:46). అయితే జయంతి రామయ్య పంతులు దొబ్బు, 'నూకు' వంటి శబ్దములు యొంటిమిట్ట ప్రాంతములో కూడ వాడుకలో ఉన్నాయని పేర్కొన్నారు. పోతన స్వస్థలం 'బమ్మెర' అనటానికి జయంతి రామయ్య పంతులు గారు సేకరించిన మూలాల్లో 'బమ్మెర'కు ఎనిమిది మైళ్ళ దూరములు ఉన్న గూడూరులో నివసించే పాలడుగు లక్ష్మారావు ఇచ్చిన లేఖ ఒకటి. ఈ లేఖలో లక్ష్మారావు గారు పోతన వంశీయులైన నెల్లుట్ల వారి గురించి చెప్పడమే గాక, శ్రీనాథుడు, పోతన మధ్య జరిగిన 'మంత్ర శక్తి ప్రదర్శన' ప్రస్తావన కూడ చేశారు. శ్రీనాథుడు, పోతన మధ్య 50 సంవత్సరముల తేడా ఉందని వాదించే సంగనభట్ల వారు జయంతి రామయ్య పంతులు ప్రామాణికంగా తీసుకున్న పాలడుగు లక్ష్మారావు లేఖ మొత్తం విషయాన్ని అంగీకరిస్తారా లేక తన మనస్సుకు తను అనుకుంటున్న దానికి దగ్గరగా ఉన్నదాన్నే అంగీకరిస్తారా అన్న ప్రశ్న ప్రశ్నగానే ఉండిపోతుంది (పో.ని.చ.పుట:11). నిజానికి జయంతి రామయ్య పంతులు గారు గాని,

కందుకూరు వీరేశలింగం పంతులు గాని, గురజాడ శ్రీరామ మూర్తి గారు గాని పోతన మహాకవి సమగ్ర జీవితావిష్కార ప్రయత్నంలో అనేక లొసుగులతో, ఊహాలతోనున్న ఒకరి వాదాలను మరియొకరు ఆలంబనగా చేసుకొని తమకు తోచినది రాశారే గాని ఇదిమిత్థంగా వారు తేల్చింది ఏమీ లేదు. ఆ లొసుగులనే వావిలికొలను సుబ్బారావు గారు భాషాపరంగా, చరిత్రపరంగా, సాహిత్యపరంగా త్రిప్పిగొట్టారు. ఆంధ్రవాల్మీకి త్రిప్పిగొట్టిన వాదానికి నిజంగా కోస్తా కవులు, రచయితలు, సాహితీ చరిత్రకారుల వద్ద ధీటైన ఏ జవాబు లేదు. అంత పట్టుతరంగా ఉన్నాయి వావిలికొలను సుబ్బారావు గారి వాదాలు". పైగా సామాజిక సూత్రాలు, సాహిత్య శాస్త్రాలు, కళల్లో ప్రామాణిక పరిశోధన సూత్రాల ప్రకారం పరిశీలించినా కూడ వావిలికొలను సుబ్బారావు గారి వాదనలు, ఉపపత్తులు సంపూర్ణ ప్రామాణికంగా ఉన్నాయి.

సంగనభట్ల వారు "తాను స్వయంగా ఒంటిమిట్ట వెళ్ళి అక్కడ పోతన వంటూ చూపిన వాటిని, జానమద్ది హనుమచ్ఛాస్త్రి గారి వ్యాసములను చూశాను. వారు చెప్పిన, చూపిన సాక్ష్యాలు ఆధారాలుగా చెల్లవు" అని రాశారు. ఈ వాక్యాలు నరసయ్య గారి రచనలకు కూడా అంతే వర్తిస్తాయి. అంతేగాక ఏకశిలా నగరంలో రామాలయం, వైష్ణవాలయం ఎక్కడుందన్న ప్రశ్నకు కూడ జవాబు దొరకదు. వల్లభరాయుడు రాసిన 'క్రీడాభిరామం'లో ఓరుగంటిలో శివాలయాలు తప్ప వైష్ణవాలయాలు లేవు. గరిమెళ్ళ వారు పోతన జనన కాలం నిర్ణయం సాహిత్య తులనాత్మక పరిశీలన ద్వారా భాగవత పీఠకారులు నిర్ధేశించిన 1372-1450 మధ్య కాలాన్నే అంగీకరించారు. వావిలికొలను సుబ్బారావు గారు పోతన జననం 1378 గాను, నాచన సోమన ఆయనకు ముందువాడని రాశారు. అంతేగాదు నాచన సోమన బుక్కరాయల నుంచి జమ్ములమడుగు తాలుకాలోని బుక్క పట్టణ అగ్రహారాన్ని 1370లో గ్రహించాడని, నాచన సోమన 1400 వరకు జీవించి ఉన్నట్లు గూడ రాశారు. ఈ విషయంలో నరసయ్య గారి (పుట:29) లెక్కకు, వావిలికొలను సుబ్బారావు గారి లెక్కకు కొంచెం తేడా ఉంది. వావిలికొలను వారు కూడ పోతన కవితాశైలిలో నాచన సోమనకు దగ్గర ఉన్నాడని, సింగన్నకు కాదని వాదించారు.

హరిహర బుక్కరాయలు కడపలో ఒంటిమిట్ట సమీపంలో రఘునాయకస్వామి గుడిని జాతికి 1410-1420 మధ్య అంకితమిచ్చినట్లుగా కడప జిల్లా మాన్యువల్‌లో

ఉంది. పోతనకు సమకాలికుడైన యయ్యల తిప్పరాజు రఘువీర శతకంలో ఒంటిమిట్ట రఘునాయకుడి ప్రస్తావన ఉంది. అందువలన పోతనకు పూర్వం కడపలో దేవాలయాలు లేవు, నాడక్కడ నాగరికత లేదు, నాడక్కడ కవులు లేరన్న ఓరుగంటి వాదనలు పూర్తిగా పరాస్తం (బొ.పో.లి.పుట 43). యయ్యల తిప్పరాజు 1433లో, ఆయన తండ్రి యయ్యల రాజు 1403లో జన్మించి, 1378లో పుట్టిన పోతన కాలం వారే అయినారు (పుట:34, 35). మరో విషయమేమిటంటే 'కూటమి' ప్రస్తావన చేయటం. సంగనభట్ల నరసయ్య గారు ఒంటిమిట్ట భక్తపోతన సమాజం వారు 'కూటమి'గా అనేక తప్పుడు వాదాలు, వాటికి సాక్ష్యాలు సృష్టించారు అని పేర్కొన్నారు.

నిజానికి కోస్తా సాహితీ చరిత్రకారులు, పండితులే కూటమిగా ఏర్పడి ఎన్నో అభూత కల్పనలు చేశారని, అందులో భాగంగా 'నారాయణ శతకం' కృతి రచనని పోతన కంట గట్టడమేనని బమ్మెర పోతరాజు విజయంలో వావిలికొలను సుబ్బారావు గారు సాక్ష్యాధారాలతో నిరూపించారు. అలా ప్రారంభమయిన 'కూటమి' పదాన్ని తిరిగి 'ఒంటిమిట్ట' వారిపై ప్రయోగించే ప్రయత్నం తప్ప వావిలికొలను వారు చేసిన నిరూపణకు నేటికీ బదులు లేదు. (బ.పో.వి : పుట 50-51). తమాషా ఏమిటంటే భాగవతంలోని స్కంధాంతములో ఉండే గద్యంతో యథాతథంగా శతకాంతం చూపుతారు. "ఇది శ్రీపరమేశ్వర కరుణాక్ష కృత కలితా చిత్ర, కేసన మంత్రిపుత్ర సహజ పాండిత్య, పోతనామాత్య ప్రణీతంబైన నారాయణ శతకంబున సర్వమును సంపూర్ణము" అనేగద్యం అది. నిజానికి శతకాంతాలలో ఇలాంటి గద్యాంతం సంప్రదాయం ఆనాడు లేదు. అయినా ఈ గద్యాంతానికి, భాగవత పద్యాంతానికి పోలిక పెట్టి రెండునూ పోతన రచనలే అని వంగురి సుబ్బారావు గారు, వద్దాది సుబ్బారావు గారలు ప్రకటించారు. నిజానికి ఇది 'కూట సృష్టి' అవటానికి కారణం 'నారాయణ శతకం' అన్ని ముద్రణలలో ఈ గద్యాంతం లేకపోవడం, పెద్దిభోట్ల వీరయ్య పంతులు గారు త్వరత్వరగా ముద్రించిన రెండు కాపీలలోనే ఇది ఉండటం. ఇందుకు సాహిత్య పరిషత్తు భాండాగారంలోని కాపీలే ప్రబల నిదర్శనము.ఒక్కటే విషయం ఇక్కడ ప్రధానంగా ఆలోచించవలసింది. పోతన వంశీకులు స్మార్తులు, శివభక్తులు. వైష్ణవులు గాని, వీర వైష్ణవులు గాని, విశిష్టాద్వైతులు గాని, వీరశైవులు గాని కారు. "అటువంటి పోతన

'నారాయణశతకం' తో వైష్ణవుడై, 'వీరభద్ర విజయం'లో శైవుడై, ఆరాధ్యుడై, భోగినీ దండకములో శృంగార వైష్ణవుడై, చివరకు భాగవతములో 'అద్వైతి' అయి, ఇన్ని రకములుగా ఒక బ్రాహ్మణ పండితుణ్ణి అన్ని మతాలలో ముంచి తేల్చిన కోస్తా సాహిత్యకారులు, పండితులు, ఓరుగంటివాదులు ఎంత విజ్ఞులో కదా?" అని ఎద్దేవా చేస్తారు వావిలికొలను వారు. నిజానికి పోతన రచనా శైలి, అలంకారములు, ప్రాసలు ఆయన తర్వాత ఎక్కువగా రాయలసీమ కవుల రచనలలోనే ఎక్కువ కనిపిస్తాయని గరిమెళ్ళ వారు సోదాహరణంగా నిరూపించారు. ఆనాటి రచనా, కాల వ్యవహారాల ప్రకారంగా పోతన రచనలు 'ఓరుగంటి' నుంచి అంత త్వరగా రాయలసీమకు, కృష్ణదేవరాయల మహాకవికి ఎలా వ్యాపించాయన్న వాదం కూడ ఒంటిమిట్ట వాదులకు సానుకూలం అవుతున్నది. ఇక్కడో విషయం. 1300–1400ల మధ్య గోల్కొండ, రాచకొండ, ఓరుగల్లు మహ్మదీయుల దాడిలో అతలకుతలమై ఉండగా, విజయ నగరం రాజులు కడప వైపు స్థిరంగా రాజ్య పాలన చేస్తున్నారు. ఈ కారణంగా అనేక మంది కవులు ఉత్తరం నుంచి దక్షిణం వైపే వెళ్లే అవకాశాలే ఎక్కువ. పోతన రచనా శైలి, అలంకారములు, ప్రాసలు ఆయన తర్వాత తెలంగాణా కవుల రచనలలో ఎక్కువ కనిపిస్తాయని ఎవరూ సోదాహరణంగా నిరూపించ లేదు. అందువల్లనే వానమామలై వరదాచార్యులు గారు 'పోతన చరిత్ర'లో మధ్యే మార్గంగా బమ్మెర వాడైన పోతన భాగవత రచన కాలానికి ఒంటిమిట్ట వచ్చి ఉంటారని సర్క్యుమెస్టెన్షియల్‌గా ప్రతిపాదించారు. సర్క్యుమెస్టెన్షియల్‌ఉపపత్తులు ప్రామాణిక పరిశోధన సూత్రాల ప్రకారం తప్పు గాదు. పోతన సమగ్ర జీవితానికి సంబంధించి కొన్ని విషయాలు పరిష్కారం అయినప్పుడు, మధ్యే మార్గంలో ఓరుగల్లువాదులు, ఒంటిమిట్ట వాదులు రాగద్వేషాలకు అతీతంగా కూర్చుని ఒక పోతన సమగ్ర జీవిత పరిష్కారం సూచించవచ్చు. అప్పుడే పోతన సమగ్ర జీవితావిష్కార కథ కంచికి చేరుతుంది.

(ఆంధ్రజ్యోతి వివిధ దినపత్రిక మార్చి 27, 2022)

14
పోతన్న జీవితం పరిష్కృతమే !

'ఇంకా కంచికి చేరని పోతన జీవిత కథ' పేరిట కొప్పరపు నారాయణమూర్తి ఆంధ్రజ్యోతి వివిధలో ఒక వ్యాసం ప్రకటించారు (27-03-2023). ఇందులో నన్నే పలుమార్లు ఖండిస్తూ రాశారు.

వావిలికొలను సుబ్బారావు రాసిన 'బమ్మెర పోతన రాజు విజయం', 'పోతన నికేతన చర్చ', 'ఆంధ్ర వాల్మీకి జీవిత చరిత్ర', 'పోతన చరిత్ర' (వానమామలై రాసినది), 'బమ్మెర పోతన' (సి.పి. బ్రౌన్ అకాడమీ) నేను చదవలేదని, అందవల్ల ఎన్నో ఆమడల దూరంలో ఆగిపోయానని రాశారు. "సంగనభట్ల చెప్పుకొన్నట్లు ఆయనేమీ నూతన వాదాలు ప్రవేశ పెట్టలేద"న్నారు. ఇతరులు చెప్పి ఓరుగల్లు వాదాన్ని "పునరు ద్ఘాటించార"న్నారు.

నేను పోతన రాసిన భోగినీ దండకాన్ని పరిష్కరించి, ప్రతిపదార్థ వ్యాఖ్య రాసి స్వయంగా ముద్రించాను. దీనిలో పీఠికాంశంగా పోతన స్థలకాలాదులను స్థూలంగా వివరించాను. పోతన్నకు రాచకొండతో గల సంబంధాలను విస్తారంగా విరించిన చారిత్రక పీఠిక అది. అంతకు ముందే ఈ అంశంలో వినిపించిన నా ఉపపత్తులను, వాదాలను, వాద సమన్వయాలను, పూర్వ వివాదాలను గ్రంథవిస్తారం అవుతుందని రాయలేదు. ఇది పోతనపై ఇప్పటి వరకు నేను రాసిన ఆఖరు రచన. దీంట్లో కూడా మళ్లీ అవన్నీ తోడిపోయలేం. నా రచనల గూర్చి వీరికి తెలియదు. వారు చూడలేదు. చూడక వావిలికొలను వారి రచనలను నేను చూడలేదన్నారు!

వావిలికొలను వారు తమ రచనల్లో పోతన ఒంటిమిట్టవాడేనన్న శరత్వం ప్రకటించారు. వ్యతిరేకించిన కందుకూరి వీరేశలింగం గారిని కూడా తిట్టిపోశారు. కందుకూరివారు తొలుత పోతన ఓరుగల్లువాడు కాదనుకొని తర్వాత తన అభిప్రాయం తప్పని, పోతన ఓరుగల్లు వాడేనని నిర్ధారించడం వావిలికొలను వారికి కోపకారణమైంది. వావిలికొలను గ్రంథాలెన్ని చదివినా పోతన ఏకశిలానగరంవాడు (అంటే వరంగల్‌వాడు) అని సమర్థించడం, లేదా సమన్వయ పరచడం అనేది ఉండదు. ఆయన వాదాలు ఉపబలకాలైనా కాకున్నా ఆయన దృష్టిలో పోతన ఒటిమిట్టవాడే! అంతేకాదు, వావికొలను వారు 'నారయణ శతకం'. 'భోగినీ దండకం' పోతనవి కావని సమూలంగా ఖండించారు అని రాశారు కొప్పరపు, వావిలికొలనే ఫైనల్ జడ్జిగారన్నట్లు. ఈ వాదాలు నేను చూడలేదనడం ఒక తప్పు. ఐతే, పోతన 'భోగినీ దండకం' రాయలేదన్న వాదాన్ని విధిగా అంగీకరించాలనడం రెండో తప్పు.

కొప్పరు వారు జయంతి రామయ్య పంతులు రాసిన లేఖలోని ప్రస్తావనలు – బమ్మెర పేరు గల గ్రామం ఏదీ వరంగల్ దగ్గర లేదు. ... గంగైనా గోదావరి ఐనా రెండూ వరంగల్‌కు చాలా దూరంలో ఉన్నాయి. శ్రీనాథుడు పోతన్నల మధ్య మంత్రశక్తి ప్రదర్శన – ఉటంకిస్తూ వాటిని 'నరసయ్యగారు అంగీకరిస్తారా లేక తను అనుకుంటున్న దానికి దగ్గరగా ఉన్నదాన్నే అంగీకరిస్తారా అన్న ప్రశ్న ప్రశ్నగానే ఉండిపోతుంది' అని వాపొయ్యారు. పై ప్రస్తావనలో మొదటిదాన్ని నేనే కాదు, తెలుగువారందరూ ఖండిస్తారు. పోతన్న, శ్రీనాథులు తాతా మనుమలంత ఎడం ఉన్నవారు అని నేను సోపపత్తికంగా ఐనవోలు శాసనం ఆధారంగా నిరూపించాను. కనుక ప్రశ్న ప్రశ్నగానే ఉండిపోయే ప్రశ్నేలేదు. పోతన్న ఓరుగంటివాదాన్ని ఎందరో పెద్దలు రాసిందాన్ని వావిలికొలను వారు 'భాషారంగా, చరిత్రపరంగా, సాహిత్యపరంగా త్రిప్పిగొట్టా'రట! కొప్పరపువారు కాలాన్ని అమోఘంగా వందేళ్లు వెనక్కుతిప్పి, తమ చరిత్ర పరిశోధనా శక్తిని ప్రదర్శించారు. అలాగే కొప్పరపు నారాయణమూర్తి ఏకశిలానగరంలో రామాలయం, వైష్ణవాలయం ఎక్కడుందన్నారు. పోతన్నగారు ఏదో ఒక ఆలయంలో కూర్చొని రాశారని వీరి భావన కావచ్చు. పోతన

రామ-కృష్ణ- శివాభేదభావనలు ఏవీ వీరికిపట్టవు. పైగా ఫలానా సంవత్సరంలో పోతన్న పుట్టాడన్న అర్థరహిత చర్చ చేశారు. పోతన్న పుట్టిన తేదీ చెప్పగలిగితే సాహిత్య లోకానికి మేలుచేసి నారాయణమూర్తిగారు ధన్యులౌతారు.

హరిహరరాయలు కడప ఒంటిమిట్ట సమీపం(?) లోని రఘునాయకస్వామి గుడిని 1410-30ల మధ్య జాతికి అంకితం ఇచ్చినట్టు కడప మాన్యువల్‌లో ఉందట. నేను ఒంటిమిట్ట ఆలయం వెళ్లి అక్కడి శాసనం సేకరించాను. అది సదాశివరాయలు వేయించినది. భోగినీ దండక వ్యాఖ్యా గ్రంథంలో శాసనం ఫోటో, పాఠం ఇచ్చాను. క్రీ.శ. 1336 నాటి హరిహరరాయలకు (తొలి విజయనగర ప్రభువు), క్రీ.శ. 1555 నాటి చివరి ప్రభువు సదాశివరాయలకు మధ్య 200 సంవత్సరాల వ్యత్యాసం ఉంది. ఒంటిమిట్ట ఆలయ చరిత్ర రాయడంలో పరమ ప్రయోజనమేమిటో?

కూటమి పదాన్ని ఒంటిమిట్టవారిపై ప్రయోగించానని, అనేక తప్పుడు వాదాలు, సాక్ష్యాలు సృష్టించారని అన్నారు (నేను కాదు). పోతన్నకు పూర్వం కడపలో దేవాలయాలు లేవు. నాగరికత లేదు. కవులు లేరని రాశారన్నారు వారు ప్రస్తావిస్తున్నది నా పుస్తకం కాదు. కనుక నేనేమీ మాట్లాడను ఒంటిమిట్ట వాదుల సాక్ష్యాలు మాత్రం చరిత్రకు నిలువవన్నది వాస్తవం.

వానమామలై వరదాచార్యులు రాసింది ఒక కావ్యం. కథాపుష్టికి అనేక ఘట్టాలు కల్పించవచ్చు. వారే నాతో స్వయంగా ఒంటిమిట్టకు పోతన్నను తీసుకుపోవడం వెనుక చారిత్రకాధారాలు ఏమీ లేవని, తన కావ్యం అన్ని ప్రాంతాలకు ఆమోదయోగ్యం కావాలని అలా కల్పించానని చెప్పారు. ఆ గ్రంథాన్ని చరిత్ర చర్చకు సాక్ష్యంగా స్వీకరించలేం. కాని కొప్పరపువారి ప్రకారం వరదాచార్యులు 'సర్క్యుమెస్టెన్షియల్'గా ప్రతిపాదించారట. ఈ ఉపపత్తులు ప్రామాణిక పరిశోధనా సూత్రాల ప్రకారం తప్పు కాదట. ఇది తప్పే ! ఇలాంటి వాటిని స్వీకరిస్తే అది ప్రామాణిక పరిశోధన కాజాలదు. ఇంకా నయం, ఒంటిమిట్టవాదులు పోతన్న నవల రాయలేదుగాని, రాస్తే, దాన్నీ ప్రమాణంగా స్వీకరించాలని మూర్తిగారు భావిస్తారేమో!

మొత్తం మీద కొప్పరపు నారాయణమూర్తి ఓరుగల్లు వాదాన్ని అంగీకరించటం లేదని భావించవలసి వస్తుంది. దానికోసం వ్యాసం రాయబోయి, నన్ను ఖండించడానికి ఎక్కువ నిడివిని వాడినారని అనిపించింది. పోతన భాగవత రచనచేసిన ఏకశిలానగరం ఓరుగల్లే, ఒంటిమిట్ట ఎన్నటికీ కాదు. 'కూర్చుని' చర్చించినా, నిలబడి చర్చించినా పోతన్నది ఓరుగల్లే. వివాదాలన్నీ పరిష్కృతాలే!

– సంగనభట్ల నరసయ్య, 9440073124

ఆంధ్రజ్యోతి దినపత్రిక 'వివిధ' 24 ఏప్రిల్ 2023

15

పోతన సమగ్ర జీవితావిష్కరణపైస్వోత్కర్ష తప్ప అన్నీ అసత్యాలు, అపరిష్కృతాలే

ఆంధ్ర జ్యోతి 'వివిధ' సాహితీ పేజీలో (మార్చి 27, 2023) అచ్చయిన ఈ రచయిత వ్యాసం 'కంచికి చేరని పోతన జీవిత కథ' కు స్పందనగా సంగనభట్ల నరసయ్య గారి 'పోతన జీవితం పరిష్కృతమే' వ్యాసం ఆంధ్ర జ్యోతి 'వివిధ' (ఏప్రిల్ 24, 2023)లో అచ్చయింది. అందులో సంగనభట్ల గారి స్వోత్కర్ష, ఆయనకు అలవాటుగా మారిన 'చెప్పిన అసత్యాలనే తిరిగి చెప్పటం' తప్ప ఈ రచయిత లేవనెత్తిన వైరుధ్యాల పై వేటికి ఇదమిద్ధమైన జవాబు లేదు. తమాషా ఏమిటంటే ఈ రచయిత రాసిన తొలి పేరా చివరి పంక్తిలో ఏముందో, సరిగ్గా సంగనభట్ల గారు తన వ్యాసం చివరి పేరాలో అదే రాశారు. 'ఎవరికి వారే తాము చేసిన పరిశోధనలాధారంగా సమస్యలన్నీ 'సమసి పోయాయి', ఇక ఎటువంటి వివాదాలు లేవని చెప్పుకొంటారు', అని ఈ రచయిత తన తొలి పేరాగ్రాఫ్ చివర రాశారు. సరిగ్గా సంగనభట్ల వారు తన వ్యాసం చివరి పేరా, చివరి పంక్తిలో 'కూర్చుని చర్చించినా, నిలబడి చర్చించినా పోతన్నది ఓరుగల్లే. వివాదాలన్నీ పరిష్కృతాలే అంటూ ముక్తాయించారు.

సంగనభట్ల వారు తన స్పందనలో (రెండవ పేరా) ఇలా రాశారు: "వావిలి కొలను సుబ్బారావు రాసిన 'బమ్మెర పోతన రాజు విజయం', 'పోతన నికేతన చర్చ', 'ఆంధ్ర వాల్మీకి జీవిత చరిత్ర,' 'పోతన చరిత్ర' (వానమామలై రాసింది), 'బమ్మెర పోతన' (సి. పి.

బ్రౌన్ అకాడమి)నేను చదవలేదని, అందువల్ల ఎన్నో ఆమడల దూరంలో ఆగిపోయానని రాశారు. సంగనభట్ల చెప్పుకొన్నట్లు ఆయనేమి నూతన వాదాలు ప్రవేశ పెట్టలేదన్నారు. ఇతరులు చెప్పిన ఓరుగల్లు వాదాన్నే పునరుద్ఘాటించారన్నారు". నిజానికి ఈ రచయిత సంగనభట్ల వారు పేర్కొన్నట్టు పై విషయాలన్నిటినీ 'ఆరోపణల్లా' ఒక్క చోట, ఏక ధాటిగా రాయలేదు. వ్యాస రచన విస్తృత పరిశీలనాధారంగా జరిగింది కాబట్టి, విశ్లేషణానుగుణంగా ఆయా విషయాలను చర్చించేప్పుడు ఆయా సందర్భాలలోచెప్పడం జరిగింది (సంగనభట్ల ఒక్కచోటే ఏ కరువు పెట్టినట్టుకాక).

ఇలా అనడానికి కారణం సంగనభట్ల వారు 'బమ్మెర పోతానామాత్యుని భోగినీ దండకం'లో రాసిన వాక్యమే: **'భోగినీ దండక కర్తృత్వం, రాచకొండ రాజ్యం గురించి ఒంటిమిట్ట వారు ఏమీ మాట్లాడలేదు' అని (చూ. పుట. 39) రాశారు.** వాస్తవానికి వావిలికొలను వారు తన 'బమ్మెర పోతరాజ విజయం'లో 'భోగినీ దండక కర్తృత్వ ఖండనం' (చతుర్థ దాటి) ను, రాచకొండ రాజ్యం గురించి, సింగమనీనికి పోతనకు సంబంధం ఉందా, లేదా వంటి విషయాలపై స్పష్టమైన అభిప్రాయం వెలిబుచ్చి ఉన్నారు (చూ బ. పో. వి: పుటలు :74-85). ఈ వాక్యాన్ని ఈ రచయిత తన వ్యాసంలో స్పష్టంగా రాసినా దానిని సంగనభట్ల వారు చదివికూడా పట్టనట్టు 'స్పందన' రాశారు. మరి ఇది అసత్యం కాదా !

'ఇక సంగనభట్ల వారు నూతన వాదాలేవీ ప్రవేశ పెట్టలేదని' ఈ రచయిత రాసిన అంశం గురించి. ఇది 'నిజం' అని అంగీకరించే శక్తి సంగంభట్ల వారికి లేకపోవటం దురదృష్టం. ఈ రచయిత ఉత్తరాంధ్ర వాదుల వాదనలు, రాయలసీమ వాదనలు రెండూ క్షుణ్ణంగా చదివారు. ఉత్తరాంధ్రవారు పోతన్న తెలంగాణా వాడనడానికి ఏయే ఉదాహరణలు అందుకున్నారో, అవే సంగనభట్ల వారి పుస్తకంలో కనిపిస్తాయి. 'బొమ్మర' లేక 'బమ్మెర' వివాదం నుంచి తెలంగాణా మాండలిక ప్రయోగాలు, భేతాళుడి' రసార్ణవసుధాకరం' తెలిపే వంశ వృక్షం దాకా అన్నీ విస్తృతంగా ఉత్తరాంధ్ర కవులు, రచయితలు శతాబ్దం క్రితం చర్చించినవే. రాయలసీమ రచయితలు ఖండించటమో, తమ వివరణ ఇవ్వటమో చేసినవే.

ఉదారహణకు 1914 లో జయంతి రామయ్య పంతులు ఓరుగల్లు వచ్చి 'బమ్మెర' గ్రామం అని భావించే 'బొమ్మర' గ్రామానికి వెళ్లి అక్కడి వారి నుంచి ఉత్తరాలు సాక్షాలుగా సేకరించినదే సంగనభట్ల వారి పుస్తకంలోనూ కనిపిస్తుంది. జయంతి వారి వివరణలో తెలంగాణా పేర్లు, మాండలికాలు అని సంగనభట్ల వారు రాసిన పదాలు కొన్ని రాయలసీమ, ఇతర ఆంధ్ర ప్రాంతాలలో వాడుకలో ఉన్నాయని జయంతి వారు తోసిపుచ్చటాన్ని వీరు ప్రస్తావించరు తన పుస్తకంలో. కానీ, జయంతి వారి రిపోర్ట్ ఆధారంగా కందుకూరి వీరేశలింగం పోతన స్వస్థలం తెలంగాణేనని, అదీ 'ఓరుగల్లేనని' తన పూర్వాభిప్రాయం సవరించుకొన్న సంగతి మాత్రం ప్రస్తావిస్తారు. అలా తన భిప్రాయం మార్చుకొన్నందుకు వావిలికొలను వారు వీరేశలింగమును విమర్శించటాన్ని 'తిట్టిపోసినట్టు'గా కూడా తమ పుస్తకంలో రాస్తారు. కానీ పాలడుగు లక్ష్మారావు'బొమ్మర' నే 'బమ్మెర' అని ప్రమాణ పత్రం ఇస్తూ , శ్రీనాధ, పోతన్నలు అదే ఊరి పొలంలో తమ మంత్ర శక్తి ప్రదర్శన చేసినట్టు పేర్కొనిందానిని పరిగణించరు. వారిద్దరూ వేరే వేరే కాలానికి చెందినవారని, వారిద్దరికీ మధ్య 50 సంవత్సరాలు తేడా ఉందని రాస్తారు తన పుస్తకంలో. ఇక్కడెక్కడా 'ఐనవోలు శాసనం' ఆధారంగా తాను శ్రీనాధ, పోతనల మధ్య 50 సంవత్సరాల తేడా ఉందన్న నిశ్చయానికి వచ్చినట్టు కనీసం బ్రాకెట్‌లో కూడా తన పరిశోధన రిఫరెన్స్ ఇవ్వలేదు. అలా ఒక్క పంక్తి రాస్తే ఈ రచయిత లాంటి వారు దానిని కూడా పరిశీలించి నిజం నిగ్గు తేల్చేవారు కదా ! ఆ కాస్తా చేయడానికి తను 'తోడిపోయ వలసినంత' అవసరం ఏముంది? నిజానికి సంగనభట్ల వారికీ విషయంలో గరిమెళ్ళ వారితో కూడా భేదాభిప్రాయం ఉంది. అయినా వారి స్పందన వ్యాసంలో కానీ, అంతకుముందు అచ్చయిన పుస్తకంలో ఈ విషయమై గరిమెళ్ళ వారు రాసిన దానిని ఖండించరు. మరో విషయం ఏమిటంటే గరిమెళ్ళ వారి పుస్తకం సంగనభట్ల వారి పుస్తకం కంటే ముందు అచ్చయింది. దానిని తన 'బమ్మెర పోతనామాత్యుని భోగినీ దండకం' కు రిఫరెన్స్ గా వాడినట్టు కృతజ్ఞతల్లో వారే ప్రకటించారు

కందుకూరు వీరేశలింగం, చిలుకూరి వీరభద్ర రావులు శ్రీనాధ, పోతనలిద్దరు సమకాలికులు అని స్పష్టం చేశారు (చూ.బ.పో.వి : పుటలు 80-85). పోతన్న స్వస్థలం

'ఓరుగల్లు' గా తన అభిప్రాయం మార్చుకున్న కందుకూరు వారిని ప్రస్తావించిన సంగనభట్ల వారు , శ్రీనాథ , పోతనలు సమకాలికులు అన్న అదే కందుకూరి వీరేశలింగం వాదన పరిగణించరు. అంతేగాదు, సంగనభట్ల వారు తన పుస్తకంలో చేసిన భేతాళ నాయని 'రసార్ణవ సుధాకర' సంస్కృత గ్రంధం వంద సంవత్సరాల క్రితం వావిలికొలను సుబ్బారావు గారు నిశితంగా పరిశీలించి తన అభిప్రాయాన్ని ప్రకటించారు 'బమ్మెర పోతరాజు విజయం'లో (చూ.బ.పో.వి : పుటలు 80-85). వీటి గురించి తన పుస్తకంలో కూడా ఎక్కడా ప్రస్తావించరు. ఇలా తనకు నచ్చిన ఉత్తరాంధ్ర రచయితల వాదనలను 'ఎంపిక చేసి కూర్చినదే' సంగనభట్ల వారి పుస్తకం 'పోతనామాత్యుని భోగినీ దండకం పీఠిక'.

ఒక వ్యాసంలా రాసిన ఈ పీఠికలో ఎక్కడా 'ఏ విషయం దేని నుంచి స్వీకరించింది గాని, దేనిని ఎందుకు తిరస్కరించింది గాని చెప్పకుండా అంతా తన స్వంత పరిశోధనలో కనుగొన్నట్టు' కనికట్టు' చేస్తారు సంగనభట్ల వారు. గరిమెళ్ళ వారు తన పుస్తకంలో 'శ్రీనాధుని జననం 1360-1370 మధ్యకాలమని, మరణం 1450-1460 మధ్యకాలమని విమర్శకుల ఆశయము' అని రాసి ఉన్నారు (చూ.గరిమెళ్ళ.పుట :32). రెండవ సింగ భూపాలుడు 1425వ సంవత్సరమున సింహాసనం అధిష్టించినట్లు నేలటూరి వెంకట రమణయ్య గారు నిరూపించారు. కావున, బోతన-శ్రీనాథ-సింగభూపాలుడు సమకాలికులు అని నిర్వివాదమగు సిద్ధాంతము' అని గరిమెళ్ళ పేర్కొన్నారు. శేషాద్రి కవులు భాగవత పీఠికలో 'పోతనామాత్యుని కాలం గురించి భేద భావములు ఉన్నట్లు పేర్కొన్నారు. 'ఇంతవరకు గల చరిత్రముల సారము ననుసరించి పోతరాజు జీవిత కాలం 1375-1475 వరకన్న జాలును. చరిత్రకారుల భిన్న భావములను సమన్వయించినచో నిక్కవిరాజు 1375లో జన్మించి తుది గ్రంధమగునాంధ్ర మహాభాగవతం 1440లోగా ముగించెనని తోచును (వాణి నికేతన పత్రిక.చూ.గరిమెళ్ళ.పుట :32).

ఇదే సమయములో వావిలికొలను సుబ్బారావు గారు పోతన జననం 1378లో అయి ఉండవచ్చని భాగవత పీఠికాకారులను ఉటంకిస్తూ ప్రకటించారు. ఇంచుమించు ఉత్తరాంధ్ర, సీమ కవులు 1375-78మధ్య కాలాన్ని పోతన జనన కాలంగా భావించారు.

ఇదే విషయం (1378) పోతన జనన కాలంగా ఈ రచయిత రాయగా, పుట్టిన తేదీ గూడా చెప్పిన బావుండునని వెటకారంగా వ్యాఖ్యానించారు సంగనభట్ల. మరి ఏ పుట్టిన తేదీ ఆధారంగా సంగనభట్ల వారు శ్రీనాధుడు, పోతన మధ్య 50 సంవత్సరముల అంతరం ఉందని రాసారో?

పైగా మాటకు మాటన్నట్టు సంగనభట్ల వారు ఇంకా ఇలా రాశారు: 'అంతకు ముందే ('బమ్మెర పోతనామాత్యుని భోగినీ దండకము' 2018లో ముద్రించక పూర్వం) ఈ అంశంలో వినిపించిన నా ఉపపత్తులను, వాదాలను, వాద సమన్వయాలను, పూర్వ వివాదాలను గ్రంథావిస్తారం అవుతుందని రాయలేదు. ఇది పోతనపై ఇప్పటి వరకూ నేను రాసిన ఆఖరి రచన. దీన్లో కూడా మళ్ళీ అవన్నీ తోడిపోయలేం. నా రచనల గురించి వీరికి తెలియదు. వారు చూడలేదు. చూడక వావికొలను వారి రచనలను చూడలేదన్నారు', అని రాశారు. ఇది పాఠకులను ఏమార్చడానికి వీలుగా ఉపయోగించిన వాదం తప్ప, ఎంత మాత్రం తర్క సమ్మతం, పండిత ఆమోదం కాదు. ఎవరైనా సరే, తను చివరిసారిగా పోతన మహాకవిపై రాస్తున్న దానిలో తను సొంత పరిశోధనలో తేలిన ఆధారాలను, ఉపపత్తులను, వాటిని అన్వయించడానికి ప్రయోగించిన సమన్వయాలను పీఠికగా రాస్తారే తప్ప, వాటిని వదిలి నూరేళ్ళ క్రితం ఉత్తరాంధ్ర, రాయలసీమ రచయితల మధ్య జరిగిన పాత చర్చలనే తన పుస్తక పీఠికలో రాస్తారా? ఇక ఈ రచయిత వారు వావిలికొలను రచనలను చదవలేదనడానికి కారణం సంగనభట్ల వారు తన పుస్తకంలో పేర్కొన్న వాక్యమేనని (చూ. పైన ఉదహరించిన ఆయన వాక్యం) మరోసారి చెప్పనక్కరలేదు.

పాలడుగు లక్ష్మారావు జయంతి రామయ్య పంతులు కిచ్చిన ప్రమాణ పత్రంలో పోతన గురించి ఇచ్చిన రెండు ప్రకటనల విషయమై ఈ రచయిత ప్రశ్నిస్తే 'బొమ్మెర', 'బమ్మెర' ఒకటేనని దేశం అంతా అంగీకరిస్తుందని వాదించారు. అంటే ఈ విషయంలో ప్రజలు ఎటుంటే తనకు అదే అంగీకార మానేనార్థం? పోతన, శ్రీనాధులది ఏక కాలమని, వారిరువురూ ఒకానొక సందర్భంలో ఊరి వేలుపల తమ మంత్రశక్తి ప్రదర్శించారన్న లక్ష్మారావు ప్రమాణానికి జవాబుగా తాను 'ఐనవోలు' శాసన పరిష్కారంలో దీనిని చర్చించానని

సూటిగా సమాధానం చెప్పక తప్పించుకొన్నారు. కానీ, తన 'బమ్మెర పోతనామాత్యుని భోగినీ దండకము' (2018లో) పీఠికలో మచ్చుకకు కూడా 'ఐనవోలు' శాసనం గురించిన చర్చ కనిపించదు. ఇది కూడా పాఠకులను ఏమార్చడానికి సంగనభట్ల వారి ఎత్తుగడ అనుకోక తప్పదు.

ఇంకా, 'వంద సంవత్సరాల క్రితం విషయాన్ని కొప్పరపు వారు అమోఘంగా వెనక్కు తిప్పి తమ చరిత్ర పరిశోధనా శక్తిని ప్రదర్శించారు' అని మరో వెటకారం చేశారు సంగనభట్ల. నిజానికి ఈ 'వెటకారం'కు సంగనభట్ల వారికంటే అర్హుడు మరొకరు ఉండరు. 1919 లో వచ్చిన 'బమ్మెర పోతరాజు విజయం' తరువాత ఉత్తరాంధ్ర కవులు, రాయలసీమ కవులు వదిలివేసిన దానిని ('పోతన నికేతన చర్చ'ని) తిరగదోడి, ఆనాటి పోతన 'ఓరుగంటి' వాడన్న ఉత్తరాంధ్ర కవుల వాదనలను సంగ్రహించి, అందులో తనకు అనుకూలమైనవే ఎంపిక చేసి పుస్తకం అచ్చువేసి ఒక 'అమోఘమైన' నాటకం ఆడటం సంగనభట్ల వారికే చెల్లింది. అన్నట్లు సంగనభట్ల వారి తొలి ప్రస్థానం 'నాటకమే' కదా'! పైగా 'వావిలికొలను వారి వాదనలను అంగీకరించాలనడం తప్పు అని, సంగనభట్ల వారు వావిలి కొలను వారి రచనలను చదవలేదనటం మరో తప్పు' అని వితండ వాదం చేశారు. వావిలికొలను వారి పోతనపై రచనలను ఖచ్చితంగా సంగనభట్ల వారు చదవలేదు అనడానికి ఈ ప్రేలాపన చాలు. ఎలా సంగనభట్ల వారు వావిలికొలను వారి నిర్ణయాలు, విశ్లేషణలు 'అంతిమ తీర్పులు' కావు అన్నారో, అదేమాట సంగనభట్ల వారికి, వారి పరిశోధనలకు వర్తిస్తుంది కూడా.

ఈ రచయిత తన వ్యాసం విస్తృత పరిశీలనలో భాగంగా రాయటం జరిగింది. కొన్నిచోట్ల పెద్దిభొట్ల వీరయ్య పంతులు గారు రాయలసీమ వాదులను ఆక్షేపిస్తూ రాసిన వాటికి కూడా స్థానం కలిపించి జవాబులు ఇవ్వటం జరిగింది. అనవసరంగా సంగనభట్ల వారు వాటిలో కూడా వేలు పెట్టారు. ఇక దాని డొల్ల తనం గురించి చర్చిస్తే ఈ వ్యాసం నిడివి పెరిగిపోతుందని దానిని చర్చించటంలేదు. చివరగా వానమామలై వరదాచార్యులు రాసిన గ్రంథం ప్రస్తావన చేశారు. అయితే వానమామలై గారింటికి వెళ్లినట్టు, వారు తాను రాసింది 'కల్పన' అన్నట్టు సంగనభట్ల వారు ప్రకటించారు. నిజానికి వారీ వాదనకు ప్రమాణం

ఏముంది? వానమామలై 1984 లోనే తన 72వ ఏట గతించారు. అప్పటికి సంగనభట్ల వారి వయస్సు కేవలం 30 సంవత్సరాల లోపే. వీరెప్పుడు పోతన గురించి పరిశోధన, రాయటం ప్రారంభించారు అటువంటివి అనేక అనుబంధ ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానాలు లేనిదే దీనిని విశ్వసించటం ఎలా? నిజానికి, ఉయ్యూరుకు (కృష్ణ జిల్లా) చెందిన సాహితీవేత్త గబ్బిట దుర్గా ప్రసాద్ గారు కూడా కడప వెళ్లి పోతన గురించి ఒక పరిశీలన జరిపారు. ఆ వివరాలు డిసెంబరు 19, 2019న తన 'సరస భారతి' ఉయ్యూరు వెబ్ సైట్‌లో కూడా పెట్టారు. ఇది గూగుల్‌లో సులువుగా దొరుకుతుంది. ఇందులో రాసినవి తిరిగి ఇక్కడ పేర్కొనడం పునరుక్తి అవుతుంది కాబట్టి వదిలేయడం జరిగింది.

ఇకపోతే 'సర్కుమస్టాంషియల్' (ప్రసంగిక) ఆధారాలు ప్రామాణికమా? కాదా? వానమామలై వరదాచార్యులు తాను ఒక కల్పిత కావ్యంగా 'పోతన చరిత్ర' రాశాననడం వలన అది ప్రామాణికం కాదని పరిహసిస్తూ రాశారు చివరగా. నిజానికి మూలం అంటూ 'సాహిత్యం' లో ఒక 'టెక్స్ట్' ఉంటే ఆ టెక్స్ట్ పై విశ్లేషణ, పరిశోధన సహజ ప్రామాణిక మవుతుంది. మూలంతో తూలనాత్మకం (ఫిడిలిటీ టు ఒరిజినల్) వీలు కానప్పుడు పాఠాంతరాల మధ్య తులనాత్మక పరిశోధన ఉంటుంది. మూలం అంటూ ఒకటి లేకపోయినా, కల్పితం అయినా, 'పాఠాంతరాలు' కూడా ప్రామాణికం అవుతాయి. వీటిలో 'అడాప్టేషన్స్' అని, 'రీమక్స్', అని పలు రకాలుగా ఉంటాయి. ఉదాహరణకు దేవదాసు నవల, రామాయణ కావ్యం కల్పితాలు. వీటికి మూలము, పాఠాంతరాలున్నాయి. కాని పోతన నిజం. అయితే ఆయన జీవితంపై ఒక మూల చరిత్ర అంటూ లేదు. పాఠాంతరాలున్నాయి. వీటిని ఇండక్షన్, ఎలిమినేషన్ పద్ధతిలో విశ్లేషించి పోతన గారి జీవిత చరిత్రను సమగ్రంగా విశ్లేషించవచ్చు. వీటికి సంబంధించి సామాజిక శాస్త్రంలో, సాహిత్య పరంగా కూడా అనేక సిద్ధాంతాలు ఉన్నాయి. అవన్నీ ఇక్కడ ప్రస్తావించటం వీలు కాదు. నిజానికి పోతన పైన 1943లో వచ్చిన 'భక్త పోతన' సినిమా ను ఒక టెక్స్ట్ కిందనే పరిగణిస్తారు. దాని తరువాత వచ్చిన పోతన సినిమాలను 'పాఠాంతరాలు'గా పరిగణిస్తారు. 1943లో విడుదలైన 'భక్త పోతన' సినిమాకు కధ రాసిన వారు 'రాంనాథ్' అని వేశారు. కింద అనేక సంఘటనలను సేకరించి 'సముద్రాల రాఘవా చార్యులు కథ రూపొందించినట్టు' కూడా వివరించారు.

పోతన 'బమ్మెర' లోనే పుట్టి, కడ దాకా అక్కడే ఉండి, భాగవత రచన చేశారన్నది చాలా ప్రశ్నలకు కారణం అవుతుంది. వీటికి ప్రత్యక్ష, సంతృప్తి కరమైన ఆధారాలు ఏమీ లేవు. ఏవైనా ఉంటే అవి ఎవరికి వారు ప్రాసంగికంగా ప్రతిపాదించినవే. ఇందుకు సంగనభట్ల వారు అతీతులు కారు. పోతనామాత్యుడు ఎవరి కలలో కనపడి ఎవరికీ ఏదీ చెప్పలేదు. పోతన తెలంగాణా వాడైనా, 'బమ్మెర' (నేటి బొమ్మర) వారి స్వగ్రామం అయినా 13, 14 శతాబ్దాలలో తెలంగాణా తురుష్కుల దాడిలో పడినందున, ఆ సమయంలో దక్షిణమున అప్పుడప్పుడే విజయనగర సామ్రాజ్యం పాదుకొంటున్న వేళ పోతనామాత్యుడు కుటుంబ క్షేమం కోరి రాయలసీమ వైపు వెళ్లి ఉండవచ్చు గదా ! ఇందుకు ప్రసంగిక సాక్ష్యం ఏమంటే పోతన కవిత్వ శైలి, అనుకరణ, అనుసరణ, పోతన పదాలు విజయనగర రాజుల కవిత్వాలలోను, వారి ఆస్థాన కవుల ప్రబంధాలలోను మెండుగా కనిపిస్తుంది. అలాంటి ఉ దాహరణలు పోతన తరువాత తెలంగాణలో ఏ కవుల ప్రబంధాలలో లేవు. గరిమెళ్ళ వారు తన గ్రంథంలో మొదటి ముప్ఫయి పుటలలో రాయలనుంచి మొదలుకొని అనేక మంది ప్రబంధ కవుల రచనల్లో నిరూపించి ఉన్నారు. అసలు వివాదం ఇదే. దీనిని పరిష్కరించితే మొత్తం జీవితావిష్కారం అవుతుంది.

చివరగా ఈ రచయిత ఒంటిమిట్ట వాది కాదు, ఓరుగల్లు వాదీ కాదు. ఈ రచయిత కోరుకొనేది మహాకవి, సహజ పండితుడు అయిన పోతన జీవితం సమగ్రంగా ఆవిష్కారం కావటమే. అది సర్వపండిత జనామోదం పొందినదై ఉండాలి. ఎవరో ఒకరు "తానే" అంతా చేసేశాను, ఇంక చేసేందుకు ఏమీ లేదు" అని హుంకరించే విషయం కాదు. పోతన తెలంగాణా వాడైనా, ఎక్కడి వాడైనా తెలుగువాడే. అందరికి ప్రియుడే. అందువలన గుడ్డిగా 'అన్నీ పరిష్కృతాలేనని' హుంకరించటం కన్నా సర్వ జన ఆమోదంగా పోతన సమగ్ర జీవితావిష్కరణ జరగాలి.

– కొప్పరపు నారాయణమూర్తి

16
ఆరు దశాబ్దాల అలుపెరుగని రచయిత - పి.ఎస్. నారాయణ

"పండరి మనస్ఫూర్తిగా బ్రహ్మకపాలంలో కార్యక్రమాన్ని నిర్వర్తించాడు. రెండోది మావారి ఆబ్దికాలు కూలి మనిషి చేత పెట్టిస్తున్నాననే బాధకలగకుండా ఉండేందుకు గాను నేను పండరినే దత్త పుత్రుడిగా స్వీకరిద్దామనుకొంటున్నాను. అప్పుడు అతడు ఈ కార్యక్రమాలు నిర్వర్తిస్తుంటే నాకు, పోయిన ఆయనకు కూడ తృప్తిగా ఉంటుంది".

పూర్ణానంద శాస్త్రి ఆమె మాటలకు అవాక్కయి ఆమెను చూస్తుండిపోయాడు - చాలాసేపు.

''పండరి మీ దగ్గరే ఉంటాడు. మీతోపాటే తిరుగుతుంటాడు. అతడు చేయవలసిందల్లా నేను పుణ్యక్షేత్ర దర్శనానికి వెళ్ళినప్పుడల్లా నాకు తోడుగా రావటం, ప్రస్తుతానికి సంవత్సరానికొకసారి మా వారి ఆబ్దికం పెట్టటం" చెబుతూ తలవంచుకొని చిన్నగా అన్నది, "తరువాత నాదీను".

గుండెలు పిండే ఈ సన్నివేశం పి.ఎస్. నారాయణ గారు రాసిన 'వైతరిణి' కథ ముగింపున వస్తుంది. (స్వాతి మాసపత్రిక, ఆగస్టు 22). "మంచి కథలలో మానవనైజ పరిశీలనలు, చిత్రణలో తన (రచయిత) వ్యక్తిత్వాన్ని మరచిపోయి, ఊహాజగత్తులో

లీనమైపోయి, కళాసృష్టికి అనువైన ఒకస్థాయిని అందుకోవటం జరుగుతుంది. మంచి కథ అంటే పాఠకుడి హృదయాన్ని తాక కలిగేది. ఒక్కోసారి కన్నీళ్ళు కూడ తెప్పించగలిగేది. పి.ఎన్. నారాయణ గారి కథలు 'మంచి కథలు' అని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు చెప్పగలను" అంటారు. ప్రముఖ రచయిత కాకాని చక్రపాణి 'నిన్నటి వీడ్కోలు' (2009, కుమార్ గారి చిత్రం) కథా సంపుటికి ముందు మాట రాస్తూ. ఇది నారాయణ గారి మూడవ కథా సంపుటి. చక్రపాణి గారి విశ్లేషణ కేవలం ఆ కథా సంపుటికే పరిమితం కాదు. వారి వ్యాఖ్యలు నారాయణ గారి మొత్తం 300 పై చిలుకు కథలకు, 50 నవలలకు అంతే స్థాయిలో వర్తిస్తాయి.

ప్రస్తుతం 85వ వసంతం పూర్తి చేసుకొనేందుకు వడివడిగా అడుగులు వేస్తున్న పి.ఎస్. నారాయణ జూన్ 1, 1938లో జన్మించారు. తల్లిదండ్రులు రామయ్య, వరలక్ష్మిలు ఆయన బాల్యంలోనే చనిపోగా సోదరి వద్దనే విద్యాభ్యాసం చేశారు. చినకాకాని (గుంటూరు జిల్లా) చెందిన నారాయణ గారు తన రచనల్లో గుంటూరుపై ఏర్పరచుకొన్న అభిమానాన్ని కుప్పలు తెప్పలుగా కుమ్మరించారు. ఆ విషయాన్నే దత్త ప్రసాద్ పరమాత్ముని గారు చంద్ర వేసిన ముఖ చిత్రంతో వచ్చిన 'రాగ స్రవంతి' కథల సంపుటికి ముందు మాటలలో 'నారాయణీయంగా చమత్కరించారు. ఏకబిగిన ఆయన కథల్ని ఒక పాతిక దాకా చదివితే గాని గుంటూరు ఎన్ని విధాలుగా నారాయణగారి కథా కథనంతో పెనవేసుకుపోతుందో ఊహించలేం' అంటారు దత్త ప్రసాద్ పరమాత్ముని. ఆ మాటకు వస్తే ఒక్క కాశీనే నారాయణగారు రెండు నవలల్లో అద్భుతంగా చిత్రించటమేగాదు, అక్కడ ఏమేమి ధర్మ కార్యక్రమాలు ఎందుకు చేస్తారో వివరిస్తారు. (స్వేద ముత్యం, 2021 స్వాతి; నువ్వేనువ్వే, 2022 స్వాతి). అలాగే 'ఆమె ఒక ప్రశ్న'లో (స్వాతి, 2023) హైదరాబాద్ కూడా. ఆ మాటకొస్తే నారాయణగారి కథల్లో గాని, నవలల్లో గాని కొన్ని ఊర్లు సిన్మాల్లో చూసినంతగా కళ్ళకు గడతాయి కథ మలుపుల్లో.

తమ కుటుంబంలో రచయిత లెవ్వరూ లేరు పి.ఎస్. నారాయణ గారికి కథలు, నవలలు, నాటకాలు రాసేందుకు ప్రేరణ కావడానికి. ఆయన గుంటూరు హిందూ కాలేజీలో చదువుతున్న రోజుల్లో మన్నవ గిరిధరరావు వీరికి ఆంగ్లం బోధించేవారు. ఓ రకంగా

దూరపు బంధువు అయినా, వాళ్ళిద్దరి మధ్య 'గురు శిష్య' బంధమే ఎక్కువ అంటారు పి.ఎస్. నారాయణగారు. మన్నవ వారి ప్రోత్సాహంతో తొలుత ఇంగ్లీషు కథలు కొన్నింటినీ తెలుగులోకి అనువదించి వారికి చూపించారు నారాయణ గారు. 'అవి బాగున్నాయి' అని మన్నవ వారు భుజం తట్టటంతో నేరుగా తెలుగులోనే కథలు రాసి పత్రికలకు పంపటం ఆరంభించారు. తాను రాసిన తొలి నాటికథ 1957లో అచ్చయినా, అదేమంత చెప్పుకోదగ్గ కథగా ఆయన భావించలేదు. 1968లో నారాయణగారు అచ్చు వేసిన 'రాగ స్రవంతి' కథల సంపుటి (1961 నవంబరు 8న)లో అచ్చయిన 'బంగారు గొలుసు' ఆయన తొలి నాటి కథా రచనకు, శిల్పం, శైలి, ఎత్తుగడకు అద్దం పడుతుంది.

ఇందులో రెండే రెండు పాత్రలు ఉంటాయి. ఒకరు రంగనాథరావు, రెండవ వ్యక్తి ఒక యువకుడు. అదే అతని పాత్ర పేరు. వీళ్ళిద్దరూ ఒక రైలు ప్రయాణంలో ఒకరికొకరు ఎదురుగా ప్రయాణిస్తారు. ఆనాడు రైళ్ళలో సీటింగ్ అరేంజ్‌మెంటు నేటిలా కాకుండా క్లాస్ రూంలోలా బల్లలు ఎదురెదురు వేసినట్టుగా ఉండేవని ఈ కథ ద్వారా చెప్పకనే తెలుసుకోవచ్చు. రంగనాథరావు తన మిత్రుడికి తాను ఏనాడో తీసుకొన్న చేబదులు డబ్బులు అయిదు వందలు తిరిగి ఇవ్వడానికి, అలాగే రెండు రోజులు అక్కడ ఉండి రావడానికి గుంటూరుకు బయల్దేరి రైలు ఎక్కుతాడు. తను తీసుకెళ్తున్న అయిదు వంద నోట్లని బొడ్డులోని ఓ సంచిలో జాగ్రత్తగా పెట్టి, కాసేపటికి కునుకు తీస్తాడు. తీరా గుంటూరు వచ్చాక జనం హడావుడికి మెళుకువవచ్చి చూస్తే ఎదురుగా ఉండే కుర్రాడు ఆ సరికే దిగిపోతాడు. కాని, అతను కూర్చుని వెళ్ళిపోయిన చోట బెంచి క్రింద ఒక బంగారు గొలుసు పడి ఉండటం గమనించి, 'పాపం ఆ కుర్రాడిది నిద్రలో పడిపోయి ఉంటుంది' అని భావించి రైలు దిగి ఫ్లాట్ ఫాం మీద కలతిరిగి, చివరికి అతన్ని పట్టుకుంటాడు రంగనాథరావు. అయితే ఆ యువకుడు తాను రంగనాథరావు గారి వద్ద కొట్టేసిన అయిదు వందల కోసం వెంటపడుతున్నాడని భావించి చాలాసేపు తప్పుకు తిరిగినా, చివరకు తప్పనిసరి పరిస్థితిల్లో 'ఇదిగోనండి మీ అయిదు వందలు, రైల్లో క్రిందపడి పోయినాయి' అని రంగనాథరావు గారి చేతిలో కుక్కినట్టు పెట్టి గాభరాగా త్వరత్వరగా స్టేషన్ బయటికి వెళ్ళిపోతాడు. అప్పటికిగాని రంగనాథరావు గారికి తన డబ్బులు పోయిన సంగతి తెలియదు. చివరకు ఆ గొలుసు ఆయన రైల్వే

పోలీసులకు ఇచ్చి చక్కా ఒక స్నేహితుడింటికి వెళ్తాడు. కాని రంగనాథరావు గారికి ఒక చిన్న సందేహం అలానే ఉండిపోతుంది. “భద్రంగా కాగితాల నడుమపెట్టి మూటకట్టి నడుముకు కట్టుకున్న ఆ అయిదు వందలు, ఆ మూట కదలకుండా వుండగా, క్రింద ఎలా పడ్డాయి?” అని. ఈ కథ ద్వారా రంగనాధరావు గారి సత్య కాలం మనస్తత్వానికి, అమాయకత్వానికి, తరాలు మారిన అంతరంలో ఆధునిక యువకులలోని కపటత్వాన్ని, మోసాన్ని గ్రహించే శక్తి లేదని చెప్పకనే చెప్పినట్లుగా ఆవిష్కరిస్తారు పి.ఎస్. నారాయణ గారు.

బహుశ ఈ కాలంలోనే ఆయన తన రచనా భాషను ఉపమానాలతో పొదగటం ఆరంభించినట్లు కనిపిస్తుంది. ఉదా: ఆకాశం మల్లె పందిరిలాగా అందంగా మెరుస్తోంది. (బంగారు గొలుసు, పుట 21 ఆంధ్ర సచిత్ర వార పత్రిక, 1961). ఇలాంటి వాక్యాలు మరింత లోతుగా, సందర్భోచితంగా కథలోని భావోద్వేగాలను మరింత ‘చిక్క’గా చేస్తూ కనిపిస్తాయి ‘శిక్ష’ (1962) కథలో. ఈ కథ ‘చల్లని ఎండ’ (1996)లో గంగాధర్ వేసిన ముఖ చిత్రంతో వెలువడిన కథల సంపుటిలో కనిపిస్తుంది. ‘శిక్ష’కు శుభకృతు నామ సంవత్సర ఆంధ్ర ప్రభ ‘దీపావళి కథల పోటీలో ద్వితీయ బహుమతి లభించింది. అంటే, సుమారు 60 ఏళ్ళ క్రితం ప్రచురితమైన కథన్నమాట. ‘వెలుగు చీకటి గుహలోకి జారిపోతున్నది’. ‘దీపాలకు, చీకటికి క్షణ క్షణానికి శత్రుత్వం పెరిగిపోతున్నది’. ‘నీటి జల్లు ప్రశాంత ప్రకృతికి తీయని జోల పాట పాడుతున్నది’, ‘ఉచల్లాంటి రెండు చేతులెత్తి నమస్కారం చేశాడు’, ‘చుట్టూ ఉన్న కొండలు నిద్ర పొమ్మంటున్నాయి’, వార్డు మధ్యలో ఉన్న గోడ గడియారం గుండె కలుక్కుమనేలా ఒంటిగంట కొట్టింది’, ‘బల్ల ప్రక్కగా నిండుగా ఉన్న నీటి కూజా ఆమెను వెక్కిరించింది’ – వంటి భావుకత నిండిన వాక్యాలు ఆధునిక కవితా ఝురిలో కనిపిస్తాయి. ఈ విధమైన భావుకత నాటి పి.ఎస్. నారాయణ గారి కథల్లో, నవలల్లో కోకొల్లలు.

కథకుడు కాకపోయినట్లైతే పి.ఎస్. నారాయణగారు ఒక మంచి ‘భావుకత’ ఉన్న భావ కవి, ఆధునిక ‘వచన కవి’ అయి ఉండే వాడనటంలో ఏ సందేహం అక్కర్లేదు. ‘ముగింపు’ (1967) పేరుతో, చంద్ర వేసిన ముఖ చిత్రంతో ఒక నవలా సంపుటి వెలువడింది.

ఇందులో రెండు నవలలు మాత్రమే ఉన్నాయి. ఒకటి 'అరుణోదయం'. ఇది ఆంధ్ర సచిత్ర వారపత్రికలో 1963లో ధారావాహికంగా అచ్చయింది. ఈ నవలా సంకలనాన్ని తనను పెంచి పెద్ద జేసి తర్వాత స్వర్గస్తురాలైన సోదరికి, బావగారికి అంకితమిస్తూ నారాయణ గారు రాసిన కవిత వారి కవితా భావుకత లోతులను మనకు జ్ఞపికి తెస్తుంది. 'నువ్వు లేవనే దు:ఖంతో, సంవత్సరాల క్రితం ఉన్నావనే జ్ఞాపకాలతో, యీ రోజున ఉండి ఉంటే, అనే అద్భుత ఆనందంతో కూడ, ఏమీ చేయలేక, మరేమీ చేతకాక భగవంతుడు నాకిచ్చిన ఒకే వరం యీ నాడు ఈ ఊహా చిత్రణ నీకే...'

నారాయణగారి భావుకత ఆయన కొన్ని నవలలకు,కొన్ని కథలకు పెట్టిన పేర్లలో కూడ కనిపిస్తుంది'. 'సర్రియలిజం' (అధివాస్తవికత)కు సంబంధం ఉన్నట్లు ఉండే ఈ పేర్లు కథతో ముడివడే ఉంటాయి. కాని సమాసంగానో, నుడికారంగానో వీటిని వివరించడం సాధ్యపడదు. అదొక వింత పద సంయోగం. నవలలపై, కథలపై శోధించేవారు పి.ఎస్. నారాయణ గారి 300 లకు పైనున్న కథల పేర్లను, నవలల పేర్లను విశ్లేషిస్తే, తెలుగు కాల్పనిక సాహిత్యంలో దీనిని ఒక వినూత్న ప్రయోగంగా చెప్పవచ్చు. ఉదాహరణకు 'గాలి కన్ను', 'స్వప్నంరాల్చిన అమృతం' (కథల సంపుటి పేరు అదే 2000), 'అమృత తిలకం', (ఇండియా టుడే, మార్చి 1999), 'విరగని వీనస్' (ఆంధ్రజ్యోతి సంచిక 1968), 'చిలిపి కిరణం', 'స్వేద ముత్యం' (నవల, స్వాతి ఏప్రియల్ 2021). 'చల్లని ఎండ' (కథా సంపుటి పేరు, 1966. ఇందులో తొలి కథ పేరు 'చల్లని ఎండ'. 1965 ఆగస్టులో ఆంధ్ర సచిత్ర వార పత్రికలో అచ్చయింది). 'కాలే వెన్నెల' (యువ దీపావళి ప్రత్యేక సంచిక 1977), 'ఎరుపెక్కిన చీకటి' (ఇండియా టుడే వార పత్రిక, 1992). కాని, ఒక విస్తృత ప్రాతి పదికన పరిశీలిస్తే పి.ఎస్. నారాయణగారు రాసిన నవలలు, కథలు, అందులోని భావుకత నిండిన, సందర్భోచిత, చిక్కని వాక్యాలు చదివిన వారికి ఇదంతా "సర్రియలిజం" (అధివాస్తవికత)కు చెందిన మరో శాఖలా ఉంటుందనిపిస్తుంది.

నారాయణ గారు పలు కథా సంపుటాల్లో విశిష్టమైన పురస్కారాలు, గౌరవాలు పొందిన తన కథలను నిక్షిప్తం చేశారు. గోవిందరాజు చక్రధర్ ముందుమాట రాసిన 'రేపటి సూర్యోదయం' (2010) కథల సంపుటి కుమార్ గారు వేసిన చిత్రంతో వెలువడింది. ఇందులో 15 కథలున్నాయి. వీటిలో 'చిలిపి కిరణం' 11వ తానా సభల సందర్భంగా

1997 'రచన' మాస పత్రిక తెచ్చిన ప్రత్యేక సంచికలో రావటం ఒక పెద్ద గుర్తింపు. దీన్ని సిడ్ని (ఆస్ట్రేలియా) తెలుగు సంఘం వారు తమ 'వాహిని' మాస పత్రిక (అక్టోబరు 1990 సంచిక)లో పునర్ముద్రించారు. 'ఏ శిల నుంచి ఎలాంటి శిల్పం చెక్క వచ్చే బాగా తెలిసిన కథా శిల్పి పి.ఎస్. నారాయణ' అని విశ్లేషించారు గోవిందరాజు చక్రధర్.

'నిన్నటికి వీడ్కోలు' కథా (2007) సంపుటిలో 'స్నేహం', 'ప్రక్షాళన' కథలకు బహుమతులు రావటమే గాక, ఇవి 'కథా పీఠం' శీర్షిక క్రింద ప్రచురితమైనాయి. 'స్నేహం'కు 2006లో యద్దపాటి వెంకట సుబ్బారావు స్మారక కథల పోటీలో 'రచన'లో ఆ సంవత్సరం ప్రచురితమైన అన్ని కథలలో ఉత్తమమైనదిగా ఎంపిక అవటం విశేషం. మల్లాది వేంకట కృష్ణమూర్తి గారు ఈ సంపుటికి తుది వాక్యం రాస్తూ 'సెంటిమెంట్, మధ్య తరగతి మనుష్యుల సమస్యల నేపథ్యంలో ఉత్కంఠతతో, ఆసక్తిగా ఊహించలేని ముగింపుతో కథల్ని రాయటం వీరి ట్రేడ్ మార్క్. పి.ఎస్. నారాయణ కథలు 'రియాలిజం' చుట్టూనే పరిభ్రమిస్తాయి' అని వివరించారు. దీనిలో ఆరు కథలున్నాయి.

'నిర్ణీతి' కథా సంపుటి (2014)లో బాలి వేసిన ముఖ చిత్రంతో వెలువడింది. ఇందులో 14 కథలున్నాయి. తన మిత్రుడు, సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం నిలుపు కొన్న 'నాట్యావధాని' స్వర్ణరాజు హనుమంతరావు గారికి అంకితం ఇచ్చారు నారాయణగారు. ప్రఖ్యాత రచయిత అలపర్తి రామకృష్ణ ఈ సంపుటికి ముందు మాట రాస్తూ, వీరిని కదిలించే కథలు' అని వర్ణించారు. 'పి.ఎస్. నారాయణ గారి కథల్లో అనుబంధపు పరిమళాలు మనస్సుకు తాకుతాయి. చేయి తిరిగిన రచయిత అవ్వడంతో ఆయన సృష్టించిన ఏ పాత్రయినా కథలో ఒద్దికగా ఒదిగిపోతుంది. కథకు ఊహించని ముగింపు ఇవ్వటంలో ఆయన అందె వేసిన చేయి' అంటూ విశ్లేషించారు అలపర్తి రామకృష్ణ ('దారి తప్పకు' కథ, స్వాతి మాసపత్రిక, 1975).

ఊహించని మలుపులతో రచనలు ముగింపు చేయటం పి.ఎస్. నారాయణ గారి 'సంతకం' లాంటిది. ఆంగ్ల కథా రచనల్లో ఓ. హెన్రీ, గ్రాహమ్ గ్రీన్ వంటివారు ఈ ఎత్తుగడను కొస మెరుపు కథలుగా బహుళ వ్యాప్తిలోకి తెచ్చారు. నారాయణగారు ఈతరహా 'కొస మెరుపు' ముగింపులను కేవలం కథల్లోనే గాక నవలల్లో కూడ అమలు చేశారు.

ఉదాహరణకు 'నువ్వు ప్రక్క నుంటే చాలు' (స్వాతి మాస పత్రిక అనుబంధ నవల జనవరి, 2021). పి.ఎస్. నారాయణ గారి మరో సంపుటి 'రాగ స్రవంతి' (1968). చంద్ర గారు వేసిన ముఖ చిత్రంతో వెలువడిన ఈ కథా సంపుటిలో ఆరు కథలున్నాయి. ఇందులో 'రాగ స్రవంతి' కథ రెండు భాగాలుగా ఆంధ్ర ప్రభలో అచ్చు అయింది. 'స్వప్నం రాల్చిన అమృతం' (2009) తల్లిదండ్రులకు అంకితమిచ్చిన కథా సంకలనం. కుమార్ గారు గీసిన ముఖచిత్రతో వెలువడిన ఈ సంపుటిలో 16 కథలున్నాయి. ఇందులో 'కొత్త పులి' కథకు (1985 స్వాతి మాసపత్రిక) కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి లభించింది. 'చిన్నకోరిక'కు కాశీ భట్ల హనుమాంబ స్మారక కథల పోటీలో ప్రత్యేక ప్రశంస లభించింది. 'ఆశ్రయం' కథకు దేవరాజు వేంకట కృష్ణారావు 116 జయంతి సందర్భంగా 2001 సంవత్సరపు ఉత్తమ కథా స్వర్ణ పతకం దక్కింది. 'అమృత తిలకం' కథకు ఉన్నవ గోపాలకృష్ణ స్మారక కథల పోటీలో బహుమతి రావటం జరిగింది.

నారాయణ గారి 'మంచు దుప్పటి' (2010) కథా సంపుటికి పినిశెట్టి గారు అద్భుతంగా చిత్రీకరించిన నారాయణ గారి చిత్రం అత్యంత సహజమై ఒప్పారింది. ఇది ఎమెస్కో వారి ప్రచురణ. ఇందులో 15 కథలున్నాయి. వాటిల్లో 1997 నాటి అన్ని పత్రికలలో ప్రచురించిన కథల్లో ఉత్తమమైనదిగా 'అజ్ఞాత శత్రువు' ఎంపికవటం నారాయణ గారి రచనా శైలికి ఒక కలికితురాయి. దీనిని తెలుగు విశ్వ విద్యాలయం వారు 'తెలుగు కథ – 1997' పేరున ప్రత్యేక సంచికలో పునర్ముద్రించారు.

నారాయణ గారి రచనల్లో స్త్రీలు ప్రధాన పాత్రలు పోషిస్తారు. 'స్త్రీ' వాద కథలను స్త్రీ రచయితలు ఎలా చిత్రించగలరో, అంతే గొప్పగా ఇంకా ఒకింత ఎక్కువగా నారాయణగారు చిత్రిస్తారనటంలో ఏ సందేహం అవసరం లేదు. నారాయణ గారు రాసిన 300 పై చిలుకు కథల్లో 50 నవలల్లో 90 శాతం 'స్త్రీ' వాదన వైపు మొగ్గు చూపే వృత్తాంతాలే. అసలు ఒక మగ రచయిత ఇన్ని రకాలుగా మానవ జీవితంలో స్త్రీ పాత్రలను వేరు వేరుగా, విభిన్న వాదనలలో, కోణాలలో దర్శించగలడా అనిపించేలా ఉంటాయి నారాయణ కథలు, నవలలు. ముఖ్యంగా స్త్రీ అంతర్గత ఘర్షణలు (ఓ స్త్రీ ఆత్మకథ నవల), అంతరంగిక భావాలు (ఆమె ఒక ప్రశ్న నవల), సిగ్గులు, బిడియాలు, మూతివిరుపులు (ఆమె ఒక ప్రశ్న నవల), స్త్రీల

ఆలోచన ధారా స్రవంతి (నువ్వే నువ్వే నవల), ఇవన్నీ పాఠకులను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతాయి. పెనుగొండ లక్ష్మీనారాయణ గారు ఇటీవల వెలువర్చిన 'గుంటూరు కథలు' (2013) పుస్తకములో కూడా స్త్రీ వాదం కిందనే పి.ఎస్. నారాయణగారి కథను చేర్చడం జరిగింది.

దాదాపు ఆరు దశాబ్దాల రచనా కాలంలో అవిశ్రాంతంగా ఆయన కలం సాగింది. అందుకు కారణం ఆయన రచనలోని 'వైచిత్రి' ఒకవైపు 'రియాలిజం' కథా వృత్తం, 'సర్రియలిజం' లాంటి పేర్లు, వాక్యాలతో కూడిన సంభాషణలు మరోవైపు. భిన్న ప్రవృత్తి గల స్త్రీ పాత్రలు, వేధిస్తున్నట్లుండే సంభాషణలు, ఆవేధింపుల సంభాషణల్లో పాత్రలు నలుగుతున్నప్పుడు పాఠకుల్లో కలిగే ఉద్వేగాలు, ఆ సంభాషణలు పాత్రలను వేధిస్తుంటే వాటికి ముగింపు ఎలా, ఎప్పుడు, ఎక్కడా?... అని ఉత్కంఠ పాఠకుల హృదయాలను పిండుతుంటే, ఆ సాహితీ విన్యాసం, పి.ఎస్. నారాయణ విశ్వరూపం మాత్రమే. అందుకే తెలుగు విశ్వ విద్యాలయం వారు 2019లో ఆయనకు 'కీర్తి పురస్కారం' ఇచ్చి సత్కరించారు. నారాయణ గారికి ఇంకా ఎన్నో అవార్డులు బాకీ ఉన్నాయి.

(పి.ఎస్. నారాయణ గారి 86వ జన్మదిన సందర్భంగా – జూన్ 1, 2023)

(ఆంధ్రజ్యోతి వివిధ దినపత్రిక 16 అక్టోబర్ 2023)

17
దళిత, బహుజన సాహిత్యం

తెలుగు సాహిత్యంలో 'దళిత సాహిత్యానికి' ఒక విశిష్ట స్థానం ఉంది. తెలుగులో తొలి 'దళిత కావ్యం' 'నిరుద్ధ భారతం ('అస్పృశ్యతా ఖండనం' అని కూడా అంటారు) అని ఆచార్య పులికొండ సుబ్బాచారి గారు నిర్ధారించారు (చూ. వివిధ, అక్టోబర్ 24, 2022). దీనిని రాసిన వారు మంగిపూడి వేంకట శర్మ. రచనా కాలం 1915. అదే విధంగా నవలా సాహిత్యంలో ఉన్నవ లక్ష్మీనారాయణ గారు రాసిన 'మాలపల్లి' తొలి దళిత నవల (1922)గా నిలుస్తున్నది. రెండూ గ్రామీణ జానపద నేపథ్యం కలిగినవే.

తొలి నాటి దళిత సాహిత్యం అగ్రవర్ణాల, భూస్వామ్య దోపిడీ వర్గాల చేతుల్లో దళితులు ఎంతటి దారుణ హింసకు గురయ్యారో కళ్ళకు కట్టినట్టుగా వివరిస్తుంది. నాడు భారతదేశంలో పట్టణాల కన్నా పల్లెలే ఎక్కువ ఉండేవి. కొన్ని విషయాలు మినహాయిస్తే నాటి పట్టణ జీవితాలకు, గ్రామీణ జీవితాలకు పెద్ద తేడా ఉండేది కాదు. ఈ కారణంగా దళితులు, దళితేతరుల మధ్య ద్వేష భావాలు తీవ్ర స్థాయిలో ఉండేవి. నేటికీ అవి కొనసాగుతున్నాయి. ఇది భారత జాతిలోని ఒకానొక మరచిపోలేని చీకటి అధ్యాయం. దీనికి ముంగింపు ఎప్పుడో ఇంకా తేలని చీకటి కోణం. అయితే, ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. ఈ చీకటి అంచున ఆకాలం లోనే ఒక వెండి జరీ వెలసింది. ఇక్కడ ఇరు వర్గాలు (దళితులు, దళితేతరులు) తెలుసుకోవలసిన విషయం ఒకటి ఉంది. అదేమిటంటే బ్రాహ్మణేతరులు (దళితేతరులు, సబ్బండ వర్ణాలు) ఒకనాడు ఇదే నేల పైన అగ్రవర్ణాల చేతి మీదుగా హారతులు, అర్చనలు, జోహార్లు, పూజలు, గౌరవాలు అందుకొన్నారు. అదెప్పుడూ

ఎలా జరిగింది, ఎలా జరుగుతోంది? వివరించటమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశ్యం. ఇదే సమయంలో దళితేతరులు, అగ్రవర్ణేతరులు లేక సబ్బండ వర్ణాల సాహిత్యం మాటేమిటి? సాహిత్య చరిత్ర పరిశోధనలో వీరి గురించిన సాహిత్యంపై కూడ ఒక చర్చ జరపవలసి ఉంది. లేకపోతే బ్రాహ్మణేతరుల సాహిత్య చరిత్ర సమగ్రం కాదు. అతుకుల సాహిత్యం, గతుకుల చరిత్ర అవుతంది. ప్రస్తుతం అలానే ఉంది. రాజకీయ బలం ఉన్నవైపు సాహిత్యంపై మాత్రమే సాహిత్య శోధన జరుగుతున్నది.

'కొన్ని ఘటనలు గ్రామీణ జీవనంలో జరిగినప్పుడు అవి కొంత కాలానికి చరిత్రగా మారతాయి. ఆ ఘటనలే జనపదుల నోళ్లలో నానుతూ కావ్య రచనకు ప్రేరణయినప్పుడు ఆ సాహిత్యం 'జానపదేతి' వృత్తంగా' రాసిన సాహిత్యం అవుతుంది' అంటారు ఆచార్య కొలకలూరి (కట్టమంచి) ఆశా జ్యోతి. సాహిత్యానికి, చరిత్రకు, వాస్తవ ఘటనలే ఊపిరన్నది నిర్వవాదంగా నిరూపించారు ఆమె తన 'ఆధునిక ఆంధ్ర కవిత్వంలో జానపదేతి ఇతివృత్తం 'పరిశోధనా గ్రంథంలో. పైగా ఆఘటనలు అగ్రవర్ణేతరులు, ప్రధానంగా సబ్బండ వర్గాలు, లేక దళితులే ప్రధాన పాత్రలుగా జరిగినప్పుడు ఆ సాహిత్యం జానపద 'అగ్రవర్ణేతరేతి' లేదా 'దళితేతరేతి' వృత్తంగా రాసిన సాహిత్యం కూడా అవుతుంది. 'దళితేతి' జానపద ఇతివృత్త సాహిత్యం గురించి ఈ వ్యాస ప్రారంభంలోనే చెప్పుకొన్నాం. ఈ సందర్భంగా కొలకలూరి ఆశాజ్యోతి తన పరిశోధనలో వెలుగులోకి తెచ్చిన 'ఆధునికాంధ్ర కవిత్వంలో 'జానపదేతి వృత్తం' నూతన సాంఘిక, సామాజిక సమీకరణ విశ్లేషణలకు దారులు తెరిచే పరిశోధనగా ఎంతో ప్రాధాన్యం కలిగి ఉంది.

ఇక 'జానపదేతి వృత్తం' పరిశోధనలో ఆశాజ్యోతి ఎన్ను కొన్న కథల ప్రాముఖ్యత నేటి తరం పరిశోధకులను, పాఠకులను ఆశ్చర్య చకితులను చేస్తుంది. ఆవిడ కేవలం ఈ వర్గాల ఘటనలను 'జానపద' ఇతి వృత్తంగానే దర్శించారు తన పరిశోధనలో. కానీ, ఈ పరిశోధన కొన్ని నూతన సామాజిక పరిణామాలను కూడా తెరపైకి తెస్తుందన్నది ఆవిడ అనుకోని ఉండరు. ఈ ఎంపిక వెనుక సాంఘిక, సామాజిక కోణాలు చాలానే ఉన్నాయి. ఇదేదో 'పరిశోధన' కోసం 'పరిశోధన' వంటిది కాదు. ఈ పరిశోధన 20వ శతాబ్ది ఆరంభంలో సాహిత్యంలో బహుముఖంగా వచ్చిన సామాజిక పరిణామక్రమానికి, ముఖ్యంగా

బ్రాహ్మణేతరుల (దళితులూ, సబ్బండ వర్గాలు) జీవితాలు, త్యాగాలు సమాజంలోని అన్ని వర్గాలకూ ఎలా ఆదర్శప్రాయం అయ్యాయో, ఎలా అన్ని వర్గాల ఆరాధన, పూజలు, జోహార్లు అందుకొన్నాయో ఒక్క చోటే ఒడిసిపట్టి విశదీకరిస్తుంది.

ఇక్కడ విషయం ఏమిటంటే ఆవిడ ఎంచుకొన్న జానపద వాస్తవ ఘటనలు అటువంటివి. అవి : ముసలమ్మ మరణం (1899), నలజారమ్మ (1917), ఒకనాడు (1965), నారాయణమ్మ (1966), మొహియారు (1972), మహాదాత (1973), స్వాతంత్ర్య వీరుడు (1977), పూర్ణాహుతి (1977), చివరగా గుండ్ల కమ్మ చెప్పిన కథ (1985). ఈ ఘటనలు ఎవరి పేరు మీద జరిగాయో అవే పేర్ల మీద ఖండ కావ్యాలు రాయటం జరిగింది. వీటిని రాసిన వారిలో ఇద్దరు మాత్రమే రెడ్డి కులస్తులు : కట్టమంచి రామలింగారెడ్డి 'ముసలమ్మ మరణం' రాయగా, దువ్వూరి రామిరెడ్డి 'నలజారమ్మ' ఖండ కావ్యం రాశారు. తక్కిన వాటిలో ఆరు ఖండ కావ్యాలను బ్రాహ్మణులయిన విద్వాన్ విశ్వం ('ఒకనాడు'), ముదివర్తి కొండమాచార్యులు ('నారాయణమ్మ', 'పూర్ణాహుతి'), పోలూరి ఆంజనేయ ప్రసాద్ ('మోహియారు'), అందలం కృష్ణమూర్తి ('మహాదాత'), పాణ్యం నరసయ్య ('స్వాతంత్ర్య వీరుడు') రాశారు. నాగభైరవ కోటేశ్వరరావు (గుండ్లకమ్మ చెప్పిన కథ) ఒక్కరే కమ్మవారు. ఈ పరిశోధనలో ఆమె రెడ్ల వర్గీకరణను వివరించి వారిని ప్రధానంగా కాపు కులస్తులుగా పరిగణించారు.

ఈ వ్యాసం ప్రారంభంలో తొలి దళిత కావ్యం 'నిరుద్ధ భారతం' (1915) రాసిన వారు మంగిపూడి వేంకట శర్మ గారని ఎందుకు పేర్కొనటం జరిగిందో ఈ పాటికి పాఠకులకు విదితం అయ్యే ఉంటుంది. ఇక ఈ ఖండ కావ్యాలలో ప్రధాన పాత్రుల ఎక్కువ శాతం రెడ్డి కులస్తులవే అయినప్పటికీ, 'ఒక నాడు' నాయకుడు హంపన్న 'బోయ' కులస్థుడు. 'మోహియారు' తురుష్కుడు. అతని నాయిక చంద్రవదన పద్మ నాయకుల కులస్తురాలు. అలాగే 'పూర్ణాహుతి'లో నాయకుడు వేముల శెట్టి. ఇలా బ్రాహ్మణేతరులు బ్రాహ్మణ ఖండ కావ్యాలకు ప్రధాన నాయకులై నిలిచారు. బ్రాహ్మణేతరులైన కవుల ఖండ కావ్యాలకు కూడా బ్రాహ్మణేతరులే నాయకులై నిలిచారు. ఈ విషయంలో మంగిపూడి, ఉన్నవ (ప్రక్రియ

పరంగా నవల అవటం మినహా) వారి పంథా కన్నా భిన్నమైన పంథాకు 1899-1917 మధ్యనే బీజం పడిందన్నది చరిత్ర చెబుతున్న సత్యం. ఈ మార్పు సమాజం నడకలో అప్పుడప్పుడే వస్తున్న పరిణామానికి అద్దం పడుతున్నదనటంలో సందేహం లేదు.

సామాజికంగా సాహిత్య చరిత్ర విశ్లేషణకు, జానపదేతి వృత్తాలకు అలాంటివి వెలుగులోకి రావటం చాలా అవసరం. ఆశాజ్యోతి జానపదేతి సాహిత్య శోధనకు ఇది పూర్వ రంగం అయితే మధ్యలో ఖాళీలను డాట్స్‌తో కలుపుకొంటూ పోలేము. సాహిత్య చరిత్ర శోధనలో దేనికైనా పూర్వ రంగం అంటూ ఒక గొలుసు ఏర్పడాలి. ఆ తర్వాతనే ఉత్తర రంగం ఆవిష్కరణ సులువు అవుతుంది. ఒకవేళ ఈనాటికి మనం పూర్వ రంగం టూకీగా కూడా ఏర్పరచుకోలేకపోయినా, ముందు తరాలు ఆపని చేసే దిశా నిర్దేశం చేయగలగాలి. ఈ విధంగా జానపదేతి వృత్తాలుగా ఆశాజ్యోతి ఎన్నుకొన్న కావ్యాలకు ఉత్తర పరిశోధనా ప్రాముఖ్యం (ముఖ్యంగా సాంఘిక, సామాజిక కోణంలో) ఉందనడంలో ఏ మాత్రం సందేహంలేదు.

ఇక ఇతి వృత్త కథల విషయానికి వస్తే కట్టమంచి రామలింగా రెడ్డి రాసిన 'ముసలమ్మ మరణం' ముందుంది. ఈ కథలో పూజలందుకొంటున్న వారిలో ఒకరైన 'ముసలమ్మ' అనంతపురం కు చెందిన బుక్కరాయ సముద్రం గ్రామస్తురాలు. ఒకసారి ఈ బుక్కరాయ చెరువుకు గండిపడితే, ఆ చెరువులోని గంగమ్మ తల్లి ఆ ఊరి ప్రజలతో 'ఎవరినైనా ఒక స్త్రీని ఈ చెరువులోకి తోసేస్తే, నేను మీ ఊరు ముంచకుండా ఆగిపోతాను' అని పలికింది. అప్పుడు ఆ గ్రామ వాసి అయిన బసిరెడ్డి కోడలు ముసలమ్మ నీళ్ళలోకి దూకి ప్రాణ త్యాగం చేస్తుంది. అంతటితో గంగ శాంతించి ఆ ఊరును ముంచకుండా వదిలేస్తుంది. ముసలమ్మ చేసిన ఈ త్యాగం గుర్తుగా ఆ ఊరి ప్రూజలు నాలుగు వేపచెట్లను ముసలమ్మ దూకిన చోట నాటారు. ఈ వృత్తాంతం మద్రాస్ గజిటీర్ లో అచ్చయింది. అప్పటి నుంచీ ఆ ఊరే గాక చుట్టు పక్కల వారు కూడా అక్కడికి వచ్చి ముసలమ్మకు పూజా, పునస్కారాలు, పోటేళ్లను బలిచ్చి మాసం నైవేద్యంగా సమర్పిస్తారు. ఇప్పుడు అక్కడ రెండు వేపచెట్లే ఉన్నాయి. అయినా పూజలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ముసలమ్మ మరణం గురించి అనంతపురం, బుక్కరాయ సముద్రం చెరువు నిర్మాణం తెలిపే కైఫీయత్తులో వివరాలు

ఉన్నాయి. ఈ కథలో 'ముసలమ్మ' నిజంగా ముసలిది కాదు. చిన్న వయస్కురాలైన బసిరెడ్డి ఏడో కోడలు. ఈ కావ్యం గురించి పింగళి లక్ష్మీకాంతం గారు రాసిన మాటలు ఒకసారి ఆలకిస్తే ఇక్కడ నూతన సామాజిక కోణం ఏమిటో తెలుస్తుంది. 'తెనుగులో స్త్రీ పాత్రకు ప్రధాన్యమిచ్చి రాసిన కావ్యములు చాలా తక్కువ. ఈ కావ్యములోని 'ముసలమ్మా' పాత్ర యతి నిపుణముగా జిత్రితమైనదే గాని పూర్వ పద్ధతిని వర్ణితమైనది కాదు' – అని రాశారు పింగళివారు.

దువ్వూరి రామిరెడ్డి రాసిన నలజారమ్మ నెల్లూరు సీమకు చెందింది. గూడూరులో నివసించింది నలజారమ్మ. భర్తకు మరణ శిక్ష పడగా, భర్తతోనే సహగమనం చేసిన వనిత. నలజారమ్మ పేరున గూడూరులో గుడి ఉంది. ఆ వీధి పేరు కూడా నలజారమ్మ వీధి. నెల్లూరు చుట్టూ పేరంటాళ్ళు నలజారమ్మ కథను విధిగా చెప్పుకొంటారు. నలజారమ్మ రెడ్డి కులస్తురాలు. భర్త వెంకటరెడ్డి పొరపాటున చేసిన చర్య దొంగతనంగా మారి నాటి తురుష్క రాజుల ఏలికలో మరణ శిక్షార్హమైనది. ఇక్కడ అన్ని కులాల వారు నలజారమ్మను దేవతగా, నమ్మిన వారిని ఆదుకొనే అమ్మగా కొలుస్తారు. విద్వాన్ విశ్వం రాసిన 'ఒకనాడు'లో హంపన్న నాయకుడు. రైల్వే గేట్ కాపలా దారు. ఒక చిన్న గదిలో గేట్‌కు దగ్గరగా ఉంటుంటాడు. ఇతను గుంతకల్లు – గుత్తి మధ్య ఉన్న రైల్వే గేటు వద్ద కాపలా దారుగా పనిచేస్తుంటాడు. బ్రిటిష్ వాళ్ళు పరిపాలిస్తున్న రోజులవి. అక్టోబర్ 4, 1893న బ్రిటిష్ సైన్యం గుంతకల్లులో అడుగుపెట్టింది. ఆరోజు సాయంత్రం గుగ్గిళ్ళు అమ్ముకొనే కురుబ జాతి స్త్రీ ఒకరు, వ్యవసాయం చేసుకొని జీవించే లింగాయత్ కాపు కుటుంబానికి చెందిన మరో స్త్రీ కలిసి పొలం వైపు నుంచి వస్తుండగా బ్రిటిష్ సైనికులు వారిని వెంబడించారు. వారు గూళ్ళపాలెం వద్ద ఉన్న హంపన్న ఇంటికి రక్షణ కోసం పరిగెత్తారు.

ఇది గమనించిన హంపన్న బ్రిటీష్ సైనికుల మనస్సులో ఉన్న దుర్మార్గపు ఆలోచన గ్రహించి వారిని తన ఇంట్లో దాచి సైనికులను అడ్డుకున్నాడు. వారి మధ్యహోరాహోరీ పోరాటమే జరిగింది. హంపన్న మల్లెపందిరి వెదురు బొంగు పీకి వారిపైకి ఎగబడ్డాడు. వారిన చావ చితక బాదాడు. ఫలితంగా బ్రిటిష్ సైనికులు కాలికి బుద్ధిచెప్పారు. అయినా వారిలో ఒకడు వెనుకకు తిరిగి హంపన్న పై కాల్పులు జరపగా ఒక గుండు హంపన్న

తొంటి లోకి దూసుకెళ్ళింది. మూలుగుతూ నేలకొరిగిన హంపన్నను వైద్యానికి తీసుకెళ్లారు. గుత్తిలో ఉన్న మిలిటరీ అసిస్టెంట్ సర్జన్, బ్రిటిష్ అధికారి కారాపిట్ వైద్య సహాయం చేసినా హంపన్న బ్రతకలేదు. నేటికీ గుత్తిలో బెంగుళూరు - కర్నూలు హైవేపై మస్రో సత్రం దగ్గర హంపన్న సమాధి ఉంది. ఈ సంఘటన నాటి హిందూ దినపత్రికలో వచ్చింది. ప్రజలు, హిందూ దినపత్రిక సేకరించిన విరాళాలతో ఆయన సమాధిపై తొమ్మిది అడుగుల శిలాఫలకం వేయించారు ప్రజలు.

ముదువర్తి కొండమాచార్యులు సృష్టించిన మరో ఖండకావ్యం 'నారాయణమ్మ' తన భర్త పాపిరెడ్డి తురుష్క ప్రభువు దౌష్ట్యం వలన మరణించగా సహగమనం చేసిన మహా వనిత. నెల్లూరు సీమలో జరిగిన మరో పతివ్రతా విరోమణి త్యాగం ఈ కావ్య వస్తువు. కందుకురమ్మ, కోరలి కళుగోళమ్మ, గూడూరు తాళ్ళమ్మ, సూళ్లూరు చెంగమ్మ, జొన్నవాడ కామాక్షమ్మ వంటి మహా వనితలు గ్రామ దేవతలై పూజలందుకొంటున్న రోజులవి. నారాయణమ్మ గుండం పడిన చోట కుప్పంచి పాడు. ఇది నెల్లూరులో ఈనాటి నెహ్రూ నగర్లో ఉంది. ఇప్పటికీ సంక్రాంతి నాడు పెరటోళ్లు నారాయణమ్మ జీవిత గాథను ఆనాడు గానం చేసి, నారాయణమ్మకు గ్రామోత్సవం జరుపుతారు.

నారాయణమ్మ కావ్యం విషాదంతం కింద పరిగణించలేమని ఆ కావ్యానికి పీఠిక రాసిన వావిలాల రామమూర్తి గారు అభిప్రాయ పడ్డారు. ఆవిడలో దైవత్వం మరణం తర్వాత కూడా ప్రకటితం అవటాన్ని బట్టి ఆమెను శివ స్వరూపిణిగా వర్ణించారు వావిలాల రామమూర్తి. ఎందుకంటే దేవతల ఇతివృత్తాలలో దేవత విషాదాంతం ఉండదు. పైన పేర్కొన్న నెల్లూరు పరిసర గ్రామాల్లోని దేవతలందరూ. వేరు వేరు కులాలవారు. అయినా వీరు దేవతలై నిత్య పూజలు అందుకొంటున్నారు. ఈ రకమైన ఆలోచనకు నాడే ఆజ్యం పోసిన వారు పింగళి లక్ష్మీ కాంతం. వావిలాల రామమూర్తి అదే అభిప్రాయాన్ని నారాయణమ్మ కావ్యానికి ప్రకటించారు. పోలూరి ఆంజనేయ ప్రసాద్ రాసిన 'మొహియారు' ఒక మతాంతర విషాద ప్రేమ వృత్తాంతం. 14-15 శతాబ్దాల మధ్య రేచర్ల వంశస్థులైన పద్మ నాయకులు కదిరి కేంద్రంగా పాలించారు. రంగనాయకులు వారిలో ఒకరు. వారి కుమార్తె చంద్రవదన. మొహియారు పర్షియా దేశం నుంచి వచ్చిన అందగాడైన వజ్రాల వ్యాపారి. వీరిరువు

కదిరి నరసింహస్వామి దేవాలయ ప్రాంగణంలోనే తొలిసారి ప్రేమలో పడతారు. ఆ విషయం తెలిసి రాజు మొహియారును చంపిస్తాడు. తన తండ్రే మొహియారును చంపించాడని తెలిసి నిండు సభలో చంద్ర వదన ఆత్మార్పణ చేసుకొంటుంది. మొహియారు, చంద్రవదనల దేహాలను అప్పటి ప్రజలు కదిరిలోని ముస్లీముల శ్మశాన వాటికలో ఒకేచోట కలిపి ఖననం చేశారు. ఈ సమాధులు చాలా ఖరీదైనవిగా అందంగా ఉంటాయి. నేటికీ కదిరి వెళ్లిన వాళ్ళు వాటిని దర్శించవచ్చు. కదిరి దేవాలయం ఎంత ప్రాశస్త్యం గలదో, అక్కడికి వచ్చే వారికి ఈ సమాధులు కూడా అంతటి దర్శనీయ క్షేత్రమే.

అందలం కృష్ణమూర్తి సృజించిన ఖండకావ్యం 'మహాదాత'లో వెంగళ రెడ్డి దాన ధర్మాలతో జీవిస్తూ, ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతూ ప్రాణం వదిలాడు. పాణ్యం నరసయ్య రాసిన 'స్వాతంత్ర్య వీరుడు' ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి ఆంగ్లేయులతో పోరాడి ప్రాణాలు అర్పించాడు. ముదువర్తి కొండమాచార్యులు రాసిన 'పూర్ణాహుతి' ఖండ కావ్యంలో వేమాల శెట్టి ప్రజల తాగునీటి అవసరాల కోసం బావి తవ్విస్తూ, బావిలో ఎంతకూ నీరు పడకపోవడంతో తన ప్రాణం అర్పిస్తాడు. ఆ వెంటనే నీళ్లు ఉబికి పైకి వస్తాయి. నాగ భైరవ కోటేశ్వరరావు సృజించిన 'గుండ్ల కమ్మ' ఖండ కావ్యం కూడా ప్రేమాయణమే. ఇది అద్దదు, అంకి చెంచు జాతి కలహాల కారణంగా ఆత్మార్పణ చేసికొంటారు.

ఇక్కడ వీరందరూ దేవతలై పూజలు, హారతులు అందుకోవడానికి కారణం వారి చర్యలు దోష రహితం. మానవ సంక్షేమం అవటమే. అంతే గాని వారి కులాలు కాదు. అందువల్లనే వీరు బ్రాహ్మణులకు, బ్రాహ్మణేతరులుకు కావ్య వస్తువులు అయ్యారు. కులంతో గాక, గుణం, దోషారాహిత్యం, మానవ శ్రేయస్సు కోరే వారందరూ సమాజానికి ఆదర్శనీయులేనని నిరూపించే ఈ ఇతివృత్తాలతో వెలుగొందిన ఈ జానపదేతి ఆధునికాంధ్ర కవిత్వం కొత్త సామాజిక సాంఘిక విశ్లేషణలకు ముందు తరాలకు ముందు చూపునిస్తుందనటంలో అతిశయోక్తి ఏమీ లేదు

(మిసిమి మాసపత్రిక అక్టోబర్ 2023)

18
కాలనాళికలు - 'గుంటూరు కథలు'

తెలుగు కథల్లో అచ్చ తెలుగును గుభాళిస్తూ, అనేక భావ, రసోద్యమాలకు, అభ్యుదయ భావాలకు, బీజక్షేత్రమై, దేవాలయ సమానమై ఒక గర్భ గుడిగా నిలిచి, దేవతల స్థాయిని మించిన కథా, నవలా రచయితలను, మహాకవులను తన కథానిలయంలో ఘనాపాటీలుగా నియమించుకున్న 'గుంటూరు కథలు' దశోత్తరశత వసంతోత్సవాలు (2023-24) జరుపుకొనే సంవత్సరం ఇది. ప్రముఖ సాహితీ వేత్త, అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం ప్రస్తుత అధ్యక్షులు పెనుగొండ లక్ష్మి నారాయణగారు తన సంపాదకత్వంలో తెచ్చిన ఈ 'కథా సంకలనం' తెలుగు కథా సాహిత్యచరిత్రకే ఒక కలికితురాయి వంటిది. దీనిని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, గుంటూరు జిల్లాశాఖ 'గుంటూరు కథ'కు శతవసంతాలు నిండిన సందర్భంగా 2013 లో ప్రప్రథమంగా వెలుగులోకి తెచ్చింది. తెచ్చి కూడా దశాబ్ద కాలం నిండింది. ఈ సందర్భంగా ఈ కథా సంకలనాన్ని, అందులోని కథలను ఒకసారి అవలోకించటం ఎంతైనా అవసరం. ఈ కథా సంకలనం ఆసాంతంగా చదివిన వారి హృదయం రక రకాల అమృతప్రేయమైన భావజాలాల్లో విహరిస్తుందనటంలో కించిత్తూ సందేహం లేదు. దీని ప్రాముఖ్యం ఒక పరిమిత పరిమాణ వ్యాసంలో చెప్పటం చాలా కష్టమైనా అనివార్యమైంది.

గతానికి, వర్తమానానికి సంబంధం తెంచేస్తే రాబోయే తరాలు సంప్రదాయ మానవ విలువలను, మహోన్నత తెలుగు జాతి సంస్కారాలను మరిచిపోయే ప్రమాదం ఎంతుందో తెలియ జెప్పే ఈ 'గుంటూరు కథలు' సంకలనం తేవడం ఎంత క్లిష్టమైందో ఆ గ్రంథం

ఒక సారి చదివితే గానీ పాఠకులకు తెలియదు. తెలిస్తే గాని మానవ జన్మలోని మాధుర్యం నేటి తరానికి అంతుబట్టదు. ఈ మాటలు రాసేందుకు కారణం నేటి సమాజంలోని అమానవీయమైన సంఘటనలే. నిన్నగాక మొన్న జరిగిన ఘటన ఎంతో కలిచి వేసింది మానవ జాతిని. పేరూ, వివరాల్లోకి పోకుండా టుకీగా చెబుతాను. వార్తలు చదివే, లేదా చూసే పాఠకులకు మాత్రం చప్పున తెలుస్తుంది ఈ కథ(లు) నిజంగా జరిగిందా లేదాని.

ఒక అబ్బాయి, ఒకమ్మాయి ప్రేమించి పెళ్లిచేసుకొన్నారు. తెలుగువాళ్లే. ఉద్యోగ రీత్యా బెంగళూరులో ఉంటున్నారు. ఆ అబ్బాయి స్నేహితుడు ఉద్యోగం కోసం బెంగళూరులోని కొత్తగా పెళ్లి చేసుకొన్న స్నేహితుడి ఇంట్లో ఉండి ఉద్యోగం వెతుక్కుంటానని బ్రతిమాలితే ఒప్పుకున్నాడు ఈపెళ్ళైన అబ్బాయి. అంతే. వాళ్ళ జీవితాలలో నిప్పులు పోశాడు ఈ ఉద్యోగం కోసం వచ్చిన అబ్బాయి. కొత్తగా పెళ్ళైన మిత్రుడి భార్యతో సంబంధం పెట్టుకొని చివరకు పెళ్ళైన మిత్రుడిని కడతేర్చి జైలుకు వెళ్లారు. కథ అంతటితో అయిపోలేదు. రెండేళ్ల తరువాత బెయిలుపై వచ్చిన అమ్మాయి తన నేరస్థుడైన ప్రియుడిని విడిపించుకొని ప్రయత్నంలో ఒక పోలీస్ ఇన్స్పెక్టర్ను మభ్యపెట్టి చివరకు అతడిని కూడా ఉద్యోగంలోంచి పీకించేసింది. ప్రస్తుతం ఆమె ప్రియుడు ఇంకా జైలులోనే ఉన్నాడు బైలురాక.

కాలంనాడు తమిళ నాటి మాజీ ముఖ్యమంత్రి కథలురాసి, నాటకాలు వేసే రోజుల్లో రాసిన 'పరాశక్తి' నవలను (ఇది సినిమాగా కూడా వచ్చింది) జ్ఞప్తికి తెచ్చే రీతిలో సాగుతుంది కదా ఈకథ కాకినాడ మామిడితాండ్రలా. ఇలాంటిదే మరోకథ. ఒకపెళ్ళైన యువతి భర్తను వదిలి, చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చి దిల్సుఖ్నగర్ లోని ఒక గుడి పూజారితో (పెళ్ళై, పిల్లలున్నతనితో) సంబంధం పెట్టుకొని వాడిచేతిలో చివరకు కడతేరిన కథ కూడా అట్టడుక్కు దిగజారిపోయిన మానవ విలువలకు అద్దం పడుతున్నాయి నేటి సమాజ స్థితులు. మరి ఈ విధమైన మానవ సంబంధాలు గతంలో కూడా ఉండేవా? అన్న ప్రశ్నకు 'ససేమిరా కాదు' అన్న జవాబు క్షణం తడబాటు లేకుండా వస్తుంది.

'గుంటూరు కథలు' వీటికి భిన్నమైన, మానవ సంబంధాలున్న, రాగ ద్వేషాలున్నప్పటికీ శృతిమించని అపూర్వమైన చిత్రణలనుమన ముందుచుతాయి. మనమెరుగని ఒక మానవ ప్రపంచం, ఒకప్పుడు తెలుగు రాష్ట్రాలలో పరిఢవిల్లిందని మన కళ్ళకు

మనోరమ్యంగా చిత్రించి చుపిస్తాయీ కథలు. సుమారు 70 మంది మెరికల్లాంటి రచయితలు రాసిన కథలతో కూర్చిన కథా సంకలనం ఇది. అక్కిరాజు ఉమాకాన్తమ్ (పల్నాటి గుత్తికొండ) తొలి కథ 'అన్నపూర్ణ'తో ప్రారంభం అయ్యే ఈ కథాసంకలనం, వేదగిరి రాంబాబు కథ 'తల్లి'తో ముగుస్తుంది. ఈ 70 మంది రచయితల కథలు, అవి అచ్చుయిన కాలంలోని సాంఘిక పరిస్థితులను బట్టి రకరకాలు ఉద్యమాలను ఎలా ప్రతిబింబించాయో తెలిపేట్లుగా వాటిని వర్గీకరించారు. కనపర్తి వర లక్ష్మమ్మ (1896-1978) 'దీర్ఘసుమంగళీ భవ' (భారతి, ఆగష్టు, 1928) కథతో 'సంస్కరణోద్యమం – స్వాతంత్రోద్యమం' కథల్లోకి చొచ్చుకు రావటం ప్రారంభం అయింది. వజ బాబురావు ('మల్లు పంచె', భారతి మాస పత్రిక, క్రోధ నామ సంవత్సరం), కే వి .సుబ్బయ్య ('ఆత్మా శాంతి', ఆంధ్ర విద్యార్థి పక్ష పత్రిక, డిసెంబర్ 15, 1947), బొల్లిముంత శివరామకృష్ణ ('దేశం ఏం కావాలి?') వంటి వారి కథలను ఈ ఉద్యమానికి తొలి పునాది రాళ్లను వేసినట్టుగా పరిగణించారు.

తరువాత కాలంలో తెలుగు నాట 'కమ్యూనిస్టు' ఉద్యమం ప్రధాన పాత్ర పోషించింది. మునిపల్లె వీర్రాజు ('దొడ్డమ్మ వారసులు', స్వాతి,ఏప్రిల్, 1988), కొడవటిగంటి కుటుంబరావు ('పైకివచ్చినవాడు', ఆంధ్రప్రభ వారపత్రిక, డిసెంబర్ 8, 1954), రావూరి భరద్వాజ (ఎందుకైనా మంచిది, కథావాహిని-3,1954), ఆలూరి భుజంగ రావు ('నిన్నటికి నేడు ఏమవుతుంది? అరణ్యపర్వం, కథా సంపుటి, జనవరి 1997), నల్లూరి రుక్మిణి,'బీటలెత్తినబీళ్ల కోసం' (అరుణతార, మే 2003) తో కమ్యూనిస్టు కథల ఉద్యమం పరాకాష్ఠకు చేరింది. ఇక్కడ ఒక విషయం పాఠకులు గమనించాలి. ఈ ఉద్యమాల వర్గీకరణ చేయటం, వాటి క్రింద కొంతమంది రచయితల పేర్లు మాత్రమే ఇవ్వటం అనేది ఒక 'సూచనా మాత్రం' గానే పరిగణించాలి. అంతేగాని ఈ రచయితల తరువాత ఎవ్వరూ 'సంస్కరణోద్యమం' చేయలేదని గాదు. లేదా కమ్యూనిస్టు ఉద్యమ అభ్యుదయ భావాలు నిబిడీకృతమైన కథలు ఇవ్వాళ ఎవ్వరూ రాయటం లేదనీ కాదు. ఈ ఉద్యమాలకు బీజాలు పడేందుకు తొలినాళ్లలో గొప్ప కథలు రాసిన వారిలో వీరూ కొందరిని అర్థం చేసుకోవాలి .

శ్రమ, కులం, మతం క్రింద దాదాపు తొమ్మిదిమంది ప్రసిద్ధ కథా రచయితలను చేర్చారు. వట్టికొండ విశాలాక్షి (రిక్షావాలా. ఆంధ్ర జ్యోతి, 1954) తో ప్రారంభించి, గోపీచంద్

(చెప్పులు కుట్టేవాడు, పతితులు కథా సంపుటి, 1985), మా గోఖలే (ముత్తాయి కూతురు, భారతి, మార్చి 1956), పెనుమాక నాగేశ్వరరావు (అనుగ్రహం, ఆంధ్ర భూమి మాసపత్రిక), బి.పి. కరుణకుమార్, ప్రతాప రవిశంకర్ వంటి ఎందరో ఉన్నత రచయితల కథలు ఇందులో చేరాయి. 'సంసారం-స్త్రీ'-ప్రధాన భూమికగా మునిమాణిక్యం నరసింహారావు కథ (మా అల్లుడు, నవ కథావళి), పి.ఎస్. నారాయణ (గొడుగు నీడ, ఆంధ్ర భూమి సచిత్ర వారపత్రిక, మార్చ్, 3 2006), వాసిరెడ్డి సీతాదేవి (తరాలు-అంతరాలు,అన్నదాత మాసపత్రిక , మార్చ్1969), పి.సత్యవతి (పెళ్లిప్రయాణం, ఇండియా టుడే వార్షిక సాహిత్యసంచిక, 1995), ఓల్గా (పురిటి నొప్పులు, ఆదివారం, వార్త దినపత్రిక, మే 11, 1997), కేతు విశ్వనాథ రెడ్డి (ఇచ్ఛాగ్ని, ఇండియా టుడే వార్షిక సాహిత్య సంచిక, 1995) వంటి హేమాహేమీ రచయితల కథలు ఇందులో ఉన్నాయి.

సంస్కృతీ – చరిత్ర క్రింద ఎనిమిది కథలు పొందుపరిచారు. మల్లాది రామకృష్ణ శాస్త్రి 'దుమువులు' కథ నుంచి, శారద రాసిన 'కౌముది ' (కథా వాహిని, 1955), పోరంకి దక్షిణామూర్తి 'చంద్ర వంక' (కలకత్తా ఆంధ్ర సంఘం వారి ద్వాదశ వార్షిక సంచిక 1965), పొత్తూరి విజయలక్ష్మి (సఫల సంరంభం) దాకా అనేకమంది ప్రముఖుల కథలివి. వ్యవసాయం క్రింద జి. వి. కృష్ణారావు 'చేసుకున్న కర్మ', తాళ్లూరి నాగేశ్వరరావు 'మమతా-భ్రమత', పాపినేని శివశంకర్ 'చింతల తోపు', వల్లూరి శివప్రసాద్ 'గిట్టుబాటు', ఎంవి రామిరెడ్డి 'ఓ రైతు ఆత్మ కథ' లను చేర్చారు. విద్య-జన్మభూమి శీర్షికన తల్లావఝుల శివశంకర శాస్త్రి కథ, బొల్లిముంత నాగేశ్వర రావు 'ఓ డాక్టర్ కథ', చలం 'శమంతకమణితో ఇంటర్వ్యూ', కొలకలూరి ఇనాక్ 'పుట్టినూరు' వంటి కథలున్నాయి. గ్రామీణం శీర్షికన గోపరాజు నాగేశ్వరరావు 'దూడ బాతు', పి.చంద్ర శేఖర ఆజాద్ 'ఏరు',విహారి 'దోసిట్లో చీకటి', కె. శర్శ్చంద్ర జ్యోతిశ్రీ 'పెదవడ్లపూడి రైల్వే స్టేషన్' వంటివి చేర్చారు. 'మరికొన్ని'శీర్షికన కొడవటిగంటి కృష్ణమూర్తి 'అభివృద్ధి', చందు సుబ్బారావు 'చీలిక' చేర్చారు. విజయం శీర్షికన శ్రీ రమణ 'ధనలక్ష్మి', కాకాని చక్రపాణి 'మూడో మనిషి', 'ఆదర్శం' శీర్షిక క్రింద సత్యం శంకరమంచి 'వరద', పెద్దిభొట్లసుబ్బ రామయ్య 'పేరయ్య భావి', వాణిశ్రీ 'చూపు', వేదగిరి రాంబాబు 'తల్లి' పొందు పరిచారు.

ఈ సంకలనంలో చేర్చిన కథలన్నీ అమూల్యమే. ఏ కథకు ఉండే గొప్పతనం, ఉన్నతమైన కథాకథనం దానిదే. మొత్తం 70 కథల గురించి చెప్పటం వ్యాసం విస్తృతి భీతితో చేయలేకపోయినా కొన్ని కథల గురించి చెప్పాలని ప్రయత్నిస్తా. 'తొలి తెలుగు కథారచయిత గుంటూరు సీమ వాడవటం గర్వకారణం' అంటారు పెనుగొండ లక్ష్మి నారాయణ. అందుచేత ముందు ఆనాటి కథ ఎలా ఉంటుందోనన్న ఆసక్తి పాఠకులకు ఉంటుందన్న భావనతో వారి 'అన్నపూర్ణ' కథను టూకీగా వివరిస్తాను. సుమారు వంద సంవత్సరాల క్రితం భారతీయ గ్రామీణ జీవనం, అప్పటి వివాహ పద్ధతులు, నాడు స్త్రీలు అపరిపక్వ వయస్సులో తమ సమవయస్కుడు గాని వారిని వివాహం చేసుకొని వారితో పిల్లలను కనటం, ఆ సంతానం తరుచూ మరణిస్తూ తొలుత తల్లికి, తరువాత వయస్సు ముదిరిన భర్తకు ఎలా నరకప్రాయంగా మారుతాయో కళ్ళకు కట్టినట్టు ఆవిష్కరిస్తారు రచయిత ఉమాకాన్తం. అంతటి సమాజంలో నరసింహుడు అనే 'చైతన్యం' ఉన్న సోదరుడు అన్నపూర్ణ భవిష్యత్తు గురించి వేదనపడటం ఎంతో కలచి వేస్తుంది. వయస్సు ముదిరిన సూర్య నారాయణ సాముద్రికం చెప్పే వాడి మాటలు నమ్మి పిల్లలపై పిల్లలని కని, వాళ్ళు వరుసగా చనిపోతుంటే తట్టుకోలేక మంచానపడి మరణించటం, అన్నపూర్ణ కాళ్ళు చచ్చుపడిలేవ లేని స్థితిలో ఉండటం కళ్ళవెంబడి నీరు జలజలా రాలేట్టు చేస్తుంది.

అలాగే కనపర్తివరలక్ష్మమ్మ రాసిన 'దీర్ఘసుమంగళీ భవ' కథ వితంతు పునర్వివాహం చుట్టూ అల్లిన సామాజిక ఇతివృత్తం. నిజానికి వరలక్ష్మమ్మ ఈ కథకు సైద్ధాంతిక బలం జోడిస్తూ, ఒక అద్భుతమైన ఎత్తుగడవేసి, ఆ ఎత్తుగడలో నాటి బ్రాహ్మణ సమాజ గుత్తాధిపత్యానికి మంగళం పాడిస్తుంది. అంటే ఈ కథలో మార్క్సిస్టు భావజాలంతో విశ్లేషించ వీలు కలిగించే ముడిసరుకు ఎలా పొందుపరచాలో అలానే అక్షరాలా పాదుగొల్పింది. మార్క్సిస్టు భావజాలానికి దారితీసే ఇతివృత్తాలతో తొలుత గుత్తాధిపత్యం వెలగబెట్టే పాత్రలను, అవి సృష్టించే అరాచకాలను ముందు ఆవిష్కరిస్తారు రచయిత్రి. ఆ తరువాత చీమల్లాంటి పాత్రలతో ఈ పెత్తందారుల దాష్టికాలకు ప్రతి ఎత్తులు వేయిస్తారు రచయిత్రి. పరశు రాములు, శివయ్య శాస్త్రి ఈ పెత్తందారులు. బ్రాహ్మణీకాన్ని అడ్డుపెట్టుకొని ఊళ్ళో అరాచకాలు, అవసరం ఉన్న వాళ్ళకు అధికవడ్డీలకు డబ్బులు ఇచ్చి వాళ్ళ కష్టార్జితాన్ని

దోపిడీ చేయటం తమ లక్ష్యంగా పెట్టుకొని వీళ్ళు ఉరిని శాసించేవారు. చివరకు హిరణ్య కశ్యపుడింట్లోనే ప్రహ్లాదుడు పుట్టినట్లు, వీరిరువురి ఇళ్లల్లోనే జన్మించిన శంకరం, పార్వతీలు తమ తండ్రుల దురాగతాలను ఎండకడుతూ లేచిపోయి గుంటూరులో పెళ్లిచేసుకొంటారు. చేసుకొనే ముందు పార్వతి తన మనోగతాన్ని వెల్లడిస్తూ పరాశరుడు, వాసిష్ఠులను ఉటంకిస్తూ తమ పునర్వివాహం శాస్త్ర సమ్మతమేనని అందుకు అంగీకరించమని తన తండ్రిని ప్రార్థిస్తూ ఉత్తరం రాయటం కథకే హై లైట్.

నల్లూరి రుక్మిణి కలం నుండి జాలు వారిన విప్లవ బీజం 'బీటలెత్తినబీళ్ళ కోసం' కళ్ళెంబడికన్నీటి వర్షాన్నికురిపించటమే కాదు, హృదయాల్ని ద్రవింపచేస్తుంది. ఇది కరువు బారిన పడిన రైతులు పొట్టపట్టుకొని, గొడ్లు, గోదాను వెంటేసుకొని అడవి మార్గం పట్టిన వైనాన్ని గుండెలు బరువెక్కేలా, హృదయ విదారంగా వర్ణిస్తుంది. నేటి భావకవిత్వం ఎంత గొప్పగా రాసినా ఆనాటి దీనస్థితిని నల్లూరి రుక్మిణి వర్ణించినట్టు వల్లించటం ఎవరివల్లా కాదనిపించింది ఆ వర్ణన చదువుతుంటే. కరువున్న చోటే రైతుల దీనస్థితిఉంటుంది. అక్కడే దోపిడి జరిగే అవకాశం ఉంటుంది. వేలు ఖరీదు చేసే గొడ్లను పప్పు బెల్లాల క్రింద అమ్మేయలేక, కబేళాలకు ఇచ్చేయలేక రైతులు పడ్డమనోవ్యథ వర్ణనాతీతం. ఇక్కడే అన్నలూ ఉంటారు. పెత్తందారుల తరుపున పనిచేయడానికి, దోపిడీదారులు చట్టబద్ధంగా దోపిడీ చేస్తే రక్షించడానికి పోలీసులూ ఉంటారు. వారి దగ్గర ఇష్టం వచ్చినప్పుడు పేల్చేందుకు తుపాకులూ ఉంటాయి. చివరకు ఊరేంబడి పడ్డ రైతులు అన్నలు, పోలీసులకు 'ఇన్ ఫార్మర్లు' గా కనిపిస్తారు. అన్నలచేతిలో 'బ్రతుకు జీవుడా' అని తప్పించుకున్నా, పోలీసుల చేతిలో చచ్చి శవాలుగా మారటంతో కథ ముగుస్తుంది. ఆద్యంతం దుఃఖభరితమై సాగే ఈ కథాకథనం ఊపిరిని నిలిపేస్తుంది కథ ముగిసేవరకు.

కొడవటిగంటి కుటుంబరావు రాసిన 'పైకి వచ్చిన వాడు' కథ నాటి గ్రామీణ ముఖచిత్రాన్ని, సగటు మనిషైన సీతారామారావు (కథకు ప్రధానపాత్ర ఇదే) గ్రామీణ జీవితం నుంచి పట్టణ స్థాయి ఉద్యోగానికి వెళ్ళేప్పటికీ సమాజంలో రాజకీయంగా, ఆర్థికంగా ఎన్ని మార్పులు చేసుకొన్నాయన్నది కళ్ళకు గట్టినట్టు చిత్రీకరిస్తుంది. మధ్య తరగతి వ్యవసాయ దారులు, వ్యవసాయం మానేసి, పొలాలను అమ్ముకొని పట్నం వెళ్లి ఏం బావుకొన్నారో కూడా వివరించే కథ. చివరకు తమ అన్న రాఘవులు కొడుకు పెద్దగా సంపాదించకపోయినా,

కమ్యూనిస్టు విప్లవ భావాలతో శుద్ధుడై తన మామగారిపైనే పోటీచేసి ఎన్నికల్లో గెలవటం ఒక కొత్త ప్రశ్నను లేవనెత్తుతుంది సీతారామారావుకు. 'అదే తన అన్న కొడుకు ఎం. ఎల్. ఏ గా గెలిచి పైకి వచ్చిన వాడి కింద లెక్కా? రాని వాడి కింద లెక్కా? అని.

పి .ఎస్. నారాయణ 'గొడుగు నీడ' కథ మోడు బారిన భార్యా భర్తల సంబంధాలలో కూడా తిరిగి పచ్చదనం చిగురిస్తుందని తెలిపే కథ. తొలుత భార్యాభర్తా సంబంధాలు అనుకోని పరిస్థితుల్లో తెగతెంపులైపోయినా, కాల ప్రవాహంలో తిరిగి ఆ బంధాలు జీవం పోసుకొని చివరి రోజుల్లో 'గొడుగు నీడలా' మారుతుందని, అది ఎలా సాధ్యమో వివరిస్తుంది. జీవితం మీద ఆశను మిగల్చాలి. నిరాశల్లో పడితే మనం ఈ వ్యాసం మొదట్లో స్త్రీ పురుష సంబంధాలు ఏ హీనస్థితికి దిగ జారాయని అనుకొన్నామో అదే జరుగుతుంది. అది మానవ జీవితం ఔన్నత్యాన్ని సంపూర్ణంగా పరాస్తం చేస్తుంది . ఇంకా తల్లావజలా శివ శంకరశాస్త్రి గారి కథ 'గాదె' ఆసాంతం పొట్ట పగిలేలా హాస్యం పండిస్తోంది. అయితే ఈ కథలో ఆనాటి పాఠశాల ఉపాధ్యాయుల వింత మనస్తత్వ అద్భుత చిత్రీకరణ ఉంది. ఆ నాటి ఉపాధ్యాయుల దాష్టికం విద్యార్థులు ఎంతగా నిరసించారో చక్కగా విమర్శించారు శివశంకర శాస్త్రి గారు.

ఈ సంకలనం తేవడం తెలుగు కథకు మహోపకారం చేశారు పెనుగొండ లక్ష్మి నారాయణ గారు. నిజానికి ఒకే సంకలనంలో వేరు వేరు కాలాల్లో వచ్చిన తెలుగు కథలు అవటం ఈ సంకలనానికి ఆయువుపట్టు వంటిది. సాహిత్య , సామాజిక పరిశోధనా ప్రియులకు ఈకథా సంకలనం అందించే ముడిసరుకు అపారమైందనటంలో ఎంత మాత్రం సందేహించవలసిన పని లేదు. ఆయా కాలాల్లో సమాజంలో ప్రధాన సమస్యలు ఏమిటి అన్నది సులువుగా ప్రోదిచేయవచ్చు. భిన్న రచయితలు ఆయా సామాజిక సమస్యలను ఎలా దర్శించారో, ఎలా విశ్లేషించారో మరోసారి పరిశోధకులు కొత్తగా వాటిని దర్శించి ఆధునిక సామాజిక సైద్ధాంతిక నేపథ్యంలో వివరించవచ్చు. నాటి సాహిత్య విలువలు, భాషా ప్రయోగాలు, వాక్య నిర్మాణాలు మనకెంతో లోతైన అవగాహన నిస్తాయి. కనపర్తి లక్ష్మమ్మ వాడిన అనేక భాషా శబ్దాలు అచ్చ తెలుగువి. నేడు వాటి ప్రయోగం వాడుకలో లేదు. ఉదాహరణకు 'ఉమ్మాలికము', 'వేష్టపడ్డారు' వంటివి కొన్ని. ఆవిడ వాక్య

వ్యంగ్యనిర్మాణాలు గూడా అలానే ఉంటాయి. 'బుద్ధిశాలియగు విష్ణు శర్మ రాజకుమారులకు హితోపదేశం సేయుటకు కరటక దమనకుల నేనాడు సృష్టించెనో కాని, తత్సంతతివారు ఇప్పటికినీ ఉన్నారు' అంటుంది.

ఇలా ఈ వ్యాసకర్త అనేక భాషావిశేషాలను ప్రోది చేసినా, ఈ వ్యాసంలో వాటిని ఏకరువు పెట్టి విశ్లేషించటం యుక్తం కాదు కనుక ఆ పని చేయలేదు. కథా సాహిత్యంకు సంబధించిన అన్ని విషయాలను లక్ష్మీనారాయణ ఈ సంకలనంలో వివరించారు. తొలుత వెలువడిన కథా సంపుటి/సంకలనం నుంచి ఏ చిన్న కథా సాహిత్యం విషయం విడవకుండా ఈ బృహత్గ్రంథంలో చేర్చారు. సాహిత్య పరిశోధకులకు, కథాప్రియులకు, సామాజిక చరిత్ర పరిశోధకులకు ఈ పుస్తకం అమూల్యమైనది.

(ప్రజాశక్తి దినపత్రిక అక్షరం పేజీ - నవంబర్ 20, 2023)

19
సూర్య వనాలను సృష్టించిన 'కవిరాజు'

'నిన్న నేను సూర్యుణ్ని చూశాను/ నీలి మైదానంలో ఆడుకొంటూకాదు/ హరిత శాద్వలాలు ఆరబోస్తూ కాదు/మబ్బు పడవలకు తెరచాపలెత్తుతూ కాదు/గడ్డు బ్రతుకులు మోసే కండలమీది స్వేద ముత్యంలోంచి/నిన్న నేను సూర్యుణ్ని చూచాను' (సూర్యధ్వజం, 1989).

ఈ కవిత రాసింది ఎవరో కాదు,'కవి రాజు' గారు. 'కవిరాజు' అసలు పేరు పెన్మత్స సత్యనారాయణ రాజు. 'కవిరాజు' బిరుదం వారికి ఆప్యాయంగా ఓసగింది గుంటూరు శేషేంద్రశర్మగారు. కవిరాజు పద అల్లికల్లోని అల్లసాని జిగిబిగిలకు, ప్రకృతి, భావుకతల సంగమానికి ముగ్ధుడై, రాజుగారి 'సూర్య కతారి' (1994) కవితా సంపుటికి ముందు మాట కూడా రాశారు శేషేంద్రశర్మ. రాయటమే కాదు, సౌమ్యుడైన రాజు 'సూర్య కతారి'లో మార్క్సిజంను దర్శించాడు శేషేంద్రశర్మ. అంతేగాదు, సమాజంలోని 'హింస'ను ప్రతిఘటించేందుకు మార్క్స్ 'ప్రతిహింస' అనివార్యం అన్నాడే కానీ, 'మార్క్స్' సౌమ్యుడని, అహింసావాది అని ప్రతిపాదించాడు శేషేంద్ర. సమాజ చలన గతుల్లో, పదార్ధ గతి తార్కిక వాద రీతులలో ఇది 'అనివార్య పరిణామం' అని గూడా శేషేంద్ర వివరించాడు. వీరి కవితల్లో వాకాటిగారు రవీంద్రుడిని, దేవులపల్లి కృష్ణ శాస్త్రిని దర్శిస్తే, వాడ్రేవు చిన వీరభద్రుడు శ్రీ శ్రీ 'సర్రియలిజం' దర్శించారు. ఆ 'సర్రియలిజం' లో రెండు మార్గాలున్నాయని, ఒకటి 'లక్ష్యంకల సర్రియలిజం' అని, రెండవది 'లక్ష్యం లేని సర్రియలిజం' అని వివరిస్తూ, శ్రీ శ్రీ లాగానే 'కవిరాజు ' రెండు పద్ధతులను పాటించాడని వివరించారు వాడ్రేవు చిన వీరభద్రుడు. ఇలా బహుముఖీయమై , బహుకోణాల్లో అభివ్యక్తమయ్యేదే కవిరాజు కవితా ఝురి .

కవి రాజు గారు 'సూర్య' శబ్దానికితన కవితలలో విస్తారమైన నిర్వచనం కలిపించారు. వారు వెలువరించిన కవితా సంపుటాలలో 'సూర్య రథం' (1983), సూర్య ధ్వజం (1989), సూర్య కతారి (1994), సూర్యాంశువులు (1996), సూర్య పుత్రి (2009), సూర్యోదయం (2011), సూర్యపర్వాలు (2013) వరకూ ఏడు సంపుటాలు ఒక్కొటి సూర్యుడు పూంచిన ఒక్కోరథంగా భావించవచ్చు. వీటిని సూర్యుడి ఏడు వర్ణాలుగా కూడా అనుకోవచ్చు. శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 'కీర్తి పురస్కారం' అందుకొన్న 'కవిరాజు'కు పలు సాంస్కృతిక సాహిత్య సంస్థలు పలు బిరుదులు ఇచ్చాయి. 'కవితాశ్రీ' (2014) బిరుదును తెలుగు రక్షణ సమితి, 'కవి నభోమణి' బిరుదును (2016లో) శ్రీ ధరిత్రీ కళావిలాసం వారూ అందచేశారు.

వీరి జీవిత చరమాంకంలో 'సూర్యుడి' నుంచి దూరం జరిగి కృష్ణుడికి దగ్గరయ్యాడనిపిస్తుంది. 'కల హారం' (2022), 'నీ రూపం' (2022) కవితా సంపుటాలు వీరి హృదయాం తరాళాల్లోని వేణు గానాన్ని, రాధా మాధవుల లయభంగిమలను తలపిస్తాయి. వీరి 'సూర్యపుత్రి' (2009)ని, 'సూర్య కతారి' (1994)ని, సూర్యోదయం (2011)ని అనువాదశ్రీ రంగయ్యగారు హిందీలోకి అనువదించారు 2013లో. వీరి 'సూర్య కతారి' (1994) కవితా సంపుటిని వదలి మందేశ్వరరావు గారు ఆంగ్లంలో అనువాదం చేశారు.

కవిరాజు గారు మే 8, 1944 లో కాకర పర్రు గ్రామం (తణుకు)లో జన్మించారు. ప్రీ యూనివర్సిటీ కంటే ఎక్కువ చదువుకోను వీలుకాని కుటుంబ పరిస్థుల్లో, పొట్టపట్టుకొని హైదరాబాద్ చేరారు ఉద్యోగం వేటలో. తొలుత బయోలాజికల్ ఇవాన్స్ లో ఉద్యోగ జీవితం ఆరంభించిన రాజుగారు, 1964లో అప్పుడే కొత్తగా పెట్టిన సింథటిక్ డ్రగ్స్ ప్లాంట్‌లో (దీన్నే తరువాత కాలంలో ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మస్యూటికల్స్ లిమిటెడ్ గా మార్చారు) చేరారు. దాదాపు 36 ఏళ్ళు అక్కడే పనిచేసి 2000లలో రిటైర్ అయ్యారు. ఆయన చదివిన చదువుకు, చేసిన ఉద్యోగానికీ ఆయన హృది పలికించిన కవితా ఝురికి ఎంతమాత్రం సంబంధం లేదు. డా.నాగభైరవ కోటేశ్వరరావుగారు పలికినట్టు కవిరాజుగారి భావశకలాలు, రస విస్ఫోటనాలు జన్మ సంస్కార ఫలంగా వచ్చినవే –అవి ఎదో చదవటం వలన కలిగినవి కావు. అయినా ఆయన పలికిన భావ, రసవిస్ఫోటాలు అనితర సాధ్యం.

'కొంపలు తగలబెడుతోంది/కుటిల రాక్షస రూపం/అంతం చేయి దాని ప్రతాపం / ఇదిగో దీపం/ ఇది భావాగ్ని చాపం' అంటారు కవిరాజు 'సూర్య కఠారి' లో. 'ఆయన కవితా ప్రయాణంలో 'బింబాలజల్లులు' పడతాయి. 'ప్రతీకల గాలులు' వీస్తుంటాయి' – అంటారు వాకాటి పాండురంగారావుగారు. ఇంకో చోటు'నా నెత్తురునే తాగుతూ దప్పిక తీరక తపించి పోతున్నాను/ఏ ఉదయకిరణం అంచు మీదగానో/ఒక అమృతబిందువు నా గొంతులోకి జార్చు' అని అంటారు (సూర్య కఠారిలో).

మరోచోట 'ఆ ఉదయం .... /సూర్యకిరణం నా గదిలోకి దూసుకొని వచ్చింది / మేలుకొనిచూస్తే నా మంచంమీద ఓ పండుటాకు /దానిమీద 'ఆ చెట్టు ఎందుకు నరికావు?'/ ఇన్నాళ్లు నీకు అమ్మయింది /ఆత పత్రం అయింది /వీవన అయింది /ఆరోగ్య దీవెన అయింది /కోయిల అయింది /నీ కవితకు ప్రేరణ అయింది /నిను చూడవచ్చినప్పుడు నా రథాన్నినిలిపేది ఆమె నీడనే కదా అని రాసి ఉంది /వెంటనే ఆ స్థానంలో ఓ పూలమొక్క నాటాను ప్రాయశ్చిత్తంగా '(సూర్య రథం). వారి కవితా వాక్యాలు ఎవరినో సంబోధిస్తున్నట్టు ఉంటాయి. 'ఆ ఎవరు?' అన్నది పాఠకుడి జన్మ సంస్కారాన్ని బట్టి బహిర్గత మవుతుంది. ఒక్కోసారి 'ఆత్మాశ్రయమ్' అయినట్లు ద్యోతకమవుతుంది. కానీ, రూఢిగా ఇది 'ఆత్మా శ్రయం' అని చెప్పలేము. ఎందుకంటే అక్కడో మెలిక వేస్తారు కవిరాజు. ఆ మెలికలో ఒక అభ్యుదయ వాదం, ఓ ఆశావాదం, ఒక ప్రకృతి చైతన్యం, ఒక జీవన సత్యం తొంగిచూస్తుంది.

వాక్యాలలో పదాల పొదుగు రవీంద్రుడి 'గీతాంజలి' గేయాల్లా మృదువుగా సాగిపోతాయి. అలలులేని నిశ్చల నదీ ప్రవాహంపై మృదువుగా సాగే పడవ ప్రయాణంలాగ ఉంటుంది. అలాంటి వాక్యాలు అలవోకగా వారినుంచి జాలు వారుతాయి. ఆ విధమైన వాక్య నిర్మాణం కవిరాజు గారి 'సంతకం' లా, వారికే ప్రత్యేకమైన డి. ఎన్ .ఏ గా మరొకరికి అసాధ్యంగా ఉంటుంది. ఠాగోర్ బెంగాలీ 'గీతాంజలి'లోని గీతాలను తెలుగులోకి అనువదించిన బెల్లంకొండ రామదాసు అనువాదాలలోని పదభంగిమలను గమనిస్తే, వాటికంటే సహజమై భావోన్నతమై ఒప్పారుతాయి ఈ రసోస్ఫోటనలు. ఉదాహరణకు ఈ కవితాఖండికల మధ్య పోలిక గమనించండి. వాటిలో నర్మ గర్భంగా దాగిన ఏక 'రసోస్ఫోటన్నాన్ని' చూడండి. జన్మనిచ్చి అమ్మ నన్ను సూర్యుడికి ఒప్పగించి పోయింది/

ఆలనా పాలన చూస్తుండమని' అని సూర్యుడిని తన తండ్రిగా భావించిన కర్ణుడు 'కవిరాజు'. ఇక ఠాగోర్ ఈ భావశకలాన్ని ఇలా పలికాడు 'నీవు నన్ను అంతగా సృష్టించావు/అది నీ విలాసం/ తాకితే చాలు పగిలిపోయే యీ పాత్రికను .... ' (గీతాంజలి 1, మొదటి పంక్తి). ఇలా సూక్ష్మంగా తులనాత్మక పరిశీలన చేస్తే ఠాగోర్ భావశ కాలాలు, కవిరాజు రసోస్ఫోటనాలు సమాంతరంగానే సాగినట్టు సులువుగా తెలుస్తుంది.

'సూర్యోదయం' (2011) కవితా ఖండికలో ఈ పద్య వైచిత్రి చూడండి. దారితప్పి వచ్చిన ఓ ఆగంతకుడు 'దేవుని జాడ చెప్పరా?' అనడిగాడు./ 'దానికింత దూరం రావాలా?' అన్నాన్నేను./ 'ఎవరినడిగినా వారి వారి దేవాలయాలు చూపించారే తప్ప, అతని ఉనికి చెప్పనే లేదు' అన్నాడు. 'ఈ విషయం తెలియదా?/ చిరునామా ఏనాడో మరిచిపోయి దేవుడు అన్నిచోట్లా తనను తానే వెతుక్కొంటున్నాడు./ నువ్వూ ప్రయత్నం చేయ్ !./ 'ఎందుకైనా మంచిది – వీలు చూసుకొని, నీలోకి కూడా ఒకసారి తొంగి చూడు' అన్నాను. 'అలాగే' అంటూ అలాగే వెళ్ళిపోయాడు'/. ఈ కవితలో 'దేవుడే తన చిరునామా మరిచిపోయి అన్నిచోట్లా వెతుక్కొంటున్నాడట. 'ఇందుగలడందు లేడన్న' భాగవత' శ్లోకానికి కొత్త అన్వయం ఎలా కూర్చాడో చూస్తే ఒక ' ఆక్సిమోరాన్ను' ఇలా కూడా చెప్పవచ్చని తొలిసారి కవిరాజే చెప్పాడనిపిస్తుంది.

కవిరాజు తన కవితాలోకంలో ఎవ్వరూ గమనించనిదాన్ని ఇట్టే పట్టేశాడు. మన దేవుళ్ళు , మతం ఎదో కోల్పోయి వెతుక్కుం టున్నారు అని. ఏమిటది? 'కొల్లలుగా దేవుళ్ళని వీధి కొక్కరుగా విసిరిపోయిన ఆ ఋషులకేం తెలుసు? / అమృతం ప్రవహించవలసిన గడ్డ మీద నెత్తుటేరులు పారుతున్నాయని/ ప్రకృతిని విస్మరించిన మనిషి/ వికృత రూపమెత్తి శిలలతో శివాలుతొక్కుతున్నాడని' (సూర్య పర్వాలు 2013) అర్థమయిందా? దేవుళ్ళ కోసం మనుషులు కొట్టుకోకుండా చూసే ధర్మాన్ని మన దేవుళ్ళు, మతం కోల్పోయినై! అని.ఎంత సున్నితంగా చెప్పారు దేవుళ్ళూ, మతాలూ ఎలా దిగజారిపోయాయోనన్న విషయం.

'నిన్ను నేను తలచుకొన్నాను, నన్ను నీలా మార్చుకొన్నాను' అన్న 'థీమ్' తో రాసిన పద్యాలు 'నందనందనం' లో కనిపిస్తాయి (2016). ఠాగోర్ 'గీతాంజలి' లో ఎక్కువగా ఈ ఛాయలున్న గేయాలు కనిపిస్తాయి. ఠాగోర్ ప్రకృతి కవే గాదు, కృషి వలుల స్వేదంలో

కూడా 'ఈశ్వరుడిని' దర్శించిన విశ్వమానవుడు. అదే రీతిలో సాగుతాయి 'నందనందనం' (2016) కవితాసంపుటిలోని కవితలు. 'విహారం' పేరుతో వనమంతా కలియతిరిగి చక్కా వచ్చి/ ఈగట్టుమీద విలాసంగా పాడుకొంటూ కూర్చొన్నావా నాన్నా! /నిన్ను అనుసరిస్తూ వచ్చి భ్రమరాలు/ నీ చుట్టూ ముసురుకొని/ తిరిగి అటు చూడటంలేదని వనాలు బెంగ పెట్టుకున్నాయి తెలుసా –/ఎక్కడ వృక్షసంపద నిర్వీర్యం అయిపోతుందోనని/.

కవిరాజు కడపటి సంవత్సరంలో రెండు సంపుటాలను వెలువరించారు. ఒకటి 'కలహారం' (2022), రెండవది 'నీ రూపం' (2022). కలహారం కవిరాజుకు వచ్చిన కలలలోని కవితలు. ఇటువంటి కవితానుభవం గతంలో ఏ కవులకు వచ్చినట్టు దాఖలాలు లేవు. కానీ, 'సూర్య కఠారి' సంపుటికి ముందు నుంచే కవిరాజు తన కవితలను తొలుత కలలలో గాంచి , వాటిని మెలుకువ వచ్చాక గ్రంథస్తం చేసేవాడినని చెబుతుండేవారు. ఎందరో గొప్ప గొప్ప విమర్శకులు కవిరాజు కవితలపై వ్యాఖ్యానించినా ఎవ్వరూ ఈ విషయం పై దృష్టి సారించలేదు. అందుకేనేమో కవిరాజు ఈ నేపథ్యం ఉన్న కవితా సంపుటాలనే వెలుగులోకి తెచ్చారు. నిజానికి కలలో వచ్చినవైనా పుస్తకం రూపంలో చూసినప్పుడు చదువరులకు వీటిలో విషయమేమి వింతగా కనిపించదు. కానీ, ఇవి కొంత తాత్వికతతో, కొన్ని అభ్యుదయ వాదంతో ఉండటంతో పాఠకుడు తిరిగి తొలుత చెప్పినట్టే 'ఆత్మాశ్రయవాదం' క్రిదకు వస్తాయా, రావో తేల్చుకోలేని డోలాయనమానంలో పడతాడు. భావశకలాలో గాని, రసోస్ఫోటనంలో గాని 'సూర్యకఠారి' కవితలకు, వీటికి మధ్య పెద్ద తేడా యేమి ఉండదు.

ఈ రకంగా ప్రాకృతికమైన మానవ హృదయం కలలో గాంచినది 'నిజమై' నిలవటం రసాయనశాస్త్ర పరిశోధనలలో జరిగింది. 'బెంజీన్' అనే సేంద్రియ రసాయనం నిర్మాణం కనుగొనటం 19వ శతాబ్దంలో చాలా క్లిష్టమైన సమస్యగా ఉండేది. అప్పట్లో ఆగస్టు కేకులి (1829–1896)అనే జర్మనీ రసాయన శాస్త్రవేత్త ఈ 'బెంజీన్' రసాయన అణువు నిర్మాణంపై విస్తృతంగా పరిశోధన చేస్తుండేవారు. ఎన్ని రకాలుగా ఒక నిర్మాణం ప్రతిపాదించి దాని రసాయన ధర్మాలు వివరించాలని చూసినా సంతృప్తి కరంగా దాని నిర్మాణం ఉండేది కాదు. ఈ పరిస్థితుల్లో ఒకసారి ప్రయోగ శాలలోనే నిద్రపోయిన కేకులీ కి ఆ 'బెంజీన్'

నిర్మాణం 'తల,తోక ఒకదానితో ఒకటి కలిసి వలయంలా చుట్టుకుపోయిన సర్పం' లాకనిపించింది. వెంటనే మెలుకువ వచ్చిన కేకులి 'బెంజీన్' నిర్మాణం తాను కనుక్కోగలిగినట్టు ప్రకటించి ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తాడు. ఇలాంటిదే డి. ఎన్. ఏ నిర్మాణ వివరణ విషయంలోనూ జరిగింది వాట్సన్ (1928), క్రీక్ (1916-2004)లకు. అయితే కల వచ్చింది జేమ్స్ డి వాట్సన్ కే. కానీ, ఆ కల ఫలితంగా నోబెల్ బహుమతి విరిరువురికే గాక మొత్తం అయిదు గురికి వచ్చింది.పోతే 'డ్రీమ్ ఎనాలిసిస్' చేస్తూ ఫ్రాయిడ్ మానవ చేతన, ఉపచేతన మధ్య జరిగే అంతర్గత కల్లోలం నుంచీ కలలు వస్తాయని భావించాడు. అలా వచ్చిన కలలో కొన్ని వాస్తవాలు, వ్యక్తిత్వ సమస్యలు, జీవిత ప్రేరణలు ఉండవచ్చని కూడా భావించాడు. ఈ నేపథ్యంలో వాడ్రేవు చైనా వీరభద్రుడు గారి విశ్లేషణ, రాజుగారి కవితల్లో 'సర్రియలిజం' కొంత వాస్తవం అనిపిస్తుంది. రాజు గారి 'కలహారం' (2022) చదివితే ఈ వాస్తవ, అధివాస్తవ చిత్రాలు అర్థం చేసికోవటం కష్టం కాదు సరి కదా రసాస్వాదన కూడా హాయిగా చేయవచ్చు.

నిజానికి కవి రాజు గారి కవితలు 'గీతాంజలి' కి ఎందునా తీసిపోవు. కానీ, తెలుగు వారికి ఠాగోరుకు ఉన్న ప్రచార ప్రజ్ఞ లేదు. ఠాగోర్ కు 'బెంగాలీ' గీతాంజలిని 'ఆంగ్లంలో' అనువదించే ఒక 'ఐరిష్' దేశస్థుడు, యువకుడు అయిన డబ్ల్యూ.బి.యేట్స్ దొరికాడు. అతనికి అప్పటికే నోబెల్ బహుమతి రావటం వలన, అతని అనువాదానికి, సిఫార్సుకు గౌరవం లభించింది. ఠాగోరుకు నోబెల్ బహుమతి లభించింది. మరి 'కవిరాజు'కు తాళ్లు లాగటం తెలియదు. అందుకే అవార్డులు, గుర్తింపులూ ఇంకా రావలసి ఉన్నా రావలసినంత రాలేదు. అందుకేనేమో కవిరాజు ఇలా అంటారు 'ఎప్పటిదో నాకీ వరం / దురాసులకు దురాశలకు దూరం చేసి/కంటకాల సంకటాలు దరిచేరకుండా చేశావు/ అడగకనే అన్నీ ఇచ్చి అక్షయసంపదతో అక్షరాన్ని చేశావు. నిస్సందేహంగా కవిరాజు ఒక నూతన కవితా ఒరవడికి 'వైతాళికుడు' అనడానికి ఏ సందేహం అవసరం లేదు.

(నవ తెలంగాణ దిన పత్రిక దర్వాజ పేజీ - డిసెంబర్ 4, 2023)

20
భారతదేశంలో ఆంగ్లేయుల చీకటిపాలనా రహస్యాలు - శశిథరూర్ ఏమి రాశారు?

భారతదేశ చరిత్రంతా వివాదమయమే. మార్క్సిస్టులది ఒక కోణం, కాషాయ వాదులది మరో కోణం. ఈ రెంటికీ మధ్యే మార్గం ఏమిటన్నది చరిత్ర చదివిన వారికెవ్వరికీ తెలియదు. ఎవరిష్టమైన వాదం వారెంచుకొనేవారున్నారు తప్ప భారత దేశంలో బ్రిటీష్ పాలనా యుగం ఒక 'చీకటి యుగం' గా నిరూపించిన వారెవ్వరూ లేరు. రెండువందలడెబ్బై సంవత్సరాల క్రితం భారత చరిత్రనే ఇంత వివాదం అయితే, అంతకు ముందు మహమ్మదీయుల పాలనా యుగం ఇంకెంత భయానకమో తలుచుకొంటేనే భయమేస్తుంది. ఎంత చీకటియుగాన్ని నాడు భారతీయులు అనుభవించుంటారు. స్కూల్ స్థాయినుంచి యూనివర్సిటీ డిగ్రీ వరకూ చరిత్ర పుస్తకాలను పరిశీలిస్తే, ఎక్కడా భారత దేశంలో ఆంగ్లేయుల పాలనాయుగం ఎంత 'చీకటి మయం' గా ఉండిందో కనబడదు. ఎందుకు ఆలా? నీరద్ చౌదరి లాంటి ప్రముఖ రచయితలు భారత్ లో బ్రిటిష్ పాలనా యుగాన్ని 'స్వర్ణ యుగం'గా అభివర్ణిస్తే, ఇంకెంతో మంది నేటికీ బ్రిటీష్ పాలనాయుగమే బాగుందని, బ్రిటీష్ వారు మనకెంతో నేర్పించారని (నాగరికత కూడా) నమ్మే వారున్నారు.

నిజానిజాలు తెలిపే, ఏ వాదానికి చెందని, ఒక చరిత్ర పుస్తకం ఇటీవలనే వెలుగులోకి వచ్చింది. కేంద్ర సాహిత్య అకాడమీ నుంచి 2019కి గాను ఆంగ్ల సాహిత్యంలో పురస్కారం

అందుకొన్న ఈ పుస్తకం పేరు 'ఏన్ ఎరా ఆఫ్ డార్క్నెస్ – ది బ్రిటీష్ ఎంపైర్'. దీని రచయిత శశి థరూర్. ప్రముఖ రాజకీయ వేత్త, ప్రస్తుత పార్లమెంట్ సభ్యుడు. గతంలో ఐక్యరాజసమితి సెక్రటరీ జనరల్‌కు అండర్ సెక్రటరీగా పనిచేసిన ఈయన ఆంగ్ల సాహిత్యంలో అసమానప్రజ్ఞ కలవాడు. ఈయన ఆంగ్లం చాలా జటిలంగా ఉంటుంది. 'వారు చేసే ఒక చిన్న ట్వీట్లో కూడా కొన్ని ఇంగ్లీషు పదాలకు మనం ఆంగ్ల నిఘంటువును సంప్రదించవలసి ఉంటుంది' అంటారు ప్రముఖ ఆంగ్ల నవలా రచయిత వివేక్ సేథ్. మరి మొత్తం పుస్తకం అలాంటి ఆంగ్ల పదాలతో నిండి ఉంటే సగటు తెలుగు వారి పరిస్థితి ఏమిటి? అంత క్లిష్టమైన ఆంగ్లంలో రాయటం వలననేమో ఈ పుస్తకంలోని అనేక వివరాలు, వాస్తవాలు, బ్రిటీషు వారి స్పందన, నాటి భారత్‌లో బ్రిటిషుపాలన ఎంత భయంకరమైన 'చీకటి యుగమో' చాలామందికి ఎలా తెలిసేది? అందువలన ఎక్కువ మంది తెలుసుకొనే అవకాశం లేక పోయి ఉండవచ్చు. పైగా ఇంతవరకు ఇది తెలుగులోకి అనువాదం కాలేదు.

ఇక్కడో ఆసక్తి కరమైన విషయం ఉంది. శశి థరూర్ ఇంగ్లాండ్ లోని 'ఆక్స్ఫర్డ్ యూనియన్' వారి ఆహ్వానం పురస్కరించుకొని మే 2015లో చేసిన ఒక ప్రధాన ఉ పన్యాసం తరువాత ఒక పుస్తకంగా 2017లో వెలుగులోకి వచ్చింది. 'ఆక్స్ ఫర్డ్ యూనియన్' అనేది ఆక్స్ ఫర్డ్ నగరంలో 'చర్చలు, సదస్సులు నిర్వహించే ఒక అంత్యంత పురాతన సాహిత్య చరిత్ర సంఘం'. దీనిలోని సభ్యులు ఎక్కువ శాతం ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయం వారే కావటం విశేషం. విషయం ఏమిటంటే 'బ్రిటన్ గతంలో తాను పాలించిన దేశాలకు క్షమాపణ లేక నష్టపరిహారం చెల్లించవలసి ఉంది' అని.

'అది ఆక్స్ ఫర్డ్ యూనియన్ వారే ప్రకటించిన విషయం కాబట్టి,బ్రిటిషు పాలనలో మనకు నిజంగానే తీవ్రమైన గాయాలు అయినాయి అని నేను నమ్మాను కాబట్టి, నేను నా ప్రసంగంలో బ్రిటన్ ప్రభుత్వాన్ని సంవత్సరానికి ఒక పౌండ్ పరిహారం చొప్పున 200 వందల పౌండ్లు చెల్లించమని అడిగాను. దీనిని ఒక రకమైన పాపపరిహారంగా పరిగణించవచ్చు. లేదా బ్రిటీషు వారు 'క్షమించండి' అని అడిగినా మంచిదే. కావలసింది బ్రిటిషు వారు పరిహారం చెల్లించటమే' –అని తన ఉపన్యాసం ప్రారంభించిన శశిథరూర్ తన ప్రతిపాదన సమర్ధవంతంగా వినిపించే ప్రయత్నంలో ఎంత పెద్ద, బలీయమైన వాదన చేశారంటే చివరకు అది ఆంగ్లఅచ్చులో 333 పేజీలు వచ్చింది.

ఇక్కడ శశిథరూర్ అసాధ్యమైంది, అసందర్భమైంది ఏదీ అడగలేదు. బ్రిటిష్ వారు భారత దేశంలో చేసిన అరాచకాలు, దురాగతాలు అన్నీ, ఇన్నీ కావన్నది తోసిరాజనాలేని సత్యం. విల్లీబ్రాండ్ట్ జర్మనీ ఛాన్సలర్‌గా ఉన్నప్పుడు వార్సాఘెట్టో (వార్సాలో యూదులు నివసించే ప్రదేశం) వద్ద 1970లో మోకాళ్ళ మీద వంగి పోలిష్ యూదులపై జరిగిన నరమేధానికి (హెూలోకాస్ట్) క్షమాపణ చెప్పారు. కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో 2016లో వంద సంవత్సరాల క్రితం తమ అధికారులు భారతీయ వలస దారులను వాంకోవర్లో దిగకుండా అడ్డుకున్నందుకు క్షమాపణ చెప్పారు. నాడు భారతీయ వలసదారులను అలా అడ్డుకోవడం వలన ఎంతోమంది బీదరికం, ఆకలితో హీనాతిహీనంగా చనిపోయారు. డేవిడ్ కామెరూన్ నిర్వచించలేని మాటల్లో 2013లో 'జలియన్వాలా బాగ్ మానవ హననాన్ని ఒక సిగ్గులేని సంఘటన' గా నిర్వచించారు. అయితే దీనిని క్షమాపణ గా పరిగణించలేము. 1997లో క్వీన్ ఎలిజబెత్ పర్యటించి సందర్శకుల పుస్తకంలో సంతకం చేశారు తప్ప ఒక ప్రశ్చాత్తాప ప్రకటన కూడా చేయలేదు. ఇటీవల ఒక అంతర్జాతీయ సంస్థ జనాభా విభాగం విడుదల చేసిన లెక్కల ప్రకారం ఎనభై సంవత్సరాల పైన వయస్సున్న భారతీయులు ఇప్పుడు గూడా 60 లక్షలమంది ఉన్నారు. అన్నీ కాకపోయినా ఈ పుస్తకంలో చెప్పిన దుర్మార్గపు ఘటనలకుకొన్నింటికైనా వారు ప్రత్యక్ష సాక్షులు. వారి ద్వారా వారి వారసులు కూడా పరోక్ష సాక్షులు. వారికిప్పుడు 50-60 సంవత్సరాలు ఉండవచ్చు. కాబట్టి, ఈ పుస్తకంలో పేర్కొన్నవేటినీ కథనో, కల్పననో కొట్టిపారేయలేము.

ఈసమస్య ఈనాటిది కాదు. యాదృచ్ఛికంగా ఈ 'పరిహారం' చర్చ ఈనాడు (2015లో) వచ్చి ఉండవచ్చు. కానీ, ఈ చర్చకు బీజాలు ఎప్పుడో పడ్డాయి. తొలిసారిగా ప్రిన్స్ చార్లెస్ 'ప్రిన్స్' గా బ్రిటన్ యువరాజుగా కిరీట ధారణ చేసి, బ్రిటీష్ పార్లమెంటును సంబోధిస్తూ ప్రసంగించినప్పుడు ఆయన పలికిన తొలి పలుకులు కూడా ఇంచుమించు ఇలాంటివే. 'చెప్పుకోవడానికి మనది రవి అస్తమించని సామ్రాజ్యమే. కానీ ఈ దేశ చరిత్ర పుస్తకాలలో ఎక్కడా మన ఓటములు, పరాజయాలు, మనం ఎదుర్కొన్న పరాభవాలు ఉండవు. కేవలం మనం సాధించిన విజయాలు, మనం ఎవరిని ఎలా హింసించి, ఎలా వారి రాజ్యాలను దోచుకొన్నాము, ఎలా వలస రాజ్యాల రాజులను మోసం, వంచన చేసి వారి

రాజ్యాలను స్వాధీనం చేసుకున్నాం, ఎలా ఇతర దేశాలలోని ముడి సరుకును తక్కువ ధర కట్టి దోచుకొన్నామువంటివే ఉంటాయి. ఇలా రాసిన చరిత్ర పుస్తకాలను చదివి ఇవ్వాళ ఈ దేశపు యువరాజు నైనందుకు నేను సిగ్గుపడాలో, గర్వపడాలో తెలియటంలేదు' అని.

నిజానికి మన దేశపు చరిత్ర పుస్తకాలలో ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. మనలో మనం ఎంత హీనంగా కొట్టుకొన్నామో, ఎవరెవరు మనల్ని వీపు పగలకొట్టి మన దేశాన్ని ఎలా దోచుకొన్నారోఉంటాయి తప్ప మనం అనుభవించిన 'చీకటి యుగాన్ని', ముఖ్యంగా బ్రిటిషు వారు అనుసరించిన దోపిడీ విధానాన్ని, వాళ్ళ ఏకపక్ష స్వార్ధపూరిత చట్టాలతో మనల్ని ఎలా హింసించింది చరిత్రగా రాయరు మన పాఠ్య పుస్తకాల్లో. అందుకే శశిథరూర్ బ్రిటిష్ లేబర్ పార్టీ నాయకుడు జెరెమికోర్బిన్ ను ఉటంకిస్తూ ఇలా రాశారు 'నిజానికి బ్రిటిష్ ప్రభుత్వం తన ప్రభుత్వ పాఠశాలలలో ఎటువంటి అత్యోక్తి అలంకారాలు, నగిషీలు లేని సాహిత్యంతో తాము చేసిన పరాయి పీడనను బోధించటమే ఉత్తమమైన పశ్చాత్తాప పరిహారం' అని.

శశిథరూర్ రాసిన (చేసిన ఈప్రసంగం) ఈ 'చీకటి యుగం' చరిత్ర సుమారు ఎనిమిది అధ్యాయాలలో విస్తరించి ఉంటుంది. కొన్ని వేల రెఫెరెన్సులతో, వివరణలతో కూడి ఉంటుంది (వీటిలో చాలావాటిని గూగుల్‌లో మళ్ళీ మనం పరిశీలించవచ్చు నిజా నిజాల నిర్ధారణ కోసం). అందువలన ఈ పుస్తకానికి ప్రామాణికత, నిష్పాక్షికత కూడా ఉ న్నాయనటంలో ఎంతమాత్రం సందేహించ వలసిన పనిలేదు.

బ్రిటీష్ పాలనలో జరిగిన దుర్మార్గాలని వివరించే ప్రయత్నంలో వారి వాదనలను వివరించటమేగాక ప్రతి అధ్యాయంలో, ముఖ్యంగా రెండవ అధ్యాయంలోనూ, మూడో అధ్యాయం నుంచి ఏడవ అధ్యాయం మధ్య బ్రిటిష్ వారు తమ దుర్మార్గాలను సమర్ధించుకొంటూ తరుచూ పాడిన అరిగిపోయిన పాటలను తిప్పికొట్టారు. ముఖ్యంగా బ్రిటిషువారి పాలన న్యాయబద్ధతను పరిశీలించటమే ఈపుస్తక లక్ష్యం. ఆలక్ష్యంగా బ్రిటీషు వారు పొందిన లబ్ధి, దానికి సంబంధించిన ఆరోపణలు, అందుకు చూపిన ఆధారాలు, వాదనలు ప్రధానంగా ఈపుస్తకంలో పొందుపరిచారు. ఈ కారణంగా ఈ పుస్తకంలోని శీర్షికలు –అందులోని ఉపశీర్షికలు–కొత్త తరహాగా ఉంటాయి. 1. భారత్ ను దోచుకోవటం, 2. బ్రిటీషువారు ఇండియాకి రాజకీయ ఐక్యత నిచ్చారా? 3. ప్రజాస్వామ్యం, ప్రెస్, పార్లమెంటరీ వ్యవస్థ, చట్టాన్ని అనుసరించటం, 4. విభజించు –పాలించు, 5. వికసించిన

నియంతృత్వం –ఒక అసత్యం, 6. సామ్రాజ్య వాదానికి అనుకూలంగా ఉన్న ప్రత్యేక పరిస్థితి, 7. జమాఖర్చుల పట్టి:ఓ ముగింపు ,8. బ్రిటిష్ వలసవాదం ముగిశాక అస్తవ్యస్త దారుణ స్థితి.

బ్రిటిష్ వారు 'ఈస్ట్ ఇండియా కంపెనీ' అనే ఒక వ్యాపార సంస్థ పెట్టటం వ్యాపారం చేసే ఉద్దేశ్యంతో ఎంత మాత్రం కాదని అది పెట్టిన అనతి కాలంలోనే నాటి రాజులకు తెలిసిపోయింది. కలకత్తా కేంద్రంగా ప్రారంభించిన ఈ వ్యాపార సంస్థకు బ్రిటీష్ పార్లమెంట్ అండదండలు పుష్కలంగా ఉన్నాయన్న విషయం తొలి అధ్యాయంలోనే బహిరంగమవుతుంది. అంటే ఈ కంపెనీలోని వాటాదారులు బ్రిటిష్ పార్లమెంట్‌లో సభ్యులు. బ్రిటన్ అవసరాలకు తగ్గట్టుగా ఈస్ట్ ఇండియా కంపెనీ నడిచిందన్నది సుస్పష్టం. లేకపోతే ఒక వ్యాపారవేత్తకు కావలసినంత సైనిక బలం, ఆయుధ సంపత్తి, మందు గుండు సామాగ్రి బ్రిటన్ ప్రభుత్వం నుంచీ లభించటం సాధ్యమా? నేరుగా యుద్ధంద్వారా రాణీ పాలన భారత్‌లో తేవటానికి, భారతీయ సంస్కృతి, జీవన శైలీ, ఇక్కడ రాజుల వద్దనున్న అపార సైనికబల సంపత్తి వారికి కొరక రాని కొయ్య లాంటిదే. అందువలన ముందు కంపెనీని దింపారు. మొఘుల్ సామ్రాజ్య పతనానంతరం చిన్న చిన్న రాజ్యాలుగా విడిపోయిన రాజుల మధ్య కలహాలను అడ్డుపెట్టుకొని, వారిలో ఒకరికి మందు గుండు సామాగ్రి, సైనిక సంపత్తినీ సమకూర్చి గెలిచిన రాజ్యాలలో కొంత భాగాన్ని తమ స్వాధీనంలోకి తీసుకొంటూ క్రమక్రమంగా విస్తరించడం మొదలు పెట్టారు. ఇక్కడో విషయం గ్రహించాలి .

ఈస్ట్ ఇండియా కంపెనీ అనేది ఏ విధంగా చూసినా ఒక ఉన్నతమైన యాజమాన్యం భావాలున్న వ్యవస్థ గాదు. భయంకరమైన అవినీతికి ఆలవాలమైన అధికారులను కలిగిన కంపెనీ. వీళ్ళ అవినీతి ఎలా ఉండేదంటే ఇక్కడికి వచ్చిన కొద్దిరోజులలోనే ఈ కంపెనీ అధికారులు కోట్లకు పడగలెత్తే వారు. అంతేగాదు, ఈ కంపెనీ పెట్టిన కొద్దీ సంవత్సరాలలోనే దీనిలో వాటాదారులు కావడానికి బ్రిటన్‌లో పోటీ పడటం ఆరంభమైంది. అవినీతినే ఆహారం, పానీయం, వాయువుగా స్వీకరించి జీవించారు వారు. ఈ లక్ష్యం సాధించేందుకు వారు మొదట భారత దేశంలోని పరిశ్రమలను నాశనం చేయటం ప్రారంభించారు. అన్నింటికంటే ముఖ్యంగా బలైంది భారతీయ వస్త్ర పరిశ్రమ. ఈస్ట్ ఇండియా కంపెనీ పెట్టకముందే

భారత దేశంలో ఉండే బ్రిటీష్ వారు మనదేశ వస్త్ర పరిశ్రమ అభివృద్ధి చెందడానికి ఏంతో ప్రయత్నం చేశారు. తొలుత వాళ్ళు బట్టల పరిశ్రమ పెట్టింది మచిలీపట్టణంలోనే. తరువాత దేశమంతా పలునగరాల్లో దానిని విస్తరించారు. ఆనాడు భారతదేశంలో బట్టల పరిశ్రమ ప్రపంచంలోనే ఉత్తమమైంది. 18వ శతాబ్దం నాటికి భారతదేశం ప్రపంచ వ్యాపారంలో 25 శాతం వాటా కలిగి ఉండేది. దీనిని సర్వ నాశనం చేశారు. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకుల్లో గొప్ప స్థాయి గల విలియం బెంటింక్ ఇలా రాశారు: 'చేనేత పనివారి ఎముకలు మైదానాలను తెల్ల రంగులోకి మార్చటం మొదలు పెట్టాయి' అని. అంటే దేశమంత ప్రత్తిపండించారన్న మాట. భారత దేశం పత్తిని పండిస్తూనే ఉంది. కానీ, అది బ్రిటన్‌కు ఎగుమతి చేయటానికి మాత్రమే. పండించిన పత్తి ఇక్కడ వడకటం గాని, మగ్గం నేయటం కానీ లేదు. దీనితో నిపుణులైన చేనేత కార్మికులు బిచ్చగాళ్లుగా మారిపోయారు.

ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశంలోనే అత్యధిక ఆదాయంకల కంపెనీ కావటానికి కారణం అది అనుసరించిన దోపిడీ విధానాలే. రైతులు అత్యధిక శిస్తులు కట్టలేక తమ భూమిలోనే తాము కూలీలుగా మారారు. కఠినాతి కఠిన శిక్షలు అనుభవించారు. వాళ్ళ స్త్రీలు వివస్త్రలై నరకమైన అవమానాలను అనుభవించారు. విపరీతమైన ధనం సమకూరటంతో అవినీతి, హత్యలు, లంచగొండితనం పెరిగిపోయాయి. చివరకు 1857లో ఈ హింసకు, దోపిడీకి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది. ఫలితంగా బ్రిటిష్ రాణి ఈకంపెనీ పాలనకు సంబంధించిన అన్ని వ్యవహారాలను బ్రిటన్ సామ్రాజ్యపరిధి లోకి తేవటంతో ఆమె కీర్తి కిరీటంలో ఒక కలికితురాయి చేరినట్లయింది.

నాటి ఈస్ట్ ఇండియా కంపెనీ దోపిడీకి రెండు ఉదాహరణలు చెప్పాలి. మొదటిది నాటి బెంగాల్ ప్రెసిడెన్సీ తొలి గవర్నర్ రాబర్ట్ క్లైవ్ (1746–1774) ఎంత మాత్రం సిగ్గూ, శరం లేకుండా అవినీతికి పాల్పడటం. 1757 లో జరిగిన ప్లాసీ యుద్ధ విజయానికి కారకుడు క్లైవ్. తొలిసారిగా ఆయన ఇంగ్లాండ్ తిరిగి వెళ్ళినప్పుడు భారతదేశంలో చేసిన దోపిడీ ఫలితంగా లభించిన సొమ్మును సుమారు 2,34,000 పౌండ్లను తనతో తీసుకెళ్లారు. క్లైవ్ ఇండియాకి తిరిగి 1765లో వచ్చారు. రెండు సంవత్సరాల తరువాత తిరిగి ఇంగ్లాండ్

వెళ్లారు. ఆలా వెళ్తూ ఆయన 4,00,000ల పౌండ్లను తీసుకెళ్లారు. అలా తీసుకెళ్లిన సొమ్ముతో ఇంగ్లాండులో క్లైవ్ ఏమిచేసాడన్నది ఎంతో వివరంగా చెప్పుకొచ్చారు శశిథరూర్. అవి ఇప్పటికీ ఇంగ్లాండులో సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయి.

రెండవది అత్యంత హేయమైన, అవినీతి కరమైన గవర్నర్ జనరల్స్‌లో మొదటి వాడు వారెన్ హేస్టింగ్స్ (1772–1785). ఇతని కాలంలో జరిగిన దురంతాలపై ఇతనిని తొలగించాలని బ్రిటిష్ పార్లమెంట్లో చర్చ జరిగింది. బర్కి అనే పార్లమెంట్ సభ్యుడు హేస్టింగ్స్ భారత స్త్రీలపై చేసిన దురాగతాలను ఇలా వివరించాడు: ‘పన్నులు వసూళ్లకు వెళ్లిన అధికారులు బెంగాలీ స్త్రీలను నగ్నం చేసి, ఇళ్ళ బయటికి లాగి, వారి నగ్న దేహాన్ని సమాజంలో అందరికీ చూపించే వారు. తరువాత కొరడాలతో వారి నగ్నదేహాన్ని కొట్టించేవారు. అంతేగాక ఆ స్త్రీల చనుగుబ్బల్ని చీల్చిన వెదురు రెబ్బలు మధ్య ఇరికించి, ఆ చను గుబ్బలను చన్నుల నుంచీ వేరు చేసేవారు. ప్రముఖ పార్లమెంట్ సభ్యుడు షెరిడాన్ సతీమణి ఈ విషయాలు విని పార్లమెంట్లోనే స్పృహ తప్పి పడిపోయారు’. క్లైవ్, హేస్టింగ్‌లు భారతదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ బలంగా పాదుకుపోవటానికి ముఖ్య కారకులు.

భారతీయ వజ్రాల గురించి పత్రికల్లో ప్రముఖంగా రాసే అవకాశం కల్పించిన తొలి ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యక్తి మద్రాస్ గవర్నర్ థామస్ పిట్. ఫలితంగా మొదటిసారి భారతీయ వజ్రాలను సామ్రాజ్యవాద ప్రతీకలుగా పరిచయం చేయటానికి నాందీపలికినట్లయింది అంటారు శశిథరూర్. 1702 లో థామస్ పిట్ ఒక డైమండ్‌ను సేకరించారు. అది ప్రపంచంలోనే అత్యంత విలువైంది, గొప్పది కూడా. సుమారు 400 కారట్లు ఉంటుంది. దీని ఖరీదు అప్పట్లోనే 24,000 పౌండ్లు. దానిని ఒక షిప్‌లో బ్రిటన్ పంపి, తన పదవికి రాజీనామా చేసి ఇంగ్లాండ్ చేరాడు. బ్రిటిష్ చరిత్రకారుడు జాన్ కీ తెలిపిన ప్రకారం పిట్ సంపాదించిన డైమండ్ చుట్టూ అనేక వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఒక కథనం ప్రకారం ఒక హిందూ దేవత (శివలింగం) కంటికి అమర్చిన డైమండ్‌నే పిట్ దొంగిలించాడని. ఈ కథనానికి బలం చేకూరుస్తూ విల్కి కాలిన్స్ 1886లో ‘ది మూన్ స్టోన్’ అనే ఆంగ్ల నవలను రాశారు. అయితేనేం? భారత దేశం నుంచి తీసుకెళ్లిన 15 సంవత్సరాలకు థామస్ పిట్ దానిని ఫ్రాన్స్‌కు చెందిన రేజంట్ డక్ డి’ ఓర్లియాన్స్‌కు 135 వేల పౌండ్లకు అమ్మేశాడు.

భూమి శిస్తుల్లో బ్రిటిష్ వారి దోపిడి చెప్పనలవి కాదు. వారికాలంలో మూడు శిస్తు వసూలు వ్యవస్థలుండేవి. జమిందారీ, రైత్వారీ, మహల్వారీ. ప్రాంతాల వారీగా బ్రిటిష్ పాలన ఉన్నచోట్ల అక్కడి పరిస్థితులను బట్టి వారు వీటిని అమలు చేశారు. 1793 లో బ్రిటీషువారు జమిందారీ వ్యవస్థలో భాగంగా ఒక శాశ్వత భూమిశిస్తు ఒప్పందాన్ని అమలులోకి తెచ్చారు. దీనిప్రకారం శిస్తు అనేది వారు పండించే పంటలో భాగంగా కాకుండా వారి భూమి శిస్తులో కొంత శాతంగా నిర్ధారిస్తారు. దానితో పండించిన రైతుకు తన ఉత్పాదన ఏమీ దక్కేది కాదు. అంటే పంట విఫలం చెందినా శిస్తు తప్పేది కాదు. ఈ లెక్కన ఒక మూడు దశాబ్దాల కాలంలో బ్రిటీషువారు బెంగాల్ నుంచి వసూలు చేసిన శిస్తు 8,17,553 పౌండ్లు నుంచీ 2,680,000 పౌండ్లకు పెరిగింది. ఇదిగాక అక్రమ వసూళ్లు ఎన్నో రెట్లు ఉండేవి. ఈ మొత్తం లండన్ చేరేది. అంతే గాక రైత్వారీ, మహల్వారి వ్యవస్థల క్రింద అధిక భూమి ఉన్న ధనిక రైతుల భూమి, స్వల్ప భూమి ఉన్న చిన్న రైతుల భూమిని పూర్తిగా రద్దుచేసి వాటిని పూర్తిగా కంపెనీ భూమిగా పరిగణించటం.

ఏన్గుస్ మాడిసన్ ప్రకారం 'భారతదేశం నుంచి పెద్ద మొత్తంలో నిధులు దాదాపు 190 సంవత్సరాలు నిరంతరంగా బ్రిటన్‌కు తరలివెళ్లాయి' అంటారు శశిథరూర్. ఇంతేనా? శశిథరూర్ చూపిన ఆధారాల ప్రకారం 17వ శతాబ్దం నాటికి భారతీయ నౌకలకు పోటీపడే నౌకలు ప్రపంచంలోనే లేవు. ఒక్క బెంగాల్ లోనే 4000 – 5000 నౌకలు ఉండేవి .అవి ఒక్కొక్కటి 400–500ల టన్నుల బరువు మోయగలిగి ఉండేవి. భారతీయ నౌకా నిర్మాణాన్ని, వ్యాపారాన్ని దెబ్బ తీయడానికి 1757లో నౌకా ప్రయాణ మార్గాలన్నీ బ్రిటిష్ ప్రభుత్వ తన గుత్తాధిపత్యం కిందకు తెచ్చింది. దీనితో నౌకా యాన మార్గాలపై అధిక పన్నులు కట్టలేక భారతీయ నౌకా నిర్మాణ పరిశ్రమ క్రమంగా మూతపడే స్థాయికి చేరింది. అలాగే ఉక్కు పరిశ్రమను దెబ్బ తీశారు. 18వ శతాబ్దం నాటికి భారతదేశంలోని ఉక్కుపరిశ్రమను శాశ్వతంగా మూతపడేలా చేశారు. ఈ ఉక్కు పరిశ్రమను దెబ్బతీయడమే కాదు, భారతదేశం నుంచి ముడి ఇనుమును అతి తక్కువ ధరకు దిగుమతి చేసుకొని, తిరిగి మనకే ఎక్కువ ధరకు అమ్మ సాగారు. అంతేగాదు టాటాస్టీల్ వారు ఉక్కు పరిశ్రమ స్థాపనకు ముందుకొస్తే ఇంగ్లాండ్ లోనూ పెట్టనీయలేదు. పోనీ ఇండియాలో పెడతామంటే ఆ ఉత్పత్తులు బ్రిటిష్

స్టాండర్డ్ స్పెసిఫికేషన్స్ అనుగుణంగా లేకపోతే వాటిని ఎవ్వరూ కొనకుండా ఆంక్షలు విధించారు.

శశిథరూర్ రాసిన ఈబృహత్‌చరిత్ర వలన మనకు అనేక కఠోర సత్యాలు తెలిశాయి. అన్నీ చెప్పటానికి స్థలాభావం సహకరించదు కనుక కొన్ని ముఖ్యమైనవి టూకీగా చెబుతాను. వాటిలో ఒకటేమిటంటే బ్రిటిష్ పాలన వలననే మన దేశంలో 'సనాతన ధర్మం' పునరుజ్జివనం పొందిందని. ముఘలాయిలు రాకముందే భారత దేశం మొత్తం అనేక రాజుల ఏకఛత్ర పాలనక్రిందకు వచ్చింది. ఒక్కోసారి సగంపైగా భారతదేశం ఒకేరాజుపాలనలో ఉండింది (ఉదాహరణకు మరాఠాల రాజ్యం). రెండవది గ్రామ పాలన వ్యవస్థ. ఇది చాలా బలంగా ఉండేది బ్రిటిష్ రాకముందు. దీన్ని కుప్ప కూల్చారు. కానీ, పకడ్బందీ ప్రత్యామ్నాయం తేవటం చేతకాలేదు. ఫలితంగా ప్రజాస్వామ్యయుతమైన గ్రామీణ వ్యవస్థ నిరంకుశ, గుత్తాధిపత్యం క్రిందకు వెళ్ళిపోయింది. బ్రిటిష్ వారు నియమించిన ఒక అధికారి, లేక జమీందారు గ్రామాధికారి అయ్యాడు. అతను బ్రిటిష్ ప్రభుత్వం ఎంత శిస్తు వసూలు చేయమంటే అంత వసూలు చేసేవాడు. గ్రామ ఆదాయం, ఉత్పత్తితో ఈవసూళ్లకు సంబంధం ఉండేది కాదు. ఇంకా బ్రిటిష్ ప్రభుత్వం నియమించిన అధికారులు జిల్లా మేజిస్ట్రేట్లుగా ఉండేవారు. వీరికి అదనంగా ఎన్నో బాధ్యతలు అప్పగించారు. ఈ పదవులకు తొలుత భారతీయులు అర్హులు కాలేదు. వీరి జీత భత్యాలు చాలా అధికంగా ఉండేవి. అవన్నీ భారతీయుల నుంచీ వసూలు అయిన శిస్తులోనే చెల్లించేవారు. జడ్జిల పదవులన్నీ బ్రిటిష్ వారే నిర్వహించేవారు. బ్రిటిషు వారు ఏనేరాన్ని, అఘాయిత్యాన్ని చేసినా ఏదో ఒక సాంకేతిక కారణం చూపి వాళ్ళకు శిక్ష పడకుండా జడ్జి మెంట్లు రాసేవారు. భారతీయులకు మాత్రం నేరం చేయకపోయినా కఠిన శిక్షలు ఉండేవి.

మనల్ని హింసించేందుకు, అరెస్ట్ చేసేందుకు నియమించిన రక్షక భటుల జీతం కూడా మనమే చెల్లించాం. మొదటి ప్రపంచ యుద్ధానికి 74,187 మంది భారతీయులను సైనికులుగా భారతదేశం నుంచి పంపారు. వీరు గాయపడ్డారో, మరణించారో ఎవరికీ తెలియదు. కానీ, చరిత్ర పుస్తకాలలో మాత్రం 'భారతదేశం బ్రిటిష్ వారికి సహాయం అందించింది. దీనిని బ్రిటిష్ ప్రభుత్వం ఎంతో దయతో అంగీకరించింది' అని పొడి పొడి అక్షరాలతో రాశారు. అంతే గాదు, యూరోపియన్ యూనియన్ అడగక పోయినా మొదటి

ప్రపంచ యుద్ధానికి మనవంతుగా10 కోట్ల పౌండ్లు సహాయం బ్రిటిష్ ప్రభుత్వం మన రక్తం పిండి వసూలుచేసి అందించింది.

మొదటి సిపాయీ తిరుగుబాటులో హిందువులూ, ముస్లిములు కలిసి పోరాటం చేయటంతో అప్రమత్తమైన బ్రిటిష్ వ్యూహకర్తలు వలసవాద పాలనలో భాగంగా విభజించు, పాలించు సిద్ధాంతాన్ని అమలు చేయటం ప్రారంభించారు. అందులో భాగంగా హిందువులు-ముస్లిముల మధ్య చీలిక తెచ్చారు. అందుకు సంబంధించి బ్రిటన్‌కు సాయపడే ముస్లిం నాయకత్వాన్ని పెంపొందిచారు. కులం అనేది బ్రిటిషు వారు రాకపూర్వం ఉన్నప్పటికీ అది వృత్తి ప్రాతిపదికనే తప్ప 'వివక్షణా' వ్యవస్థ కాదు. కేవలం 'ఉనికి' ప్రాధమిక రూపం. బ్రిటిష్ వారి పాలన రాకపూర్వం అన్ని కులాలు సమానమే. బ్రాహ్మలకు ప్రత్యేకతేమీ ఉండేది కాదు. కానీ, బ్రిటిష్ వారు కుల, జాతి గణన ప్రవేశపెట్టి మతాన్ని, కులాన్ని' ఉనికి' వ్యవస్థగా మార్చారు. 'కుల వివక్షత' కలిపించి సమాజ వ్యవస్థను బహుముఖాలుగా చీల్చారు. ఇందుకు ఒక బ్రాహ్మణ పండిత పరిషద్ ఏర్పాటు చేసి వివక్షతతో కూడిన సామాజికవ్యవస్థ నిర్మాణం చేయించారు. ఈ సేవకు ప్రతిఫలంగా బ్రాహ్మలకు సమాజం పై ఆధిపత్యం కలిపించారు. డిర్క్స్ రాసిన 'కాస్ట్ ఇన్ మైండ్స్' లో బ్రిటిష్ వారి ఈ వ్యూహాన్ని సమూలంగా చర్చించాడు. అర్జున్ అప్పదురై, డేవిడ్ వాష్ బ్రూక్ లాంటి వారు 'కులం', 'కుల వివక్ష' ను భిన్నంగా చూశారు. ముఖ్యంగా 'కుల' వివక్ష' అనేది ఒక 'వలసవాద సంపద', బ్రిటిష్ సృష్టిగానే వారూ వాదించారు.

ఇలా అనేక అంశాలను లోతుగా విశ్లేషించి, గతంలో చీలికలు, పీలికలుగా ఉన్న భారత దేశ చరిత్రలో 'బ్రిటిష్ పాలనా యుగం' అసలు స్వరూపం బయట పెట్టటం ప్రస్తుత తరుణంలో ఎంతగానో ప్రయోజనకరం. ఈ పుస్తకం నేటి యువతరం తప్పక చదివి తెలుసుకోవలసినదే.

(విశాలాంధ్ర సాహితీ పేజీ డిసెంబర్ 4, 2023)

21

ప్రకృతీ, భావుకతను సంగమించిన తెలుగు రవీంద్రుడు'కవి రాజు'

'కిసలాయాలనుండి సింధూరం తిలకంగా స్వీకరించి పదికాలాలు చల్లగా వర్ధిల్లమంటూ చెట్లను దీవించి పోతున్నాడు సూర్యుడు/సూర్యునిపాదినుంచి జారిపడి, ఒక అంశువు జెండాగా ఎగురుతూంది/జెండా నడుమ మొలిచిన అక్షరం,కరిగి కన్నీరై కారుతూంది'(సూర్యపుత్రి).

తొలి సంధ్య కిరణాలు నల్లని మబ్బులు చీల్చుకొంటూ వస్తుంటే, ఖణఖణ మండే సూర్య గోళం కాషాయం పులుముకొని సముద్రంపై బంతిలా తేలుతున్నప్పుడు, ఆ అరుణారుణకిరణాలు మహార్ణవంలోచల్లారి, ఆ నీటిని సింధూరవనంగా మార్చినప్పుడు, ఆ తొలి సంధ్యలో, ఆ నీటి అలల ఉరకలలో మునిగి తేలాలని ఎదో తపన, ఆరాటం ఈ దేహం నుంచీ విడివడి, ఎదోనానుంచి వెలువడి, ఆ అనుభూతితో తాదాత్మ్యం చెందాలనే 'తహతహ' నేమందాము? ఈ అనుభూతిని ఏమంటాము? ఇదొక విచిత్ర స్థితి. కవికి మాత్రమే గోచరమై, సామాన్యుడికి అర్థంకాకపోయినా క్షణకాలం అనుభవైక్యమై నిలిచే ఈ ప్రకృతీ, భావుకతల 'రొమాంటిసిజమే' ఈ 'కవిరాజు' ను తెలుగు రవీంద్రుడుగా మార్చింది.

"నేను నేనుగా ఉన్నప్పుడు నిన్ను కానలేకపోయాను/ 'నేను' తప్పుకున్నాను, ఇప్పుడు నీ రూపం తప్ప ఏమీ కనిపించడం లేదు' (నీ రూపం, 2022). దీనినే ఠాగోర్మరోలా

నివేదించారు నేను నీ పాదాల వద్ద కూర్చున్నాను /నా జీవితాన్ని ఒక చిన్న వేణువులా సుగమం, సుందరం చేసుకోనీ/చాలు, నీ వేణువును ఊదుదువుగాని' (గీతాంజలి, 7వ గీతం చివరి పంక్తి).కవి రాజుగారు తన అస్తిత్వం సూన్యంచేసికొని లక్ష్య రూపం పొందారు, ఠాగోర్ తను వేణువుగా మారితే ఆ వేణువే కృష్ణుడు ఊదాడు అంటాడు.

ఇది, కవిరాజు అంతరంగం చవిచూసిన' ప్రకృతి, భావుకతల 'రొమాంటిసిజం' కు పరాకాష్ఠ. శాంతినికేతన్ అశోక వృక్ష ఛాయాలలో ప్రకృతిలో లీనమైరవీంద్రుడు ధ్యానంలో, తాదాత్మ్యంలో గంటలు, రోజులూ గడిపేసేవాడు అని రాశాడు సి.ఎఫ్ ఆంద్రూస్. అది చూడని వారు కవిరాజు కవితా చరణాలలో ఆభాగ్యం పొందవచ్చు. అందుకు సాక్ష్యం ఇదిగో 'నీ సువర్ణ సుందర ప్రాంగణ కేళీ విలాసాలు కీర్తిస్తూ /సూర్యుడు ఆకులమీద వ్రాసే పదాలు పక్షులు పాడుకొంటున్నాయి బాణీ కట్టి' (సూర్య కఠారి).

ఆరు దశాబ్దాలకు పైగా తన కవితాఝురితో తెలుగు కవితా భావ, రసాల నాస్వాదించే పాఠకులను ఉర్రుతలూగించిన 'కవిరాజు' అసలు పేరు పెన్మత్స సూర్యనారాయణ రాజు. మే 8, 1944 లో తణుకు దగ్గర కాకరపర్రు గ్రామంలో జన్మిచారు. ప్రీ యూనివర్సిటీ కన్నా ఎక్కువ చదవను వీలుకాని సూర్యనారాయణ రాజు పొట్ట కోసం హైద్రాబాదు నగరం చేరి బయోలాజికల్ ఎవాన్స్ కంపెనీలో కార్మికుడిగా చేరాడు. రెండేళ్ల అనంతరం సింథటిక్ డ్రగ్స్ ప్లాంట్ లో (ఇదే తరువాత కాలంలో ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మస్యూటికల్స్ లిమిటెడ్ గా మారింది) 1964 లో చేరి 36 సంవత్సరాలు అందులోనే పనిచేసి రిటైర్ అయినారు.

స్కూల్లో చదివే రోజుల్లో ఛందస్సుతో పద్యాలు రాశారు. వీరి తెలుగు ఉపాధ్యాయులు వేమూరి నరసింహమూర్తిగారు వీరికి కవిత్వం పట్ల ఉన్న శ్రద్ధను గమనించి చామకూర వెంకట కవి 'విజయవిలాసం' ఇచ్చి చదవమని చెప్పారు. రాజుగారు దాన్ని ఎన్నిసార్లు చదివారోలెక్కలేదు. ఐడీపీఏల్ లో చేరాక కవిరాజు గారు సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొనటం ప్రారంభించారు.ఈ కాలంలోనే వారికి శ్రీ శ్రీ 'మహాప్రస్థానం', ఇతర రచనలు చదివే అవకాశం కలిగింది. అలా స్వతఃసిద్ధంగా రూపొందిన 'కవి' రాజు గారు. తరువాత కాలంలో అనేక కవితా సంపుటాలను వెలువరించారు. అందుకేనేమో'ఎందుకింత ప్రయాస పడుతున్నావు /నీలోనే వున్న నాకోసం? పొరలు తొలగించుకో, తట్టి లేపిందొక తటిల్లత'

(సూర్య ధ్వజం) -అని రాశారు కవి రాజుగారు. రాజు గారికి తనను 'కవిరాజు' అని పిలవటం సుతాము ఇష్టం లేదు. కానీ, శేషేంద్ర శర్మ గారు పట్టుబట్టి ఆయనకు 'కవిరాజు'అన్న పేరును ఖాయం చేశారు. చివరికి దానిని ఒక 'గౌరవంగా' భావించి ఇన్నేళ్లు ఆ బిరుదాన్నే తన పేరుగా భరించారు రాజు గారు.

కవితా వ్యవసాయం ప్రారంభం రోజుల్లో 'కవిరాజు'గారితో కొందరు సాహితీ మిత్రులు సాహిత్య ప్రయాణం చేశారు. శ్యామలరావు,సత్యనారాయణ రాజు (వీరే తరువాత కవిరాజుగా ప్రసిద్ధికెక్కారు), రాజేంద్ర రెడ్డి, సత్యనారాయణా చార్యులు. వీరు నలుగురు కలిసి రాసిన తోలి కవితా సంపుటి 'లేడి చంపిన పులి నెత్తురు'. 1970-73 మధ్య అచ్చయింది. పేరే వింతగా ఉందికదా! సాధారణంగా 'పులి చంపిన లేడినెత్తురు' అంటే ఏమంత ఆశ్చర్యం కలగదు. మనం చూసినట్టు కవులు చూస్తే ఈ సమాజంలో కవితకు స్థానం ఏముంటుంది? తరువాత 'తొలి కిరణాలు' (చంద్ర బొమ్మతో) 1975 లో అచ్చయింది. వీరి కవితలను తొలినాళ్లలో పత్రికలకు పంపటం చేసినవారు సుప్రసిద్ధ రచయిత పాలకోడేటి సత్యనారాయణ రావు గారు. ఆ రోజుల్లో వీరి కవితలు ఎక్కువగా ఆంధ్రప్రభ దిన, వార పత్రికలలో వచ్చేవి. ఎల్లోరా గారు వీరికి వీరాభిమాని. ఆచార్య తిరుమల, పోతుకూచి సాంబశివరావు గారలు నిర్వహించే సాహితీ కార్యక్రమాలలో కవిరాజు గారి 'కవితా పఠనం' తప్పక ఉండేది. ఆ క్రమంలోనే రాజుగారు ఆచార్య తిరుమలకు ఎంతో సన్నిహితులయ్యారు. ఆ క్రమంలోనే రాజుగారు ఆచార్య తిరుమలకు ఎంతో సన్నిహితులయ్యారు. వీరు రాసిన 'సూర్య రథానికి' (1983)ఆచార్య తిరుమల అద్భుతమైన ముందు మాట రాశారు. బాపు బొమ్మ వేశారు.

ఆ తరువాత కాలంలో 'కవిరాజు' గారు ఒక్కరే తన కవితా సంపుటాలను వెలువరించ సాగారు సూర్య రథం (1983), సూర్యధ్వజం (1989), సూర్యకతారి (1994), సూర్య అంశువులు (1996), సూర్యపుత్రి (2009), సూర్యోదయం (2011), సూర్య పర్వాలు (2013), నంద-నందనం (2016), నీరూపం(2022), కలహారం (2022) వగైరా అచ్చయినాయి. సూర్యుడి సప్తాశ్వాలకు గుర్తుగా వీరు 'సూర్య' శీర్షికన ఏడు కవితా సంపుటాలను రచించారు.

'వసంతం వాలిన ఒక తోటను వేడుకొంటాను/సజ్జడు పూల కోసం పక్షుల గుంపుతో ఆడుకొంటాను/ఏడు స్వరాల కోసం' (సూర్య కతారి). వీరి సూర్యకతారి చదివి నాగభైరవకోటేశ్వర రావు ఇలా వ్యాఖ్యానించారు 'మొదట సూర్య కతారి చదివాను. మంచి పుస్తకం. మీరు మంచి కవి. మీలోఠాగోర్ ఉన్నాడు. చలం అంతరంగం ఉంది. కృష్ణశాస్త్రి హృదయం ఉంది. అన్నింటికీ మించి జన్మతః మీకు లభించిన 'ఇస్తేటిక్ సెన్స్' ఉంది. మీరు అచ్చపు కవి. నిర్మలమైన మీ భావనా భావుకతల స్రోతస్వినిలో నేను మునకలు వేసాను.'

'నేను ఎగిరిపోతున్నాను/సూర్యుని చెక్కిలిమీది అశ్రువులు తుడవాలని? కాలం కొమ్మమీద చిగురై మళ్ళీ మొలవాలని' కవి భావనాశకలాలు కవి కంటేనిరంకుశమైనవి అంటే అతిశయోక్తి కాదు సుమా! లేకపోతే సూర్యుడిమీదకు వెళ్లాలన్న 'గగనయాన్' అభిలాష నలభై సంవత్సరాల ముందే కవిరాజు ఆశల్లో, ఊహల పల్లకీల్లో ఊరేగటమేమిటి? మండే ఆ అగ్ని గోళానికి దగ్గరగా వెళ్తే బూడిద కూడా మిగలదే, మరి ఆయన చెక్కిలి మీద అశ్రువులు ఉండి ఉంటాయన్న ఊహేమిటో? అవి తుడవాలని ఆరాటం ఏమిటో? అంటే ఆయన అంతటి సూర్యగోళాన్ని ఒక సాధారణ మనిషిగానే, తన లానే భావించాడు. మరి ఆయన మండే కొలిమైనా ఆయన చెక్కిలి పైన అశ్రువులు వచ్చి అలాగే ఉన్నాయి కాబట్టి ఈయన ఎగిరి వెళ్లి ఆ అశ్రువులను తుడుస్తాడట. ఏమి స్నేహ భావం, ఏమి మిత్ర వాత్సల్యం? తనకన్నా ఉన్నతులైన వారిని తన స్థాయికి దించక పోతే మిత్ర వాత్సల్యం ఏర్పడేదెట్లా? వారితో రాగ, ద్వేష బంధాలు ఏర్పరచుకోవడం ఎట్లా? రాధ కృష్ణుడ్ని ఏ ధైర్యముతో వరించింది, నృత్యాలు, గానాలు చేసింది? 'వాత్సల్య' కవిత్వం, భావుకతలో నిరంకుశం అంతర్లీనమే గదా! అందుకే నాగభైరవకోటేశ్వర రావు ఆయనలో కృష్ణునిపై విరహంతో వేగిపోతున్న రాధను చిత్రించిన ఠాగోర్ 'గీతాంజలి' భావ శకలాలు చూశాడు.ఠాగోర్ కవితల్లో 'పెర్సొనిఫికేషన్', 'యూఫిమిజం' రెండూ తరుచుగా కనిపిస్తాయి.

'నీ కలల్లో లోకలోకలోకాల్లో నువ్వు మమ్మల్నికంటావు /మా కలల్లో దృశ్యా దృశ్య దృశ్యాలలో నిన్ను మేము కంటాం' (సూర్యోదయం)– అంటారు కవి రాజు. 'కవిత్వంలో ప్రయుక్తమైన ప్రతి అక్షరమూ పులుకడిగిన ముత్యంలా భావించాలి. అందుకే భాషా సంప్రదాయజ్ఞత ఎంత అవసరమో, అభివ్యక్తి దక్షతా అంతే అవసరం. అదే కవి సంస్కారం.

ప్రతి పుటాన్తర్గత భావ సమానతను సాధించ కలుగుతుంది. రాజుకవిత్వం ఆ పరువాలన్నింటినీ సంపూర్ణంగా స్వాధీన పరుచుకుంది' అంటారు ఆవంత్స సోమసుందర్. చంద్రుడిని మబ్బుల చాటునుంచి చూసినప్పుడు, కొబ్బరి ఆకుల ఈనల మధ్యనించి దర్శించినప్పుడు, రావిచెట్టు రెమ్మలమధ్య నుంచీ కనినప్పుడూ వేరు వేరు అనుభూతులు కలుగుతాయి. చంద్రుడు ఒకడే. అయినాచూసే దృశ్యానికి అనుకొన్న మనస్సును ఒక్కోసారి ఒక్కోభావ రసాస్ఫోటనం కలిగిస్తుంది. చంద్రుడిపైన వెలుగూ సూర్యుడిదే, చంద్రబింబంలోని చల్లదనం సూర్యుడిదే, చంద్రుడిని పౌర్ణమినాడు చూసి ఆనందంతో ఎగసిపడే సముద్ర అలలలోని అయస్కాంత శక్తి సూర్యుడిదే. అన్నీ సూర్య మయం అన్న భావన నుంచి రాజు గారి 'రొమాంటి సిజం' ఎప్పుడూ వేరు పడలేదు. 'జన్మనిచ్చి అమ్మ నన్ను సూర్యుడికి ఒప్పగించి పోయింది/ ఆలనా పాలన చూస్తుండమని' అని సూర్యుడిని తన తండ్రిగా భావించిన కర్ణుడు 'కవిరాజు'. ఇక ఠాగోర్ ఈ భావ శకలాన్ని ఇలా పలికాడు' నీవు నన్ను అంతగా సృష్టించావు/ అది నీ విలాసం/ తాకితే చాలు పగిలిపోయే యీ పాత్రికను .... ' (గీతాంజలి 1, మొదటి పంక్తి). ఇలా సూక్ష్మంగా తులనాత్మక పరిశీలన చేస్తే ఠాగోర్భావశ కాలాలు, కవిరాజు రసోస్ఫోటనాలు సమాంతరంగానే సాగినట్టు సులువుగా తెలుస్తుంది.

కవిరాజు 'సూర్యుడి'ని అసమానాలతో, అన్యాయాలతో, హింసతో రగులుతున్న సమాజంలో విప్లవాగ్నికి'ప్రతీక'గా అభివర్ణించారు గుంటూరు శేషేంద్ర శర్మ 'సూర్య కఠారి'కి రాసిన ముందు మాటలో.'నిన్ననేనుసూర్యుణ్నిచూశాను/ నీలి మైదానంలో ఆడుకొంటూ కాదు/ హరిత శాద్వలాలు ఆరబోస్తూ కాదు/మబ్బు పడవలకు తెరచాపలెత్తుతూ కాదు/గడ్డు బ్రతుకులు మోసే కండల మీది స్వేద ముత్యంలోంచి/ నిన్న నేను సూర్యుణ్ని చూచాను' (సూర్యధ్వజం). (రైతు రాతి నేలను దున్నుతూ వున్న చోట / రోడ్లు వేసే పనివాడు రాళ్లు కొడుతూన్న చోట/అతను వున్నాడు /ఎండనకావాననకా పనిచేస్తున్న వారివద్దనే/ అతను వున్నాడు /అతని దుస్తులుకూడా వారి దుష్టులవాలనేదుమ్ముకొట్టుకొన్నవి (గీతాంజలి, 11వ గేయం) ఈ కవితను శేషేంద్రశర్మ రామాయణంలోని 'తతహ్కరుణ వేదిత్వాత్ అధర్మో యమితి ద్విజహ' భావంతోపోలుస్తాడు. కారణ్యబోధ ఉన్నవాడే అధర్మ శాత్రవుడౌవు తాడంటాడు. ధర్మపక్షప్రతిబద్ధుడౌతాడు. దరిద్రాన్ని పారద్రోలడానికి దరిద్రస్రష్టలని సంహరించాలని ప్రతిపాదించిన మార్క్సుసుడుకాడు. సుమకోమల స్వభావంలోంచిఉ

ద్భవించిన చంద్రబింబం కారణ్యంలోనుంచే మార్భిజం పుట్టింది అంటారు శేషేంద్రశర్మ. 'రేపుమందారమైపూస్తుంది/ ఈ సాయం సంధ్యలో చల్లబడ్డగాడ్పు రేపు ప్రభంజనమైవీస్తుంది'. ఇది అని వార్యం అంటాడు కవిరాజు. దీనికి తన ఆమోదముద్ర వేశాడు శేషేంద్ర. వ్యక్తి, ప్రకృతి, ఆనందం ఈ త్రిపీటికలాధారంగా సాగిన 'రాజు' కవితలు మల్లెల వెన్నల్లు. మధురోహలమందారాలు. స్వయంగా సూర్యుడైనవాడు సహస్ర సూర్య సమానుడు మైత్రి కోసం వేసిన నిటారైన నిచ్చెనలే ఈ సంపుటిలోని ఖండికలు. వస్తువూ, శైలికలిసి సమగ్ర శబ్ద వర్ణచిత్రలుగా భాసించే ఈ ఊయలసేవలో ఒకచోర వీంద్రుడు, మరోచోట క్రుష్ణశాస్త్రి పలకరిస్తారు అంటాడు వాకాటి పాండురంగారావు. కవిరాజు రచనల్లో గీతాంజలి–ఠాగోర్రచనలను పోలిన ప్రత్యేక రచన సూర్య పర్వాలు (2013). కవిరాజు అవిశ్రాన్త కవితా వ్యవసాయానికి, కృషికీ తెలుగు విశ్వవిద్యాలయం ఆయనకు 2019లో 'కీర్తిపురస్కారం' ఇచ్చి సత్కరించింది. ఇంకా అనేక సంస్థలు ఆయనకు పలు బిరుదులు ప్రదానం చేసి సత్కరించాయి.

కవిరాజుకవితలు అనేక ఇతర భాషల్లో అనువాదం కావటం తెలుగు కవితలు గర్వకారణం. అనువాద శ్రీరంగయ్యగారు వీరి కవితలను ఆంగ్లంలోకి అనువదించారు. తెలుగులోను ప్రసిద్ధ కథా రచయితపి. చంద్రశేఖర అజాద్కవిరాజు గారినే ప్రధాన ఇతివృత్తంగా 'తెలిమబ్బులఛాయ' అని నవల రాశారు. ఇది అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆట) వారు నిర్వహించిన పోటీల్లో బహుమతి పొందింది.

ఆఖరుగా–'నీకుస్పర్శతో ధరాధరంసుమదలమై కనీ నికాగ్రాన ఆతపత్రమై పర్జన్య గర్వాన్ని విదలించింది/ పదస్పర్శతో విషధరం విద్యా ధరమై వినుతించింది/ ఆలింగనస్పర్శతో కుబ్జఆబ్జంలా వికసించింది/ కన్నా! విశ్వానికి మంగళం కలిగించింది ఎవరున్నార్రా నీకన్నా!!' అంటాడు కవిరాజు తన 'నందనందనం' (2016) కవితాసంపుటిలో. నిజానికి ఆయన క్రష్ణుడ్ని ఉద్దేశించిరాసిన ఈ సుమారు పలుకులు కవిరాజుకే ముందువర్తిస్తాయి. ఎందుకంటే 'కలడుకలడను వాడు కలడోలేడో కనుకు'.

(మిసిమి మాసపత్రిక 2024)

22
'నారాయణీయం'
- పి.ఎస్. నారాయణ సాహిత్యం

"పండరి మనస్ఫూర్తిగా బ్రహ్మకపాలంలో కార్యక్రమాన్ని నిర్వర్తించాడు. రెండోది మావారి ఆబ్దీకాలు కూలి మనిషి చేత పెట్టిస్తున్నాననే బాధకలగకుండా ఉండేందుకు గాను నేను పండరినే దత్త పుత్రుడిగా స్వీకరిదామనుకొంటున్నాను. అప్పుడు అతడు ఈ కార్యక్రమాలు నిర్వర్తిస్తుంటే నాకు, పోయిన ఆయనకు కూడ తృప్తిగా ఉంటుంది".

పూర్ణానంద శాస్త్రి ఆమె మాటలకు అవాక్కయి ఆమెను చూస్తుండిపోయాడు - చాలాసేపు.

"పండరి మీ ధ్గరే ఉంటాడు. మీతోపాటే తిరుగుతుంటాడు. అతడు చేయవలసిందల్లా నేను పుణ్యక్షేత్ర దర్శనానికి వెళ్ళినప్పుడల్లా నాకు తోడుగా రావటం, ప్రస్తుతానికి సంవత్సరానికొకసారి మా వారి ఆబ్దీకం పెట్టటం" చెబుతూ తలవంచుకొని చిన్నగా అన్నది, "తరువాత నాదీను".

గుండెలు పిండే ఈ సన్నివేశం పి.ఎస్. నారాయణ గారు రాసిన 'వైతరిణి' కథ ముగింపున వస్తుంది. (స్వాతి మాసపత్రిక, ఆగస్టు 22). "మంచి కథలలో మానవనైజ పరిశీలనలు, చిత్రణలో తన (రచయిత) వ్యక్తిత్వాన్ని మరచిపోయి, ఊహాజగత్తులో

లీనమైపోయి, కళాసృష్టికి అనువైన ఒకస్థాయిని అందుకోవటం జరుగుతుంది. మంచి కథ అంటే పాఠకుడి హృదయ స్పందనను తాక కలిగేది. ఒక్కొసారి కన్నీళ్ళు కూడ తెప్పించకలిగేది. పి.ఎస్. నారాయణ గారి కథలు 'మంచి కథలు' అని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు చెప్పగలను" అంటారు. ప్రముఖ రచయిత కాకాని చక్రపాణి 'నిన్నటి వీడ్కోలు' (2009, కుమార్ గారి చిత్రం) కథా సంపుటికి ముందు మాట రాస్తూ. ఇది నారాయణ గారి మూడవ కథా సంపుటి. చక్రపాణి గారి విశ్లేషణ కేవలం ఆ కథా సంపుటికే పరిమితం కాదు. వారి వ్యాఖ్యలు నారాయణ గారి మొత్తం 300 పై చిలుకు కథలకు, 50 నవలలకు అంతే స్థాయిలో వర్తిస్తాయి.

ప్రస్తుతం 85వ వసంతం పూర్తి చేసుకొనేందుకు వడివడిగా అడుగులు వేస్తున్న పి.ఎస్. నారాయణ జూన్ 1, 1938లో జన్మించారు. తల్లదండ్రులు రామయ్య, వరలక్ష్మిలు ఆయన బాల్యంలోనే చనిపోగా సోదరి వద్దనే విద్యాభ్యాసం చేశారు. చినకాకాని (గుంటూరు జిల్లా) చెందిన నారాయణ గారి తన రచనల్లో గుంటూరుపై ఏర్పరచుకొన్న అభిమానాన్ని కుప్పలు తెప్పలుగా కుమ్మరించారు. ఆ విషయాన్నే దత్త ప్రసాద్ పరమాత్ముని గారు చంద్ర వేసిన ముఖ చిత్రంతో వచ్చిన 'రాగ స్రవంతి' కథల సంపుటికి ముందు మాటలలో 'నారాయణీయంగా చమత్కరించారు. ఏకబిగిన ఆయన కథల్ని ఒక పాతిక దాకా చదివితే గాని గుంటూరు ఎన్ని విధాలుగా నారాయణగారి కథా కథనంతో పెనవేసుకుపోతుందో ఊహించలేం' అంటారు దత్త ప్రసాద్ పరమాత్ముని. ఆ మాటకు వస్తే ఒక్క కాశీనే నారాయణ గారు రెండు నవలల్లో అద్భుతంగా చిత్రించటమేగాదు, అక్కడ ఏవేమి ధర్మ కార్యక్రమాలు ఎందుకు చేస్తారో వివరిస్తారు. (స్వేద ముత్యం, 2021 స్వాతి; నువ్వేనువ్వే, 2022 స్వాతి). అలాగే 'ఆమె ఒక ప్రశ్న'లో (స్వాతి, 2023) హైదరాబాద్ కూడా. ఆ మాటకొస్తే నారాయణగారి కథల్లో గాని, నవలలోగాని కొన్ని ఊర్లు సిన్మాల్లో చూసినంతగా కళ్ళకు గడతాయి కథ మలుపుల్లో.

తమ కుటుంబంలో రచయిత లెవ్వరూ లేరు పి.ఎస్. నారాయణ గారికి కథలు, నవలలు, నాటకాలు రాసేందుకు ప్రేరణ కావడానికి. ఆయన గుంటూరు హిందూ కాలేజీలో చదువుతున్న రోజుల్లో మన్నవ గిరిధరరావు వీరికి ఆంగ్లం బోధించేవారు. ఓ రకంగా

దూరపు బంధువు అయినా, వాళ్ళిద్దరి మధ్య 'గురు శిష్య' బంధమే ఎక్కువ అంటారు పి.ఎస్. నారాయణగారు. మన్నవ వారి ప్రోత్సాహంతో తొలుత ఇంగ్లీషు కథలు కొన్నింటినీ తెలుగులోకి అనువదించి వారికి చూపించారు నారాయణ గారు. 'అవి బాగున్నాయి' అని మన్నవ వారు భుజం తట్టటంతో నేరుగా తెలుగులోనే కథలు రాసి పత్రికలకు పంపటం ఆరంభించారు. తాను రాసిన తొలి నాటికథ 1957లో అచ్చయినా, అదేమంత చెప్పుకోదగ్గ కథగా ఆయన భావించలేదు. 1968లో నారాయణగారు అచ్చు వేసిన 'రాగ స్రవంతి' కథల సంపుటి (1961 నవంబరు 8న)లో అచ్చయిన 'బంగారు గొలుసు' ఆయన తొలి నాటి కథా రచనకు, శిల్పం, శైలి, ఎత్తుగడకు అద్దం పడుతుంది.

ఇందులో రెండే రెండు పాత్రలు ఉంటాయి. ఒకరు రంగనాధరావు, రెండవ వ్యక్తి ఒక యువకుడు. అదే అతని పాత్ర పేరు. వీళ్ళిద్దరూ ఒక రైలు ప్రయాణంలో ఒకరికొకరు ఎదురుగా ప్రయాణిస్తారు. ఆనాడు రైళ్ళలో సీటింగ్ అరేంజ్‌మెంటు నేటిలా కాకుండా క్లాస్ రూంలోలా బల్లలు ఎదురెదురు వేసినట్టుగా ఉండేవని ఈ కథ ద్వారా చెప్పకనే తెలుసుకోవచ్చు. రంగనాధరావు తన మిత్రుడికి తాను ఏనాడో తీసుకొన్న చేబదులు డబ్బులు అయిదు వందలు తిరిగి ఇవ్వడానికి, అలాగే రెండు రోజులు అక్కడ ఉండి రావడానికి గుంటూరుకు బయల్దేరి రైలు ఎక్కుతాడు. తను తీసుకెళ్తున్న అయిదు వంద నోట్లని బొడ్డులోని ఓ సంచిలో జాగ్రత్తగా పెట్టి, కాసేపటికి కునుకు తీస్తాడు. తీరా గుంటూరు వచ్చాక జనం హడావుడికి మెళుకోవవచ్చి చూస్తే ఎదురుగా ఉండే కుర్రాడు ఆ సరికే దిగిపోతాడు. కాని, అతను కూర్చుని వెళ్ళిపోయిన చోట బెంచి క్రింద ఒక బంగారు గొలుసు పడి ఉండటం గమనించి, 'పాపం ఆ కుర్రాడిది నిద్రలో పడిపోయి ఉంటుంది' అని భావించి రైలు దిగి ఫ్లాట్ ఫాం మీద కలతిరిగి, చివరికి అతన్ని పట్టుకుంటాడు రంగనాధరావు. అయితే ఆ యువకుడు తాను రంగనాధరావు గారి వద్ద కొట్టేసిన అయిదు వందల కోసం వెంటపడుతున్నాడని భావించి చాలాసేపు తప్పుకు తిరగినా, చివరకు తప్పనిసరి పరిస్థితిల్లో 'ఇదిగోనండి మీ అయిదు వందలు, రైల్లో క్రిందపడి పోయినాయి' అని రంగనాథ్‌రావు గారి చేతిలో కుక్కినట్టు పెట్టి గాభరాగా త్వరత్వరగా స్టేషన్ బయటికి వెళ్ళిపోతాడు. అప్పటికిగాని రంగనాధరావు గారికి తన డబ్బులు పోయిన సంగతి తెలియదు. చివరకు ఆ గొలుసు ఆయన రైల్వే

పోలీసులకు ఇచ్చి చక్కా ఒక స్నేహితుడింటికి వెళ్తాడు. కాని రంగనాధరావు గారికి ఒక చిన్న సందేహం అలానే ఉండిపోతుంది. “భద్రంగా కాగితాల నడుమపెట్టి మూటకట్టి నడుముకు కట్టుకున్న ఆ అయిదు వందలు, ఆ మూట కదలకుండా వుండగా, క్రింద ఎలా పడ్డాయి ?” అని. ఈ కథ ద్వారా రంగనాధరావు గారి సత్య కాలం మనస్తత్వానికి, అమాయకత్వానికి, తరాలు మారిన అంతరంలో ఆధునిక యువకులలోని కపటత్వాన్ని, మోసాన్ని గ్రహించే శక్తి లేదని చెప్పకనే చెప్పినట్లుగా ఆవిష్కరిస్తారు పి.ఎస్. నారాయణ గారు.

బహుశ ఈ కాలంలోనే ఆయన తన రచనా భాషను ఉపమానాలతో పొదగటం ఆరంభించినట్లు కనిపిస్తుంది. ఉదా: ఆకాశం మల్లె పందిరిలాగా అందంగా మెరుస్తోంది. (బంగారు గొలుసు, పుట 21 ఆంధ్ర సచిత్ర వార పత్రిక, 1961). ఇలాంటి వాక్యాలు మరింత లోతుగా, సందర్భోచితంగా కథలోని భావోద్వేగాలను మరింత ‘చిక్క’గా చేస్తూ కనిపిస్తాయి ‘శిక్ష’ (1962) కథలో. ఈ కథ ‘చల్లని ఎండ’ (1996)లో గంగాధర్ వేసిన ముఖ చిత్రంతో వెలువడిన కథల సంపుటిలో కనిపిస్తుంది. ‘శిక్ష’కు శుభకృతు నామ సంవత్సర ఆంధ్ర ప్రభ ‘దీపావళి కథల పోటీలో ద్వితీయ బహుమతి లభించింది. అంటే, సుమారు 60 ఏళ్ళ క్రితం ప్రచురితమైన కథన్నమాట. ‘వెలుగు చీకటి గుహలోకి జారిపోతున్నది’. ‘దీపాలకు, చీకటికి క్షణ క్షణానికి శత్రుత్వం పెరిగిపోతున్నది’. ‘నీటి జల్లు ప్రశాంత ప్రకృతికి తీయని జోల పాట పాడుతున్నది’, ‘ఊచల్లాంటి రెండు చేతులెత్తి నమస్కారం చేశాడు’, ‘చుట్టూ ఉన్న కొండలు నిద్ర పొమ్మంటున్నాయి’, వార్డు మధ్యలో ఉన్న గోడ గడియారం గుండె కలుక్కుమనేలా ఒంటిగంట కొట్టింది’, ‘బల్ల ప్రక్కగా నిండుగా ఉన్న నీటి కూజా ఆమెను వెక్కిరించింది’ – వంటి భావుకత నిండిన వాక్యాలు ఆధునిక కవితా ఘరిలో కనిపిస్తాయి. ఈ విధమైన భావుకత నాటి పి.ఎస్. నారాయణ గారి కథల్లో, నవలల్లో కోకొల్లలు.

కథకుడు కాకపోయినట్లైతే పి.ఎస్. నారాయణగారు ఒంక మంచి ‘భావుకత’ ఉన్న భావ కవి, ఆధునిక ‘వచన కవి’ అయి ఉండే వాడనటంలో ఏ సందేహం అక్కర్లేదు. ‘ముగింపు’ (1967) పేరుతో, చంద్ర వేసిన ముఖ చిత్రంతో ఒక నవలా సంపుటి వెలువడింది.

ఇందులో రెండు నవలలు మాత్రమే ఉన్నాయి. ఒకటి 'అరుణోదయం'. ఇది ఆంధ్ర సచిత్ర వారపత్రికలో 1963లో ధారావాహికంగా అచ్చాయింది. ఈ నవలా సంకలనాన్ని తనను పెంచి పెద్ద జేసి తర్వాత స్వర్గస్తులయిన సోదరికి, బావగారుకు అంకితమిస్తూ నారాయణ గారు రాసిన కవిత వారి కవితా భావుకత లోతులను మనకు జ్ఞపికి తెస్తుంది. 'నువ్వు లేవనే దు:ఖంతో, సంవత్సరాల క్రితం ఉన్నావనే జ్ఞాపకాలతో, యీ రోజున ఉండి ఉంటే, అనే అద్భుత ఆనందంతో కూడ, ఏమీ చేయలేక, మరేమీ చేతకాక భగవంతుడు నాకిచ్చిన ఒకే వరం యీ నాడు ఈ ఊహా చిత్రణ నీకే...'

నారాయణగారి భావుకత ఆయన కొన్ని నవలకు,కొన్ని కథలకు పెట్టిన పేర్లలో కూడ కనిపిస్తుంది'. 'సర్రియలిజం' (అధివాస్తవికత)కు సంబంధం ఉన్నట్లు ఉండే ఈ పేర్లు కథతో ముడివడే ఉంటాయి. కాని సమాసంగానో, నుడికారంగానో వీటిని వివరించడం సాధ్యపడదు. అదొక వింత పద సంయోగం. నవలలపై, కథలపై శోధించేవారు పి.ఎస్. నారాయణ గారి 300 లకు పైనున్న కథల పేర్లను, నవలల పేర్లను విశ్లేషిస్తే, తెలుగు కాల్పనిక సాహిత్యంలో దీనిని ఒక విన్నూత్న ప్రయోగంగా చెప్పవచ్చు. ఉదాహరణకు 'గాలి కన్ను', 'స్వప్నంరాల్చిన అమృతం' (కథల సంపుటి పేరు అదే 2000), 'అమృత తిలకం', (ఇండియా టుడే, మార్చి 1999), 'విరగని వీనస్' (ఆంధ్రజ్యోతి సంచిక 1968), 'చిలిపి కిరణం', 'స్వేద ముత్యం' (నవల, స్వాతి ఏప్రియల్ 2021). 'చల్లని ఎండ' (కథా సంపుటి పేరు, 1966. ఇందులో తొలి కథ పేరు 'చల్లని ఎండ'. 1965 ఆగస్టులో ఆంధ్ర సచిత్ర వార పత్రికలో అచ్చయింది). 'కాలే వెన్నెల' (యువ దీపావళి ప్రత్యేక సంచిక 1977), 'ఎరుపెక్కిన చీకటి' (ఇండియా టుడే వార పత్రిక, 1992). కాని, ఒక విస్తృత ప్రాతి పదికన పరిశీలిస్తే పి.ఎస్. నారాయణగారు రాసిన నవలలు, కథలు, అందులోని భావుకత నిండిన, సందర్భోచిత, చిక్కని వాక్యాలు చదివిన వారికి ఇదంతా "సర్రియలిజం" (అధివాస్తవికత)కు చెందిన మరో శాఖలా ఉంటుందనిపిస్తుంది.

నారాయణ గారు పలు కథా సంపుటాల్లో విశిష్టమైన పురస్కారాలు, గౌరవాలు పొందిన తన కథలను నిక్షిప్తం చేశారు. గోవిందరాజు చక్రధర్ ముందుమాట రాసిన 'రేపటి సూర్యోదయం' (2010) కథల సంపుటి కుమార్ గారు వేసిన చిత్రంతో వెలువడింది. ఇందులో 15 కథలున్నాయి. వీటిలో 'చిలిపి కిరణం' 11వ తానా సభల సందర్భంగా

1997 'రచన' మాస పత్రిక త్రెచ్చిన ప్రత్యేక సంచికలో రావటం ఒక పెద్ద గుర్తింపు. దీన్ని సిడ్ని (ఆస్ట్రేలియా) తెలుగు సంఘం వారు తమ 'వాహిని' మాస పత్రిక (అక్టోబరు 1990 సంచిక)లో పునర్ముద్రించారు. 'ఏ శిల నుంచి ఎలాంటి శిల్పం చెక్క వచ్చే బాగా తెలిసిన కథా శిల్పి పి.ఎస్. నారాయణ' అని విశ్లేషించారు గోవిందరాజు చక్రధర్.

'నిన్నటికి వీడ్కోలు' కథా (2007) సంపుటిలో 'స్నేహం', 'ప్రక్షాళన' కథలకు బహుమతులు రావటమే గాక, ఇవి 'కథా పీఠం' శీర్షిక క్రింద ప్రచురితమైనాయి. 'స్నేహం'కు 2006లో యద్దపాటి వెంకట సుబ్బారావు స్మారక కథల పోటీలో 'రచన'లో ఆ సంవత్సరం ప్రచురితమైన అన్ని కథలలో ఉత్తమమైనదిగా ఎంపిక అవటం విశేషం. మల్లాది వేంకట కృష్ణమూర్తి గారు ఈ సంపుటికి తుది వాక్యం రాస్తూ 'సెంటిమెంట్, మధ్య తరగతి మనుష్యుల సమస్యల నేపథ్యంలో ఉత్కంఠతతో, ఆసక్తిగా ఊహించలేని ముగింపుతో కథల్ని రాయటం వీరి ట్రేడ్ మార్క్. పి.ఎస్. నారాయణ కథలు 'రియాలిజం' చుట్టూనే పరిభ్రమిస్తాయి' అని వివరించారు. దీనిలో ఆరు కథలున్నాయి.

'నిర్ణీతి' కథా సంపుటి (2014)లో బాలి వేసిన ముఖ చిత్రంతో వెలువడింది. ఇందులో 14 కథలున్నాయి. తన మిత్రుడు, సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం నిలుపు కొన్న 'నాట్యావధాని' స్వర్ణరాజు హనుమంతరావు గారికి అంకితం ఇచ్చారు నారాయణగారు. ప్రఖ్యాత రచయిత అలపర్తి రామకృష్ణ ఈ సంపుటికి ముందు మాట రాస్తూ, వీరిని కదిలించే కథలు' అని వర్ణించారు. 'పి.ఎస్. నారాయణ గారి కథల్లో అను బంధపు పరిమళాలు మనస్సుకు తాకుతాయి. చేయి తిరిగిన రచయిత అవ్వడంతో ఆయన సృష్టించిన ఏ పాత్రయినా కథలో ఒద్దికగా ఒదిగిపోతుంది. కథకు ఊహించని ముగింపు ఇవ్వటంలో ఆయన అందె వేసిన చేయి' అంటూ విశ్లేషించారు అలపర్తి రామకృష్ణ ('దారి తప్పకు' కథ, స్వాతి మాసపత్రిక, 1975).

ఊహించని మలుపులతో రచనలు ముగింపు చేయటం పి.ఎస్. నారాయణ గారి 'సంతకం' లాంటిది. ఆంగ్ల కథా రచనల్లో ఒ. హెన్రీ, గ్రాహమ్ గ్రీన్ వంటివారు ఈ ఎత్తుగడను కొస మెరుపు కథలుగా బహుళ వ్యాప్తిలోకి త్రెచ్చారు. నారాయణగారు ఈతరహా 'కొస మెరుపు' ముగింపులను కేవలం కథలకే గాక నవలలు గూడ అమలు చేశారు. ఉ

దాహరణకు 'నువ్వు ప్రక్క నుంటే చాలు' (స్వాతి మాస పత్రిక అనుబంధ నవల జనవరి, 2021). పి.ఎస్. నారాయణ గారి మరో సంపుటి 'రాగ స్రవంతి' (1968). చంద్ర గారు వేసిన ముఖ చిత్రంతో వెలువడిన ఈ కథా సంపుటిలో ఆరు కథలున్నాయి. ఇందులో 'రాగ స్రవంతి' కథ రెండు భాగాలుగా ఆంధ్ర ప్రభలో అచ్చు అయింది. 'స్వప్నం రాల్చిన అమృతం' (2009) తల్లిదండ్రులకు అంకితమిచ్చిన కథా సంకలనం. కుమార్ గారు గీసిన ముఖచిత్రతో వెలువడిన ఈ సంపుటిలో 16 కథలున్నాయి. ఇందులో 'కొత్త పులి' కథకు (1985 స్వాతి మాసపత్రిక) కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి లభించింది. 'చిన్నకోరిక'కు కాశీ భట్ల హనుమాంబ స్మారక కథల పోటీలో ప్రత్యేక ప్రశంస లభించింది. 'ఆశ్రయం' కథకు దేవరాజు వేంకట కృష్ణారావు 116 జయంతి సందర్భంగా 2001 సంవత్సరపు ఉత్తమ కథా స్వర్ణ పతకం దక్కింది. 'అమృత తిలకం' కథకు ఉన్నవ గోపాలకృష్ణ స్మారక కథల పోటీలో బహుమతి రావటం జరిగింది.

నారాయణ గారి 'మంచు దుప్పటి' (2010) కథా సంపుటికి పినిశెట్టి గారు అద్భుతంగా చిత్రీకరించిన నారాయణ గారి చిత్రం అత్యంత సహజమై ఒప్పారింది. ఇది ఎమెస్కో వారి ప్రచురణ. ఇందులో 15 కథలున్నాయి. వాటిల్లో 1997 నాటి అన్ని పత్రికలలో ప్రచురించిన కథల్లో ఉత్తమమైనదిగా 'అజ్ఞాత శత్రువు' ఎంపికవటం నారాయణ గారి రచన శైలికి ఒక కలికితురాయి. దీనిని తెలుగు విశ్వ విద్యాలయం వారు 'తెలుగు కథ – 1997' పేరున ప్రత్యేక సంచికలో పునర్ముద్రించారు.

నారాయణ గారి రచనల్లో స్త్రీలు ప్రధాన పాత్రలు పోషిస్తారు. 'స్త్రీ' వాద కథలను స్త్రీ రచయితలు ఎలా చిత్రించగలరో, అంతే గొప్పగా ఇంకా ఒకింత ఎక్కువగా నారాయణగారు చిత్రిస్తారనటంలో ఏ సందేహం అవసరం లేదు. నారాయణ గారు రాసిన 300 పై చిలుకు కథల్లో 50 నవలలో 90 శాతం 'స్త్రీ' వాదన వైపు మొగ్గు చూపే వృత్తాంతాలే. అసలు ఒక మగ రచయిత ఇన్ని రకాలుగా మానవ జీవితంలో స్త్రీ పాత్రలను వేరు వేరుగా, విభిన్న వాదనలలో, కోణాలలో దర్శించగలడా అనిపించేలా ఉంటాయి నారాయణ కథలు, నవలలు. ముఖ్యంగా స్త్రీ అంతర్గత ఘర్షణలు, అంతరంగిక భావాలు, సిగ్గులు, బిడియాలు, మూతివిరుపులు, స్త్రీల ఆలోచన ధారా, స్రవంతి ఇవన్నీ పాఠకులను సంభ్రమాశ్చర్యాలలో

ముంచెత్తుతాయి. దాదాపు ఆరు దశాబ్దాల రచనా కాలంలో అవిశ్రాంతంగా ఆయన కలం సాగింది. అందుకు కారణం ఆయన రచనలోని వైచిత్రి' ఒకవైపు 'రియాలిజం' కథా వృత్తం, 'సర్రియలిజం' లాంటి పేర్లు, వాక్యాలతో కూడిన సంభాషణలు మరోవైపు. భిన్న ప్రవృత్తి గల స్త్రీ పాత్రలు, వేధిస్తున్నట్లుండే సంభాషణలు, అవేధింపుల సంభాషణల్లో పాత్రలు నలుగుతున్నప్పుడు పాఠకుల్లో కలిగే ఉద్వేగాలు, ఆ సంభాషణలు పాత్రలను వేధిస్తుంటే వాటికి ముగింపు ఎలా, ఎప్పుడు, ఎక్కడా?... అని ఉత్కంఠత పాఠకుల హృదయాలను పిండుతుంటే, ఆ సాహితీ విన్యాసం, పి.ఎస్. నారాయణ విశ్వరూపం మాత్రమే. అందుకే తెలుగు విశ్వ విద్యాలయం వారు 2019లో ఆయనకు 'కీర్తి పురస్కారం' ఇచ్చి సత్కరించారు. నారాయణ గారికి ఇంకా ఎన్నో అవార్డులు బాకీలు ఉన్నాయి.

(పి.ఎస్. నారాయణ గారి 86వ జన్మదిన సందర్భంగా – జూన్ 1, 2023)

(సాహిత్య ప్రస్థానం మాసపత్రిక మే 2024)

23
గాంధీకి, కే విశ్వనాథ్ కీ మధ్య సంబంధం ఏమిటీ?

భారత దేశ చరిత్రలో గాంధీదోసుస్థిర స్థానం. 19–20 శతాబ్దాలలో గాంధీ ఒక గొప్ప దృగ్విషయం.ముఖ్యంగా గాంధీలేని భారత దేశాన్ని ఊహించటం కష్టం. అయితే గాంధీకీఘనత రావటానికి ఆయన ఆచరించిన సూత్రాలు, నియమాలే కారణం. అయితే గాంధీకి, కే. విశ్వనాథ్ కు మధ్య సంబంధం కూడా ఇక్కడే ప్రారంభం అవుతుంది. చాలా మందికి గాంధీ ఆచరించిన సూత్రాలు (సత్యం, అహింస, సత్యాగ్రహం), నియమాలు (దైవభక్తి , తాత్వికత, పరిమిత భాషణం, మితంగా ఆహారం, నిద్ర, భజనలు, వంటివి) తెలుసు. కానీ, వాటిని విశ్వనాథ్ తన సినిమాలలో ఎలా అద్భుతంగా మేళవించాడో, వాటి చుట్టూ తన కథలను ఎలా అల్లాడో తెలియదు.ఆ విషయాలను వెల్లడించడమే ఈ వ్యాసం ప్రధాన లక్ష్యం.

స్వాతంత్ర్యం రాక పూర్వం 1930లో జన్మించటం వలననేమో గాంధీ ప్రభావం విశ్వనాథ్ పైన ఉందని ఖచ్చితంగా చెప్పవచ్చు. విశ్వనాథ్ సినిమాలను కూలంకుషంగా శోధిస్తే ఆయన భారతీయ కళలు (నటన, సంగీతం, గానం, నృత్యం, చిత్ర కళ, శిల్ప కళ) నేపథ్యంలో తీసిన సాంఘిక ఇతివృత్తాలు జనుల హృదయాలకు ఇట్టే తాకాయి. ఇక్కడ కేవలం కళలపై డాక్యుమెంటరీ తీసినట్టు కాకుండా, వారేంపిక చేసిన సాంఘిక ఇతివృత్తాలలో 'సమిష్టి సమాజం' (ఇంక్లూసివిటీ) అనేది ఒక ప్రధాన అంశంగా ఉండేది. 1971 లో తీసిన 'చెల్లెలి కాపురం' సినిమాలో నలుపు చర్మం ఉన్నకథా నాయకుడు తెరవెనుక పాటలు

రాస్తే, తెరముందు ఆ పాటలు తనవే అని చెప్పుకొనే మరో ప్రతినాయకుడు మధ్య పాత్రలు ఎలా సంఘర్షిస్తాయో హృద్యంగా మలచటం ద్వారా 'చర్మం రంగుకు' ప్రాధాన్యం ఎంత మాత్రం సమంజసం కాదన్న సందేశం ప్రేక్షకులకు చాలా సులువుగా చేరవేశాడు. 1972 లో తీసిన 'కాలం మారింది' లో కులాంతర వివాహం,పురుష అంహంకారం మేళవించి సమాజం ఈ దుర్గుణాలనుంచి ముందుకు కదలక పోతే దేశం శిధిలం అవుతుందన్న సందేశాన్ని అందించాడు.ఆశ్చర్యం ఏమిటంటే ఈ సినిమాని విశ్వనాథ్ గాంధీకే అంకితం ఇస్తాడు(చివరి సీన్లో నాయక, నాయికలు గాంధీ చిత్రపటానికి పూలదండ,పూలు వేసి నివాళులు అర్పిస్తారు).

స్థూలంగా గాంధీ ఆలోచనా సరళికి తెర రూపం ఎలా కలిపించ వచ్చో తొలిసారిగా చూపించాడు విశ్వనాథ్ ఈ 1971, 1972లో విడుదలైన సినిమాలలో. ఇది విశ్వనాథ్ సినిమాలలో 'ఇంక్లూసివిటీ'/సమిష్టి సమాజం' తొలి రూపం.ఇక 'గాంధీ నమూనా' (గాంధీయన్ మోడల్) విశ్వనాథ్ కు ఎలా ప్రాతిపదికగా మారిందంటే గాంధీ కూడా తన స్వాతంత్ర్య పోరాటంలో కళలపైనే ఆధారపడి సమాజాన్ని ఏకం చేసే ప్రయత్నమే చేసి కృతకృత్యుడయ్యాడు.

గాంధీ మతం లేని 'రాజకీయం'ను గర్హించాడు. మనిషిలోని 'నైతికతకు', దాని ఉత్పత్తి,పెంపు, మార్గదర్శకత్వానికి 'ఆత్మ' (సెల్ఫ్) అనేది ఒకటి మతం వల్లే ఏర్పడుతుందని, అంతర్గతంగా మనిషిలో ఉండే ఈ 'ఆత్మ'నే ('సెల్ఫ్') రాజకీయాలకు, సిద్ధాంతాలకూ, రాజకీయ నాయకులకు ఒక'నైతిక స్థలాకృతి' ('మోరల్ టోపోగ్రఫీ') గా రూపొందుతుందని గాంధీ భావించారు. ఇదేదో టాలా టోలీగా ప్రతిపాదించిన అంశం కాదు. సామాజిక శాస్త్రంలో 'ఆత్మ' (సెల్ఫ్) కు బహుముఖ ప్రాధాన్యత ఉంది. మోడర్నిటీ, పోస్టమోడర్నిటీలోనూ దీనిపై చాలా పెద్ద చర్చనే ఉంది. దీనినే "డిస్కషన్ అబౌట్ 'సెల్ఫ్' అండ్ ది 'అదర్'' అని అంటారు. ఇవ్వాళ చార్లెస్ టేలర్ లాంటి కెనడియన్ ఫిలోసఫర్స్ గాంధీ చెప్పిన 'ఆత్మ' (సెల్ఫ్) అనే భావన మీద సామాజిక పునర్నిర్మాణం జరగాలని యూరోప్ దేశాలకు సూచిస్తున్నారు. మన దేశంలో కూడా రాజీవ్ భార్గవ , సెంటర్ ఫర్ డెవలపింగ్ సొసైటీస్

డైరెక్టర్ లాంటి వారు అద్భుత పరిశోధనలు చేసి పుస్తకాలు వెలువరించారు ఇటీవల . అందులో ఒకటి 'పాలిటిక్స్ , ఎథిక్స్, అండ్ ది సెల్ఫ్' 2022 లో అచ్చయింది. (అయితే ఈ వ్యాసం రచయిత స్వీయ పరిశోధనా ఫలితం. రాజీవ్ భార్గవ పరిశోధనకన్నా ముందు ఇంగ్లాండ్ లో అచ్చయింది).

ముఖ్యంగా భారతీయ సనాతన ఇతిహాసాలనురామాయణ, మహాభారతాలను, భగవద్గీతను– ప్రఘాడంగా విశ్వసించటమేగాక వాటిని మార్గదర్శినులుగా భావించేవాడు గాంధీ. భారతీయ సనాతనత్వం ప్రాతిపదికనే గాంధీ కుల, మత విచక్షణను ఖండించాడు. అప్పటికే బ్రిటిష పాలనలో చొచ్చుకు వచ్చిన కుల వివక్షను, కులాన్ని వేరువేరుగా చూశాడు. 'అంటరానితనాన్ని' మహాపాపంగా అభివర్ణించాడు. భజనలు జరిపించి స్వయంగా తనే పాడి, కార్యక్రమానికి హాజరైన వారితో కూడా పాడించేవాడు. గాంధీ భక్తితత్వానికి, భజనలు జరిపించటానికి ఆయనపై ఆనాడు మహారాష్ట్ర సంతులు, గుజరాతీ సంతుల ప్రభావం తీవ్రముగా ఉన్నట్టు కనిపిస్తుంది. గాంధీ వాడిన సంగీతం పరికరాలు కూడా ఖరీదైనవి ఎంత మాత్రం కాదు. తబలా, చిడతలు, కంజీరలు, గజ్జెలు, సన్నాయి, ఫిడేల్, మృదంగం వంటివి ఎక్కువగా ఆనాటి గాంధీ జరిపించే భజనల్లో కనిపించేవి. వీటిని తరువాత కాలంలో సామాజిక శాస్త్రజ్ఞులు 'సింబల్స్'గా, సామాన్యులను ఇట్టే ఆకట్టు కునేవిగా, గాంధీ ఉద్యమ విజయబాటకు ప్రధాన కారణంగా వ్యాఖ్యానించారు.

ఆయన సనాతనత్వాన్ని నమ్మడం కారణంగానే 'అంటరాని' వారుగా భావించిన ప్రజలను 'హరిజనుల'ని, 'గిరిజనుల'ని పిలిచేవారు. అంబేద్కర్ వంటి యువమేధావులు భారతీయ సనాతనత్వంలోని'వర్ణాశ్రమ ధర్మం'మే ఈ కుల వివక్షతకు కారణం అని వాదించినా, గాంధీ ఆ వాదనతో ఏకీభవించలేదు. పీటర్ బిఆర్డీయూ (1989), దుమాంట్ (1980), వాష్ బ్రూక్ (1993), అర్జున్ అప్పదురై (1981) లాంటి వారు 'కులం' వైదిక భావన అయినప్పటికీ, 'కుల వివక్ష' అనేది బ్రిటీష్ కోలోనియల్ రాజకీయ తంత్రం వలననే ఏర్పడినట్టు నిర్ధారించారు. గాంధీ వాదన చాలామంది నాటి బ్రాహ్మలకు నచ్చలేదు. జూన్ 25 ,1934లో ఉత్తర భారతానికి చెందిన కొన్ని బ్రాహ్మణ సమాజాలు ఒకటై గాంధీని హత్య చేయాలని కూడా భావించినట్టు డేవిడ్ హార్దిమాన్ రాశారు (2003). ఇలా గాంధీ

స్వాతంత్ర్య పోరాటాన్నికేవలం ఒక సూత్రంమీద కాక, బహుముఖంగా నడిపించాడు. సత్యం, అహింస, సత్యాగ్రహం, భజనలు, కుల,మత వివక్షకు వ్యతిరేక పోరాటం, దేశాన్ని సమైక్యంగా నడపటం ఆయన పోరాట వ్యూహంలో ప్రధాన భూమికలు. ఆనాటి స్వాతంత్ర్య యోధులెవ్వరు ఇంత పెద్ద భారీ కేన్వాస్ తమ పోరాటానికి ప్రాతిపదికగా పెట్టుకోలేదన్నది నిర్వివాదాంశం.

ఇక విశ్వనాథ్ సినిమాల మాటకొస్తే ఆయన తొలి సినిమా 'ఆత్మగౌరవం' (1965) అయినప్పటికీ, ఆయన కళల నేపథ్యంలో సినిమా కథ నడపటం 'చెల్లెలి కాపురం' తోనే మొదలైంది. దాదాపు 17 సినిమిమాలకు ఆయనే కథ , స్క్రీన్ ప్లే రాశారు. శారద (1973), అమ్మ మనసు (1974), మాంగల్యానికి మరోముడి (1976), సిరి సిరి మువ్వ (1976), సీతామహాలక్ష్మి (1978), అల్లుడు పట్టిన భరతం (1979) వంటి సినిమాలలో అనేక సామాజిక ఇతివృత్త ప్రయోగాలు చేశారు విశ్వనాథ్ తన కథల ద్వారా, కథా కథనం ద్వారా. 1973లో విడుదలైన 'శారద'లో కథానాయిక శారద (నటి కూడా శారదే) అకస్మాత్తుగా తన మానసిక స్థిరత్వం కోల్పోతే, ఒక మానిసిక వైద్యుడిగా శోభన్ బాబు ఆమెను మామూలు మనిషిని చేయడానికి పడిన పాట్లు హృద్యంగా చిత్రించాడు విశ్వనాథ్. 1981 లో విడుదలైన 'సప్తపది' నుంచి 1992 లో విడుదలైన 'స్వాతి కిరణం' వరకూ, దాదాపు 10 సినిమాలు సంగీత ప్రాధాన్యం, కళల మేళవింపు, విన్నూతన సామాజిక ఇతివృత్తం ఉన్న సినిమాలే . ఇవన్నీ గాంధీ మోడల్ నే అనుసరించాయి .

ఉదాహణకు 'సిరిసిరి మువ్వ' (1976) చిత్రంలో ఒక మూగ అమ్మాయి (జయప్రద) అద్భుతంగా నృత్యం చేసే ప్రతిభ కలిగి ఉంటుంది. కానీ, ఆమె సవతి తల్లి తన కూతురు (కవిత) సినిమా హీరోయిన్ కావాలన్న కాంక్షతో జయప్రదను దారుణ హింసలకు గురిచేస్తుంటుంది. ఆ ఊళ్ళో ఉండే చంద్రమోహన్ ఒక అనాథ. అతను అద్భుతంగా డప్పు వాయించే కళాకారుడు. అతను తను డప్పు వాయించినపుడల్లా లయబద్ధంగా జయప్రద నాట్యం చేయటం గమనిస్తాడు. సవతి తల్లి బాధ నుంచీ తప్పించటానికీ ఆమెను తీసుకెళ్లి హైద్రాబాదులో ఒక ప్రదర్శన ఇప్పిస్తాడు. దానితో ఆమె జీవితమే మారిపోతుంది. చివరకు ఆమె డప్పుకళాకారుడైన చంద్రమోహన్ నే వివాహమాడుతుంది. ఈ సినిమాలో బ్రాహ్మణ, యువతి, చర్మ కారుడైన డప్పు కళాకారుడిని వివాహమాడటం ద్వారా ఒక కులాతీత

సమాజానికి నాందీ పలకటం ఒక ఎత్తైతే, వీళ్ళిద్దరిని కలపటానికి నృత్యం, డప్పు సంగీతం మేళవిస్తాడు విశ్వనాథ్. ఇందులో డప్పు వాయిద్యం గాంధీ ఉపయోగించిన సంగీత పరికరమే. 'గాంధీ మోడల్' ను విశ్వనాధ్ ఎంత తెలివిగా ఒక సామాజిక నేపథ్యానికి అన్వయించాడో చెప్పడానికి ఇది ఒక చక్కని ఉదాహరణ మాత్రమే.

'శంకరాభరణం' (1980) సినిమా అయితే అడుగంటిపోతున్న శాస్త్రీయ సంగీతంకు, ప్రాణంపోసి ఒక సంగీత విప్లవానికి నాంది పలికింది. ఇందులో సంప్రదాయ బ్రాహ్మణుడైన శంకరశాస్త్రి ఒక వేశ్య కాంతను తన ఇంటిలోకి రమ్మని, స్నానం చేసి తన పూజకు కావలసిన ఏర్పాట్లు చూడమని చెప్పటం సినిమాకు, సంప్రదాయ హద్దులకు ఒక పెద్ద కుదుపని చెప్పవచ్చు. 'సప్తపది ' (1981) లో విడుదలైంది. ఇది సాంప్రదాయ బద్ధమైన వివాహంకు ఏడడుగులు తుది మెట్లు. ఈ ఏడుమెట్లతో ఆ వివాహ బంధం స్థిరం, శాశ్వతం అవుతుంది. దాన్నెవ్వరూ మార్చలేరు. కానీ, ఒక సంప్రదాయ బద్ధంగా వివాహమాడిన బ్రాహ్మణ స్త్రీ తన భర్తతో తొలి రాత్రి తను వేరే కులస్తుడితో (ఒక వేణు వాయిద్యకారుడితో) ప్రేమలో ఉన్నట్టు తెలుపుతుంది. అంతకుముందు ఆమె భర్తకు ఆమె గుళ్లో పూజలందుకునే దేవతలా ఉన్నట్టు కనిపిస్తుంది. ఇలా అవటానికి కారణం ఆమె వివాహబంధంతో పేరుకు భార్య అయినా, ఆమె మనస్సులో మరో పురుషుడు ఉండటమేనని గ్రహిస్తాడు ఆమె భర్త గౌరీనాథ్. తన తండ్రికిఆవిషయం వివరించి చివరకు ఆమెను, ఆమె ప్రేమించిన వేణు వాయిద్యకారుడితో పంపించేస్తాడు పడవలో. ఇలా సంప్రదాయానికి , ఆధునికతకు మధ్య జరిగే ఘర్షణలో ఆధునికతకే పట్టం కట్టాడు విశ్వనాథ్. కులానికన్నా మనస్సుకే ప్రాధాన్యం కలిపించాడు ఈ సినిమా ద్వారా.

1982లో వచ్చిన 'శుభలేఖ' సినిమా ద్వారా వరకట్న సమస్య, డబ్బున్నవారు, లేనివారి మధ్య అంతరాలను కొసమెరుపులతో, అద్భుతమైన సంగీతంతో మేళవించి సామాజిక ఆర్థిక రుగ్మతలకు ఒక పరిష్కారం సూచిస్తాడు. 1983లో విడుదలైన 'సాగర సంగమం' లో నృత్య కళల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలని కృషిచేసి, చివరకు తల్లిపోవటం వలన నిర్దేశించిన కార్యక్రమానికి వెళ్లలేకపోయిన బాలు (కమల్ హాసన్) అనే నృత్యకారుడు

ఆఖరికి తను ప్రేమించిన జమీందారు కుటుంబానికి చెందిన వివాహితైనా స్త్రీని (జయప్రదను) కూడా పెళ్లి చేసుకోలేక అనారోగ్యం పాలై మరణించటం చూపిస్తాడు. అయితే అతను మరణించేముందు తనకున్న నృత్య పరిజ్ఞానం మొత్తం జయప్రద కూతురుకు నేర్పి తుది శ్వాస విడుస్తాడు. ఆ విధంగా నిజమైన కళకు అంతం లేదని నిరూపిస్తాడు విశ్వనాథ్.

గాంధీ జీవితంలో భజనలకు, కీర్తనలకు ఎంత ప్రాధాన్యం ఇచ్చాడో విశ్వనాథ్ సినిమాలో గూడా భజనలకు, కీర్తనలకు అంత ప్రాధాన్యం ఇచ్చాడు తన సామాజిక ఇతివృత్త మేళవింపుతో. 'సిరిసిరి మువ్వ' (రా దిగిరా, దివినుంచి భువికి దిగిరా), 'శు భోదయం' (కంచికి పోదామా కృష్ణమ్మా ..),'సప్తపది' (అయిగిరినందిని, మరుగేలరా ఓ రాఘవా), 'శంకరాభరణం' (ఏతీరుగ నను దయచూసెదవో, పలుకేబంగారమాయెనా, బ్రోచేవారెవరురా), 'స్వాతి ముత్యం' (రామా కనవేమిరా), 'స్వర్ణకమలం' (చేరియశోదకు శిశువితడు), 'శృతిలయలు' (ఆలోకనే శ్రీ బాలకృష్ణం, ఇన్ని రాసుల) 'సిరివెన్నెల' (విధాత తలపున), ఇలా చెప్పుకొంటూ పొతే ఎన్నో త్యాగరాజ, నారాయణ తీర్థ యతీన్ద్ర, వాసుదేవా చార్యులు, రామదాసు వంటి మహాభక్తుల కీర్తనలు మనకెక్కువగా విశ్వనాథ్ సినిమాలలోనే కనిపిస్తాయి. అంతే కాదు, గాంధీ వాడిన వాయిద్యాలు ఎక్కువగా విశ్వనాథ్ సినిమాలలోనే తారసపడతాయి. అది వేణువు ఊదటం అయినా (సిరివెన్నెల), సన్నాయి, డోలు అయినా (సూత్రధారులు), సారంగీ (స్వాతిముత్యం), ఫిడేల్ , వయోలిన్, మృదంగం అయినా (శంకరాభరణం, సిరివెన్నెల), డప్పు అయినా (సిరిసిరి మువ్వ).

విశ్వనాథ్ సినిమాలలో హింసకు పెద్ద పీట ఉండదు. హీరోను ఉన్నతంగా చూపడానికి 'స్టంట్' లను, 'రక్తంకారే' హింసను ప్రోత్సహించడు . స్వాతిముత్యం లో అమాయకుడైన కమలహాసన్ పాత్రనుఊరి వారు కొట్టటం సహించలేని రాధిక, అప్పుడే అమాయకంగా తనకు తాళి కట్టిన ఆ కమలహాసన్ ను రక్షించుకొమ్మని కర్ర చేతికిచ్చి ఉ సిగొలుపుతుంది. ఇలా 'ఆత్మ రక్షణ' కు 'ప్రతిహింస' తప్పు కాదన్న గాంధీ సూత్రాన్ని సందర్భానికి బాగా అన్వయిస్తాడు. అలాగే 'స్వయంకృషి' సినిమాలో చెప్పులు కొట్టుకొని లక్షాధికారైనా, తన కులవృత్తి పట్ల గౌరవం ఉండాలని తను పెంచుకున్న కుమారుడ్ని సాత్వికంగానే (హింసించకుండా) మారేలా చేస్తాడు. గాంధీ కులవృత్తులు నాశనం కాకూడదని,

అవి సమాజానికి ఎంతో అవసరమని 'గ్రామీణ సౌమ్య వాదం' (రూరల్ సోషలిజమ్) క్రింద ప్రతిపాదిస్తాడు. దానినే 'స్వయం కృషి' సినిమా ద్వారా సాకారం చేస్తాడు విశ్వనాథ్. విశ్వనాథ్ తీసిన 'సప్తపది' సినిమాకి నర్గిస్ దత్ అవార్డు ఫర్ బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ఆన్ నేషనల్ ఇంటెగ్రేషన్' లభించింది . విశ్వనాధ్ సినిమాలలో సజీవంగా కనిపించే 'గాంధీ స్మృతికి' భారత ప్రభుత్వం ఇచ్చిన ఘనమైన సత్కారం ఇది . సామాజిక శాస్త్ర పరిశోధకుల భావనలో 'సమిష్టి సమాజం' (ఇంక్లూసివిటీ)కి, విశ్వనాథ్ సినిమా అనే ఒక బలమైన మాధ్యమం ద్వారా ఒక నూతన మార్గం సమాజంముందుంచారు. గాంధీ తనదైన విన్నూత్నమార్గంలో ఎలా స్వాతంత్ర్య ఉద్యమం నడిపారో, అలాగే విశ్వనాధ్ కూడా ఈ 'మోడల్' ఒకటి సృజించి సినీ పరిశ్రమలో ఒక నూతన వరవడి అందించారు. అందుకే భారత ప్రభుత్వం వారిని అత్యున్నత దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో సత్కరించింది 2017లో. అంతకు పూర్వమే వారికి 1992 లో పద్మశ్రీ అవార్డు నిచ్చి సత్కరించింది.

(విశాలాంధ్ర ఆదివారం అనుబంధం ఫిబ్రవరి 11, 2014)

24
రాజా రామ్మోహన రావు కథలు: మనోవిశ్లేషణ

ఇంక తెలతెల వారుతుండగా…మిల్లు సైరన్ కూసినప్పుడడిగింది వాణ్ని 'నీకెలా తెలుసు నేను గుడ్డిదానిని…' అని. చిన్నగా నవ్వాడు వాడు. నవ్వి 'నర్సిగాడు చెప్పాడు' అన్నాడు. నాగరత్నం కూడా నవ్వింది. సూర్యుడి వెలుగు వెచ్చగా వొంటికి తగుల్తుంటే… కొత్తదంపతుల్లా వాళ్లిద్దరూ ఒకళ్ళకొకళ్ళు ఆసరాగా అరుగు దిగారు. కట్నాలు, కక్కుర్తులూ, అనుమానాలూ, అవమానాలూ లేని పెళ్లి వాళ్ళది. అది స్వచ్ఛమైన ప్రకృతి చేసిన వివాహం.

ఈ పతాక సన్నివేశం (క్లైమాక్స్) 'వెలుగు ముడి' (ఆంధ్ర జ్యోతి వారపత్రిక, 05-07-1974) కథ లోనిది. ఇందులో వెలుగు, ముడి రెండూ వేరు వేరు పదాలు. రెండు పదాలకు ఆ సందర్భంలో విశేష అర్థం ఉంది. నాగరత్నం గుడ్డి బ్రతుకులోని చీకటి ఘటనలకు ముగింపు పలికుతూ వెలుగు నింపిన రాత్రి తెల్లవారుఝాము వెలుగు. నాగరత్నంను మరో గుడ్డి వాడైన రాముతో ముడి వేసి, శాశ్వతబంధంలోకి మార్చిన రాత్రికి ముగింపు వెలుగు. ఇక్కడ ఆ ఇద్దరు దంపతులకు 'ముడి' పడి శాశ్వత బంధం ఏర్పడటంతో వచ్చిన వెలుగు. అది కేవలం తెల్లవారితే వచ్చే వెలుగని కాదు. అలాంటి వెలుగు 'గుడ్డి' నాగరత్నానికి అసంబద్ధమైంది. కేవలం 'ముడి' పడటమే వారిద్దరికీ 'వెలుగు'. ఇక్కడ వెలుగు 'వారి మానసిక 'సంతోషం' కు సంకేతం'. అందుకే రచయిత 'వెలుగు ముడి' పేరు మధ్యలో కావాలనే హైఫన్ పెట్టలేదు.

రాజా రామ్మోహన రావు తెలుగు తల్లి గర్వించ దగ్గ తెలుగు బిడ్డ. కథా, నవలా రచయిత. జనవరి 3, 1946 లో ఏలూరులో జన్మిచిన వీరు, ప్రాథమిక విద్యానంతరం రాజమండ్రికి వెళ్లి అక్కడే పి యూ సి వరకూ చదివారు. ఆపై ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజినీర్స్ వారి ఏ.ఎం.ఐ.ఈ. లో చేరి రెండేళ్లు డిగ్రీ పూర్తి చేశారు. ఈ లోగా వారికి అఖిల భారత రైల్వే సర్వీస్‌లో ఉద్యోగం రావటంతో చదువును అక్కడికి ఆపి ఉద్యోగంలో చేరారు. భారతీయ రైల్వేలో 1965-2001 వరకూ వివిధ హొదాలలో పనిచేసిన వీరు, తన జీవిత బండిని ఉద్యోగం, తెలుగు సాహిత్య సేవ అనే రెండు సమాంతర పట్టాలపై ఏక కాలంలో సాగించారు. వారి కుటుంబంలో వారికి పూర్వం ఎవ్వరూ రచయితలు లేరు. పెద్దగా సాహిత్యంతో పరిచయం ఉన్నవారూ లేరు. కానీ, ఆయన నిత్య జీవితంలో చూసిన తాడిత, పీడిత ప్రజల జీవితాలు 'అలా ఎందుకు మారాయో? ' తెలుసుకొనే ఉత్సాహం ఎక్కువగా కలిగి ఉండేవాడు. అలా చూస్తే ఆయన కమ్యూనిస్టు కాని వెనుకబడిన వర్గాల జీవితాల్లో తొంగి చూసే తీరిక లేని సమాజానికి 'అది ఇది' అని పరిశోధనాత్మకంగా విశ్లేషించి చెప్పిన అభ్యుదయ రచయిత రామ్మోహన రావు. అదే సమయంలో భమిడిపాటి జగన్నాథ రావు గారి సాహిత్యం, సాన్నిత్యం ఆయనను ఈ వర్గం కథల వైపు నడిపించిందని మాత్రం ఊహించవచ్చు.

ఆయన సుమారు 300 ల కథలు, 21 నవలలు రాశారు. ఇంకా ఇప్పుడూ రాస్తూనే ఉన్నారు. ఇతర భాషల్లోకి సుమారు 35 కథలు, నాలుగు నవలలు అనువాదమైనాయి. ఆయన సుమారు 300ల కథలు, 21 నవలలు రాశారు. ఇంకా ఇప్పుడూ రాస్తూనే ఉన్నారు. ఇతర భాషల్లోకి సుమారు 35 కథలు, నాలుగు నవలలు అనువాదమైనాయి. వివిధ కథా, నవలల పోటీలలో దాదాపు 33 బహుమతులు గెలుచుకున్నారు. నాలుగు కథా సంపుటాలు వరద (ఎమెస్కో పోకెట్ బుక్స్, 1975), తెల్లటి చీకటి (జ్యేష్ఠ లిటరరీ ట్రస్ట్, 1999), లోలోపల (చినుకు ప్రచురణ, 2011), మనసుకు మరో వేపు (అనల్ప, 2022) వెలువరిచారు.

రామ్మోహన రావు కథా రచనల్లో (ముఖ్యంగా నేరేటివ్ లో) ఒక విశిష్టమైన తాత్వికత ఉంటుంది. ఏక వాక్యాలలో కూరినట్లుండే ఈ తాత్వికతకు వ్యాఖ్యానాల్ని ఏ సిద్ధాన్త,

రాద్ధాంతాలనుంచైనా చెప్పుకోవచ్చు. అది ఆ తాత్వికత మనస్సులో రగిల్చే భావాగ్నిని ఏమాత్రం చల్ల బరచలేదు. 'చాలా రకాల దౌర్భాగ్యాలకు చాలా మంది నవ్వుకొనే నవ్వు '/ఆఫీస్ లో ఫ్యాన్ అయినా చాలా మంది అతన్ని ఫ్యాన్ లా చూసే తాహతు పోగొట్టుకున్నారు/మూడ్ ను పాడు చేసుకోకూడదనుకొన్న నిర్ణయం మాటల్ని మింగేసింది/ప్రతి సరదా డబ్బుతోటి ముడిపడే కనిపించింది/మరింక తప్పదన్నట్టు సూర్యోదయం అయింది/మేక్కి వేలాడుతున్న తాడు పెద్ద కొండచిలువలా కనిపించింది-లాంటి తాత్విక వాక్యాలు ఆయన కథ 'పంపకం' (ఆంధ్ర జ్యోతి వారపత్రిక, 1973) లోనివి. ఇలా ఒక్కొక్క కథ నుంచి ఎన్నో వాక్యాలు ముత్యాల్లా దొర్లుతాయి ఆయన కథల్లో.

ఇక్కడ 'పంపకం' అనేది నెలాఖరు రాగానే కొత్తగా వచ్చిన జీతాన్ని ఎవరెవరికి పంచాలన్నదే. ఆఖరికి అందరికీ పంచగా పెళ్ళాం, పిల్లలను పెళ్లి రోజున సినిమాకు కూడా తీసుకెళ్లడానికి కొత్తగా వచ్చిన జీతం డబ్బులు సరిపోక పొతే, కిక్కిరిసిన ఒంటి రూములో పెళ్ళాం బిడ్డలతో సహాపడుకొని పిల్లలు గమనించని ఏ అర్ధరాత్రి సమయంలో భార్యతో సుఖం పంచుకొని (డబ్బు పంపకం బదులు) పెళ్ళాంతో లెక్క తేల్చేయడం. అది చూసిన తల్లి తెల్లవారగానే ఆ చిన్న ఇరుకు గదిని రెండు ముక్కలు చేస్తూ, అటూ ఇటూ మేకులు కొట్టి మధ్యలో ఒక తాడు కట్టటం, దానిపై చీరనో, దుప్పటినో కప్పటం జరుగుతుంది. అది కూడా పంపకమే గదా.

రచయితగా రాజా రామ్మోహన రావును వేధించిన సమస్యలు కొన్ని ఉన్నాయి. అందులో తక్కువ జీతగాళ్ల జీవితాలలో ఆర్థిక సమస్యల వల్ల కలిగే మానసిక వ్యథ, కాదు ఘోష పాఠకులను కన్నీరు పెట్టిస్తుంది (చిరిగిన తెర చాప, పంపకం కథలు ఈ కోవకు చెందినవే). మరో రకం కథలు 'వీధి బ్రతుకులు'. ఎవ్వరూ పట్టించుకోని, ఎప్పుడూ ఆలోచించని 'వీధి మనుషుల' జీవితలోతుల్లోకి తొంగిచూడటం ఈ కథల ప్రత్యేకత (నీడల చాటు నిజం, ఇంటర్వ్యూ, వెలుగు ముడి, ఎగరటానికి లెఖ్ఖ లక్కరలేదు, మసక మసక నీడలు ఈ కోవకిందికే వస్తాయి).

'మార్పుకు మరో దారి కథ' (ఆంధ్ర ప్రభ వారపత్రిక 1969) పాఠశాలల్లో పిల్లలు తప్పు దోవ పడుతున్న కథ. హెడ్ మాస్టర్ తో సహా, బయట తినుబండారాలు అమ్మేవారు,

'కాయ్ రాజా కాయ్' ఆటలు ఆడించేవారుదాకా అందరూ పాఠశాల పవిత్రతకు, విద్యా విధానంకు మచ్చ తెచ్చేలా ప్రవర్తిస్తున్న తీరు చుట్టూ కథ తిరుగుతుంది.

'ఒంటెకు ఒయాసిస్' కథ ఆంధ్రప్రభ వారపత్రికలో అచ్చయినదే. ఇందులో రామం అనే పాత్ర తొలి ధర్మపత్ని హఠాత్తుగా కాలం చేస్తుంది. ఊళ్ళో ఉండే పరంధామయ్య మళ్ళీ పెళ్లి చేద్దామనుకొంటాడు. కానీ, ఆ పిల్లకి తనకి మధ్య ఒక తరం తేడా ఉందని కాదంటాడు రామం. ఊళ్ళో అంతా రామం పరస్త్రీ జోలికి పోని రాముడే అనుకొంటుంటారు. అయితే రామానికి ఒంటరి జీవితం ఎడారిలో ఒంటె బ్రతుకు అనిపించింది. ఆ సమయంలో లక్ష్మి అనే ఒక వ్యభిచారి పైన రామంకు మనస్సు కలుగుతుంది. ఇప్పుడా లక్ష్మి కాలం చేసింది. లక్ష్మి లేని ఊళ్ళో ఉండటం ఇష్టం లేక ఊరొదిలి వెళ్ళిపోతూ గతాన్ని నెమరు వేసుకోవటం కథలో మొదటి భాగం.

కథా కథనంలో పై రెండు కథలకొక విశిష్టత ఉంటుంది. అది రామ్మోహన రావు గారి శైలి విశిష్టతనే చెప్పుకోవాలి. పొట్టి పొట్టి వాక్యాలు.... తాత్త్వికభావగర్భితమై ఉంటాయి. 'ఎడారిలో మనిషికి ఒయాసిస్ అవసరం చాలా ఉంది/ కేవలం జీవిగా పరిగణిస్తే ఒంటెకు అంతే/పోల్చి చూస్తూనే భేదం/ఎడారిలో ధర్మ సూత్రం ఒంటె కన్నా మనిషికి ఒయాసిస్ అవసరం ఎక్కువని/. అవసరాన్ని బట్టి ఏర్పడ్డ ధర్మ సూత్రం అది. ఇలాంటి పొట్టి వాక్యాలు డాట్ డాట్‌తో ముత్యాలన్నీ ఒకేచోట పోగేసి నట్లుంటాయి. ఇలా ఇతర రచయితలు అరుదుగా రాస్తారు.

'తెల్లటి చీకటి' కథ (జ్యోతి మాస పత్రిక, 1969) మామ దుర్మార్గానికి బలైపోయిన ఓ కోడలు హృదయ విదారక కథ. అసమర్థుడైన భర్త (కొడుకు) నెలకొకసారి వచ్చి భార్యతో కలవాలని రాత్రి పడే ఆరాటం, భర్తకు దూరంగా నెలలు, నెలలు గడపలేక, మనసు విప్పి చెప్పలేక భార్య వేదనకు పరాకాష్ట వెరసి భార్య స్వయంగా అంటించుకొన్న అగ్నిలో ఆహుతై పోవటం. కథ ముగిశాక కూడా మనల్ని వెంటాడే రచయిత పదునైన వాక్యాలు, పరస్పర విరుద్ధ విశేషణాలు పేరులో ఇముడ్చుకొన్న ఈ కథ, నాటి సమకాలీన ఆడ పడచుల జీవితానికి దర్పణం పడుతుంది.

రామ్మోహనరావు రాసిన అన్నికథలలో ఒక విశిష్ట మైన రచన 'తను ' అనే కథ.

ఆంధ్ర జ్యోతి వారపత్రికలో 1970లో అచ్చయిన కథ ఇది. ఇందులో మూడు పాత్రలుంటాయి. వేటికీ పేర్లు ఉండవు. ఏ పాత్ర నిర్మాణం జరగదు. ఒకే ఒక బలహీనత చుట్టూ తిరుగుతుంది కథ. బహుశ ఇలాంటి కథలు రామ్మోహనరావు 'సంతకం' గుర్తు అంటే ఆశ్చర్యం కాదేమో. ఇక వాక్య నిర్మాణం పైన చెప్పినట్టు కొన్ని పొట్టి వాక్యాలు సమాహారంలా మధ్యలో చుక్కల చుక్కలతో నడుస్తుంది. నడవటం కాదు, సర్పం కాదలికలా చరచరా పాకుకుంటూ పోతుంది. కానీ వాటిలో వచన, భావ కవిత్వం నిండుగా ఉంటుంది.

అందుకేనేమో చాలా మంది కవులు కథకులు అయినారు. కథకులు కవులైనారు. రాజా రామ్మోహన రావు కవి కాని కవి. తన మాటల్లో బరువు కోసం ఆయన కవితా ఝరి ప్రయోగిస్తాడు. ఇలాంటి శైలీ రచన 'తను'లో పుష్కలంగా కనిపిస్తుంది. 'అటు ఆకాశం పరిగెడుతోంది/ ఇటు చెట్లు .... టెలిగ్రాఫ్ స్తంభాలు పారిపోతున్నాయి/. కాళ్ళు లాగుతున్నట్టు అనిపించి వో తలుపు దగ్గర చతికిల బడ్డాడు/. కాళ్ళ నొప్పి కడుపులో లాగుతున్నట్ట యింది/ . కూర్చున్న చోటినుంచి చూస్తే రైలు పెట్టె సొరంగంలా ఉంది/. సొరంగం అంచులమీద ఎన్నో కాళ్ళు, మోటుగా మొద్దులా ఉన్నాయి/. లేత రేకుల్లా ఉన్నాయి. చెప్పులున్నవి, చెప్పుల్లేనివి, చెప్పుల్లాగే ఉన్నవి/'. ఇది 'తను' కథలో రామ్మోహన రావు రచనా శైలి. పలు భాషల్లోకి అనువాదమైన కథల్లో ఇది ఒకటి.

ఈ కథలో ఒక వయస్సులో ఉన్న అవిటి అమ్మాయి, ఎంత దుమ్ముకొట్టుకుపోయి, గారపళ్లతో ఉన్నా ఆ అమ్మాయి వయస్సు వేడి ఒక కుర్రాడిని ఇట్టే కట్టిపడేస్తుంది. వాడి చూపుల్లో అర్థాలు తెలియని అమాయకురాలేమీ కాదామ్మాయి. అలాంటి చూపులు చాలా చాలా చూసింది రైల్లో బిచ్చమెత్తుకొంటూ, పాటలు పాడుతూ. ఆ అమ్మాయి నాకర్షించే ఆ కుర్రాడి ప్రయత్నం పసిగట్టి వాడితో కబుర్లు పెడుతుందామ్మాయి. దాని వయస్సు పొంకాలు చూసి మరులుగొన్న మరో కుర్రాడు ఆకుపచ్చ ప్యాంటు, షర్టు, షూస్ వేసుకొని దానిముందు దాని చూపులు తన వైపు తిప్పుకొనేలా నడుస్తూ వాష్ రూమ్ కు వెళ్లి వస్తాడు. ఇంతలో రైల్లోకి ఒక బఠాణీలు అమ్ముకొనే వాడు వస్తాడు. వాడు దానికి బటానీలు పెట్టి దాని వ్యక్తిగత క్షేమ సమాచారాలు అడుగుతాడు. వాడికి అది ఎప్పటినుంచో తెలుసు. అందువల్ల వాడికి దాని అవసరాలు కూడా బాగా అర్థం అవుతాయి. చివరకు రెండు రూపాయలు

ఇస్తానని దానికి చెప్పి వచ్చే స్టేషన్ లో దానితో సహా దిగిపోతాడు. పోయేప్పుడు అది తనని ఒకసారి చూస్తుందేమో అని కుర్రాడు అనుకొంటాడు. కానీ అది చూడదు. దానికి కావలసింది డబ్బు మాత్రమే, సుఖము కాదు, సంతోషం అసలే కాదు.

ఒత్తిడి నుంచి బయట పడటానికి లైంగిక విశ్రాంతి ఉపయోగపడుతుందని లైంగిక నిపుణులు అంటుంటారు. సరిగ్గా అదే సూత్రంగా రావు అనే వ్యాపారి తన వ్యాపార కోసం హైదరాబాద్ వచ్చి, ఆ రోజు చర్చల్లో కలిగిన చికాకు నుంచి బయట పడటానికి శాంత అనే స్త్రీతో ఆ కార్యక్రమం కానిచేస్తాడు. తనకొచ్చిన చిక్కులేమిటో అన్నీ ఆమెకు చెబితే నష్టం లేదని చెప్పేస్తాడు. డబ్బు తీసుకొంటున్నందుకు ఆవిడ రావు చేసే లైంగిక చర్యలను, వాగే వ్యాపార సమస్యలను ఓపికగా వింటూ సహకరిస్తుంది. అలాగే అతను అలిసి వెల్లకిలా పడుకున్నప్పుడు తన సమస్యలను కూడా అతనితో పంచుకొంటే బాగుంటుందను కొని చెబుతుంది. కానీ, అవేమి ఆతను వినడు, పట్టించుకోడు. ఏది ఏమైనా లైంగిక సుఖంలో కూడా ధనికపురుషాధిపత్యం ఎలా అమలవుతుందో చెప్పే కథ 'బిజినెస్'. ఆంధ్ర జ్యోతి సచిత్ర వారపత్రిక లో 1975 లో అచ్చయిన కథ ఇది.

'చిరిగిన తెరచాప' కథలో (జీవనాడి ప్రత్యేక మాస పత్రిక, 1974) అల్పాదాయ వర్గానికి చెందిన భార్యా భర్త మనోవేదన. ఒంటిమీద వేసుకొనే లంగాలు మూడే ఉంటాయి ఆ ఇల్లాలుకు. అన్నీ చినిగి ఉంటాయి. ఈ నెల ఖర్చు పొదుపు చేసి ఒక్క లంగా కొందామనుకొన్న ఏ నెలకానెల ఖర్చులు పెరగటంతో ఆ లంగా కొనలేక పోతుంది. తీరా భర్తతో సంగమించే సమయంలో ఆ కుదుపులకు లంగా ఇంకా చినిగి పేలికలవుతుందోనని భయంతో ముందు దానిని విప్పి పక్కకు పెట్టి ఆ పైన భర్తతో చేరుతుంది. ఇదీ ఈ కథ లోని మూలవస్తువు. చివరకు ప్రకృతి కార్యాలలోను భార్యాభర్తలు దరిద్రాన్ని దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తలు తీసుకోవలసి రావటం రామ్మోహన రావు గారి వివరించిన విధానంలో గుండెను కదిలిస్తుంది. 'చిరిగిన తెరచాప' అనేది ఇక్కడ ఎదో కాదు. ఒక బీద స్త్రీ ధరించిన చినిగిన లంగానే.

'ఎగరటానికి రెక్కలక్ఖరలేదు' అనే కథ ఆంధ్ర జ్యోతి వార పత్రికలో అచ్చయింది. ఇది పొట్టకూటికోసం పొట్టబెట్టుకొని ఊరూరా తిరిగే ఒక కుర్రాడి కథ. రైలు కూలీగా

చేద్దామనుకున్న అక్కడ పనిచేస్తున్న కూలీలు ఆ కుర్రాడిని బతకనొప్పుకొని కథ. చిట్ట చివరకు పదిమంది ముందు తనకు తోచిన సినిమా పాటలకు తోచిన రీతిలో డాన్స్ వేస్తే కూలి కంటే ఎక్కువ పైసలు రావటం ఆ కుర్రాడిని సంతోషంలో ముంచెత్తుతుంది. ఏదైతేనేం, బ్రతుకు బాటకు రైలు కూలీగా లైసెన్సే అవసరంలేదు. 'ఇలా గూడా బతకవచ్చు' అని చెప్పే కథ. 'కానీ, అది గూడా ఒక బ్రతుకేనా'? అంటే. ఈ ప్రశ్నకు పాఠకుడే ప్రశ్న వేసుకొని సమాధానం వెతుక్కోవాలి.

'ఇంటర్వ్యూ' ((ఆంధ్ర జ్యోతి సచిత్ర వార పత్రిక 1973) అనే కథ ఒక విచిత్ర శైలి, కథాకథనంతో సాగుతుంది. ఎవరు ఎవరిని ఇంటర్వ్యూ చేశారు అన్నది తెలియదు. ఇందులో ప్రధానంగా రెండే రెండు పాత్రలుంటాయి. ఇందులో ఒక పాత్ర రచయితది. రెండవ పాత్ర 'అమ్మాయిలు కావాలా సార్?' అని అడిగిన కుర్రాడిది. ఆ కుర్రాడి జీవితం పట్ల రచయితకు హఠాత్తుగా కలిగిన ఆసక్తి. రచయిత ఒక రైల్వే స్టేషన్లో తెల్లవారు ఝామున వచ్చే రైలుకు రాత్రి పదినుంచి నిరీక్షణ చేయాల్సి రావటం, ఆ క్షణాన రచయితకు ఈ కుర్రాడు తారస పడటం, ఆ కుర్రాడి జీవితం, అతను ఎలా ఈ వృత్తి లోకి దిగింది తెలుసుకోవటం, చివరగా ఆ పిల్లాడి మనస్సులో ఉన్న ఆశాలేమిటి, అతని భవిష్యత్ ఆచరణ పథకాలేమిటి కనుక్కొని భారంగా నిట్టూర్పు విడిచి రైలెక్కటంతో ముగుస్తుంది. ఎక్కడ ఇంటర్వ్యూ ఛాయలు కనిపించవు. నిజానికి ఆ కుర్రాడే చాలాసార్లు రచయితని ప్రశ్నిస్తాడు తన జీవితంలోని సంఘటనలకు తాను చేసింది 'కరెక్టా? కాదా?' అని. మాములుగా ఏ పాత్రల మధ్య జరిగే సంభాషణ లైనా అలానే సాగుతాయి. కానీ, అంతర్లీనంగా అతని జీవితం ఆ మలుపులు ఎలా తీసుకొందో పాఠకులకు మధ్య మధ్య చెబుతుండటంతో అది 'ఇంటర్వ్యూ' అయిందనిపిస్తుంది.

రాజా రావు కథలలో 'నేరేటివ్' విశిష్టంగా ఉంటుంది. ఆయన నేరేటివ్ లో ఒక అద్భుతమైన వేగం ఉంటుంది. పాము లుంగలు తిరుగుతూ చకచకా ఎంత వేగంగా పాకుతుందో అలా సాగుతుంది ఆయన నేరేటివ్. పొట్టి పొట్టి వాక్యాలతో వర్ణనలు, గమనాలు, మనోభావాలు ఇలాంటి వాక్యాలతోనే చిత్రిస్తాడు. వాటిమధ్య చుక్కలు మూడు నాలుగు ఉంటాయి. అంతే గాని దీర్ఘ, సుదీర్ఘ వాక్యాలు ఆయన అరుదుగా వాడతారు. ఇదో విశిష్టమైన శైలి. సమకాలీన రచయితల రచనల్లో ఎక్కడా కనపడదు.

ఇటీవల లభించిన కొలకలూరి రామయ్య సాహిత్య విమర్శ పురస్కారమే గాక అనేక ఇతర పురస్కారాలు వీరిని వరించాయి. జ్యేష్ఠ లిటరరీ ట్రస్టు అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయం కథానిక ప్రక్రియ పురస్కారం, గురజాడ 150వ జయంతి పురస్కారం వీరి గుర్తింపుల పొదిలోని కొన్ని అక్షయతూణీరాలు.

(విశాలాంధ్ర దినపత్రిక అక్టోబర్ 21, 2024)